వాల్మీకీయం

శ్రీమత్తిరుమల లక్ష్మీకుమార తాతాచార్య

వాల్మీకీయం

శ్రీమత్తిరుమల లక్ష్మీకుమార తాతాచార్య

రామానుజం గురుం వందే - సీతాంచ చిద్స్వరూపిణీమ్ |

రామచంద్రం పరబ్రహ్మం - మారుతిం భక్తాగ్రణీమ్ ||

యో నిత్యమచ్యుత పదామ్బుజ యుగ్మరుక్మ -

వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే |

అస్మద్గురోర్భగవతోఽస్య దయైకసింధోః -

రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ||

అస్మద్దేశిక మస్మదీయ పరమాచార్యాన్ అశేషాన్ గురూన్ |

శ్రీమల్లక్ష్మణ యోగిపుంగవ మహాపూర్ణౌ మునిం యామునమ్ ||

రామం పద్మవిలోచనం మునివరం నాథం శఠద్వేషిణమ్ |

సేనేశం శ్రియమిందిరాసహచరం నారాయణం సంశ్రయే ||

శ్రీ రామానుజ యోగి సున్దరవర శ్రీశైలనాథాన్ గురూన్

లోకార్యోత్తర వీధి కృష్ణ కలిజి ద్వేదాన్త భట్టారకాన్

శ్రీగోవింద యతీంద్ర పూర్ణయమునా వాస్తవ్య రామాన్భజే

పద్మాక్షాహ్వయనాథయోగి శఠజిత్సేనేశ పద్మాహరీన్

వందే శ్రీశైలపూర్ణార్యం పితామహ పితామహం

శ్రీమద్రామాయణార్థం యో భాష్యకృ న్మునయేవదత్

శ్రీరామ ఉవాచ

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే |
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ||

శ్రీసీతా ఉవాచ

పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ |
కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ||

శ్రీలక్ష్మణ ఉవాచ

న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే |
ఐశ్వర్యం వాపి లోకానాం కామయే న త్వయా వినా ||

శ్రీహనుమాన్ ఉవాచ

స్నేహో మే పరమో రాజంస్త్వయి తిష్ఠతు నిత్యదా |
భక్తిశ్చ నియతా వీర భావో నాన్యత్ర గచ్ఛతు ||

శ్రీసీతాలక్ష్మణహనుమత్సమేత
రామచంద్రపరబ్రహ్మణే నమః

పులితోలు వలువగా - విభూది పూతగా

భిక్షువు వలె తిరుగు - భుజగ భూషణుడు

దైవశక్తే వదిలిన - ధర్మావలంబుగని

త్యాగరాజు నీవే యని - తలయూచి పలికె.

వాల్మీకీయం : అనుక్రమణిక

వాల్మీకి రామాయణంతో సరితూగగల ధర్మకథాగ్రంథం కేవలం భరతఖండంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా కనపడదు. దానిని భారతీయ సాంప్రదాయంలో ఆదికావ్యం అంటారు. అది భారతీయ సంస్కృతిలో రూపుదిద్దుకున్న మొట్టమొదటి కావ్యం అవటం వల్ల దానిని ఆదికావ్యం అని అనలేదు, భారతీయ సాంప్రదాయిక ధర్మంలో (దీనిని ముందు ముందు క్లుప్తత కోసం "ధర్మం" అని కూడా వ్యవహరిస్తున్నాను) ముఖ్య అంశాలని మౌలికంగా అర్థం చేసుకోటానికి అవసరం అవటంవల్ల, ఇతర ధర్మ గ్రంథాలని అర్థం చేసుకోవటానికి పునాది అవటం వల్ల దానిని ఆది కావ్యం అన్నారని నా అభిప్రాయం.

ఇందులేనిది ఎందూలేదు అని మహాభారతాన్ని పొగుడుతారు. సకల ఉపనిషత్తుల సారాంశం అని అంటారు శ్రీమద్భగవద్గీతని. వేదాలు మానవులు రచించలేదని భారతీయ సాంప్రదాయకుల నమ్మకం. రామకథని మహానుభావులు, భక్తులు అనేక విధాలుగా వర్ణించారు. అన్నిటినీ పక్కకిపెట్టి వాల్మీకి రామాయణానికి పెద్ద

పీట వేస్తున్నాను. ఇతర గ్రంథాలు మీద శ్రద్ధాభక్తులు లేక ఇలా చేయటంలేదని నా మనవి.

ఈ తరం భారతీయులకి మన సంస్కృతితో ఏమంత పరిచయం ఉంది? మహర్షి రచనలో నాకు కనపడే అనేక ముఖ్యవిషయాలు వాళ్ళకి కనపడుతాయా? పురాతన భారతీయ సంస్కృతితో ఎంతో కొంత పరిచయం లేకుండా వాటిని తెలుసుకోగలరా? వాల్మీకి రామాయణంలో ఇరవై నాలుగు వేల శ్లోకాలున్నాయి. ప్రతులలో తేడాలున్నాయి. కొన్ని కొన్ని శ్లోకాలని ప్రక్షిప్తాలు అని తొలిగించిన విమర్శనాత్మక కూర్పులూ ఉన్నాయి. వాల్మీకి వాడిన సంస్కృత భాష అతి సరళమైనదే. సంస్కృత భాషతో పరిచయం ఉండి వాల్మీకి రామాయణం చదివిన పాఠకులు కూడా నేను ముఖ్యం అనుకున్న విషయాలని గుర్తించలేక పోవచ్చు. అందువల్ల ముందు మాటగా ధర్మం గురించి ఒక **“పూర్వాంగం” (పుటలు 1-37)**, ఆ తరువాత **“వాల్మీకీయం” (పుటలు 38-154)** అనే శీర్షికతో వాల్మీకి రామాయణంలో (సాంప్రదాయిక దాక్షిణాత్య రామాయణ ప్రతిలో) నాకు ముఖ్యం అనిపించిన సంఘటనల, సంభాషణల వర్ణన, ఆ తరువాత నా “**త్రివేణి**” వ్యాఖ్యానం **(పుటలు 155-280)** ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయి. చివరికి నా అభిప్రాయాలకి వాల్మీకి రామాయణంలో **“వ్యాఖ్యాధారాలు”**

(పుటలు 281-308) చూపాను. వాల్మీకి రామాయణం భక్తిగా పారాయణ చేసే వాళ్ళు రామపట్టాభిషేకంతో చదవటం ఆపేస్తారు. అందువల్ల ఉత్తర కాండ కలిసిన వాల్మీకి రామాయణ ప్రతులలో కూడా పట్టాభిషేక సర్గలో ముందు కథని క్లుప్తంగా ముగించి, ఫలశ్రుతికూడా చెప్పి ఆ తరువాత ఉత్తర కాండని మొదలు పెడతారు.. ఉత్తర కాండ మళ్ళీ ఫలశ్రుతితో ముగుస్తుంది. భక్తులు తేలికగా పారాయణ చేయటం కోసం చేసిన మార్పు ఉత్తర కాండ వాల్మీకి రాయలేదనే వాదానికి దారి తీసింది. ఇతరులు రాసిన రామ కథలు కూడా తరచు పట్టాభిషేకంతో ఆగిపోతాయి. కానీ లవకుశులు రాముడి ఎదుట గానం చేసారు అని వాల్మీకి మొదలు పెట్టారు. కనుక ఉత్తరకాండ వాల్మీకి రచించినదే అని నా అభిప్రాయం. అది ఎలా ఉన్నా నా త్రివేణి వ్యాఖ్యానానికి ఉత్తర కాండలోని కథా వివరాలు చాలా అవసరం. అందువల్ల వాల్మీకీయం వ్యాసంలో కూడా ముందు సంక్షిప్త ముగింపు ఆ తరువాత ఉత్తర కాండ కనపడతాయి.

వాల్మీకీయం : పూర్వాంగం

వాల్మీకి రామాయణాన్ని ఒక సాటిలేని ధర్మకథ అన్నాను. అసలు ధర్మం అంటే ఏమిటి? ఇక్కడ మనకి కావలసినది ఏ పరిస్థితిలో ఏ వ్యక్తి ఏం చేస్తే ధర్మం, ఏం చేస్తే అధర్మం అవుతుంది అనే ప్రశ్నకి సమాధానం కాదు. అసలు మానవులలో ధర్మం గురించి ఆలోచనలు ఎందుకు ఉన్నాయి? వివిధ సమాజాల ఆచరణలో ప్రత్యక్షంగా కనపడే తేడాలే కాక మౌలిక తేడాలు ఉన్నాయా? ధర్మకథలు ఈ ఆలోచనలకి రూపకల్పనా లేక ఉదాహరణాలా? ఈ "పూర్వాంగం" వ్యాసంలో ఈ విధమైన ప్రశ్నలకి నా వ్యక్తిగత సమాధానాలు కనపడతాయి. ఈ పూర్వాంగం వాల్మీకీయానికి, నా త్రివేణి వ్యాఖ్యానానికి వారధి అవుతుందని నా నమ్మకం.

ఒక సామాన్య అనుభవం గురించి లోతుగా ఆలోచించడం ధర్మాన్ని సంక్షిప్తంగా అర్థం చేసుకోటానికి చాలా సహాయపడింది. నేను దేనినో చూసి పాము అనుకుని భయపడ్డాను. నాకు చెమట పట్టడం మొదలైంది. వణకటం మొదలుపెట్టాను. ముందుగా రెండు మూడు సార్లు లోతుగా ఊపిరి తీసుకుని ఆ తరువాత ఆలోచించంటం మొదలుపెట్టాను. ఇంతకీ అది పాము కాదేమో? తాడో బొమ్మో కావచ్చు. పామే అయినా ప్రమాదం లేని పశిరిక పాము కావచ్చు అనుకుని మళ్ళీ జాగ్రత్తగా చూసాను. భయానికి

కారణం లేదు అని తెలిసింది. శరీరం మళ్ళీ నా స్వాధీనం లోకి వచ్చింది. ఈ సామాన్య సంఘటన గురించి ఆలోచటం మొదలు పెట్టాను. ఇది భరత ఖండంలో ధర్మం గురించి తరతరాలుగా జరిగిన చర్చలని, రాయబడిన గ్రంథాలని అర్థం చేసుకోవటానికి మొదటి మెట్టు అనిపించింది.

చూడటానికి కావలసింది కన్ను. కంటికి కనపడిన దానిని గత అనుభవాలతో పోల్చి పామేమో అని భయపడటానికి కారణం బుద్ధి. లోతుగా ఊపిరి తీసుకుంటే శరీరం యొక్క వణుకు తగ్గి ఇంకొక సారి పరీక్షగా చూడవచ్చు అని తెలిపేది కూడా బుద్ధి. చివరికి భయానికి కారణం లేదు అని తేల్చింది కూడా బుద్ధి. శరీరం వణకటానికి కారణం మాత్రం మనసులో భయం.

కళ్ళు చెవులు మొదలైన “ఇంద్రియాల” ద్వారా మనసుకి బయట ప్రపంచం గురించి తెలుస్తుంది. ఇంద్రియాల నుంచి లభించే జ్ఞానం మనసుని మార్చగలదు. మనసులో భావాలు శరీరంలో ఇతర మార్పులు కలిగిస్తాయి. బుద్ధి మనసునీ ఇంద్రియాలనీ ఒక స్థితి నుంచి ఇంకొక స్థితికి కదపగలదు. ఈ మూడూ మాత్రమే కాక, ఇంద్రియాలు, మనసు, బుద్ధి “నావి” అనుకునే అనుభూతి నాకు ఉంది. ఈ “నేను” బుద్ధి ద్వారా ఇంద్రియాలని, మనసుని, వాటి ద్వారా శరీరాన్ని అదుపులో పెడుతున్నాను. ఇతరులని పరిశీలిస్తే వారి మనసులో ఉన్న భావాలని కొంత కొంత వరకూ

తెలుసుకోవచ్చు. వాళ్ళూ పాముని చూసి భయపడి వణుకుతారు అని కనపడుతుంది. వాళ్ళతో మాట్లాడితే ఎప్పుడో ఒకప్పుడు ఇలాగే తాడుని చూసి పాము అనుకున్నాము అని చెబుతారు.

బుద్ధి చేసిన తర్కం అందరికీ వర్తిస్తుంది. కానీ తర్కం చేసిన తీర్మానాన్ని అందరూ ఒకేలా ఆచరణలో పెట్టక పోవచ్చు. ఒకడు తాడే కదా అని పట్టుకోవచ్చు. ఇంకొకడు ఏమో తాడులాగే ఉంది అయినా జాగ్రత్తగా ఉండాలి అని దూరంగా ఉండవచ్చు. అందరి శరీరాలు, ఇంద్రియాలు, మనసులు, బుద్ధులు కొంత వరకైనా ఒకేలాగా పని చేస్తాయి అని తెలుసుకోగలం. కానీ ఈ “నేను” అనుకునే అనుభూతి “నాకు ఉంది” అని మాటలలో చెప్పగలం కానీ ఇంతకు మించి దాని గురించి ఇంకేమీ చెప్పలేము. నాకు కూడా ఉంది అని ఇతరులు చెప్పినా, వారి అనుభూతిని మన అనుభూతితో పోల్చలేము. వాళ్ళు చెబుతున్నది నిజమా కాదా అని తెలుసుకోలేము. మనతో మాట్లాడుతున్నది ఒక మనిషా లేక ఏదో యంత్రమా అని నిక్కచ్చిగా తేల్చలేము. మాటలతో ఉందని కూడా చెప్పలేని చిన్న పిల్లలకీ, స్పృహతప్పి కట్టెలా పడి ఉన్న వారికీ ఈ “నేను” అనే అనుభూతి ఉన్నట్టా లేనట్టా? మానవులకి మాత్రమే ఉందని ఎలా నిర్ధారించగలం? ఇతరుల సంగతి అలా ఉంచి, నాకు ఈ అనుభూతి కలలు కంటున్న సమయంలో కూడా ఉంటుంది. ఏది వాస్తవమో ఏది కలో ఎలా నిక్కచ్చిగా చెప్పగలను? కలలు లేని నిద్రలో “నేను” అనే ఈ అనుభూతి

ఏమవుతుంది? నిద్రలేచిన తరువాత నేననే అనుభూతి తిరిగి వస్తున్నప్పుడు మరణం తరువాత రాదు అని ఎలా చెప్పగలం? వస్తుందేమో!

ఆధునిక విజ్ఞానం ఎంత గొప్ప ప్రగతి సాధించినా ఈ ప్రశ్నలు, సందేహాలు ఇలాగే ఉండిపోతాయి. ఎటొచ్చీ ఈ ప్రశ్నలే అర్థం లేనివి అని ఒక విధమైన పరిష్కారం సూచించగలదు ఆధునిక విజ్ఞానం. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మెదడులోని జీవకణాల మధ్య ఏర్పడిన బంధాలే అంటుంది ఆధునిక విజ్ఞానం. “నేను” అనే అనుభూతి కూడా అదే విధమైన బంధాల వల్ల ఏర్పడింది. “నేను” అనే అనుభూతి ఉండేది ఆ అనుభూతి ఉన్నంతవరకు. దీనికి ఏదో ప్రత్యేకమైన స్థానం ఇవ్వవలసిన అవసరం ఏమీ లేదు అని చర్చ ముగిస్తుంది.

ఈ ఆధునిక విజ్ఞాన మార్గానికి బుద్ధికి తెలిసేది మాత్రమే నిజం. ఈ ఆధునిక విజ్ఞాన పరిష్కారాన్ని ఒప్పుకోలేనివాళ్ళు ఏదో ఒక ధర్మాన్నో లేక మతాన్నో ఆశ్రయిస్తారు. “నేను” అనే ఈ అనుభూతి మరణంతో సమాప్తం కాదు అనుకునే వాళ్ళ వల్లనే ప్రపంచంలోని అన్ని మతాలు, ధర్మాలు పుట్టాయి. ఈ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, “అహంకారం” అనే విభజన భరత ఖండంలో పుట్టిన అన్ని ధర్మాలలో సాంప్రదాయాలలో తప్పకుండా ఉంటుంది. (పురాతన ధర్మ గ్రంధాలలో ఈ “నేను” అనుభూతిని అహంకారం

అనేవారు. నేటి భాషలో అహంకారం అంటే పొగరుబోతుతనం, లేదా గర్వం.)

మనస్సు, బుద్ధి శరీరంలో భాగాలు, "అహంకారం" మాత్రమే వేరు అనుకోవడం కేవలం మాటలతో చేసే గారడీ కాదు. అనేక ధార్మిక భావాలకి అది పునాది. మానవుడు పూర్వజన్మలలో చేసిన కర్మల వల్ల కూడగట్టుకున్న పాప పుణ్యాలలో ఒక భాగాన్ని ఈ జన్మలో అనుభవిస్తున్నాడు. ముక్తి లభించే వరకు ఈ జన్మ మరణాలు సాగుతూ ఉంటాయని బౌద్ధులు, జైనులతో సహా, మన సమస్త సాంప్రదాయాలవారు ఒప్పుకుంటారు. ముక్తి లభించే వరకు సాగే జీవుడి జనన మరణాలకి ప్రతిబింబం అనంతంగా సాగే సృష్టి ప్రళయ చక్రాలు[1] అని కూడా అంగీకరిస్తున్నారు. మనస్సు, బుద్ధి శరీరంతో ఉండి "అహంకారం" విడిగా ఉండటం వల్లనే అది కర్మ ఫలాలకి ఆధారం అవుతోంది. కర్మ ఫలాలు ఇంకొక జన్మని ఇస్తాయి. పూర్వజన్మలో ఉన్న బంధుత్వాలు, శత్రు-మిత్ర భావాలు మాత్రం మిగలవు. ఈ భావాలన్నీ మనస్సులోనే ఉండిపోతాయి. మనసు శరీరంతో ఎల్లప్పుడూ కలసి ఉంటుంది. పూర్వజన్మలో చేసిన కర్మఫలం అనుభవిస్తాడే కానీ జీవుడికి పూర్వజన్మ జ్ఞానం ఉండదు. మనసు, బుద్ధి, శరీరం కేవలం పంచ భూతాలతో,

---

[1] అహంకారం" మనస్సుకి బుద్ధికి అతీతమైన ఉంది అనే భావన లేని సంస్కృతులు జన్మ మరణాలనీ, సృష్టి ప్రళయాలని ఈ విధంగా, మళ్ళీ మళ్ళీ వచ్చే చక్రాలుగా భావించవు. పాద గమనికలలో ఇటువంటి మౌలిక తేడాలేంటి చూపుతున్నాను.

(భూమి, ఆకాశము, అగ్ని, నీరు, గాలి) తయారు అయినది. అందుకే అవి పంచ భూతాలతో తిరిగి కలవటానికి వీలుగా మరణం తరువాత భౌతిక కాయానికి అగ్ని సంస్కారం చేస్తారు[2]. మరణానంతరం జీవుడు స్వర్గానికో నరకానికో వెళ్తాడనుకున్నా అక్కడ శాశ్వతంగా ఉండిపోడు. పితృయజ్ఞం[3] చేస్తున్నది తండ్రి వంశం వారికి. తండ్రి తాతల పేర్లు చెబుతారు. కానీ వాళ్ళు వసు, రుద్ర, ఆదిత్య రూపాలలో ఉన్న పితృదేవతలు. తండ్రి తాతలు జీవితంలో అనుభవించిన బంధుత్వాలు, శత్రు-మిత్ర భావాలు మిగలవు. చార్వాక సిద్ధాంతం ఆధునిక విజ్ఞాన శాస్త్రం లాగే కంటికి కనిపించేది మాత్రమే నిజం అంటుంది. కాబట్టే ఈ విధమైన కార్యాలు చేయక్కరలేదు అని, హాయిగా బ్రతికినన్నాళ్ళు అప్పు చేసి నెయ్యి తాగమన్నారు.

ఈ విధంగా "అహంకారం", మనస్సు, బుద్ధులని విడి విడిగా గుర్తించటం పురాతన భారతీయ ధర్మానికి, సంస్కృతికి పునాది

---

[2]" భరత ఖండంలో పుట్టినవి "ధర్మాలు" అనీ భరతఖండం వెలుపల పుట్టిన వాటిని "మతాలు" అని పేర్కొన్నాను.ఇలా చేయడం రెండింటినీ అర్థం చేసుకోవటానికి సహాయం చేస్తుంది. ఇది గొప్ప, అది తక్కువ అని చెప్పటానికి కాదు. "మతాలు" ఏవీ మనస్సుకి అహంకారానికి తేడా గమనించవు. వీరందరూ మరణానంతరం శరీరాలని పాతి పెడతారు. శరీరాలని అతి జాగ్రత్తగా భద్రపరిచినవారు పురాతన ఈజిప్టు వాసులు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో ఉన్న క్రైస్తవ, ఇస్లాము మతాలు కూడా మనస్సుకి అహంకారానికి తేడా గమనించవు. యెహోవా జీవుల పాప పుణ్యాలు పరిశీలించే "తీర్పు రోజున" జీవులు తమ రూపంతోనే శాశ్వతంగా స్వర్గానికి కానీ నరకానికి కానీ పోతారని బోధిస్తారు.

[3] ప్రతి సంవత్సరం తండ్రి వంశంవారికి చేసే వైదిక కార్యం

అనటం ధర్మ గ్రంధాలని మరీ ఎక్కువగా సరళీకరించటం అని అనిపించవచ్చు. కానీ ప్రసిద్ధి చెందిన పరమత సహనంతో సహా చాలా ముఖ్యమైన విషయాలు అర్థం చేసుకోవటానికి ఈ అతి సరళ వ్యాఖ్య చాలు.

"అహంకారం" ఎవరికి వారికే అనుభూతి. దాని గురించి ఎవరు ఏం చెప్పినా, ఎంత వాదించినా అవి కేవలం మాటలే. ఇకపోతే ఎందుకు చెప్పారు అనేది చాలా ముఖ్యం. కానీ అది ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన విషయం. ఈ స్వాతంత్ర్యం వలనే విదేశీ "మత" ప్రచారకులతో సహా ఎవరు ఎప్పుడు ఏం చెప్పినా బలవంతంగా నోరు మూయించే ప్రయత్నం చేయక పోవటం, వాళ్ళ ఖర్మ వాళ్ళదని వదిలేయటం భారతీయ సాంప్రదాయం. తప్పు సిద్ధాంతాలు నమ్మటం కూడా పూర్వజన్మలో చేసిన పాపం వల్లే కదా. అనుభవించక తప్పదు. బుద్ధి ఈ జన్మలో రాకపోతే మరో జన్మలో వస్తుందని సరిపెట్టుకుంటారు. తప్పు సిద్ధాంతాలు నమ్మినా ఎవరూ శాశ్వతంగా నరకంలో ఉండిపోరని నమ్మటం సమాజంలో హింసని కొంత తగ్గిస్తుందేమో?[4].

[4] గత వేయి సంవత్సరాలలో ప్రబలిన భక్తి మార్గాలు కుల వ్యవస్థలోని అసమానతని కొంత వరకు తగ్గించి ఆధునిక బుద్ధి జీవుల ప్రశంశలు అందుకున్నాయి. కానీ అదే సార్వజనీయత కారణంగా అంతకు ముందు భారత ఉపఖండంలో సాంప్రదాయాల మధ్య ఎప్పుడూ లేని కక్షలు, కావేషాలు, హింస, విభిన్న భక్తి మార్గ ప్రవక్తల శిష్యుల మధ్య మొదలైనాయి. సార్వజనీయతో పాటు వీటినీ విదేశీయ మతావలంబుల ప్రవర్తన చూసి నేర్చుకున్నారని అని మాత్రం బుద్ధిజీవులు ఒప్పుకోరు.

ఈ "నేను" అనే అనుభూతి ముక్తి లభించే వరకు ఉంటుంది అని నమ్మినప్పుడు ఈ ముక్తి త్వరగా, వీలయితే ఈ జన్మలోనే కలగాలి అనుకోవడం సహజం. అన్ని ధర్మాలు మతాలు మరణం తర్వాత కలిగే సుఖదుఃఖాల కోసం, ముక్తి కోసం, ఈ పనులు చేయవలసినవి ఇవి చేయకూడనివి అని నిర్దేశిస్తాయి. ఇలా నియమాలని పాలించటమే ధర్మాచరణ[5]. ముక్తి "నేను" అన్న భావనకి గమ్యం. ఏ ధర్మమైనా, ఏ మతమైనా ఈ నియమాలు నిర్దేశించేది పరలోకంలో సుఖం కోసం, అంటే రాబోయే జన్మలోనో స్వర్గంలోనో లభించే సుఖం కోసం, ముక్తి కోసం. సమాజంలో ఇతరుల సుఖం కోసం కాదు[6]. ఉదాహరణకు ఏ ధర్మమైనా ఏ మతమైనా దానధర్మాల చెయ్యమని ఆదేశించటం కేవలం ధనం ముక్తికి అడ్డంకి అవుతుందనే[7]. ఇది అందరూ ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలసిన ముఖ్యం విషయం.

---

[5] ఉన్నది ఒకే జన్మ, మరణానంతరం స్వర్గంలో సుఖంగా లేదా నరకంలో బాధలు అనుభవిస్తూ శాశ్వతంగా జీవుడు ఉంటాడు అనుకున్నా అవి ఈ జన్మలో ఆచరణ మూలంగానే కలుగుతాయి.

[6]ఆధునిక నాస్తిక బుద్ధిజీవులు, ధర్మాలు మతాలు పుట్టటానికి పైన చూపిన అసలు కారణాన్ని నిరాకరించి, ఇవి ఇన్ని వేల సంవత్సరాలుగా మానవ సమాజంలో భాగం అవటానికి కారణాలు వెతుకుతుంటారు. చాలామంది ఉద్దేశ్యంలో ఇవి కొన్ని వర్గాలని దోపిడీ చేయటం కోసం ఇతర వర్గాలు పుట్టించాయి. కానీ కొద్ది మంది బుద్ధిజీవులకి ధర్మాలని మతాలను నమ్మే వాళ్ళలో కొంత మంది ఆచరణ మీద సానుభూతి ఉంది. ఆ కారణం చేత ధర్మ మతాలలో అసలు భాగం ఈ జన్మలోనే అందరి సౌభాగ్యం కోసం పాటు పడటం అనే సిద్ధాంతం లేవదీశారు.

[7]ధనం ముక్తికి అడ్డంకి అయితే, మొదటినుంచీ ధనసంపాదన మీద దృష్టి పెట్టకూడదు. సంపాదించకుండా దానం చేయడం ఎట్లా? కూడపెట్టిన వాడి ముక్తికి ధనం అడ్డంకి అయితే దానం తీసుకున్న వారి ముక్తికి ధనం అడ్డంకి కాదా? ఇటువంటివి లెక్కలేనన్ని ప్రశ్నలు తలెత్తుతాయి.

ముక్తికి నిజమైన మార్గం ఒక్కటే. మిగతావి అన్నీ అబద్ధం అనే నియమం, ఇతరులని తమ మార్గం లోకి బలవంతంగా అయినా సరే మార్చాలనే తపన, ధర్మాలలో లేదు[8]. కనుక, ఎలాంటి ధర్మ సిద్ధాంతాలు, కథలు, చెప్పటానికైనా అందరికీ పూర్తి స్వాతంత్ర్యం ఉంది. ఎవరు చేప్పేవి వారి వారి అనుభవం, క్షమత, సామర్థ్యం, వారి నియమ నిష్ఠ తెలియజేస్తాయి. సహజంగా చెప్పే వాటిలో పరస్పర విరుద్ధ భావాలు, కథనాలు ఉంటాయి. సహజంగానే మోక్షం కోసం మానవుడు చేయవలసిన పనులు, చేయలేని పనులు, చేయకూడనివి అనే నియమాలు కూడా ఒకటికొకటి విరుద్ధంగా ఉండవచ్చు. (చాలా నియమాలు నేటి ఆధునిక జీవనశైలికి విరుద్ధంగా ఉంటాయి. నేడు గర్వంగా మేము ఫలానా సాంప్రదాయాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునేవారు కూడా ఆ సాంప్రదాయం యొక్క ప్రాచీన నియమాలలో కొన్ని మాత్రమే ఆచరణలో పెట్టగలరు. నా రచన కేవలం వాస్తవికతని అర్థం చేసుకోవటానికి చేసిన ప్రయత్నం. ఏదో ఒక సాంప్రదాయాన్ని ఎన్నుకుని దానిని ఆచరించమని ప్రచారం చేయటానికి కాదు.) ఆస్తికులందరూ[9] సాధారణ మనుష్యులు ధర్మాచరణ చేయటం వల్ల పైన చెప్పినట్టుగా పరలోకంలో సుఖాలు పొందుతారు అని

---

[8] క్రైస్తవ ఇస్లాము మతాలలో ఇది చాలా ముఖ్యం. మతాంతరులని శాశ్వతంగా నరకం బాధలనుండి తప్పించటానికే ఈ జన్మలో వారిపైన ధాష్టీకం చేస్తున్నామని పురాతన కాలంలో వాళ్ళు స్పష్టం చేసారు.

[9] "ధర్మాలని" అనుసరించే వారు, "మతాలని" అనుసరించే వారు కూడా.

ఒప్పుకుంటారు. భారతీయ ధర్మ గ్రంధాలు మాత్రం ఇక్కడితో ఆగక వివిధ నియమాల ఆచరణ వల్ల మానవుడికి ఈ లోకంలోనే పరిమితి లేని అసాధారణ శక్తులు కూడా లభిస్తాయి అంటాయి. అన్ని ధర్మ నియమాలు, ఆచరణలో నిష్ఠ వల్ల, ముక్తిమార్గాలు అవటమేకాక ఈ అసాధారణ శక్తులు కలగటానికి కారణం కూడా అవుతాయి.

ఉదాహరణకు మన కళ్ళు సమీపంలో ఉన్న వాటిని చూడగలవు. సాధన, అనగా నియమ పాలన నిష్ఠతో చేసిన వారు అసాధారణ శక్తులు సాధించి ఎక్కడ ఏమి జరిగినా చూడగలరు. మనం గతంలో కొంత గుర్తు చేసుకుంటే ఈ అసాధారణ శక్తులు ఉన్న వాళ్ళు గతంలో జరిగినదీ, భవిష్యత్తులో జరగబోయేవి, పూర్తిగా తెలుసుకోగలరు. మనం ఒక మాట అన్నంత మాత్రాన మంచిగానీ చెడుగానీ జరగవు. ఈ అసాధారణ శక్తులు ఉన్నవాళ్ళు జరగాలి అంటే జరుగుతాయి (వీటినే వాడుక భాషలో శాపాలు, వరాలు అంటాము.) అంటాయి ఈ గ్రంథాలు.

ఎంత శ్రద్ధగా, ఎంత కఠోర నిష్ఠతో నియమాలు ఆచరిస్తే అంత ఎక్కువ శక్తులు లభిస్తాయి అంటాయి ఈ గ్రంథాలు. మానవుడి ధర్మాచరణకి అన్నిటికంటే పెద్ద అడ్డంకి బుద్ధి ఇంద్రియాలని అదుపులో పెట్టలేక పోవటం. ఇంద్రియాలని ఎంతగా నిగ్రహిస్తే అంత కఠిన నియమాలని పాలించటం సాధ్యం అవుతుంది.

అలా చేసినప్పుడు ఉష్ణోగ్రత పెరిగి[10] చివరకి లోకాలన్నింటినీ దహిస్తుందని కూడా ఈ గ్రంధాలు దృఢంగా చెబుతాయి.

వ్యాయామం చేసి కండలు పెంచిన వ్యక్తి ఆ శక్తిని మంచిపనులు చేయటానికైనా చెడు చేయటానికైనా కూడా ఉపయోగించవచ్చు. అలాగే సాధనతో ఇంద్రియాలకి, మనస్సుకి, బుద్ధికి లభించిన ఈ అసాధారణ శక్తులతో మానవుడు ధర్మ అధర్మ కార్యాలు రెండూ చేయవచ్చు. అందుకే ధర్మాలు “అందరూ” పాటించవలసిన ఆజ్ఞలు కావు. నియమ పాలన నిష్ఠగా చేయటం వల్ల లభించిన శక్తులతో లోకాలని హింసించకుండా ఉండాలని బోధించటం ధర్మాల ప్రత్యేకత[11]. అసాధారణ శక్తులని విపులంగా ఎందుకు వర్ణించారు? అవి పారలౌకిక సుఖాలు లభిస్తాయని నమ్మటానికి రుజువులౌతాయి కనుక వ్యక్తి సాధన ఆపకుండా ఉండటానికి ప్రేరేపిస్తాయని కావచ్చు.

కావాలసినట్టు వస్తువులని బంగారంగా మార్చటం, కావలసిన స్త్రీని వశపరచుకోవటం, ఎంత బలవంతుడైన శత్రువుని అయినా హింసించడం, ప్రపంచ విజేత కావటం మొదలైన అనేక ఇతర శక్తులు ఉన్నాయని భారతీయ సాంప్రదాయిక కథలలో అనేక

[10] ఎలాగైతే కర్రల మధ్యరాపిడి వల్ల అగ్ని పుడుతుందో అలాగే ఇంద్రియాలకి, బుద్ధికి మధ్య ఘర్షణవల్ల ఇలా అవుతుందని ఊహించారేమో.
[11]ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఇవన్నీ అసంభవం. అదే నా ఉద్దేశం కూడా. ధర్మాలకి మతాలకి ఇదికూడా ఒక తేడా కనుక ప్రస్తావించాను.

చోట్ల చెబుతారు.[12] వీటివల్ల పరలోకంలో సుఖం లభించదు కానీ ఈ జన్మలోనే కొన్ని శక్తులు సాధించవచ్చు అని పురాతన కాలం నుంచి చాలా మంది నమ్ముతూ వచ్చారు,

కేవలం సాధన వల్లనే ముక్తి సాధించాలి అన్నవారు బౌద్ధులు జైనులు. తాను చేసిన తప్పులకి తానే బాధ్యత వహించి ఎన్ని జన్మలైనా ధర్మాచరణ మరింత శ్రద్ధగా చేయటం తప్ప వారి దృష్టిలో ముక్తికి మరొక మార్గం లేదు[13]. పశ్చాత్తాపం మోక్ష సాధనకి సహాయపడవచ్చు కానీ మోక్షానికి దగ్గర దారి కాదు. పశ్చాత్తాపం వల్ల చేసిన తప్పు సమసిపోదు. మోక్షం పొందిన వారు కూడా ఇతరులకి తేలిక మార్గాలు చూపలేరు. కేవలం మోక్షం పొందిన వారిని ఆదర్శంగా ఉంచుకుని ఎవరికి వారు తమ మోక్షం కోసం సాధన చేయాలి. ఇందుకే జైన బౌద్ధ ధర్మాలని మన పూర్వీకులు నిరీశ్వర వాదమని అనేవారు. మనిషి చేసిన పాపాలని క్షమించి ముక్తికి దగ్గర దారి చూపించే "ఈశ్వరుడు" ఒకడు ఉన్నాడని ఇతర ధర్మాల నమ్మకం. (వాడుక భాషలో ఈశ్వరుడు కైలాస పర్వతం మీద ఉండే శివుడు. ఇక్కడ మోక్షాన్ని ఇవ్వగలిగే స్వరూపాన్ని "ఈశ్వరుడు" అని అంటున్నాను.) పాపాలని

[12]ఇలాంటి నమ్మకాలు ప్రపంచంలో అన్ని సమాజాలలో కనపడుతాయి. అన్ని మతాలు, ధర్మాలు వీటిని నిందిస్తూనే వచ్చాయి.

[13] మహమ్మదీయ, క్రైస్తవ మతాలలో వ్యక్తి పశ్చాత్తాపపడటంవల్ల పాపాలు నశిస్తాయి. నశించటం క్రీస్తు ప్రభువు వలనా? ప్రవక్త ద్వారా యెహోవా వలనా? పూజారులకి ఎన్ని అధికారాలు ఉన్నాయి? మొదలైన విషయాల మీద మాత్రం విభిన్న అభిప్రాయాలు ఉంటాయి. పశ్చాత్తాప పడాలనే నిర్ణయం మాత్రం వ్యక్తే తీసుకోవాలి.

క్షమించడం ఈశ్వరుడి శక్తి, కృప కూడా. పశ్చాత్తాపపడిన వ్యక్తికి లభిస్తుందని, అది లేకపోతే లభించదని నిబంధనలు లేవు. మన సాంప్రదాయాలు ఏవీ పశ్చాత్తాపానికి గొప్ప విలువ ఇవ్వవు. దీనికి కారణం కూడా మనస్సు బుద్ధి శరీరం యొక్క భాగాలని నిర్ణయించి. అహంకారాన్ని విడిగా చూడటం.

ఇతర సాంప్రదాయాల నియమాలకి, "ఈశ్వరుడు" లేడన్న జైన బౌద్ధ ధర్మ నియమాలకి తేడాలు ఉన్నా కొంత పోలిక కూడా ఉంది.[14] రెండిటిలోనూ పశ్చాత్తాపం తప్పనిసరి కాదు. తెలిసి చేసిన తప్పుకి, తెలియక చేసిన తప్పుకి శిక్షలో తేడా ఉండవచ్చు. అది రాజు విధించిన శిక్ష కావచ్చు. సమాజంలో ఇతర పెద్దల నిర్ణయం కావచ్చు. జైన బౌద్ధ ధర్మాలలో లాగే మన ఇతర సాంప్రదాయాలలో కూడా నిష్ఠతో ధర్మాచరణ చేసి లేదా యోగ సాధనతో పాపాలు నాశనం చేసుకోవచ్చు. మళ్ళీ మళ్ళీ జన్మ తీసుకోవటానికి సిద్ధపడచ్చు. కానీ పాపాలని నాశనం చేయగల "ఈశ్వరుడు" ఉంటే వ్యక్తికి ఇంకొక దగ్గర దారి దొరుకుతుంది. ఈ ధర్మాల దృష్టిలో "ఈశ్వరుడు" పాపాలని నాశనం చేయటానికి వ్యక్తికి పశ్చాత్తాప పడవలసిన అవసరం లేదు. గంగా స్నానాలు, కొన్ని క్షేత్రాలలో మరణించటం, పశ్చాత్తాపపడిన వారివి మాత్రమే కాక ప్రతి ఒక్కరికీ ముక్తి మార్గం అవుతుంది అనే నమ్ముతాయి ఈ

[14] కొన్ని బౌద్ధ నియమాలు, భక్తి మార్గాలు లాగే కుల వ్యవస్థలోని అసమానతని వ్యతిరేకించి, దానాన్ని ఎక్కువగా సమర్ధించి ఆధునిక బుద్ధి జీవుల ప్రశంశలు అందుకున్నాయి.

ధర్మాలు. వ్యక్తి పాపాలని నాశనం చేయగల ఈ "ఈశ్వరుడు" అంటే ఎవరు లేదా ఏమిటి అన్న ప్రశ్న ముందుకు వస్తుంది.

బౌద్ధ జైన ధర్మాలు కూడా కర్మ వల్ల మళ్ళీ జన్మ కలుగుతుంది అని ఒప్పుకుంటాయి. మరి దీనికి కారణం? ఒక్కొక్క జీవి చేస్తున్న ప్రతి పని అప్పటికప్పుడు జన్మ మరణాల చక్రంలో మార్పులు కలిగించటం ఏదో తెలియని శక్తి లేకుండా సాధ్యమా? మాటలతో వర్ణించరాని, యోగ అనుభూతిగా చెప్పబడే "బ్రహ్మం" లోకాలని సృష్టించిందని అన్నా, బౌద్ధ జైన ధర్మాలు నిర్ధారణ చేసినట్టు కైవల్య స్థితిలో అంతా శూన్యమే అని అన్నా రెండూ "ఇది సృష్టి నియమం" అని ఊరుకోవటమే అవుతాయి[15]? నా ఉద్దేశ్యంలో బుద్ధితో పైన వాడిన "ఈశ్వరుడు" అన్న మాటకి అనేక విధాలుగా అర్థం చెప్పుకోగలం. "ఈశ్వరుడు" జన్మ మరణ చక్రాన్ని నడిపే శక్తి. బౌద్ధులు జైనులు "ఈశ్వరుడు" అన్న మాట వాడరు. ఎవరూ నడపకుండా చక్రం ఎలా నడుస్తోంది అన్ని ప్రశ్న వారికి ముఖ్యం కాదేమో. ఇక పోతే చార్వాకులకి "ఈశ్వరుడు" లేడు, జన్మ మరణ చక్రం కూడా లేదు.

ప్రాణం లేని వస్తువులు కర్మ చేయలేవు కనుక వాటిని ఈ చక్రంలో భాగంగా చూడలేము. కానీ ప్రాణం లేని వస్తువులలో మార్పులు ఉంటాయి, ఆ మార్పులకి కారణాలు బుద్ధితో తెలుసుకోగలం.

---

[15] కొంతమంది ఆధునిక విజ్ఞాన నిష్ణాతులు ఇలాంటి "ప్రాకృతిక ఈశ్వరత్వాన్ని" సమర్థించి మేము నాస్తికులం కాము అని అంటారు

అందువల్ల "నేను" అనే అనుభూతికి వెలుపలి సృష్టి యొక్క నియమాలకి[16] కూడా "ఈశ్వరుడు" కర్త లేదా స్రష్ట.

జనన మరణాల చక్రంలో కర్మ చేసే జీవుడు ఉన్నట్టే ఈ ప్రకృతిలో వివిధ భాగాలకి కర్తృత్వం వహించే వాళ్ళు ఉంటారు, వారే దేవతలని ఇంచుమించు అన్ని ధర్మాలు అంగీకరించాయి. ఈ నియమాలు శాశ్వతం కనుక కర్తలైన దేవతలు "అమరులు" అయ్యారు. కర్త ఎవరైనా సరే బాధ్యత, శక్తి చేతికి రాగానే తోడుగా కోపతాపాలు కూడా వస్తాయి[17]. అమరుల ప్రవర్తనని అదుపులో పెట్టి వాళ్ళు సృష్టిని నియమానుసారం నడిపేటట్టు చూసేవాడు కూడా "ఈశ్వరుడు".

నేను అనే అనుభూతి ముఖ్యం కాబట్టే మర్త్యులు, అంటే జనన మరణాలు ఉన్న జీవులు ఎప్పుడూ అమరత్వం కోరుకుంటారు[18]. ఇంద్రియాల ప్రాకృతిక స్వభావాన్ని కఠోర నిష్ఠతో నిగ్రహిస్తే సృష్టి నియమానుసారం నడవనట్టే భావించి ఇటువంటి పరిస్థితులలో ఇంద్రియ నిగ్రహంతో శక్తి సంపాదించుకుంటున్న మర్త్యులకి

---

[16] ఇదే ఆధునిక విజ్ఞానం

[17] ఆధునిక జీవితంలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనకి సరితూగుతుంది అమరుల ప్రవర్తన

[18] ఆధునిక కాలంలో కూడా ఎప్పటికైనా ఆధునిక వైద్య నిపుణులు మరణం మీద విజయం సాధిస్తారనే ఆశతో కొంతమంది తమ శరీరాలని అతి శీతల ఉష్ణోగ్రతలో భద్రపరిపించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరణం మీద విజయం అసంభవం అనే మహమ్మదీయులు, క్రైస్తవులు శాశ్వతంగా స్వర్గంలో సుఖంగా ఉంటామని ఆశిస్తారు.

వరాలు ఇచ్చి తాత్కాలికంగా వారిని శాంతింప చేస్తారు దేవతలు. దేవతలు స్వశక్తితో అమరత్వం సాధించుకోలేదు. “ఈశ్వరుడి” కృప వల్ల వారికి అమరత్వం లభించింది. ఈ కారణం వల్లనే కాబోలు, అమరత్వం వరంగా ఇవ్వలేమని పురాణం కథలలో మాటిమాటికీ చెబుతారు దేవతలు. (పురాణ కథల విశ్లేషణ ముందు ముందు చేస్తాను.) దేవతలనుంచి వరంగా అమరత్వం దొరకకపోయినా నేను నీ వేలుతోనే నీ కన్ను పొడుస్తాను అన్నట్టు విచిత్రమైన వరాలు అడగటం, ఆ విచిత్ర వరాలనే ఉపయోగించి దేవతలని జయించాలని ప్రయత్నించటం పురాణ ధర్మకథలలో అనేక చోట్ల కనపడుతుంది. ఇలా సృష్టిని నియమానుసారం నడవనివ్వకుండా అడ్డుపడే మర్త్యులని లొంగతీసేవాడు కూడా “ఈశ్వరుడు”. ఇదే దైవత్వానికి, ఈశ్వరత్వానికి తేడా. లోకాలని తమ తపస్సుతో తల్లకిందులు చేస్తామని బెదిరించి దేవతలని లొంగదీసుకోవటం పెద్ద కష్టంకాదు. ఏ బెదిరింపులు లేకుండా యజ్ఞాలు చేసి, వాళ్ళని మంచి చేసుకుని కూడా అటువంటి వరాలు సంపాదించుకోవచ్చు. ఈ విధంగా తనే సృష్టికి నియంత అవాలనే ప్రయత్నం చేయవచ్చు. “ఈశ్వరుడు” బెదిరింపులకి లొంగడు. “ఈశ్వరుడు” ప్రసన్నుడు అయ్యాడు అనటానికి గుర్తు ఈ విధమైన వరాలు సంపాదించి సృష్టికి నియంత అవాలనే కోరిక నశించటమే .

పరస్పర విరుద్ధ కథనాలు, తర్కాలతో నిండి ఉన్నప్పటికీ మన ధర్మ సాంప్రదాయాలన్నికీ పైన వివరించిన “ఈశ్వరుడి” మౌలిక లక్షణాలు వర్తిస్తాయి. (అసలు “ఈశ్వరుడే” లేడు అన్న జైన బౌద్ధ ధర్మాలను మినహాయించి). ఇలాగే మన ధర్మ నియమాలన్నిటికీ కూడా ఒక మౌలిక లక్షణం కనపడుతుంది. ధర్మాచరణలో ఏ ఒక్క అంశమూ సర్వజనీయం కాదు. కాని ధర్మనిష్ఠకి అంటే వ్యక్తి స్వయంగా తనకు తానే ఎంచుకున్న ధర్మ నియమాలపై నిష్ఠకి అంతులేని గౌరవం కనపడుతుంది. వ్యక్తి నియమాలని నిష్ఠతో ఆచరిస్తే అపారశక్తి లభించి “ఈశ్వరుడి” మధ్యస్థం లేకుండానే కార్య సఫలత పొందగలడు[19] అన్నది ఈ ధర్మాల మూల భావన. నియమం కంటే నియమ నిష్ఠ ముఖ్యం అవటం వల్లనే అన్ని ధర్మాలవారు ఈశ్వరుడి స్వరూపం ఏదయినా భక్తి, ముక్తికి దారి అవుతుంది అని గుర్తిస్తారు. అలాగే యోగ సాధకులు ఈశ్వరుడి బదులు ఒక కల మీద మనస్సు నిలిపినా మోక్షం లేదా కైవల్యం సాధించవచ్చు అని భావిస్తారు.

దీని వల్లనే భారతీయ సాంప్రదాయికులు చార్వాకులని సైతం క్రూరంగా ఎప్పుడూ శిక్షించలేదు. అన్ని ధర్మాలనీ సమన్వయం చేసిన భగవద్గీతకి కూడా ఈ యొక్క భావనే ప్రేరణ. ధర్మాన్ని నువ్వు రక్షిస్తే ”ఈశ్వరుడి” దాకా వెళ్ళనక్ఖరలేకుండా ధర్మమే నిన్ను రక్షిస్తుంది అన్నదే మూల సూత్రం. చేసిన పని పరిపూర్ణ

---

[19] పది ఆజ్ఞలు శాశ్వత, సర్వజనీయం అనుకున్న వారు సహితం ఇలా భావించరు

నైపుణ్యంతో చేస్తే ముక్తి లభిస్తుందన్న భగవద్గీత వాక్యానికి ఇది ప్రతిబింబం. ధర్మనిష్ఠ మీద శ్రద్ధ కోరిన వ్యక్తి సుఖ దుఃఖాలని పట్టించుకోకూడదు. పని చేయటంవల్ల దొరికే సుఖాన్ని, పని వైఫల్యం కారణంగా కలిగే దుఃఖాన్ని పట్టించుకోక పోతేనే చేస్తున్న పనిలో పరిపూర్ణ నైపుణ్యం సాధ్యం. అందుకే ధర్మనిష్ఠ, యజ్ఞాలు ఇంద్రియ నిగ్రహంతో చేసే తపస్సుకి సరితూగుతాయి. వాటి వల్ల కూడా అతీంద్రియ శక్తులు లభిస్తాయని, అవి ముక్తి మార్గాలని నిర్ణయించినది[20].

శరీరం మనసు బుద్ధుల కలయికే జీవుడు. నేను అనే అనుభూతి వల్ల జీవుడు ప్రకృతిని తన నుంచి వేరుగా గుర్తిస్తాడు. “నేను” అనే అనుభూతితో పుట్టిన జీవుడికి, “ఈశ్వరుడితోనూ”, ప్రకృతితోనూ ఉన్న సంబంధం జీవన్ముక్తులకి, అనగా ముక్తి లేదా కైవల్యం సాధించిన జీవులకి కూడా ఉంటుందా? దేవతలకి, ఈశ్వరుడికి ఉన్న తేడా ఇంతకు ముందు చర్చించాను. బ్రహ్మం, పరబ్రహ్మం అన్న మాటలతో అందరికీ పరిచయం ఉంటుంది. సహజంగా వీటికీ ఈశ్వరుడికి కూడా తేడా ఏమయినా ఉందా అన్న ప్రశ్న తల ఎత్తుతుంది. పరబ్రహ్మం అనబడేది ధర్మనిష్ఠ అంతిమ గమ్యం. ఈశ్వరుడికి, పరబ్రహ్మానికి కూడా రుజువు స్వానుభవం మాత్రమే. జీవన్ముక్తుల స్వానుభూతి పరబ్రహ్మం. పరబ్రహ్మం వరాలివ్వదు. పాపాలని నాశనం చేయదు. గుర్తిస్తే పరబ్రహ్మ, “ఈశ్వరుడు” ఒకే

---

[20] గత వెయ్యి సంవత్సరాలలో భక్తిమార్గ సమర్థకులు ఈ రెంటినీ వదలమని చెప్పటం వల్ల వారిని ఆధునిక బుద్ధిజీవులు ప్రశంసించారు.

నాణానికి రెండు వైపులు, ఒకటి కనపడితే రెండవది కనపడదు. ఇవి మాటలతో తర్కించి తెలుసుకునే విషయాలు కావు అనే మన పూర్వీకులు వీటి గురించి లెక్కలేనన్ని గ్రంథాలు, వ్యాఖ్యలు రచించారు. దీనినే వాడుక భాషలో వేదాంతం అంటారు.

ఈ వ్యాసంలో ఇప్పటి వరకు వేదాంతం యొక్క మౌలిక ఆధారం గురించి నా వ్యక్తిగత అభిప్రాయం రేఖామాత్రంగా తెలిపాను. ఇకముందు వివరించిన ఈ "వేదాంతానికి" కథా రూపం గురించి చర్చిస్తాను. ఈ కథలలో తపస్సు, ఇంద్రియ నిగ్రహం, ధర్మనిష్ఠ వల్ల అతీంద్రియ శక్తులు సాధించి ఈశ్వరుడిని ధిక్కరించి తామే సృష్టికి నియంతలు అవాలి అనుకునే వారు కనపడతారు. ముక్తి మాత్రమే కోరుకునే వాళ్ళు మునులు, ఋషులు, పతివ్రతలు. మన కథలలో వీరి వర్ణన కూడా కనపడుతుంది. అసురులను శిక్షించటం సృష్టిని రక్షించటం ఈశ్వరుడి భాధ్యత. "ఈశ్వరుడి" భాధ్యతా నిర్వహణని వర్ణించే కథలు ధర్మాన్ని పూర్తిగా అర్థం చేసుకోవటానికి సహాయం చేస్తాయి. దీనినే ఈశ్వరుడి "కళ" లేదా "లీల" లేదా "అవతారాల" వర్ణన అనవచ్చు.

సాధారణ మానవుల మనసు మీద ఈ కథలు బలంగా పనిచేసి వాళ్ళని ముక్తి మార్గం వైపు మళ్ళించేందుకు కవిత్వం, సంగీతం, నృత్యం మొదలైన కళలు కల్పించబడ్డాయి. పురాతన భారతీయ సంస్కృతిలో విశిష్టత నృత్యానికి సంగీతం, సంగీతానికి కవిత్వం,

కవిత్వానికి "ఈశ్వరుడి" కథలు ఆధారం అవటం. పసిపిల్లలకి తల్లులు పాడే జోల పాటల దగ్గర నుంచి వేశ్యలు నృత్యానికి వాడే శృంగార పదాల దాకా అన్నీ చాలా వరకు దైవపరంగా రాసినవే. మన ప్రాచీన సాహిత్యంలో దైవ సంబంధం లేని కథలు చాలా తక్కువ[21].

వేదాంతానికి నేను చూపిన రేఖా రూపానికి, కథలకి ఉన్న దగ్గర సంబంధం, "ఈశ్వరుడి" మౌలిక స్వరూపం తెలియటానికి, నేను ఎంచుకున్న విష్ణువు అవతారాలలో నాకు కనపడిన విశేషాలని సంక్షిప్తంగా చూపిస్తున్నాను[22]. (ఎంపిక చేసిన కథలు, వివరాలు ఏ ప్రామాణిక గ్రంథాలలో ఉన్నాయో నిక్కచ్చిగా చెప్పలేను. విష్ణు కథల బదులు శివుడు లేదా దేవీ ప్రధానమైన కథలతో కూడా ఇదే విధంగా రాయవచ్చు. శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో పెరగటంవల్ల నాకు విష్ణువు కథలు కొంత ఎక్కువ వివరంగా తెలుసు. అవే చూపుతున్నాను. అందుకే "ఈశ్వరుడు" అన్న మాట బదులుగా కొన్ని చోట్ల "నారాయణ" లేదా "విష్ణువు" అన్నాను.) తననీ,

[21] ఇది ఇతర సంస్కృతుల లలిత కళలతో విలక్షణంగా కనపడుతుంది. క్రైస్తవ ఇస్లాము మత గ్రంథాలలో కథలు సరళంగా ఉంటాయి. కథలో ఏవిధమైన మార్పులు ఒప్పుకోరు. అందువల్ల దైవపరమైన కథలు ఒకే మూసలో ఉంటాయి. వాటిలో నవరసాలనీ చూపటం కష్టం.
[22] సమీప కాలంలో ఇతరుల గురువులు కంటే తమ గురువు గొప్ప అని నొక్కి చెప్పటం కోసం వాళ్ళని జీవన్ముక్తులని కాక అవతారం పురుషులు అనటం సామాన్యం అయింది. ఇది ఎంతవరకూ న్యాయమో ఎవరికి వారు ఈ వర్ణన సహాయంతో తేల్చుకోవచ్చు

ప్రకృతిని ఎవరు సృష్టించారు అన్న ప్రశ్న చాలా సహజం[23]. చాలా మందికి తెలిసినవి నాలుగు ముఖాలతో పద్మంలో కూర్చుని ఉన్న బ్రహ్మ సృష్టించాడు అనే కథలు. త్రిమూర్తులు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, వరుసగా సృష్టి, పోషణ, నాశనాలకి కారకులై సృష్టి ప్రళయ చక్రాన్ని నడుపుతారు అన్న వర్ణనలో సృష్టి కర్త ఈ నాలుగు ముఖాల బ్రహ్మే. కానీ ఒక మత్స్యావతార కథ ప్రకారం ప్రళయం తరువాత సృష్టి మొదలు పెట్టటానికి బ్రహ్మకి వేదాలు, ఓషధులు, సప్త ఋషులు, మనువు అవసరం. విష్ణువు వీటిని ప్రళయం నుంచి మత్స్య రూపంలో కాపాడుతాడు. సోమకుడనే అసురుడు వేదాలని దొంగిలిస్తే, నారాయణుడు మత్స్యరూపుడై సంహరించాడని, ఇంకో కథ. మత్స్యావతారం కథను సూక్ష్మంగా పరిశీలిస్తే బ్రహ్మకి సృష్టి చేసే సామర్థ్యం ఇచ్చినది నారాయణుడు. పోషణకి మాత్రమే కాక సృష్టికి కూడా నారాయణుడే కారకుడు అని మత్స్యావతారం కథ చెబుతుంది.

సృష్టి మొదలైనప్పుడు ప్రాకృతిక శక్తులకి అధిపతులైన దేవతలకి మరణం ఉండేదని, వాళ్ళు అసురులతో కలిసి క్షీర సాగరాన్ని మధిస్తే అమృతం లభించిందని ఇంకో కథ ఉంది. అమృతం లభించిన తరువాత మాత్రమే దేవతలు అమరులు అయ్యారు. ఈ కథ వివరంగా చదివితే దేవతలు, అసురులు కలిసినా వారు

---

23 "ఎవరు" అని అడగటం తప్పు. "ఎలా లేదా ఏవిధంగా" ఏర్పడింది అని అడిగితే ఆధునిక విజ్ఞాన పద్ధతులతో సాక్షికంగా సమాధానం దొరుకుతుంది అంటారు నాస్తికులు.

తమ శక్తితో అమృతం సాధించలేదు అని స్పష్టం అవుతుంది. మంధరగిరిని కవ్వంగా, వాసుకి సర్పాన్ని తాడుగా ఉపయోగించి దేవతలు, దైత్యులు క్షీరసాగరం చిలికితే లోకాలన్నిటినీ నాశనం చేసే హాలాహలమే పుడుతుంది. విష్ణువు లోకాలని రక్షించమని చెబితే శివుడు హాలాహలం తన కంఠంలో ఉంచుకుని లోకాలని రక్షిస్తాడు. ఆ తరువాత కూడా చిలుకుతూ ఉంటే మంధరగిరి సముద్రంలో పూర్తిగా మునిగి పోతుంది. విష్ణువు కూర్మమై దానిని ఎత్తుతాడు. అమృతం కోసం చిలికే దేవతలకి, అసురులకి కూడా శివుడి సహాయం, కూర్మావతారం ధరించిన విష్ణువు సహాయం (ముందు చర్చించిన "ఈశ్వరుడి") అవసరం అయ్యాయి. ఒక కథ ప్రకారం విష్ణువు మందరగిరిని మోయటమే కాక తన చేతితో తిప్పి అమృతం పుట్టిస్తాడు. దేవతలకి మరణం లేకుండా చేసే అమృతం, భక్తులకి ముక్తి లాగా నారాయణుడి కృప మాత్రమే.

నారాయణుడు మోహినీ అవతారం ధరించి అమృతం దేవతలకి మాత్రమే లభించేటట్టు చేసాడని ఇంకొక కథ. ఇది ఈశ్వరత్వాన్ని ఇంకా చక్కగా చాటుతోంది. సృష్టి నియమానుసారం జరగటానికి ప్రాకృతిక శక్తుల అధిపతుల సహయోగం అవసరం. "ఈశ్వరుడి" అధిపత్యాన్ని ఒప్పుకున్నారు కనుక, దేవతలకి అమృతం ఇస్తాడు విష్ణువు[24]. అది దేవతా పక్షపాతం కానే కాదు. పైన వివరించిన విధంగా సురులు అసురులు కలిసి కూడా స్వశక్తితో అమృతం

[24] ఇస్లాం, క్రైస్తవ మతాల కథలలో యెహోవా సన్నిధిలో దేవదూతలు ఉంటారు గానీ వాళ్ళకి సొంత అధికారాలు ఉన్నట్టు కనపడదు.

సాధించ లేక పోయారు. "ఈశ్వరుడి" అధిపత్యాన్ని ధిక్కరించి తామే సృష్టికి నియంతలవాలి అనుకునే అసురులు అమరులు అవటం ప్రమాదకరం. వారిని మనం అసురులు అని పిలిచినా, రాక్షసులు అని పేరు పెట్టినా, నిశాచరులు అన్నా వారి ప్రవృత్తి ఈశ్వర ధిక్కారమే. ఇంతేకాక రాహుకేతువుల వల్లే సూర్య చంద్ర గ్రహణాలు కలుగుతాయి[25]. అందువల్ల రాహుకేతువులు పాక్షిక ప్రాకృతిక శక్తులు అని గుర్తిస్తే విష్ణువు వాళ్ళ వరకు అమృతం ఇవ్వటంలో అంతరార్థం తెలుస్తుంది.

మత్స్య కూర్మ మోహినీ అవతారాలు సృష్టిని నియమానుసారం నడిచేటట్టు చూడటంలో ఈశ్వరుడి భూమికని ఎత్తి చూపిస్తాయి. కొందరు అసురులు రకరకాల మార్గాలతో అమరత్వం సాధించి ఆవిధంగా తామే సృష్టికి నియంతలు కావాలని చూసినప్పుడు ఈశ్వరుడు వాళ్ళని ఎలా నిగ్రహించాడో తెలుపుతాయి ఇంకొన్ని అవతార కథలు. హిరణ్యాక్షుడు తపస్సు చేసి సంపాదించుకున్న వరాల వల్ల కాక తన స్వశక్తితో భూమిని నీళ్ళలో ముంచి లోకాలని నాశనం చేయటానికి ప్రయత్నం చేస్తే విష్ణువు వరాహ అవతారం ధరించి భూమిని కోరలతో పైకి ఎత్తి హిరణ్యాక్షుడిని చంపుతాడు.

---

[25] మన జ్యోతిష్య శాస్త్రంలో రాహుకేతువులు గ్రహాల లాగే రాశి చక్రంలో కదులుతూ ఉండే ఛాయా గ్రహాలు. ప్రాచీన భారతీయులు గ్రహాలు సూర్యుని చుట్టూ, చంద్రుడు భూమి చుట్టూ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతూ ఉంటాయని గుర్తించలేదు. ఆధునిక వైజ్ఞానంతో సమన్వయం చేయాలంటే రాహుకేతువులు సూర్యుడి చుట్టూ భూమి కక్ష్య, భూమి చుట్టూ చంద్రుడి కక్ష్యల సంగమ స్థానాలని అనుకోవచ్చు. గ్రహాల లాగే వాటికీ చలనం ఉంటుంది.

అత్యంత శక్తివంతమైన మర్త్యుల దౌర్జన్యం నుంచి ఈ లోకాలని కాపాడేవాడు నారాయణుడు అనేది వరాహావతార కథ మర్మం. కొన్ని గ్రంథాలలో హిరణ్యాక్షుడు దైవ, మానవ, జంతువుల వల్ల మృత్యువు లేకుండా బ్రహ్మ నుండి వరం పొందాడని ఉంటుంది. కానీ ఆలాంటి వరంతో వరాహావతారాన్ని సమన్వయం చేయటం కష్టం. దైవం అంటే కేవలం ముప్పై ముగ్గురు దేవతలు మాత్రమే అని అర్థం చెప్పుకోవాలి. తన స్వశక్తితో సృష్టి నియంత అవాలని ప్రయత్నించిన తమ్ముడిని వరాహ రూపంలో విష్ణువు చంపాడు అని తెలిసిన హిరణ్యకశిపుడు అతి ఘోరమైన తపస్సు చేసాడు అనుకోవడం నా ఉద్దేశ్యంలో న్యాయం.

అమరత్వం ఇవ్వటానికి బ్రహ్మ అశక్తుడు కనుక, చావు లేకుండా ఉండటం కోసం అతి విచిత్రమైన వరం కోరాడు హిరణ్యకశిపుడు. బ్రహ్మ సృష్టించిన ఏ జీవి చేతకానీ, ఇంటి లోపలకానీ, ఇంటి బయట కానీ, పగలుకానీ రాత్రికానీ, భూమి మీద కానీ, ఆకాశంలో కానీ, బ్రహ్మకాని వారు ఆయుధాలతో కానీ, మానవులచేత కానీ, మృగాల వలన కానీ, బ్రతికి ఉన్న వాటి ద్వారా కానీ, బ్రతికి లేని వాటి ద్వారాకానీ, దేవాసురుల వల్ల కానీ, మహా సర్పాల వల్లకానీ తనకి మరణం సంభవించకూడదు అన్నది ఈ వరం. ఇంతేకాక దేహమున్నవారితో యుద్ధంలో విజయం, వారిమీద ఆధిపత్యం, సాక్షాత్తు బ్రహ్మ లాగే అన్ని గ్రహాధిపతుల మీద అధికారం, తాను

ఇంతవరకు చేసిన తపస్సు, యోగ సాధనల ప్రభావం శాశ్వతంగా ఉండటం కూడా కోరుకున్నాడు.

బుద్ధితో ఇంతగా ఆలోచించి వరం కోరుకున్నా హిరణ్యకశిపుడు మృత్యువుని తప్పించుకుని సృష్టి నియంత కాలేకపోయాడు. దీనితో బుద్ధి యొక్క పరిమితి తెలుస్తోంది. స్థూలంగా చూస్తే రాత్రి -పగలు, మానవుడు-మృగం, భూమి-ఆకాశం, ఇంటా-బయటా, బ్రతికి ఉన్నవి - లేనివి సంపూర్ణ ద్వంద్వాల లాగా కనపడతాయి. ఏ రెంటినీ మినహాయిస్తే ఇంకేమీ లేవు అనిపిస్తుంది. కానీ నరసింహావతారం ఈ జంటలు సంపూర్ణం కాదు అని చూపింది. బ్రహ్మ ఇచ్చిన వరాన్ని అతిక్రమించకుండా మృగము, మనిషి కాని నరసింహుడు పగలు రాత్రి కాక సంధ్యా సమయంలో, ఇంటా బయటా కాని ద్వారంలో, భూమి ఆకాశాలలో కాక తన తొడలమీద వేసుకుని బ్రతికి ఉన్నవో కాదో తెలియరాని గోళ్ళతో చంపుతాడు. అతి విచిత్రమైన వరాలు కోరుకున్న అసురుడిని ఈశ్వరుడు అతి తేలికగా నిర్మూలించాడు. హిరణ్యకశిపుడి కొడుకైన ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు. భక్తుడిని రక్షించవలసిన సమయం వచ్చినప్పుడు విష్ణువు నరసింహ అవతారం ధరించాడు అన్నా, రక్షించినది సకల లోకాలని.

బలిచక్రవర్తి తపస్సు ద్వారా కాక యజ్ఞ మార్గంతో సృష్టి నియంత అవటానికి ప్రయత్నం చేసిన అసురుడు. దేవతలతో యుద్ధం

చేసి విజయం సాధించిన తరువాత బలి "విశ్వజిత్" యజ్ఞం ఎందుకు చేస్తున్నట్టు? యజ్ఞం ఎప్పుడూ దేవతల తృప్తి కోసం చేసేదే కదా. యుద్ధంలో ఓడించిన శత్రువు తృప్తి కోసం యజ్ఞం చేయటానికి కారణం ఏమిటి? యజ్ఞం సక్రమంగా చేసిన కర్తకి హవిర్భాగం స్వీకరించటానికి వచ్చిన దేవతల ఏ వరం అడిగినా ఇవ్వాలి, సృష్టి పైన విజయంతో సహా. ఇందుకే ఈ యజ్ఞం నీ వేలుతోనే నీ కంటిని పొడుస్తాను అనటం. ఒకసారి యుద్ధంలో ఓడిన దేవతలు బలవంతంగా యజ్ఞం ఆపలేరు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు క్రూరులై అన్ని లోకాలని హింసించారు. సృష్టిని నియమానుసారం నడవనివ్వలేదు. కనుకనే వరాహ నరసింహ అవతారాలు ధరించి వాళ్ళని చంపి, ఈశ్వరుడైన నారాయణుడు తన అవతార బాధ్యత నిర్వహించాడు.

నారాయణుడు బలిని చంపటానికి వామన అవతారం ఎత్తలేదు. బలి అజ్ఞానం, అహంకారం పోగొట్టటం కోసం అవతారం ఎత్తాడు. బలికి అహంకారం పోలేదు కనుకనే దానం తీసుకునేందుకు వచ్చినది విష్ణువు, నువ్వు దానం ఇవ్వవద్దు అని తన గురువు శుక్రాచార్యుడు చెబితే, విష్ణువు అంతటివాడి చెయ్యి కింద, నా చెయ్యి పైన అవుతుంది, తప్పకుండా దానం ఇస్తాను అన్నాడు. మూడు అడుగులు మాత్రం దానం తీసుకుని త్రివిక్రముడై సర్వ సృష్టిని రెండే రెండు అడుగులతో ఆక్రమించిన విష్ణువు బలిని శిక్షించలేదు. ధర్మం తప్పకుండా లోకాలని పాలించే ఈశ్వరుడు

వేరు, నువ్వు వేరు అనే అజ్ఞానం పోగొట్టాడు. ఆ అజ్ఞానం వల్లనే "నేను" ఈ సృష్టికి నియంతని అవాలి అనుకున్నాడు బలి. అదే రాక్షస, అసుర ప్రవృత్తి.

ఇంతవరకు చర్చించిన, ఒక్కొక్క అవతారంలో నారాయణుడికి ఒక్క ముఖ్య బాధ్యతా నిర్వహణ కోసం భూమి మీదకి రావాలిసి వచ్చింది. బాధ్యత పూర్తి కాగానే అవతారమూ పూర్తి అవుతుంది. నరసింహ వామనులు తమ బాధ్యతా నిర్వహణ తరవాత కొంత కాలం భూలోకంలో ఉన్నారని చిన్న కథలు కొన్ని మన గ్రంధాలలో కనపడతాయి. కానీ ఈ కథలు ముఖ్య కథతో పొందికగా కలవవు. పై అవతారాల లాగే బుద్ధావతారంలో కూడా బాధ్యతా నిర్మహణ సమయంలో మాత్రమే అవతారమూర్తి కనపడతాడు.

బుద్ధావతారం గురించి రెండు రకాల కథలు కనపడతాయి. కొన్ని కథల ప్రకారం త్రిపురాసురులని చంపి లోకాలని రక్షించమని శివుడిని దేవతలు ప్రార్థిస్తారు. కానీ వారి భార్యల పాతివ్రత్యం వల్ల వారిని చంపటం సాధ్యం కాదు. మారువేషంలో త్రిపురాసురుల నగరంలో ప్రవేశించి విష్ణువు తన నాస్తిక బోధలతో సామాన్యులని ఆకట్టుకుంటాడు. ఆ తరువాత, తమ భర్తలని శివుడి బారినుంచి రక్షించేందుకు ఒక అనుచిత కార్యం చేయవలసి ఉంటుందని అసురుల భార్యలని నమ్మిస్తాడు. అనుచిత ప్రవర్తన వల్ల వాళ్ళ పాతివ్రత్యం భంగమైన తరువాత త్రిపురాసురులని సంహరించి

శివుడు లోకాలని కాపాడతాడు. ఇంకొన్ని కథలు బౌద్ధ ధర్మాన్ని బోధించిన సిద్దార్థ గౌతముడే విష్ణువు అవతారమని చెబుతాయి. యజ్ఞాలలో జంతువుల బలి హింస కనుకనే అహింస పరమ ధర్మమని బోధించిన సిద్ధార్థ గౌతముడు యజ్ఞాలు చేయరాదని నాస్తిక వాదం చేసాడని[26] ఈ కథలు చెబుతాయి.

త్రిపురాసురుల భార్యలని పెడదారి పట్టించిన బుద్ధావతారాన్ని ఇంతకుముందు చర్చించిన వేదాంతం యొక్క రేఖాచిత్రంతో సమన్వయం చేయటం చాలా తేలిక. త్రిపురాసురులు తమ భార్యల పాతివ్రత్య బలప్రభావంతో “ఈశ్వరుడిని” ధిక్కరించటం హిరణ్యకశిపుడు వరబలంతో సకల సృష్టికి నియంతని అవాలి అనుకోవడం లాంటిదే. ఇది కూడా ఇంకో విచిత్రమైన వరం అని అనుకోవచ్చు.

స్థూలంగా చూసి విష్ణువు త్రిపురాసురుల భార్యలని మోసం చేసాడని నిందించచ్చు. దుష్టులైన త్రిపురాసురలతో సహవాసం అనే దోషం ఉండటం వల్లనే వాళ్ళ భార్యలని ప్రలోభ పెట్టటం విష్ణువుకి సాధ్యం అయింది. మన ధర్మాలలో తాను చేసిన తప్పుకి తనదే బాధ్యత. కాబట్టి మన ధర్మ నియమాల ప్రకారం తప్పు

---

[26] బౌద్ధం శాఖాహారాన్ని ఎక్కువగా సమర్థించ లేదు. అందుకే బౌద్ధులు చాలావరకు మాంసాహారులు. శాకాహారాన్ని బలంగా సమర్థించిన వాళ్ళు జైనులు. వాళ్ళకి పాలు శాఖాహారమే. ఈ శాఖాహార నియమాలని భారతదేశంలో చాలా సాంప్రదాయాల వాళ్ళు స్వీకరించారు.

భార్యలదే. ఈ కథ ధర్మాచరణ వల్ల అతీత శక్తులు లభిస్తాయన్న విశ్వాసానికి కూడా ఉదాహరణ. పాతివ్రత్యం ధర్మనిష్ఠ. దాని వల్ల త్రిపురాసురలకి సాక్షాత్తు శివుడిని నిలువరించే శక్తి లభించింది.

సిద్ధార్థ గౌతముడు విష్ణువు యొక్క అవతారం అనటం నా దృష్టిలో పూర్తిగా తప్పు[27]. మన ధర్మ కథలలోని పరస్పర విరుద్ధ కథనాలకి ఈశ్వరుడు లేడన్న సిద్ధార్థ గౌతముడు విష్ణువు యొక్క అవతారం అనటం కన్న గొప్ప ఉదాహరణ ఏముంది? సిద్ధార్థ గౌతముడు విష్ణువు అవతారం అనే వారు అన్ని సాంప్రదాయాలు వేదాలకి ఇస్తున్న గౌరవాన్ని అర్థం చేసుకోకుండా వేదాలకి కేవలం విగ్రహ పూజ చేస్తున్నారు[28].

ప్రతి అవతార కథా వస్తువు నారాయణుడు చేసిన ఒక కార్యమే. రామావతార కథా వస్తువు రావణవధ. ఇతర అవతారాల కథలలో విష్ణువు తన అవతార బాధ్యతని నిర్వహించినది శక్తి యుక్తులతో.

---

[27] గత వేయి సంవత్సరాలలో ధర్మనిష్ఠ మీద శ్రద్ధ తగ్గి, జ్ఞాన భక్తి మార్గ సాంప్రదాయకులు యజ్ఞయాగాది కర్మలని తీవ్రంగా నిరసించటం వల్ల బౌద్ధులు నిరీశ్వరులు అన్న విషయం మర్చిపోయి సిద్ధార్థ గౌతముడు విష్ణువు అవతారమే అన్న వాదం బలపడింది. స్వశక్తి మీద నమ్మకం లేకపోవటం, నిర్వేదంగా భగవంతుడిమీద భారం వేయటం, భక్తిమార్గాల ప్రాబల్యం. ఇది మాటిమాటికి మహమ్మదీయులతో యుద్ధాలలో ఓడిపోవడం వల్ల కావచ్చు.

[28] మాంసాహారాన్ని పూర్తిగా నిషేధించిన భక్తి సాంప్రదాయకులు యజ్ఞాలలో జంతుబలిని అంగీకరించలేరు. వీళ్ళు సిద్ధార్థ గౌతమ బుద్ధావతారాన్ని బలపరిచారనీ, ఇతర సాంప్రదాయకులు త్రిపురాసుర కథలో “బుద్ధ” పేరుని బుద్ధి హేతువాదానికి పరిమితమైనది కాబట్టి స్వీకరించారని నా ఉద్దేశం.

రామావతారంలో మాత్రమే విష్ణువు ధర్మాచరణతో తన అవతార బాధ్యతని నిర్వహించాడు. తాను నిర్దేశించిన ధర్మనియమాలని తానే పాటించి, ధర్మనిష్ఠ వల్ల లభించిన శక్తితో అవతార బాధ్యత పూర్తి చేసుకోవటం రామావతారంలోని విశిష్టత. దీనికి కారణం రావణుడు అడిగిన వరం. తపస్సు చేసి నరులు తప్ప ఇంకెవ్వరి చేతిలోనూ చావు ఉండకూడదు అన్నది రావణుడడిగిన వరం.

కానీ ఒక నరుడు రావణుడి కంటే ఎక్కువ శక్తిమంతుడు ఎలా అవగలడు? తపస్సు చేసా? ఇతరులు కూడా తన లాగే తపస్సు చేసి తన కంటే ఎక్కువ శక్తి సంపాదించుకోకుండా ఆపటానికే రావణుడు మునుల తపస్సు భంగం చేయమని తన భృత్యులని ఆజ్ఞాపిస్తాడు. విశ్వామిత్రుడు, అగస్త్యుడు వశిష్టుడు మొదలైన మహర్షులు రావణుడి కంటే చాలా శక్తివంతులు. కానీ మహర్షులు రావణుడికి శాపం కూడా ఇవ్వలేరు. కారణం స్పష్టమే. రావణుడు ఈ మహర్షులని స్వయంగా ఎదిరించక మారీచుడు సుబాహువు, ఖరుడు వంటి భృత్యులని వాళ్ళ తపస్సు ఆపమని పంపుతాడు. ఇంద్రియాలని జయించిన జ్ఞానులు కయ్యానికి కాలుదువ్వలేరు. దేవతలకి రావణుడి కంటే శక్తివంతులని సృష్టించటం చాలా తేలిక. ఇంద్రుడి కొడుకైన వాలి సంధ్యావందనం చేసుకుంటూ రావణుడిని తన చంకన పెట్టుకుని నాలుగు సముద్రాలలోనూ ముంచి కిష్కింధకు తీసుకొస్తాడు. వాలిది జంతు ప్రవృత్తి కాబట్టి సరిపోయింది. అన్ని లోకాలనీ జయించాలి అని అనుకోడు. అదే

ఒక నరుడు వాలితో సమానంగా బలవంతుడైతే? రావణుడిని చంపగలడు. కానీ అసుర రాక్షసుల లాగా రావణుడి కంటే పెద్ద లోక కంటకుడు కూడా కావచ్చు. ఇందుకే రావణ వధ కోసం నరుడిగా అవతరిస్తాను అని విష్ణువు అనగానే తమ అంశలతో వానరులని సహాయంగా పంపమని బ్రహ్మ దేవతలకి ఆదేశం ఇస్తాడు. ఇది రావణుడు తపస్సు చేసి ఎంత శక్తి సంపాదించాడో తెలుపుతుంది.

రావణుడిని ఒక నరుడు మాత్రమే చంపగలడు. జన్మ వల్ల లేదా తపస్సు వల్ల కావలసిన శక్తి లభించదు. అందువల్ల నరుడు ధర్మనిష్ఠతో శక్తి సంపాదించాలి. అంటే ఆ నరుడితో శత్రుత్వం రావణుడే స్వయంగా తెచ్చుకోవాలి. ఈ నియమాలన్నింటినీ గౌరవిస్తూ దైవత్వాన్ని పూర్తిగా మరుగుపరిచి ధర్మనిష్ఠాపరులైన సామాన్య మానవుల లాగా లక్ష్మీనారాయణులు ప్రవర్తించారని వాల్మీకి రామాయణం మాత్రమే అతి స్పష్టంగా చెప్తుంది. ప్రతి సంఘటన, ప్రతి మాట ధర్మాచరణని వర్ణిస్తాయి. లేకుంటే వారి సామాన్యతని నొక్కి చూపుతాయి. ఇది అవతార బాధ్యత సుమా అని మహర్షి మధ్య మధ్యలో గుర్తు చేస్తారు.

నేను అయోనిజని. భూమి లోంచి పైకి లేచి వచ్చాను అని తప్ప సీత తన దైవత్వం ఎక్కడా వ్యక్తం చేయలేదు. రాముడు ఎక్కడా తన దైవత్వం తెలియనివ్వలేదు. పరశురాముడితోటి ఘర్షణలో

కూడా నువ్వు విష్ణువువి అని పరశురాముడి అంటే సమాధానం చెప్పలేదు. సీత అగ్నిప్రవేశం చేసిన తరువాత బ్రహ్మ వచ్చి నువ్వు నారాయణుడివి అంటే దశరథుడి కొడుకైన రాముడిగానే నన్ను నేను గుర్తిస్తున్నాను అని అంటాడు. జటాయువుకి శాస్త్రోక్తంగా అగ్ని సంస్కారం, ఋషి సమానుడి చేతిలో జరిగింది కాబట్టి తనకి తగిన లోకానికి శాశ్వతంగా వెళ్ళాడంటారు వాల్మీకి మహర్షి. విభీషణుడికి శరణు ఇచ్చినప్పుడు కూడా రాముడి మాటలో దైవత్వం లీలగానే తప్ప స్పష్టంగా ఎక్కడా కనపడదు. ఇతర అవతారాలకి రాముడి అవతారానికి ఉన్న ఈ మౌలికమైన తేడాని ఇతర రామకథా రచయితలు గుర్తించరు. దృష్టి భక్తి మీద కేంద్రీకరించి, ఆ దృష్టితో వాల్మీకి రచనకి మార్పులు చేర్పులు చేస్తూవచ్చారు. ధర్మాచరణ ద్వారా అవతార బాధ్యతా నిర్వహణ జరిగిందని స్పష్టంగా చూపిన వాల్మీకి రామాయణాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న సామాన్యులకి విడిగా ధర్మ గ్రంధాలతో కుస్తీ పట్టవలసిన అవసరం లేకుండా వేదాంతం అర్థం అవుతుంది. ఎంత వివరంగా తెలుసుకుంటే అంతగా మన సంస్కృతి అర్థం అవుతుంది.

ఏ ఇతర అవతారంలోనూ నేను ఈశ్వరుడిని అని నారాయణుడు చెప్పలేదు. కానీ కృష్ణావతారంలో తానే దుష్టులని శిక్షించటం కాక ధర్మాత్ములని రక్షించడానికి ఈ అవతారం ఎత్తానని అర్జునుడికి భగవద్గీత ఉపదేశిస్తూ చెప్పేస్తాడు. ఇతర అవతారాలలో లాగా

ఇది నారాయణుడి అవతారమే అయితే నిర్వహించిన బాధ్యత ఏమిటి అని ప్రశ్నించి బుద్ధి సహాయంతో సమాధానాలు వెతికే అవసరం లేదు. పూతనని చంపటంతో మొదలైన దుష్టశిక్షణ కురుక్షేత్ర సంగ్రామం దాకా సాగింది అనుకోవచ్చు.

రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. ఒక్కటి రాసలీల. రెండవది భీష్మ ద్రోణ, కర్ణ, దుర్యోధనులని ధర్మ విరుద్ధంగా చంపమని కృష్ణుడు పాండవులకి చెప్పటం. రాసలీలని కష్టపడకుండానే ఆధ్యాత్మిక దృష్టితో సమర్థించవచ్చు. ప్రతి గోపికా కృష్ణుడిమీద దృష్టి నిలిపి ఇతర గోపికలు కూడా తన చుట్టూ ఉన్నారని గుర్తించదు. ఈ వర్ణనకి యోగ సాధకుని స్థితికి పోలిక స్పష్టంగా కనిపిస్తుంది. కృష్ణుడు ఈశ్వరుడు అని కనుక అంగీకరిస్తే ఈ పోలిక మరింత బలపడుతుంది. ఇకపోతే మిగిలే అభ్యంతరం దీనిని స్త్రీ పురుష సంబంధంగా వర్ణించటం. పురాణాలలో కూడా ఈ అభ్యంతరం లేవనెత్తి దానికి సమాధానాన్ని పూర్తిగా చర్చించారు[29]. స్త్రీ పురుష సంబంధం వల్లే జీవాలు జన్మిస్తాయని అన్ని మానవ సమాజాలు గుర్తించాయి. కాని పూర్తి సృష్టిని ఒక స్త్రీ పురుష సంబంధంగా చిత్రీకరించటం బహుశా మన సంస్కృతికి మాత్రమే పరిమితం. ఈ విధమైన వర్ణనలు వేదాలలో సహితం ఉన్నాయి. అందుకే మానవ జీవితంలో భాగమైన స్త్రీ పురుష సంబంధాలని కూడా

---

[29] ఇదే మధుర భక్తి పేరుతో ప్రసిద్ధి చెందింది. దురదృష్టవశాత్తు మధుర భక్తి హద్దులేని లౌకిక శృంగార వర్ణనలకి ఒక ముసుగు కూడా అయింది.

పవిత్రమైనవిగా భావించటం మన సంస్కృతి[30]. రాసలీలకి, పైన చర్చించిన త్రిపురాసుర భార్యలని విష్ణువు ప్రలోభ పెట్టడానికి ఉన్న తేడాని గుర్తించాలి. తన దగ్గరికి వచ్చిన గోపికలని వేణువు వాయిస్తున్న కృష్ణుడు వెనక్కి తమ భర్తలు దగ్గరికి వెళ్ళమనే చెబుతాడు. కృష్ణుడికి తమని తాము అంకితం చేసుకున్నారు గోపికలు. కృష్ణుడి మహిమ వల్ల వారి కుటుంబాలు గోపికలు తమ ఇళ్ళల్లోనే ఉన్నట్టు భావిస్తారు. రాసలీలకి తరతరాలుగా చేసిన ఆధ్యాత్మిక వ్యాఖ్యానాలు లౌకిక శృంగార వర్ణనలకి వేసిన ముసుగులు కావు. భారతీయ సాంప్రదాయాలలో విస్తృతంగా కనబడే భగవత్పరమైన లలితకళలకి కృష్ణుడి బాలలీలలు, రాసలీల చాలా ముఖ్యం. ఇతర దైవ పరంగా సృష్టించిన లలిత కళలలో నవరసాలన్నీ వ్యక్తం చేయటం కష్టం.

కురుక్షేత్ర యుద్ధంలో రణధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించమని యుధిష్ఠిరుని భీమార్జునులని కృష్ణుడు ప్రోత్సాహిస్తాడు. కర్ణుడు ఆయుధం చేతిలో లేకుండా రథచక్రం ఎత్తుతున్న సమయంలో చంపమంటాడు కృష్ణుడు. అప్పటికీ అర్జునుడు సందేహిస్తోంటే అభిమన్యుడి చావు గుర్తు చేస్తాడు. అర్జునుడికి తెలియకుండానే

---

[30] అది మానవుడి పతనానికి చిహ్నంగా భావించి, ముక్కు మూసుకుని సహించవలసిన దౌర్భాగ్యంగా చిత్రీకరించిన విదేశీయ మతాల సాంగత్యం వల్ల మన సంస్కృతిలో కూడా స్త్రీ పురుష సంబంధాన్ని సాహిత్యంలో వర్ణించటం పట్ల ముఖం చిట్లించటం మొదలయింది. ఉదాహరణకి వాల్మీకి రామాయణంలో సీత వర్ణనని తులసీదాసు రామచరిత మానస్ లోని వర్ణనతో పోల్చి చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

అతని విల్లు నుంచి బాణం వెళ్ళిపోయిందని వ్యాస భారతంలో వర్ణన. అంత మానసికమైన ఒత్తిడి ఎందుకు పెట్టాడు?[31] కృష్ణుడు ఈశ్వరుడని ఊరుకోలేకపోతే పూర్తిగా నాస్తికుడు అవాల్సిందేనా? నా ఉద్దేశ్యంలో ఎన్నిసార్లు ఎంత స్పష్టంగా నేనే ఈశ్వరుడిని అని కృష్ణుడు చూపాడో గుర్తించాలి. కృష్ణుడు సామాన్య మానవుడిలా పుట్టలేదు. కారాగృహంలో దేవకీ వసుదేవులకి నారాయణుడు నాలుగు చేతులతో, శంఖుచక్రాలతో ప్రత్యక్షమై. వసుదేవుడు ఏం చెయ్యాలో వివరంగా చెప్పి చిన్న పిల్లవాడి లాగా మారుతాడు. యశోదకి నోటిలో విశ్వం చూపిస్తాడు. నీటిలో మునిగిపోయిన నందుడిని వెనక్కి తేవటానికి వరుణలోకం వెళితే వరుణుడు కృష్ణుడికి క్షమాపణలు చెప్పుకుని పూజ చేస్తాడు. ఇంద్రుడు, బ్రహ్మ తమ శక్తితో కృష్ణుడితో తలపడి ఓడిపోతారు. గురుదక్షిణగా చనిపోయిన కొడుకుని తీసుకు రమ్మని గురువు అడిగితే తెస్తాడు. ఇవి భాగవత కథలైతే ద్రౌపది మానరక్షణ, చనిపోయి పుట్టిన పరీక్షిత్తుని బ్రతికించటం, దూర్వాసుడు కోపించి శపించకుండా చూడటం భారత కథలు. ఇవి కాక రాయబారానికి వచ్చినప్పుడు పుట్టుకతో గుడ్డివాడు అయిన ధృతరాష్ట్రుడికి విరాట్స్వరూపం చూపించటం, అర్జునుడికి గీతోపదేశం సమయంలో విశ్వరూపం చూపించటం ఉండనే ఉన్నాయి. ధర్మాచరణలో ఎంత ఎక్కువ శక్తి ఉందో రామావతారం చూపితే కేవలం ఆ ఈశ్వరుడు ఆదేశిస్తే మాత్రమే ధర్మాన్ని ఉల్లంఘిచవచ్చు అంటుంది కృష్ణావతారం.

---

[31] భారతంలో కృష్ణుడు వేరు, గోకులంలో కృష్ణుడు వేరు అనటం, కృష్ణుడిని కేవలం రాజకీయ నాయకుడనటం మొదలైన అభిప్రాయాలకి ఇదే కారణం.

వివిధ అవతారాలలో కనపడిన విష్ణు విరోధులలో బలి దోషం అహంకారం. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు కేవలం క్రూరులు. శక్తితో లోకాలని బాధించారు. రావణుడు కుటిలుడు. దీనికి సాక్ష్యాలు బంగారు లేడిగా మారీచుణ్ణి పంపించటం, రాముడి మాయా శిరస్సుని చూపి సీతను భయపెట్టటం. దుర్యోధనుడు నీచుడు. యుధిష్ఠిరుని ధర్మ నియమాలని ఉపయోగించి తాను రాజు అవటానికి ప్రయత్నం చేస్తాడు. భీష్ముడు అంపశయ్య మీద ఉండిపోతే ద్రోణుడిని సేనాధిపతిని చేసి, నువ్వు యుధిష్ఠిరుని బంధించితే చాలు మళ్ళీ పాచికలు ఆడించి అడవికి పంపుదాం అంటాడు. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, రావణుడు సర్వ లోక విరోధులైన రాక్షసులు. దుర్యోధనుడు మానవుడు. అతని నీచత్వం పూర్తిగా పాండవుల మీద మాత్రం కేంద్రీకరించబడింది. కురుక్షేత్ర యుద్ధంలో అనేక ఇతర రాజులు దుర్యోధనుడి పక్షంలో ఉండటానికి కృష్ణుడితో శత్రుత్వమే కాక ఇది కూడా కారణమే. వాళ్ళకి దుర్యోధనుడితో వైరం లేదు. అతను సహాయం అడిగితే లేదనటానికి హేతువు లేదు. ఈ నీచత్వానికి దోహదం చేసిన భీష్ముడి దోషాలు భారత కథకి మూల కారణం అయ్యాయి.

ఈ అతి సంక్షిప్త వ్యాసంలో మొదటిభాగం మర్త్యుల ప్రవృత్తికి, ధర్మానికి, ఈశ్వరుడికి ఉన్న సంబంధ బాంధవ్యాల మౌలిక రూపాన్ని స్పష్టం చేస్తుంది. రెండవ భాగంలోని దశావతార వర్ణన ఆ సంబంధ బాంధవ్యాలకి ఒక కథా రూపం ఇస్తుంది. ఇతర

ఆవతారలకి రామావతారానికి ఉన్న తేడా సూచనా మాత్రంగా కనపడుతుంది. దీని తరువాత ఉన్న వాల్మీకీయం, త్రివేణి వ్యాసాలు రామావతార విశిష్టతని విపులంగా వివరించటమేకాక ఈ పూర్వాంగంలో సూచనా మాత్రంగా కనపడిన విశేషాలని ఎత్తి చూపుతాయి. అందుకే పూర్వాంగం వాటికి వారధి.

వాల్మీకీయం

పదహారు ఉత్తమ గుణాలు కలిగిన మానవుడు ఎవరైనా ఉన్నారా అని వాల్మీకి నారదుడిని అడగటంతో మొదలవుతుంది వాల్మీకి రామాయణం. ఆ సద్గుణాలన్నీ ఉన్న మానవుడు రాముడు అన్న నారదుడు, సంక్షిప్తంగా రాముడి కథ చెబుతాడు. జరిగిన రామ కథతో పాటు జరగబోయేది కూడా చెప్పి నారదుడు వెళ్ళిపోతాడు. తరువాత వాల్మీకి ఆ రామకథని మననం చేసుకుంటూ స్నానం చేయటానికి తమసానది తీరానికి వెళ్తాడు. అక్కడ చెట్టు మీద ఆడుకుంటున్న పక్షుల జంటలో మొగ పక్షిని ఒక బోయవాడు బాణంతో కొట్టి చంపుతాడు. ఆడ పక్షి దుఃఖంతో అరుస్తుంది. దాని దుఃఖాన్ని చూసి చలించిన వాల్మీకి నీకు శాశ్వతంగా అపకీర్తి కలుగుతుందని శ్లోక రూపంలో బోయవాడికి శాపం పెడతాడు. స్నానం పూర్తి చేసుకుని పక్షి బాధకి స్పందించి ఇలాంటి పద్యాన్ని ఎందుకు పలికాను అని వాల్మీకి ఆలోచిస్తుంటే బ్రహ్మ స్వయంగా వచ్చి రామకథ శ్లోక రూపంలో రాయమని చెబుతాడు. మహర్షి అయిదు వందల అధ్యాయాలలో ఇరవై రెండు వేల శ్లోకాలలో రామకథ రాసి తన శిష్యులైన రాజకుమారులు, కుశలవులకి నేర్పిస్తాడు. వాళ్ళు మునుల ఎదుట రామకథ పాడుతూ ఉంటే రాముడు విని వాళ్ళని తన సభకి రప్పించి పాడమని చెబుతాడు.

అయోధ్య నగరానికి రాజైన దశరథుడు, నాకు కొడుకులు లేరు. పుత్రుల కోసం అశ్వమేధ యాగం చెయ్యాలని అనుకున్నాను. ఈ విషయంలో మీ అభిప్రాయాలు చెప్పండి అని మంత్రులని పురోహితులని అడుగుతాడు. ఋష్యశృంగుడిని కనక రప్పిస్తే నీకు కొడుకులు పుడతారని పూర్వం సనత్కుమారుడు చెప్పాడట అంటాడు సుమంతుడు. దశరథుడు వెళ్ళి తన స్నేహితుడు, అంగదేశానికి రాజయిన రోమపాదుడిని అడిగి అతని అల్లుడు ఋష్యశృంగుడిని తీసుకు వస్తాడు. తరువాత యజ్ఞం సక్రమంగా పూర్తిచేయవలసిన బాధ్యత పూర్తిగా మంత్రులకి, పురోహితులకి అప్పగిస్తాడు. వశిష్టుడు ఎవరెవరిని ఆహ్వానించాలో చెబుతూ విదేహ రాజు జనకుడు, కైక తండ్రి అశ్వపతి, రోమపాదుడు, కాశీ రాజు ముఖ్య అతిథులు. వారిని నువ్వు స్వయంగా వెళ్ళి తీసుకు రమ్మని మంత్రి సుమంతుడికి చెబుతాడు. దశరథుడి అశ్వమేధ యాగం సక్రమంగా పూర్తయినప్పుడు అక్కడకి వచ్చిన దేవతలు నువ్వు దశరథుడికి నలుగురు కొడుకులుగా పుట్టి లోకాలన్నింటినీ బాధిస్తున్న రావణుడిని చంపమని విష్ణువుని వేడుకుంటారు. విష్ణువు దానికి అంగీకరిస్తాడు. పుత్రులను కోరి యజ్ఞం చేస్తున్న దశరథుడి ఎదుట ఉన్న అగ్నిలోంచి ప్రజాపతి పైకి వస్తాడు. ప్రజాపతి ఇచ్చిన పాయసం దశరథుడు ముందు సగం కౌసల్యకి, తరువాత పావుభాగం సుమిత్రకి ఆ తరువాత ఎనిమిదవ వంతు కైకేయికి ఇచ్చి, మిగిలింది కూడా సుమిత్రకి ఇస్తాడు. నరుడిగా

,

జన్మించబోతున్న విష్ణువుకి సహాయంగా, అపార బలవంతులైన వానరులని పుట్టించమని దేవతలందరిని బ్రహ్మ ఆజ్ఞాపిస్తాడు. సంవత్సరం తరువాత కౌసల్యకు రాముడు, మర్నాడు కైకేయికి భరతుడు ఆ మరుసటి రోజున సుమిత్రకి లక్ష్మణ శత్రుఘ్నులు పుడతారు.

కొద్ది సంవత్సరాల తరువాత విశ్వామిత్రుడు దశరథుడి దగ్గరకు వచ్చి మారీచ సుబాహులనే రాక్షసుల నుంచి తన యజ్ఞాన్ని రక్షించటం కోసం రాముడిని తన వెంట పంపమని కోరుతాడు. నా ప్రియ పుత్రుడు రాముడు పదహారేళ్ళు కూడాలేనివాడు, శస్త్ర విద్యలు తెలియని వాడు. ఆ రాక్షసులతో యుద్ధం చేయలేడు. నేను పంపనంటాడు దశరథుడు. విశ్వామిత్రుడికి కోపం వచ్చింది అని గ్రహించిన వశిష్టుడు, ఏదడిగినా ఇస్తాను అని మాట ఇచ్చి తప్పకు. విశ్వామిత్రుడికి తెలియని అస్త్రాలు ఈ సృష్టిలో లేవు, అతని రక్షణలో ఉన్న రాముడి గురించి భయపడవద్దు అని దశరథుడికి నచ్చచెప్పి రాముడిని పంపటానికి ఒప్పిస్తాడు.

సరయూనది తీరంలో విశ్వామిత్రుడు రామలక్ష్మణులకి శారీరక శ్రమ తెలియకుండా ఉండేందుకు బల అతిబల అని మంత్రాలు ఉపదేశిస్తాడు. ఆ తరువాత తాటక ఉన్న చోటికి తీసుకుని వెళ్ళి, ఈ తాటక వెయ్యి ఏనుగుల బలం ఉన్న స్త్రీ. అయినా లోక క్షేమం కోసం చంపు, గతంలో ఇంద్రుడికి, విష్ణువుకి కొందరు రాజులకి

,

లోక క్షేమం కోసం స్త్రీలని చంపాల్సి వచ్చింది అని ప్రోత్సహిస్తాడు. నా తండ్రి ఆజ్ఞ పాటించటం నా ధర్మం. నువ్వు ఏం చెయ్యమంటే అది చెయ్యి అని నా తండ్రి శాసనం. కాబట్టి నువ్వు చంపమన్న ఈ తాటక స్త్రీ అయినా సరే, నేను చంపుతాను అని విల్లంబులు అందుకుంటాడు రాముడు. రాముడు వదలిన బాణంతో తాటక మరణించిన తరువాత ఇంద్రుడు నీ దగ్గర ఉన్న సమస్త అస్త్రాలు పారితోషికంగా రాముడికి ఇవ్వమని విశ్వామిత్రుడికి చెబుతాడు. అస్త్రాలు ఇవ్వగానే వాటిని ఉపసంహరించటం కూడా నేర్పమని అడుగుతాడు రాముడు. అస్త్రాల ఉపసంహరణ నేర్పి, మరిన్ని అస్త్రాలు కూడా ఇచ్చి రామలక్ష్మణులని తన ఆశ్రమానికి తీసుకుని వెళతాడు విశ్వామిత్రుడు. మారీచుడు, సుబాహుడు యజ్ఞాన్ని ఆపటానికి ప్రయత్నిస్తే రాముడు మారీచుడి మీద మానవాస్త్రం ప్రయోగిస్తాడు. ఆ అస్త్రం వలన మారీచుడికి స్పృహ పోతుంది. అస్త్రం వాడిని నూరు యోజనాల దూరంలో పారేసింది కానీ వాణ్ణి చంపలేదు అని లక్ష్మణుడితో చెప్పి రాముడు సుబాహువు మీద ఆగ్నేయాస్త్రం ప్రయోగిస్తాడు. సుబాహుడు చనిపోతాడు. మిగిలిన రాక్షసులని రాముడు వాయవ్యాస్త్రంతో తరిమేస్తాడు. సక్రమంగా యజ్ఞం పూర్తి అవుతుంది.

ఇంకా ఏమి ఆజ్ఞ అని అడిగిన రాముడితో నేను మిథిలలో జనక మహారాజు చేస్తున్న యజ్ఞాన్ని చూడటానికి ఇతర మునులతో కలసి వెళుతున్నాను, ఆయన దగ్గర గొప్ప ధనుస్సు ఉంది. దాన్ని

,

చూడటానికి మాతో రమ్మని తీసుకు వెళతాడు విశ్వామిత్రుడు. రాత్రిళ్ళు విశ్రాంతి తీసుకునే సమయంలో రామలక్ష్మణులకి ఇతర మునులకి, క్షీరసాగర మథనం, గంగావతరణం, షణ్ముఖుడి పుట్టుక, ఇక్ష్వాకు వంశంలో పుట్టిన సగరుడి యాగాశ్వాన్ని ఇంద్రుడు దాచితే సగరుడి కొడుకులు అశ్వం కోసం భూమిని తవ్వి పాతాళంలో కపిలుడి వల్ల భస్మం అవటం, సగరుడికి నాలుగవ తరం వాడైన భగీరథుడు గంగాజలం పాతాళానికి తెచ్చి భస్మమైన తన పూర్వీకులైన సగరుడి పుత్రులను స్వర్గానికి పంపటం మొదలైన పురాణ కథలు చెబుతాడు విశ్వామిత్రుడు. చివరికి మహర్షి గౌతముడు తన భార్య అహల్యని, ఇంద్రుడిని శపించిన విషయం చెబుతాడు. నువ్వు ఈ ఆశ్రమంలో ప్రవేశించే వరకు అదృశ్యంగా తపస్సు చేయమని అహల్యని గౌతముడు శపించాడు. అందువల్ల నువ్వు ఈ ఆశ్రమంలో ప్రవేశిస్తే అహల్యకి తన రూపం తిరిగి లభిస్తుంది అంటూ రాముడిని ఆశ్రమంలోకి తీసుకు వెడతాడు. రామలక్ష్మణులు నిజరూపం తిరిగి ధరించిన అహల్యకు నమస్కరించి, గౌతముడి ఆతిథ్యాన్ని స్వీకరించి, మిథిల చేరుతారు. అహల్యా గౌతముల కొడుకు శతానందుడు జనక మహారాజు పురోహితుడు. తల్లికి నిజరూపం లభించినదని విని ఆనందించి, రాముడికి విశ్వామిత్రుడి చరిత్ర చెబుతాడు.

విశ్వామిత్రుడు పరాక్రమవంతుడైన రాజు. తన సేనతో వెళుతూ దారిలో వశిష్టుడి ఆశ్రమానికి వస్తాడు. వశిష్టుడు సమస్త సైన్యానికి

,

ఆతిథ్యం ఇస్తానని రాజుని బలవంతం చేస్తాడు. విశ్వామిత్రుడు అంగీకరించిన తరువాత వశిష్టుడి కామధేనువు నందిని విందుకి అవసరమైన సమస్త సామగ్రి సృష్టి చేస్తుంది. నేను రాజుని. అన్ని అపురూపమైన వస్తువులు నిజానికి నాకే చెందాలి. అయినా నీకు ఆవులు, బంగారము, వెండి, రత్నాలు ఇస్తాను, బదులుగా నాకు నీ నందినిని ఇయ్యి అని అడుగుతాడు విశ్వామిత్రుడు. వశిష్టుడు నేను ఇవ్వను అంటాడు. బలవంతంగా నందినిని తీసుకుని వెళ్ళిపోటానికి ప్రయత్నం చేస్తాడు విశ్వామిత్రుడు. నందిని పెద్ద సైన్యాన్ని సృష్టించి విశ్వామిత్రుడి సైన్యాన్ని, కొడుకులని కూడా నాశనం చేస్తుంది. విశ్వామిత్రుడికి కోపం వచ్చి శివుడి గురించి తపస్సు చేసి సకల అస్త్రాలు సంపాదించి వశిష్టుడి ఆశ్రమానికి వచ్చి ప్రయోగిస్తాడు. విశ్వామిత్రుడి అస్త్రాలు వశిష్టుడి దండంలో లీనమౌతాయి.

క్షత్రియుడి బలం కంటే బ్రహ్మ బలం గొప్పది అని గ్రహించిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అవటానికి తపస్సు మొదలుపెడతాడు. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన త్రిశంకుడు ఈ శరీరంతోనే స్వర్గానికి వెళ్ళటానికి యజ్ఞం చేయించమంటే వశిష్టుడు అది కుదరదు అంటాడు. వశిష్టుడి కొడుకులని అడిగితే తండ్రి కాదంటే మేము ఎలా చేస్తామనుకున్నావు అంటారు. ఇంకెవరినైనా అడుగుతాను అన్న త్రిశంకుడిని గురువుని వదిలిన నీకు చండాల రూపం కలగుతుందని శపిస్తారు వశిష్టుడి కొడుకులు. విశ్వామిత్రుడిని నా

,

కోరిక తీర్చమని వేడుకుంటాడు త్రిశంకుడు. త్రిశంకుడి కోసం విశ్వామిత్రుడు యజ్ఞం చేస్తే హవిర్భాగం తీసుకోవటానికి దేవతలు రారు. కోపం వచ్చి త్రిశంకుడిని స్వర్గానికి వెళ్ళమని విశ్వామిత్రుడే ఆజ్ఞ ఇస్తాడు. స్వర్గానికి చేరిన వాడిని దేవతలు మళ్ళీ భూమి మీదకి పడేస్తారు. త్రిశంకుడిని మధ్యలో ఆపి తానే ఇంకొక స్వర్గం, నక్షత్రాలు, సృష్టించటం మొదలెడతాడు విశ్వామిత్రుడు. చివరికి దేవతలు విశ్వామిత్రుడిని శాంతింప చేసి త్రిశంకుడికి ఒక శాశ్వత నక్షత్ర స్థానం ఇస్తారు.

విశ్వామిత్రుడు మళ్ళీ తపస్సు చేయటం మొదలు పెడతాడు. శునప్శేనుడి తండ్రి వాడిని రాజుకి యజ్ఞ పశువుగా ఇచ్చేస్తాడు. తనని కాపాడమని మేనమామ విశ్వామిత్రుడిని వేడుకుంటాడు శునప్శేనుడు. జాలితో తన కొడుకులలో ఒకడిని యజ్ఞ పశువుగా వెళ్ళమంటాడు విశ్వామిత్రుడు. వాళ్ళు ఒప్పుకోరు. కోపం వచ్చి వాళ్ళను శపిస్తాడు. శునప్శేనుడికి జపించటానికి ఒక మంత్రం చెబుతాడు. ఆ మంత్రం మహిమ వల్ల యజ్ఞ పశువు లేకుండానే రాజుకి పూర్తి యజ్ఞఫలం ఇస్తాడు ఇంద్రుడు. ఇంకోసారి తపస్సు మొదలుపెట్టిన విశ్వామిత్రుడికి మేనకని మోహించటం కొన్ని సంవత్సరాలు సంసారం చేయటం ఇంకో ఆటంకం అవుతుంది. తరువాత రంభ ఇంద్రుడు కూడా తపస్సుకి విఘ్నాలు కల్పిస్తారు. అయినా మళ్ళీ మళ్ళీ తపస్సు చేసి చివరికి బ్రహ్మర్షి అవుతాడు.

,

శాతానందుడు కథ చెప్పటం అయిన తరువాత విశ్వామిత్రుడు రాముడికి శివ ధనుస్సుని చూపమని జనకుడిని అడుగుతాడు. నేను యజ్ఞ భూమిని దున్నుతోంటే భూమిని చీల్చుకుని పైకి వచ్చిన పిల్ల సీత. ఆకాశవాణి మాట ప్రకారం నా కూతురుగా పెంచుకుంటున్నాను. ఎన్నో తరాలుగా మా ఇంట ఉన్న శివుడి ధనుస్సుని ఎక్కుపెట్టిన వాడికి, సీతను ఇచ్చి పెళ్ళిచేస్తానని నేను ప్రకటించాను. ఎవరూ ధనుస్సుని కదపను కూడా లేకపోయారు అని చెబుతూ ధనుస్సు తెప్పిస్తాడు జనకుడు. విశ్వామిత్రుడి అనుమతి తీసుకున్న రాముడు విల్లు ఎత్తి ఎక్కుపెట్టగానే ఆ ధనుస్సు మధ్యకి విరుగుతుంది. జనకుడు కన్యాదానం ఇప్పుడే చేస్తానంటే రాముడు తండ్రి అనుమతి లేకుండా స్వీకరించను అంటాడు. (అయోధ్యకాండలో, అత్రిమహర్షిని, అతని భార్య అనసూయని రాముడు దర్శించినప్పుడు, అనసూయ అడిగితే సీత ఈ వివరాలు చెబుతుంది.) జనకుడు దూతలను పంపి ఆహ్వానించగా దశరథుడు మిథిలానగరం వస్తాడు. దశరథుడి అనుమతితో సీతతో రాముడికి, లక్ష్మణుడికి మరొక్క కూతురు ఊర్మిళతో, తన తమ్ముడి కూతుళ్ళైన మాండవి శృతకీర్తులతో భరతశత్రుఘ్నులకి వివాహాలు జరిపిస్తాడు జనకుడు.

దశరథుడు తన కొడుకులతో కోడళ్ళతో కలిసి అయోధ్య తిరిగి వస్తున్నప్పుడు అకస్మాత్తుగా అంతా చీకటిగా అయిపోతుంది. దశరథుడికి, రామలక్ష్మణభరతశత్రుఘ్నులకి, వశిష్టుడి వంటి

,

ఋషులకి పరశురాముడు కనపడతాడు. ఋషుల అభివాదం స్వీకరించిన పరశురాముడు శివుడి ధనుస్సు విరిచావని తెలిసి వచ్చాను. దానికి దీటయిన ఈ విష్ణు ధనుస్సుని ఎక్కుపెట్టి నాతో యుద్ధం చెయ్యి అంటాడు రాముడితో. దశరథుడు కొడుకుని కరుణించమంటే వినిపించుకోడు. విష్ణువు విల్లు ఎక్కుపెట్టి ఈ విష్ణుబాణం వృధా కాకూడదు. కానీ విశ్వామిత్రుడి బంధువువి కాబట్టి నిన్ను చంపను. నీ తపశ్శక్తిని నాశనం చేయనా లేక నీ నడిచే శక్తిని నాశనం చేయనా అని అడుగుతాడు రాముడు. నువ్వు విష్ణువువి అని తెలుసుకున్నాను, నా తపశ్శక్తినే నాశనం చెయ్యి అని చెబుతాడు పరశురాముడు. రాముడు అలా చేసిన తరువాత రాముడికి నమస్కరించి మహేంద్ర పర్వతానికి తిరిగి వెళ్ళిపోతాడు పరశురాముడు. కొడుకు గురించి భయపడుతూ దుఃఖిస్తున్న దశరథుడు రాముడు విల్లు ఎక్కు పెట్టటం కానీ పరశురాముడు నువ్వు విష్ణువువి అని చెప్పటం కానీ గుర్తించడు. పరశురాముడు వెళ్ళిపోయాడు కనుక మన సేనని అయోధ్యా నగరానికి బయలుదేరమని ఆజ్ఞ ఇయ్యి అని రాముడే తండ్రికి చెబుతాడు.

వివాహాల తరువాత అయోధ్యానగరం తిరిగి వచ్చిన దశరథుడు భరతుడిని మేనమామతో కైకేయ దేశానికి వెళ్ళమని చెబుతాడు. భరత శత్రుఘ్నులు వెళ్ళగానే రాముడికి ప్రభుత్వ బాధ్యతలు ఒప్పచెప్పటం మొదలుపెడతాడు దశరథుడు. తానింకా బ్రతికి

,

ఉండగా రాముడిని యవరాజుని చెయ్యాలని నిర్ణయించుకుని దశరథుడు మంత్రులని సంప్రదించి, సభ ఏర్పాటు చేయమని, సభకి అన్ని జాతుల వారినీ పిలవమనీ, సీత తండ్రి జనకుడిని, కైకేయి తండ్రి అశ్వపతిని వదిలి ఇతర రాజులకి ఆహ్వానాలు పంపమని మంత్రి సుమంత్రుడికి ఆజ్ఞ ఇస్తాడు. సభలో అందరూ రాముడు యువరాజు అవటం హర్షిస్తారు. యౌవరాజ్యాభిషేకానికి ముహూర్తం రేపే అని దశరథుడు నిర్ణయిస్తాడు.

కైక దాసి మంథర రాముడు యువరాజయితే భరతుడు అతని సంతతి రాజరికానికి శాశ్వతంగా దూరం అవుతారు. రాముడు భరతుడిని బ్రతికి కూడా ఉండనివ్వడు అని కైకేయికి రాముడి మీద కోపం కలిగిస్తుంది. యుద్ధంలో గాయపడిన దశరథుడిని నువ్వు రక్షించావు. అప్పుడు నీకు రెండు వరాలు ఇస్తానని మాట ఇచ్చాడు. ఇప్పుడు ఆ వరాలు అడుగు. భరతుడిని యువరాజు చేయమను. రాముడిని పద్నాలుగు సంవత్సరాలు అరణ్యానికి పంపమను. భరతుడు రాజ్యాధికారాన్ని స్థిరం చేసుకుంటాడు అంటుంది మంథర. కైకేయి అంగీకరించి తన అలంకారాలు తీసేసి అలక గృహంలో దశరథుడి కోసం వేచి ఉంటుంది. తాను అనుకున్నట్టే రాముడి పట్టాభిషేకం జరుగుతుందని సంతోషంతో పొంగిపోతున్న దశరథుడు కైక దగ్గరికు వస్తాడు.

,

కోపానికీ, అలుకకి కారణం అడిగిన దశరథుడిని, కైకేయి తాను అడగబోయేది తప్పకుండా ఇస్తానని వాగ్దానం చేయమంటుంది. దశరథుడు రాముడి మీద ఒట్టు, తప్పకుండా ఇస్తాను అంటాడు. కైక దశరథుడి మాటకి స్వర్గంలోని ముప్పై ముగ్గురు దేవతలు, సూర్య చంద్రులు మొదలు గృహ దేవతల దాకా సమస్త సృష్టి సాక్ష్యం అని ముందు చెప్పి, తరువాత ఈ వరాలు గతంలో దశరథుడు తనకి ఇచ్చిన వరాలే అని కూడా గుర్తుచేసి రాముడి యౌవరాజ్యాభిషేకం కోసం తెప్పించిన సంభారాలతో భరతుడిని యువరాజుగా అభిషేకించటం, రాముడు తక్షణం పద్నాలుగు సంవత్సరాలు జటలు, నార బట్టలు ధరించి దండకారణ్యంలో తాపసిగా ఉండటం తాను అడుగుతున్న వరాలు అంటుంది. దశరథుడు ఎంత బతిమాలుకున్నా, ఎంతగా తిట్టినా కైకేయి వినిపించుకోదు. మరునాటి ఉదయం రామపట్టాభిషేకానికి అన్నీ సిద్ధం చేసి వశిష్టుడు ఇతర ప్రముఖులు తమ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పటానికి వచ్చిన సుమంత్రుడిని కైక రాముడిని తీసుకురమ్మని పంపుతుంది. తండ్రి నోరు తెరిచి తాను నాకిచ్చిన వరాల గురించి నీకు చెప్పలేక పోతున్నాడు అంటూ కైకేయి రాముడికి తాను అడిగిన వరాలు ఏమిటో చెప్పేస్తుంది. రాముడు వనవాసానికి వెళ్తానని మాట ఇస్తాడు.

ఈ విషయం రాముడు చెప్పగా విని దుఃఖిస్తున్న కౌసల్యని చూచి కోపంతో తండ్రిని చంపుతాను అన్న లక్ష్మణుడిని శాంతపరచి,

,

తల్లితో, తండ్రి ఆజ్ఞ పాటించటం నా ధర్మం, భర్తసేవ నీ ధర్మం. కనుక నువ్వు నాతో రాకూడదు. నేను మాత్రం అడవికి వెళ్ళటానికి అనుమతించు అని అంటాడు రాముడు. కౌసల్య దుఃఖిస్తూనే రాముడికి రక్షకట్టి ఆశీర్వాదం చేస్తుంది. వనవాసానికి రావద్దని ఎంత చెప్పినా వినని సీతని చివరికి తనతో తీసుకు వెళ్ళటానికి అంగీకరిస్తాడు రాముడు. తమతో లక్ష్మణుడు రావటానికి కూడా ఒప్పుకుంటాడు. సీతారాములు తమ సమస్తమూ దానం చేసి దశరథుడి దగ్గర వీడ్కోలు తీసుకోవటం కోసం కాలి నడకన వస్తారు. దశరథుడు నన్ను తొలిగించి రాజ్యం నీ చేతికి తీసుకో అంటే రాముడు ఒప్పుకోడు. ఇంకొక్క రోజు ఆగమన్నా వినడు. బాధతో దశరథుడు సైన్యాన్ని, ధనాన్ని, ప్రజలని రాముడి వెంట వెళ్ళమంటాను అంటే కైకేయి భరతుడికి ఖాళీ నగరం ఇస్తావా అని కోపగిస్తుంది. రాముడు స్థైర్యంగా, గుర్రాని ఇచ్చేసిన వాడికి కళ్ళెం ఎందుకు. తాపసిగా బ్రతకటానికి నాకు నారవస్త్రాలు మాత్రమే అవసరం అవుతాయి అంటాడు. సీతారామలక్ష్మణులకి నారవస్త్రాలు కైకేయి వెంటనే ఇస్తుంది. రామ లక్ష్మణులు వాటిని ధరిస్తారు. సీత వాటిని ఎలా ధరించాలో తెలియక సిగ్గు పడుతూ ఉఃటే రాముడు సీత కట్టుకున్న వస్త్రాలు పైన వాటిని చుడతాడు. వశిష్టుడు కైకేయిని మందలించి సీత వల్కలు ధరించాలని నువ్వు వరం అడగ లేదు. ధర్మం తెలిసిన భరతుడు నీ కోరిక తీర్చటానికి రాజ్యాభిషేకం చేసుకోడని గుర్తు పెట్టుకో అంటాడు కైకతో. సీతకి అవసరమైన వస్త్రాభరణాలు ఇవ్వమని దశరథుడు

,

తన కోశాధికారికి ఆజ్ఞ ఇస్తాడు. గురువు వశిష్టుడే కాక దశరథుడి మంత్రులు సుమంతుడు, సిద్ధార్థుడు కూడా కైకేయిని తీవ్రంగా నిందిస్తారు.

రాముడిని తన తండ్రి దశరథుడిగా, సీతని తల్లిగా, అడవిని అయోధ్యగా భావిస్తూ సుఖంగా ఉండమని సుమిత్ర లక్ష్మణుడికి ఆశీర్వాదం చేస్తుంది. సీతారామలక్ష్మణులు, తల్లులు అందరికీ, తండ్రికే పాదాభివందనాలు చేసి రథం ఎక్కి వనవాసానికి బయలుదేరుతారు. ఒక వైపు రాజమార్గంలో ప్రజలు దుఃఖిస్తూ ఉండగా, తల్లితండ్రులు రాజభవనం బయటకు వచ్చి ఏడుస్తూ రథాన్ని ఆపమని సారథిని పిలుస్తూ ఉండటం విని రాముడు భరించలేక, సారథిని రథాన్ని ఆపకుండా పోనీ. వెనక్కి వచ్చిన తరువాత ఒకవేళ మహారాజు, నేను ఆపమంటే రథం ఎందుకు ఆపలేదు అని అడిగితే ఇతర చప్పుళ్ళలో ఆజ్ఞ వినపడలేదు, అని చెప్పు అంటాడు. స్త్రీలు పిల్లలు అయోధ్యలో ఆగిపోయినా పురుషులు రథం ఆపమని అరుస్తూ రథం వెనుకే పరిగెత్తి వస్తూ ఉంటారు. రథం దిగిన రాముడికి వృద్ధ బ్రాహ్మణులతో సహా అందరూ సాష్టాంగ నమస్కారాలు చేసి వనవాసం వదిలి వెనక్కి రమ్మని ప్రార్థిస్తారు. రాముడు బదులు చెప్పకుండా వారు అలసి ఉన్నారని గ్రహించి నెమ్మది నెమ్మదిగా నడుస్తూ ఉంటాడు. సాయంకాలానికి అందరూ తమసా నదీతీరం చేరి చెట్లకింద పడుకుంటారు. పూర్తిగా తెల్లవారే లోపల రాముడు నిశ్శబ్దంగా

,

గుర్రాలని రథానికి పూన్చి తాము ఎటు వెళ్ళామో తెలియకుండా రథాన్ని అడ్డదిడ్డంగా నడపమని సారథికి చెబుతాడు. తరువాత సీతారామలక్ష్మణులు అలసటకి నిద్రపోతున్న పౌరులు లేచేసరికి రథం ఎక్కి వాళ్ళకి కనపడకుండా వెళ్ళి పోతారు. పౌరులు తమ నిద్రని తిట్టుకుంటూ అయోధ్యకి వెళ్ళిపోతారు.

మరుసటిరోజు సాయంత్రానికి రథం గంగాతీరం చేరుకుంటుంది. రాముడు వెనుకకు తిరిగి కోసలరాజ్య దేవతకు నమస్కారం చేసి తమ వనవాసం సుఖంగా పూర్తి అయ్యేటట్టు ఆశీర్వదించమని కోరుతాడు. గంగానదీ తీరంలో నిషాద రాజు గుహుడు రాముడిని తాను ఇచ్చే ఆతిథ్యం స్వీకరించమని అడిగితే, వనవాస దీక్షలో ఉన్నాను కనుక స్వీకరించలేను అంటూ గుర్రానికి మాత్రం మేత ఇవ్వమని కోరుతాడు. మర్నాడు మర్రి పాలతో జుట్టుని జటలుగా చేసుకుని, రథం అయోధ్యకి తీసుకుని వెళ్ళి తండ్రికి, తల్లులకి తన నమస్కారాలు చెప్పి తాము దండకారణ్యం ప్రవేశించామని చెప్పమంటాడు సుమంతుడిని. తరువాత గుహుడు ఏర్పాటు చేసిన నావలో గంగ దాటి, మనుష్య సంచారం లేని అడవిలో సీతారామలక్ష్మణులు జంతువులని వేటాడి, ఆ మాంసం తిని రథమూ సారథి లేకుండా రాత్రి గడుపుతారు. తల్లిని కైకేయి దౌష్ట్యం నుంచి రక్షించేందుకు లక్ష్మణుడిని తిరిగి అయోధ్యకు వెళ్ళమంటాడు రాముడు. లక్ష్మణుడు ఒప్పుకోడు. మరుసటిరోజు భరద్వాజుడిని కలిసి, ఆయన సూచన మేరకు తామే తయారు

,

చేసుకున్న తెప్పలో యమునా నది దాటి చిత్రకూటంలో పర్ణశాల ఏర్పాటు చేసుకుంటారు సీతారామలక్ష్మణులు.

సుమంతుడు రాముడు చిత్రకూటం వెళ్ళాడని తెలిసేదాకా గుహుడి వద్ద ఆగి అయోధ్యా నగరం తిరిగి వస్తాడు. ఈ సంగతి విన్న దశరథుడు కౌసల్య దుఃఖిస్తారు. కౌసల్య దశరథుడిని తీవ్రంగా నిందిస్తుంది. ధర్మనిష్ఠకల రాముడికి ఏ భయమూ లేదు. నీ కొడుకు తిరిగి వచ్చి సింహాసనం ఎక్కటం నువ్వు చూస్తావు అంటూ కౌసల్యని ఓదారుస్తుంది సుమిత్ర. ఆ రాత్రి తను పొరపాటుగా శ్రవణ కుమారుడిని చంపిన నేరానికి రాముడితో దూరం అయ్యాడని దుఃఖిస్తూ దశరథుడు ఆ విషయం కౌసల్యకి చెబుతాడు. యువరాజు దశరథుడికి కనిపించకపోయినా శబ్దం చేస్తున్న చోటుని బాణంతో కొట్టటం తెలుసు. వర్షాకాలంలో వేటకి వచ్చి ఏనుగు నీళ్ళు తాగుతున్న చప్పుడు అనుకుని బాణం వేస్తే ఆ బాణం కుండలో నీళ్ళు నింపుకుంటున్న శ్రవణ కుమారుడికి తగులుతుంది.

చనిపోయేముందు శ్రవణుడు కళ్ళు లేని నా తల్లిదండ్రులు సేవ చేయటానికి నేను లేకపోతే ఎలా బ్రతుకుతారు అని ప్రశ్నిస్తాడు. తాను వైశ్యుడికి శూద్ర స్త్రీయందు పుట్టినవాడు. కనుక దశరథుడికి బ్రహ్మహత్యా దోషం ఉండదు అని కూడా చెబుతాడు. శ్రవణుడి మరణం తరువాత దశరథుడు అతని తల్లిదండ్రుల దగ్గరకి

,

వెళ్ళి శ్రవణుడు ఎలా మరణించాడో చెబుతాడు. నువ్వే వచ్చి స్వయంగా తప్పు ఒప్పుకున్నావు కనుక బ్రతికావు లేకుంటే నీ తల వెయ్యి చెక్కలు అయేది. తెలియక చేసిన తప్పు కనుక నీకు బ్రహ్మహత్యా దోషం ఉండదు అని శ్రవణుడి తండ్రి చెబుతాడు. తరువాత దశరథుడి సహాయంతో శ్రవణుడికి అంత్యక్రియలు చేసి, ఆ చితిమీదే ఆత్మహత్య చేసుకుంటూ, నువ్వు కూడా పుత్ర శోకంతో మరణిస్తావు అని శపిస్తాడు. కథ చెప్పిన దశరథుడు ఆ రాత్రి కౌసల్య, సుమిత్ర, దశరథుడి ఇతర భార్యలు నిద్రపోతూ ఉండగా మరణిస్తాడు. మరునాడు అందరికీ తెలిసి దుఃఖిస్తారు. కొడుకులు ఎవరూ దగ్గర లేనందున శరీరాన్ని తైల బాంధంలో ఉంచి భరతుడిని తొందరగా అయోధ్య రమ్మని చెప్పటానికి దూతలని పంపుతూ సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళ్ళటం దశరథుడు మరణించటం భరతుడికి తెలియనివ్వవద్దు అని ఆ దూతలని ఆజ్ఞాపిస్తాడు వశిష్టుడు.

భరతుడు వచ్చి, జరిగినది తెలుసుకుని, కైకేయిని తీవ్రంగా తిట్టి దశరథుడి అంత్య క్రియలు చేస్తాడు. అవి పూర్తి అయిన రోజు శత్రుఘ్నుడు మంథరను చూసి కోపంతో ఆమెను చంపటానికి సిద్ధం అవుతే నువ్వు స్త్రీని హత్య చేసావని తెలిస్తే రాముడు మన ఇద్దరితోనూ ఒక్క మాట కూడా మాట్లాడడు. నేను కైకను అందుకే చంపలేదు అంటూ వారిస్తాడు. తండ్రి తరువాత జ్యేష్ఠ పుత్రుడే రాజు అవటం ఇక్ష్వాకుల ఆచారం కనుక నేను రాజ్యాభిషేకం

,

చేసుకోను అని సభలో తన మేనమామ యుధాజిత్తు సమక్షంలో స్పష్టం చేస్తాడు. రాముడికి అరణ్యంలోనే అభిషేకం చేయించి వెనక్కి తీసుకు రావటం తన ధర్మం అని చెప్పి, గురువులతో, మంత్రులతో, తల్లులతో, సేనతో బయలుదేరుతాడు.

గూహుడు భరతుడిని చూసి రాముడికి అపకారం చెయ్యటానికి వచ్చాడని సందేహిస్తాడు. భరతుడు దుఃఖించి తాను కూడా జటలు ధరించి భరద్వాజ మహర్షి ఆశ్రమం చేరుకుంటాడు. భరద్వాజుడు కూడా గుహుడిలాగే అనుమానిస్తాడు. భరతుడు నేను రాముడిని మళ్ళీ అయోధ్యకి తేవాలని వెళ్తున్నాని మహర్షికి చెబుతాడు. భరతుడు చిత్రకూటం దగ్గర రాముడిని వెతుకుతూ ఉంటే సైన్యాన్ని చూసి అడవిలోని జంతువులు బెదిరి పరుగులు పెడతాయి. దీనికి కారణం తెలుసుకోమని రాముడు ఆజ్ఞ ఇస్తే చెట్టు ఎక్కి సైన్యం మధ్య భరతుడి రథం మీద ఉన్న ధ్వజాన్ని గుర్తుపడతాడు లక్ష్మణుడు. భరతుడు దురుద్దేశంతో వచ్చాడు, వాడిని, సైన్యాన్ని చంపేస్తాను అని కోపంతో అంటే రాముడు మందలిస్తాడు. నీకు రాజ్యం కావాలని ఉంటే చెప్పు. ఇప్పిస్తాను. భరతుడు నా మాట కాదనడు. నేను ధర్మాన్ని నిలబెట్టటానికి అడవికి వచ్చాను అని అంటాడు.

భరతుడు ఆశ్రమానికి వచ్చి, రాముడి కాళ్ళమీద పడి తండ్రి మరణ వార్త చెబుతాడు. రాముడు దుఃఖిస్తూ నదిలో స్నానం చేసి

,

తండ్రికి పిండాలు పెట్టి, తల్లులని, గురువుని ఇతర పౌరులని కలుసుకుంటాడు. అయోధ్యకి తిరిగివచ్చి పట్టాభిషేకం చేసుకో అని రాముడిని అనేక విధాలుగా భరతుడు బతిమాలుతాడు. ఇక్ష్వాకు వంశంలో పెద్ద కొడుకు రాజు అవటం ఎన్నో తరాలుగా వస్తున్న సాంప్రదాయం. కనుక గురువు మాట విని సాంప్రదాయం ప్రకారం పట్టాభిషేకం చేసుకోమని వశిష్టుడు కూడా చెబుతాడు. తల్లితండ్రులు ఇచ్చిన ఆజ్ఞ ఏదయినా సరే, దానిని ఆచరణలో పెట్టటమే పిల్లల ధర్మం. తల్లిదండ్రుల ఆదేశాలని ప్రశ్నించే అధికారం పిల్లలకి లేదు. కనుక నేను పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో ఉండి తీరాలని భరతుడికి వశిష్టుడికి కూడా రాముడు చెబుతాడు. స్వర్గం, నరకం, పితృ దేవతలకు పిండం పెట్టటం మొదలైన వాటిని నమ్మటం బుద్ధిలేనితనం అంటూ నాస్తికవాదం చేసిన జాబాలితో, నా తండ్రి నీలాంటి నాస్తికుడికి తన ఆస్థానంలో ఎందుకు చోటు ఇచ్చాడో నాకు తెలియదు. నేను మాత్రం గతంలో మహర్షులు చూపిన మార్గంలో నడుస్తున్నాను అంటాడు రాముడు. చివరికి ఆకాశంలో ఉన్న సిద్ధులు, దేవతలే కాక అయోధ్యావాసులు కూడ రాముడి ధర్మనిష్ఠని గౌరవించమని భరతుడికి నచ్చచెబుతారు.

నువ్వు కాకపోతే నీ పాదుకలు పద్నాలుగు సంవత్సరాలు రాజ్యం చేస్తాయి. గడువు తీరిన మరునాడు నువ్వు కనుక రాకపోతే నేను అగ్నిప్రవేశం చేస్తానంటాడు భరతుడు. రాముడు ఆ నియమం

,

ఒప్పుకుని ఆ పాదుకలని ఒకసారి ధరించి, భరతుడికి ఇచ్చి అయోధ్యకి పంపుతాడు. రాముడు లేని అయోధ్యలో ఉండలేను అని భరతుడు నందిగ్రామంలో పాదుకలకి పట్టాభిషేకం చేసి, నారబట్టలు, జటలు ధరించి రాజ్యం చేస్తూ ఉండిపోతాడు. చిత్రకూటంలో నువ్వు ప్రవేశించిన దగ్గర నుంచి రాక్షసుల బెడద ఎక్కువ అయింది అని రాముడికి చెప్పి, అక్కడి మునులు ఇంకో సురక్షితమైన ప్రదేశానికి వెళ్ళి పోతారు. నేను మిమ్మల్ని రాక్షసుల నించి రక్షిస్తాను అని రాముడు ధైర్యం చేప్పినా వాళ్ళు వినరు. భరతుడితో వచ్చిన సైన్యం కారణంగా చిత్రకూటంలోని అడవి అశుభ్రం అవటం, అక్కడ తల్లులని సోదరులని కలుసుకోవటం వలన వారు గుర్తువచ్చి తనకి దుఃఖం కలగటం మెదలైన అనేక కారణాల వలన రాముడు చిత్రకూటం వదిలి వెళ్ళాలని నిర్ణయం తీసుకుని, చిత్రకూటం నుంచి అత్రి మహాముని, అతని భార్య అనసూయల ఆశ్రమానికి వచ్చి, ఒకరోజు ఆతిథ్యం స్వీకరిస్తాడు. వారి దగ్గర సెలవు తీసుకుని దండకారణ్యానికి బయలుదేరిన రాముడితో, మమ్మల్ని రాక్షసులు చంపుతున్నారు, నీకు కూడా ఆ రాక్షసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఫలాలు కోసం అడవిలోకి వెళ్ళే దారి ఇది. ఇటు వెళ్ళమని చెబుతారు అక్కడి మునులు.

దండకారణ్యం మునులు, సీతారామలక్ష్మణుల రూపలావణ్యాలు చూసి ఆశ్చర్యపోతూ వారికి తగిన అతిథి సత్కారాలు చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరిన సీతారామలక్ష్మణులకి విరాధుడు

,

ఎదురై సీతను పట్టుకుంటాడు. నాకు పరాయి పురుషుడి ఒడిలో సీతను చూడటం కంటే బాధాకరమైన విషయం ఏముంటుంది? భరతుడి రాజరికానికి అడ్డంకి తొలగాలని నన్ను అడవికి పంపిన కైక కోరిక తీరుతుందని బేలగా అంటాడు రాముడు. లక్ష్మణుడు రాముడికి ధైర్యం చేప్పి, నువ్వు ఎవరివి అని విరాధుడిని అడుగుతాడు. నేను ఒక రాక్షసుడిని, ఏ ఆయుధాలూ నన్ను చంపలేవు, నా శరీరాన్ని ఛేదించలేవు అంటాడు విరాధుడు. వాడి మీద రామలక్ష్మణులు ఇద్దరూ బాణాలు వేస్తారు. గాయపడిన విరాధుడు సీతను వదిలి వారితో యుద్ధానికి దిగుతాడు. రామ లక్ష్మణులు ప్రయోగించిన బాణాలు విరాధుడు ఆవలించగానే వాడి శరీరంలోనుంచి రాలిపోతాయి. వాడి చేతిలోని శూలాన్ని రాముడు బాణాలతో విరగగొడితే కోపం వచ్చి రామలక్ష్మణులని చంకల్లో బంధించి అడవిలోనికి పరిగెత్తుతాడు. సీత ఎలుగెత్తి ఏడుస్తూ ఉంటే చూసి రామలక్ష్మణులు విరాధుడి భుజాలు తమ కత్తులతో నరుకుతారు. తరువాత తమ కాళ్ళతో చేతులతో ఎంత కొట్టినా వాడు చావకపోవటం చూసిన రాముడు వీడిని పాతి పెడదాం, గొయ్యి తవ్వు అని లక్ష్మణుడికి చెబుతాడు. అప్పుడు విరాధుడు, కుబేరుడి శాపం వల్ల నాకు ఈ రాక్షస జన్మ కలిగింది నువ్వు నన్ను చంపినప్పుడు నాకు శాపవిముక్తి అని కుబేరుడు చెప్పాడు అంటూ రాముడిని కీర్తిస్తాడు. విరాధుడిని పూడ్చి పెట్టి సీతారామలక్ష్మణులు శరభంగుడి ఆశ్రమం సమీపిస్తారు.

,

పుణ్యలోకాలకి వెళ్ళిపోవటానికి సిద్ధమవుతున్న శరభంగుడు, నీ కోసమే ఎదురు చూస్తున్నాను, నేను సాధించుకున్న సమస్త పుణ్య లోకాలని నువ్వు స్వీకరించు అని అడుగుతాడు. పుణ్యలోకాలు నేనే స్వయంగా సాధించుకుంటాను. నేను ఉండటానికి అనువైన ప్రదేశం చూపించండి అని రాముడు అడుగుతాడు. సుతీక్ష్ణుడిని కలుసుకో అని మాత్రం చెప్పి అగ్ని ప్రవేశం చేసి పుణ్యలోకానికి వెళ్ళిపోతాడు శరభంగుడు. ఆ సమయంలో వచ్చిన మునులు దండకారణ్యంలోని రాక్షసుల బారినుంచి తమని రక్షించమని రాముడిని వేడుకుంటారు. వారి కోరిక తీరుస్తానని మాట ఇస్తాడు రాముడు.

వారి దగ్గర సెలవు తీసుకుని రాముడు సుతీక్ష్ణుడిని కలుస్తాడు. సుతీక్ష్ణుడు కూడా శరభంగుడి లాగే నీ కోసమే నేను ఎదురు చూస్తున్నాను, నేను సాధించుకున్న సమస్త పుణ్యలోకాలని నువ్వు స్వీకరించు అని అడుగుతాడు. పుణ్యలోకాలు నేనే స్వయంగా సాధించుకుంటాను నేను ఉండటానికి ఏదైనా అనువైన ప్రదేశం చూపించండి అని రాముడు సుతీక్ష్ణుడిని కూడా అడుగుతాడు. సుతీక్ష్ణుడు నువ్వు నా ఆశ్రమంలో ఉండవచ్చు. ఇక్కడ ఒకటే లోపం. ఆశ్రమంలో ఉన్న మునులని క్రూర జంతువులు తరుచూ బెదిరిస్తున్నాయి. కానీ వారికి ఏ అపాయమూ కలిగించటంలేదు అంటాడు. ఆ క్రూర జంతువులని నేను చంపగలుగుతాను కానీ నీ ఆశ్రమంలో అలా చేస్తే నీకు బాధ కలుగుతుంది. అందువల్ల

,

నీ ఆశ్రమంలో కొద్దికాలం మాత్రమే ఉంటాను అంటాడు రాముడు. అక్కడ నుంచి బయలుదేరిన రాముడితో సీత, రాజ్యంతో పాటు క్షత్రియ ధర్మం వదిలి మునివృత్తి నువ్వు స్వీకరించావు కానీ ఇంకా ఆయుధాలు ధరించటం మానలేదు. అందువల్ల నీలో అకారణ శత్రుత్వమనే దోషం కలిగింది. నీతో వైరం లేని రాక్షసులని, నేను చంపుతాను, అని మాట ఇచ్చావు. వనవాసం పూర్తిచేసి రాజ్యం స్వీకరించిన తరువాత నువ్వు మునులని రక్షించటం సబబు అని హితవు చెబుతుంది. దీనికి సమాధానంగా, అడగకుండానే మునులని రక్షించవలసిన బాధ్యత నాకుంది. అలాంటప్పుడు వాళ్ళు స్వయంగా అడిగితే బాధ్యత తీసుకోకుండా ఉండటం అసంభవం. ఏది ఏమైనా ఇచ్చిన మాట వెనక్కి తీసుకోను. పైగా ఇది బ్రాహ్మణులకి ఇచ్చిన మాట అంటాడు రాముడు.

దండకారణ్యంలో, కొన్ని మునుల ఆశ్రమాలలో కొద్ది నెలలు ఇతర ఆశ్రమాలలో ఎక్కువ నెలలు ఉంటుండగా రాముడి వనవాసంలో పది సంవత్సరాలు గడిచిపోతాయి. సుతీక్ష్ణుడి కోరిక తీర్చటానికి ఆ ముని ఆశ్రమానికి ఇంకోసారి వచ్చి కొద్ది కాలం గడుపుతాడు రాముడు. అగస్త్యుడి ఆశ్రమానికి దారి చూపమని సుతీక్ష్ణుడిని అడుగుతాడు రాముడు. దారి తెలుసుకుని, ఆ మహర్షి దగ్గరికి వెళ్తాడు. శరభంగ, సుతీక్ష్ణులని అడిగినట్టే, అగస్త్యుడిని కూడా నా నివాసానికి అనువైన ప్రదేశం చూపించమని అడుగుతాడు రాముడు. సమాధానంగా అగస్త్యుడు గోదావరినదీ తీరాన ఉన్న

,

పంచవటిలో ఉండమని చెప్పటమే కాక, సాధారణంగా స్త్రీలు భర్త యొక్క సుఖాలు మాత్రమే పంచుకుంటారు. అలా కాక నీతో అడవికి వచ్చి కష్టాలు పంచుకుంటున్న సీత ఏది చెయ్యమన్నా కాదనకు అని చెబుతాడు. సీతారామలక్ష్మణులు పంచవటిలో పర్ణశాల ఏర్పాటు చేసుకుంటారు. హేమంత ఋతువుని వర్ణిస్తూ వర్ణిస్తూ భరతుడిని పొగుడి, కైకేయి లాంటి స్త్రీకి ఇటువంటి వాడు ఎలా కొడుకు అయ్యాడో అని అంటాడు లక్ష్మణుడు. నా ఎదుట పెద్దవాళ్ళని నిందించవద్దు అని రాముడు మందలిస్తాడు.

సూర్పణఖ పర్ణశాలలో రాముడిని చూసి మోహిస్తుంది. నేను రావణుడి చెల్లెలిని. సీతను వదిలి నన్ను భార్యగా చేసుకోమని అడుగుతుంది. భార్య లేకుండా ఉంటున్న లక్ష్మణుడిని పెళ్ళి చేసుకో నీకు సవతి బాధ ఉండదు అంటాడు రాముడు. నేను రాముడి దాసుడిని. నన్ను పెళ్ళి చేసుకుంటే నువ్వు కూడా దాసివి అవుతావు కనుక రాముడినే చేసుకో అంటాడు లక్ష్మణుడు. నేను ముందు ఈ సీతని మింగేస్తాను అప్పుడు నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావు అంటూ సీత మీదకి వెళుతుంది సూర్పణఖ. భయపడుతున్న సీతను చూసి, సూర్పణఖని ఆపి, ఇటువంటి వాళ్ళతో హాస్యం చేయకూడదు. కొంచెం ఉంటే సీతను మింగేది, ఈమె చెవులు ముక్కు కోసేయమని లక్ష్మణుడిని ఆజ్ఞాపిస్తాడు రాముడు. లక్ష్మణుడు అలాగే చేస్తాడు. సూర్పణఖ అరుస్తూ తన అన్న ఖరుడి దగ్గరికి వెళుతుంది. నీ ముక్కు చెవులు కోసి, నాకు

,

కోపం తెప్పించటానికి సాహసించింది ఎవరు, అని సూర్పణఖని చూడగానే అడుగుతాడు ఖరుడు. దండకారణ్యం ప్రవేశించిన రామలక్ష్మణులు సీత కారణంగా ఇలా చేసారు, వాళ్ళ నెత్తురు తాగాలని ఉంది, వాళ్ళని చంపు అంటుంది సూర్పణఖ. వాళ్ళని చంపమని పద్నాలుగు మంది రాక్షసులని పంపుతాడు ఖరుడు. సీతా లక్ష్మణులని వెనక్కి పంపి మీరు పారిపోకపోతే మీ ప్రాణాలు దక్కవు అని ఆ రాక్షసులని హెచ్చరిస్తాడు రాముడు. వాళ్ళు ప్రయోగించిన ఆయుధాలని విరగకొట్టి ఆ రాక్షసులని క్షణంలో సంహరిస్తాడు రాముడు.

పారిపోయిన సూర్పణఖ ఖరుడికి జరిగినది చెప్పి శూరుడివైతే రాముడితో యుద్ధం చెయ్యి అని రెచ్చగొడుతుంది. ఖరుడు దండకారణ్యంలోని తన అనుచరులైన పద్నాలుగు వేలమంది రాక్షసులని వెంట తీసుకుని రాముడితో యుద్ధానికి వెళ్తాడు. వీళ్ళని నేనే చంపాలని అనుకుంటున్నాను కనుక నువ్వు సీతకి కాపలాగా ఉండు అని లక్ష్మణుడికి చెప్పి, రాముడు యుద్ధానికి సిద్ధం అవుతాడు. తనకి గాయాలు అయినా పట్టించుకోకుండా రాక్షస ముఖ్యులైన దూషణ త్రిశిరులతో సహా పద్నాలుగు వేల రాక్షసులని రాముడు చంపివేసిన తరువాత ఖరుడు యుద్ధం చేస్తూ రాముడి చేతిలో విల్లుని రాముడి కవచాన్ని విరగ్గొడతాడు. అగస్త్యుడు ఇచ్చిన విష్ణుచాపాన్ని తీసుకుని రాముడు ఖరుడి సారథిని గుర్రాలని చంపి, రథాన్ని ఆయుధాలని కూడా నాశనం

,

చేస్తాడు. ఖరుడు రథం వదిలి నేల మీదకి దూకి, గదని, చెట్టుని విసిరితే రాముడు వాటిని కూడా తన బాణాలతో విరగ్గొట్టేస్తాడు. ఖరుడు పరిగెడుతూ వచ్చి రాముడి మీద పడటానికి ప్రయత్నం చేస్తాడు. రాముడు ఒక అడుగు వెనక్కి వేసి ఇంద్రుడి బాణంతో ఖరుణ్ణి చంపుతాడు. ఆకాశంలో ఉండి ఈ యుద్ధాన్ని చూస్తున్న దేవతలు, ఋషులు రాముడిని పొగుడుతారు. సీతా లక్ష్మణులు గాయపడ్డ రాముడిని అభినందిస్తారు.

ఖర దూషణ త్రిశిరులతో సహా జనస్థానం లోని పద్నాలుగు వేల రాక్షసులు చనిపోయారు, నేను ఎలాగో అలా తప్పించుకుని నీకు తెలపడానికి వచ్చాను అని లంకలో రావణుడికి చెబుతాడు అకంపనుడు. దేవతలకి కూడా నేనంటే భయం. ఎవరు ఎలా చంపారు అన్న రావణుడి ప్రశ్నకి సమాధానంగా, రాముడి శక్తి సామర్థ్యాలు వర్ణించి చెబుతాడు అకంపనుడు. రామలక్ష్మణులని చంపేస్తాను అని లేచిన రావణుడు, నువ్వు ఆ పని చేయలేవు, రాముడు సామాన్యుడు కాడు, సకల లోకాలనీ నాశనంచేసి మళ్ళీ సృష్టి చేయగలడు. నువ్వు సీతను అపహరిస్తే రాముడు బెంగతో తనంత తానుగా చచ్చి పోతాడు అన్న అకంపనుడి సలహా నచ్చి మారీచుడి దగ్గరికి వెళ్ళి, జనస్థానంలోని రాక్షసులని అందరినీ రాముడు చంపేసాడు. అతని భార్య సీతని అపహరించటానికి నాకు సహాయం చెయ్యమని అడుగుతాడు. నిన్ను సర్వనాశనం

,

చేయటానికి ఈ సలహా ఇస్తున్నారు, నీ ఉద్దేశ్యం మార్చుకోమని మారీచుడు చెబితే రావణుడు లంకకి తిరిగి వెళ్ళిపోతాడు.

సూర్పణఖ లంకలో ప్రవేశించి, పెద్దన్న కుబేరుడిని యుద్ధంలో ఓడించి తెచ్చికున్న అతని పుష్పక విమానంలో, మంత్రుల మధ్య తపశ్శక్తి వల్ల అగ్ని లాగా జ్వలిస్తూ, ఐరావతం, విష్ణు చక్రం మొదలైన దివ్య ఆయుధాలు చేసిన గాయాల మచ్చలతో, తన శక్తిని, తన ఐశ్వర్యాన్ని ప్రదర్శిస్తూ, బంగారు సింహాసనం మీద ఉన్న తన అన్న రావణుడిని చూసి, రాజనీతి చెబుతుంది. ఆ నీతిని ఆచరణలోపెట్టి చారుల ద్వారా రాజ్యంలో జరుగుతున్నవి తెలుసుకుని ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల తమ్ముడు ఖరుడితో సహా పద్నాలుగు వేల మంది రాక్షసులని రాముడు చంపగలిగాడు అంటూ రావణుడిని నిందిస్తుంది. రాముడి శక్తి గురించి రావణుడు ప్రశ్నిస్తాడు. సమాధానంగా సీత సౌందర్యాన్ని పొగిడి, సీత నీకు తగిన భార్య. నీ కోసం ఆమెను ఎత్తుకు వద్దామని ప్రయత్నిస్తే లక్ష్మణుడు నా ముక్కు చెవులు కోసాడు. సీతను నీ భార్యగా చేసుకోవాలని కోరిక ఉంటే రామలక్ష్మణుల శక్తిని అర్థం చేసుకుని బలాబలాలు శ్రద్ధగా ఆలోచించి వాళ్ళని చంపటానికి బయలుదేరు అని సలహా ఇస్తుంది.

సభ ముగించి మంత్రులకి సెలవు ఇచ్చి, తాను ఏమి చెయ్యాలో నిర్ణయించుకుని, రావణుడు మళ్ళీ మారీచుడి దగ్గరికి వెళ్తాడు.

,

రాముడు పరమ దుర్మార్గుడు. రాక్షసులని చూడగానే ఒక మాట కూడా లేకుండా విల్లు తీసుకుని వాళ్ళని అందరినీ చంపేశాడు. ఏ కారణమూ లేకుండా సూర్పణఖ ముక్కు చెవులు కోశాడు. నువ్వు బంగారు లేడి రూపంలో సీత కంటికి కనపడాలి. తప్పకుండా బంగారు లేడిని పట్టి తెమ్మని రామలక్ష్మణులని పంపుతుంది. ఒంటరిగా ఉన్న సీతను నేను ఎత్తుకుపోతాను. ఆ తరువాత భార్యా వియోగంతో బాధపడుతున్న రాముడిని నేను తేలికగా చంపుతాను అంటాడు రావణుడు.

రాముడిని గురించి చెడ్డగా మాట్లాడటం నీకు తగదు. రాముడు మహా శక్తిశాలి. రాముడితో కోరి శత్రుత్వం తెచ్చుకునే ముందు నీ మంత్రులతో, ధర్మాత్ముడైన విభీషణుడితో బలాబలాలు పూర్తిగా చర్చించి నిర్ణయం తీసుకో. విశ్వామిత్రుమడు తన యజ్ఞాన్ని రక్షించటానికి రాముడిని తెచ్చుకుంటే బాలుడే కదా అని నేను లెక్క చేయలేదు. రాముడు నన్ను చంపే బదులు బాణంతో కొట్టి వంద యోజనాల అవతల సముద్రంలో పడేసాడు. తరువాత వనవాసం చేస్తున్న రాముడు నాకు కనపడితే, జరిగినది గుర్తు తెచ్చుకుని, ఇద్దరు రాక్షసులతో కలిసి ఎదిరించాను. క్షణంలో మూడు బాణాలు వేస్తే ఆ ఇద్దరు రాక్షసులు మరణించారు. నేను పారిపోయాను కనుక బ్రతికాను. అప్పటినుండి అడవిలో ప్రతి ఆకులోను నామీద బాణం వేస్తున్న రాముడే కనపడుతున్నాడు. ర అక్షరంతో మొదలయ్యే ఏ శబ్దం విన్నా భయం వేస్తోంది.

,

నువ్వు రాముడితో శత్రుత్వం తెచ్చి పెట్టుకుంటే నీ లంకానగరం సర్వనాశనం అవుతుంది. నీతో పాటు ఏ తప్పూ చేయని నీ సకల బంధువులు మరణిస్తారు అని హెచ్చరిస్తాడు మారీచుడు.

నా నిర్ణయం మారదు. వరుణ, యమ, అగ్ని, ఇంద్ర, చంద్రుల, శక్తి తనలో కలిగిన రాజుని ఎప్పుడూ గౌరవించాలి. రాజుకి నచ్చని సలహా ఎప్పుడూ ఇవ్వకూడదు. రాజుగా ఆజ్ఞాపిస్తున్నాను. నువ్వు బంగారు లేడి రూపంలో సీతకి కనపడితీరాలి. సీత తప్పకుండా లేడిని పట్టుకోమని రాముడిని పంపుతుంది. రాముడిని దూరంగా తీసుకుని వెళ్ళి రాముడి గొంతులో హా సీతా, హా లక్ష్మణా అని పెద్ద కేకపెట్టు. సీత రాముడికి సహాయం చేయమని లక్ష్మణుడిని పంపుతుంది. నేను సీతని ఎత్తుకుపోతాను. తరువాత నువ్వు ఎక్కడికైనా వెళ్ళవచ్చు. నీకు నా రాజ్యంలో సగభాగం ఇస్తాను. నువ్వు ఈ పని చేస్తే రాముడు నిన్ను చంపటం అనుమానం మాత్రమే. నువ్వు ఈ పని కనక చేయకపోతే నిన్ను నేను ఇప్పుడే చంపటం తథ్యం, అని కోపంగా చెబుతాడు రావణుడు.

నీ వంటి రాజు వలన రాజ్యం, ఐశ్వర్యం సర్వనాశనం అవుతాయి. ముందు నేను తరువాత లంకలోని మీ అందరు రాముడి చేతిలో మరణిస్తారు. నీ చావుతో నా కోరిక తీరుతుంది. అని తిడుతూ రావణుడితో కలిసి బయలుదేరుతాడు మారీచుడు. తన మాట విన్నందుకు మారీచుడిని మెచ్చుకుంటూ రథం ఎక్కించుకుని

,

రాముడి పర్ణశాల దగ్గరికి వస్తాడు రావణుడు. బంగారు లేడిని చూసి సీత ఆశ్చర్యపోతూ, దానిని రామలక్ష్మణులకి చూపుతుంది. చూడగానే మారీచుడు మాయతో ఈ మృగరూపం ధరించాడు అంటాడు లక్ష్మణుడు. ఇటువంటి విచిత్రమైన మృగం ఎవరూ చూసి ఉండరు. దీనిని మనం పట్టుకుని తీసుకువస్తే వనవాసం ముగిసిన తరువాత అయోధ్యకి తీసుకుని వెళితే అందరికీ చాలా ఆనందం కలుగుతుంది. పట్టుకోవటం కుదరకపోతే కనీసం దాని చర్మాన్ని తెస్తే గొప్ప ఆసనం అవుతుంది. ఇటువంటి కోరికలు స్త్రీలు కోరకూడదు. అయినా ఈ బంగారు లేడి అందాన్ని చూసి అడుగుతున్నాను అని రాముడిని కోరుతుంది సీత. రాముడికి కూడా ఆ మృగాన్ని తేవాలనే కోరిక కలిగి, సీత కోరుకుంది, పైగా రాజులు ఎప్పుడూ రత్నాలు బంగారము మొదలైన వస్తువులని కోశాగారంలో చేర్చాలి, ఒకవేళ ఇది మారీచుడే అయితే అనేక మునులని చంపిన ఈ రాక్షసుడిని చంపటం కూడా నా కర్తవ్యం. అందువల్ల నేను ఆయుధాలు ధరించి మరీ వెళుతున్నాను. ఆశ్రమంలో సీతని జాగ్రత్తగా చూసుకో. జటాయువు కూడా నీకు తోడుగా ఉన్నాడు అని లక్ష్మణుడికి చెప్పి బయలుదేరుతాడు. ఎంత దూరం పరిగెత్తినా లేడి దొరక్కపోతే దానిని చంపటానికి బాణం వేస్తాడు రాముడు. ప్రాణాలు పోతున్న సమయంలో, సీత లక్ష్మణుడిని రాముడికి సహాయంగా పంపక పోతే రావణుడు సీతాపహరణం చేయలేడని ఆలోచించి రాముడి గొంతుతో హా సీతా, హా లక్ష్మణా అని పెద్దగా కేకపెట్టి మరణిస్తాడు మారీచుడు.

,

బంగారు లేడి రూపం మాయమై మారీచుడి రాక్షస రూపం కనపడగానే లక్ష్మణుడు చెప్పినట్టు ఇది మారీచుడి మాయా రూపం. నా గొంతుతో అరచిన కేక విని సీతా లక్ష్మణుడు ఏమి చేస్తారో అని కంగారుపడుతూ, ఇంకొక లేడిని చంపి దాని మాంసాన్ని తీసుకుని ఆశ్రమం దిశగా కదులుతాడు రాముడు.

రాముడి గొంతుతో మారీచుడి అరుపు విన్న సీత, నువ్వు అన్నకి సహాయంగా వెళ్ళమంటే లక్ష్మణుడు వెళ్ళడు. నువ్వు నిజానికి రాముడి శత్రువువి నా మీద కోరికతో అన్నకి సహాయంగా వెళ్ళటం లేదు అన్న సీతతో భయం అనవసరం, ఏ రాక్షసుడూ రాముడిని ఏమీ చేయలేరు, ఇదంతా రాక్షసుల మాయంటాడు లక్ష్మణుడు. సీత దుఃఖిస్తూ మళ్ళీ నువ్వు నా మీద కోరికతో ఇలా చేస్తున్నావు. లేకపోతే భరతుడు నీ ద్వారా రాముడికి అపకారం చేయిస్తున్నడో. నేను నీ కళ్ళ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటాను కానీ నీ వశం కాను అంటూ రకరకాలుగా తిడుతుంది. ఘోరమైన ఆ మాటలు సహించలేక నేను రాముడితో కలిసి వెనక్కి వచ్చేటప్పటికి నువ్వు పర్ణశాలలో ఉంటావో లేదో తెలియదు అని బయలుదేరుతాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు అటు వెళ్లగానే, సన్యాసి వేషంలో రావణుడు వచ్చి, అందమైన స్త్రీవి అయివుండి, రాక్షసులు తిరిగే ఈ అడవిలో ఉంటున్న నువ్వు ఎవరు అని అడుగుతాడు. ప్రశ్నకి సమాధానం

,

చెప్పకపోతే సన్యాసి శపిస్తాడేమో అని అలోచించి సీత తమ విషయం అంతా చెబుతుంది. నేను రావణుడిని, అడవిలో రాముడితో కష్టపడకు. నా భార్యవై లంకానగరంలో సకల భోగాలు అనుభవించు అంటాడు సన్యాసి వేషంలో ఉన్న రావణుడు. సీత కోపంగా తిడుతుంది. కోపంతో రావణుడు తన అసలు రూపం ధరించి, తనని తాను పొగుడుకుని సీతను బలవంతంగా తన రథం ఎక్కించుకుని లంకకి బయలుదేరుతాడు. అడ్డు వచ్చి రథం ధ్వంసం చేసిన జటాయువు రెక్కలు కోసి సీతను పట్టుకుని ఎగురుతూ లంకకి బయలుదేరుతాడు రావణుడు. ఇక త్వరలో రావణుడి మరణం తథ్యం అంటాడు బ్రహ్మ. సీత అవస్థను చూసి దుఃఖిస్తున్న ఋషులు, దేవతలు, జరగబోయే రావణవధ తలచుకుని సంతోషిస్తారు. సీత రాముడు నిన్ను చంపుతాడు అని ఎంత భయపెట్టినా, తిట్టినా రావణుడు వినిపించుకోడు. రావణుడు చూడకుండా తన నగలు కొన్ని భూమి మీద కనపడిన వానరుల మధ్య పడేస్తుంది సీత. లంకలో తన ఐశ్వర్యాన్ని ఎంత చూపించినా తన భార్య అవటానికి ఒప్పుకోని సీతని అశోకవనం పంపుతాడు రావణుడు. సీతకి కాపలాగా ఉంటూ నయాన్నో భయాన్నో తన భార్య అవటానికి ఒప్పించమని రాక్షస స్త్రీలకి చెబుతాడు రావణుడు.

వెనక్కి పర్ణశాలకి వస్తున్న దారిలో లక్ష్మణుడిని కలిసి, కేవలం ఒక స్త్రీ మాటతో కోపించి తన ఆజ్ఞని పాటించనందుకు లక్ష్మణుడిని

,

మందలిస్తాడు రాముడు. పర్ణశాలలో సీత కనపడక, దుఃఖిస్తూ కనపడిన ప్రతి చెట్టునీ పక్షినీ సీత జాడ చెప్పమని వేడుకుంటూ తిరుగుతున్న రాముడు కొంత సేపు తరువాత కోపించి తక్షణం సీతను తనకి తిరిగి ఇవ్వకపోతే సకల సృష్టిని నాశనం చేస్తానని బెదిరిస్తాడు. ఎవరో ఒక్కడు తప్పు చేస్తే సకల సృష్టిని నాశనం చేయాలనుకోవడం ధర్మం కాదు, మనం సీతను వెదుకుదాం, తప్పుచేసిన వాడిని శిక్షిద్దాం అని లక్ష్మణుడు నచ్చచెప్పిన తర్వాత రాముడు శాంతిస్తాడు. రామలక్ష్మణులకి యుద్ధం జరిగిన చోటు, విరిగిన రథం, గాయపడ్డ జటాయువు కనపడతారు. ముందు వీడే సీతను చంపాడు అంటాడు రాముడు. రావణుడు సీతను ఎత్తుకు పోతుంటే నేను అడ్డు వచ్చాను. రావణుడు నా రెక్కలు కోసి సీతను తీసుకు వెళ్ళిపోయాడని మాత్రం చెప్పి మరణిస్తాడు జటాయువు. తనకోసం యుద్ధం చేసి ప్రాణాలు పోగొట్టుకున్న జటాయువుని చూసి దుఃఖించి, అగ్ని సంస్కారం చేసి, నేను అగ్నిసంస్కారం చేయడం వల్ల నా అనుమతితో నీకు శాశ్వతంగా అన్నిటినీ మించిన లోకంలో స్థానం లభించుగాక అని అంటాడు రాముడు. జటాయువుకి కూడా తండ్రికి చేసినట్టు పిండం పెట్టి తర్పణాలు వదిలి రామలక్ష్మణులు సీతను వెదుకుతూ ఉంటే ఒక రాక్షసి కనపడుతుంది. నువ్వు నాతో కలిసి రమించు అని లక్ష్మణుడిని పట్టుకున్న ఆ రాక్షసి అయోముఖి ముక్కు చెవులు కోస్తాడు లక్ష్మణుడు. ఆ రాక్షసి పెద్దగా అరుస్తూ పారిపోతుంది.

,

ఆ తరువాత, రామలక్ష్మణులని తల లేని మొండెంలా ఉండి, పొట్టలో కన్ను, పెద్ద నోరు ఉన్న కబంధుడు పొడుగైన చేతులతో పట్టుకుని మింగబోతాడు. నాకు ఆహారమవటానికి వచ్చిన మీరు ఎవరని అడుగుతాడు కబంధుడు. ముందు బెంబేలు పడినా రామలక్ష్మణులు తరువాత ధైర్యం తెచ్చుకుని, తమ కత్తులతో కబంధుడి భుజలు తెగగొడతారు. రామలక్ష్మణుల మాటలతో వచ్చినది రామలక్ష్మణులు అని తెలుసుకున్న కబంధుడు మీరు నా భుజాలు తెగగొట్టినప్పుడు నాకు శాపవిముక్తి కలుగుతుందని నాకు తెలుసు. భయంకరమైన రూపం ధరించి స్థూలశిరుడనే మహర్షిని భయపెట్టాలని చూసాను. రామలక్ష్మణులు నీ భుజాలు ఖండించేవరకు నువ్వు ఈ భయంకరమైన రూపంలోనే ఉండు అని శపించాడు. నా తపస్సుకి మెచ్చి బ్రహ్మ నాకు దీర్ఘాయువు ఇచ్చాడు కదా అని దేవేంద్రుడిని ఎదిరిస్తే, వజ్రాయుధంతో నా తలని మొండెం లోకి తోసి, పొట్టలో కన్ను, నోరు ఏర్పాటు చేసినప్పుడు ఇంద్రుడు కూడా శాపవిముక్తి మీరు నా భుజాలు తెగగొట్టినప్పుడు జరుగుతుంది అని చెప్పాడు. మీరు నన్ను దహనం చేస్తే, నా అసలు రూపం, జ్ఞానం లభించిన తరువాత నేను నీకు సీతను వెతకటానికి సహాయం చేయగలవాడి ఉనికి చెబుతాను అంటాడు. రామలక్ష్మణులు కబంధుడిని చితిలో దహనం చేస్తే దానిలోంచి దివ్య రూపంతో బయటికి వచ్చి, తన అన్న వాలి రాజ్యం నుంచి తరిమేస్తే ఋష్యమూక పర్వతం మీద దాక్కున్న సుగ్రీవుడు, సీతని, రావణుడిని వెతకటానికి సహాయం

,

చేయగలడు. వానరుడు అని చిన్న చూపు చూడకుండా అతన్ని అగ్నిసాక్షిగా నీ మిత్రుడిని చేసుకో. నువ్వు వెళ్ళే దారిలో మాతంగి ముని ఆశ్రమం ఉంది. గతంలో అక్కడ తపస్సు చేసిన మునుల తపోబలం వలన ఈ అడవిలోని చెట్ల పూలు ఎప్పటికీ వాడవు. ఆ మునులు ఉత్తమ లోకాలకు వెళ్లిపోయినా వారి పరిచారిక శబరి నీ దర్శనం చేసుకుని తరువాత పుణ్యలోకాలకి వెళ్దామని వేచి ఉంది. ఆ ఆశ్రమాన్ని దర్శించమని చెప్పి వెళ్ళిపోతాడు.

మాతంగ ఆశ్రమంలో రామలక్ష్మణులు శబరిని కలుసుకుంటారు. నీ నియమనిష్టలు చక్కగా జరుగుతున్నాయని ఆశిస్తున్నాను అన్న రాముడికి జవాబుగా నువ్వు చిత్రకూట చేరిన సమయంలో నా గురువులు ఉత్తమ లోకాలకు వెళిపోతూ నీకు ఆతిథ్యం ఇవ్వటానికి నన్ను ఇక్కడే ఉండమన్నారు. ఇవిగో అడవినుంచి సేకరించిన పళ్ళు, పూలు. నీ దర్శనంతో జన్మ ధన్యమయింది అంటుంది శబరి. రాముడి కోరిక మేరకు గతంలో మునులు ఏర్పాటు చేసుకున్న సప్త సముద్రాలు, ఇప్పటికీ తడి ఆరని వారి వస్త్రాలు, అగ్ని వేదిక మీద వాడకుండా ఉన్న పూలు మొదలైనవి చూపి ఇక నీ అనుమతితో అగ్ని ప్రవేశం చేసి నా గురువులని చేరుకుంటాను అంటూ శబరి అగ్నిలో ప్రవేశించి, దివ్యరూపం ధరించి ఉత్తమ లోకాలకు వెళ్ళిపోతుంది. ఆ సప్తసముద్రాలలో స్నానాలు చేసి తండ్రి తాతలకి జలతర్పణాలు మొదలైనవి చేసిన తరువాత, తన సీతాన్వేషణ సఫలమౌతుందన్న నమ్మకం కలిగి

,

సుగ్రీవుడిని కలుసుకోవటం కోసం రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతం వైపు నడుస్తారు.

సుగ్రీవుడు గొప్ప ఆయుధాలు ధరించి పంపా సరోవర సమీపంలో తిరుగుతున్న రామలక్ష్మణులని చూసి ఒక్కచోట ఉండక ఇటూ అటూ పరిగెడుతోంటే వాలి ఇక్కడికి రాలేడు. భయమెందుకు? అని అడుగుతాడు హనుమంతుడు. ఆ ఇద్దరు వీరులని, వాలి నన్ను చంపటానికి పంపాడని భయపడుతున్నాను అంటాడు సుగ్రీవుడు. సుగ్రీవుడి ఆజ్ఞ ప్రకారం రామలక్ష్మణులతో మాట్లాడి వారు శత్రువులో కాదో తెలుసుకోవడానికి ఆంజనేయుడు సన్యాసి వేషంలో వచ్చి, నమస్కరించి, భూమండలాన్ని జయించగల మహావీరుల లాగా, దేవతల లాగా, కనపడుతున్న మీరు గొప్ప ఆయుధాలు ధరించి ఈ అడవిలో ఎందుకు తిరుగుతున్నారో తెలుసుకోవటానికి వచ్చాను. అన్న రాజ్యం నుంచి వెళ్ళగొడితే ఇక్కడ ఉంటున్న సుగ్రీవుడికి నేను మంత్రిని అని అంటాడు హనుమంతుడు. మనం కలవాలని అనుకుంటున్న సుగ్రీవుడి మంత్రి ఇతను. వ్యాకరణమూ వేదాలు శ్రద్ధగా నేర్చుకున్న వ్యక్తికే ఇంత చక్కగా మాట్లాడటం సాధ్యం. ఇటు వంటి మంత్రి ఉంటే రాజు కార్యాలు సఫలం అవుతాయి. ఇతనితో మంచిగా మాట్లాడు అని లక్ష్మణుడికి చెబుతాడ రాముడు. మేము దశరథ మహారాజు కొడుకులం. సుగ్రీవుడిని కలవాలనే వచ్చాము. కలయిక ఏర్పాటు చేయమని హనుమంతుడికి చెబుతాడు లక్ష్మణుడు. సుగ్రీవుడి

,

కష్టాలు వీరి సహాయంతో పూర్తిగా తీరిపోతాయని సంతోషించిన హనుమంతుడు మీ కథ వివరంగా చెప్పమని అడుగుతాడు. దశరథుడు కైక వరాలు ఇవ్వటం వల్ల అడవికి వచ్చిన రాముడి భార్య సీతను రావణుడు అనే రాక్షసుడు ఎత్తుకుని పోయాడు. శాపం వల్ల కబంధ రూపం పొందిన ధనుడు, అసలు రూపాన్ని పొందిన తరువాత సీతను వెతకటానికి సుగ్రీవుడు సహాయం తీసుకోమని చెప్పాడు. దేవతలందరికంటే ఎంతో గొప్ప వాడైన రాముడికి సుగ్రీవుడిని సహాయం అడగవలసి వచ్చింది అంటూ దుఃఖిస్తాడు లక్ష్మణుడు. హనుమంతుడు సన్యాసి వేషం వదిలి వీపుమీద రామలక్ష్మణులని ఎక్కించుకుని సుగ్రీవుడి దగ్గరకు తీసుకు వస్తాడు. హనుమంతుడు రామసుగ్రీవులని ఒకరినొకరికి పరిచయం చేస్తాడు. ముందుగా సుగ్రీవుడు తనతో స్నేహం చేయమని అడుగుతాడు. తరువాత రాముడు సుగ్రీవుడు అగ్ని సాక్షిగా స్నేహం చేసుకుంటారు. నా అన్న నన్ను వెళ్ళగొట్టటమే కాక నా భార్యని అపహరించాడు అని దుఃఖిస్తుంటే రాముడు వాలిని చంపుతానని మాట ఇస్తాడు.

మేము ఒక రాక్షసుడు ఏడుస్తున్న స్త్రీని ఆకాశ మార్గంలో తీసుకు వెళుతుంటే చూసాము. ఆ స్త్రీ రామా లక్ష్మణా అంటూ ఏడుస్తూ కొన్ని నగలు వస్త్రంలో కట్టి మా మధ్య పడేసింది. నీ వివరాలని హనుమంతుడు నాకు చెప్పాడు. దాన్ని బట్టి మేము చూసినది సీతనే అని అనుకుంటున్నాను అంటూ సుగ్రీవుడు ఆ నగలు,

,

వస్త్రం చూపిస్తాడు. వాటిని రాముడు గుర్తిస్తాడు. నమస్కారం చేస్తున్నప్పుడు చూడటం వల్ల ఈ పాద మంజీరాలని నేను కూడా గుర్తు పట్టగలను అంటాడు లక్ష్మణుడు. రాముడు ఆ రాక్షసుడు ఎక్కడ ఉంటాడో ఇప్పుడే చెప్పమని అడిగితే నాకు తెలియదు కానీ భూమండలమంతా వెతకటానికి వానరులని పంపుతాను, నువ్వు బేలగా దుఃఖించకు అంటూ రాముడిని ఓదారుస్తాడు సుగ్రీవుడు. రావణుడిని సీతని వెతకటానికి చేయవలసినదంతా నువ్వు చెయ్యి. నేను ఏమి చెయ్యాలో చెప్పు అంటాడు రాముడు.

దేవతలు కటాక్షించి నీలాంటి స్నేహితుడిని ప్రసాదించారు. నీ సహాయంతో ఈ కపిరాజ్యాన్ని మాత్రమే కాదు స్వర్గాన్ని కూడా సంపాదించుకోగలను. నేను వాలి భయంతో పారిపోయి ఇక్కడ దాక్కున్నాను. వాలి మరణిస్తేనే కానీ నాకు భయం పోదు అన్న సుగ్రీవుడితో నీ భార్యని అపహరించిన వాడిని చంపుతాను. కానీ మీ ఇద్దరి మధ్య ఈ వైరానికి కారణం చెప్పు అని అడుగుతాడు రాముడు. నా తండ్రి తరువాత వానరులందరికీ రాజైన నా అన్న వాలికి నేను విధేయుడిగానే ఉన్నాను. తన తండ్రి దుందుభిని చంపాడన్న కోపంతో దుందుభి కొడుకు మాయావి కిష్కింద వచ్చి వాలిని యుద్ధానికి పిలిచాడు. వాలి, వాలి వెనుక నేను కిష్కింద లోనుంచి బయటకు రావడం చూసి పారిపోయి ఒక కొండ గుహలో దూరాడు. నన్ను గుహ దగ్గరే నించోమని చెప్పి వాలి లోపలికి వెళ్ళాడు. ఏడాది పాటు నేను అక్కడ వేచి ఉన్నాను. ఆ

,

తరువాత గుహలోంచి నెత్తురు ప్రవహించటం, లోపల రాక్షసుల అరుపులు విని వాలి చచ్చిపోయి ఉంటాడని భయపడి గుహని రాయితో మూసి దుఃఖిస్తూ కిష్కింద వచ్చాను. జరిగినది విని మంత్రులు నాకు రాజ్యాభిషేకం చేసారు. కొద్దిరోజుల తరువాత వాలి వెనక్కి వచ్చి నేను క్షమాపణ వేడినా వినిపించుకోకుండా నేను రాజు అవటం కోసం గుహని రాయితో మూసి వాలిని చంపే ప్రయత్నం చేశానని తిట్టి కట్టు గుడ్డలతో తరిమేశాడు. నా భార్యని అపహరించాడు, అని అంటాడు సుగ్రీవుడు. రాముడు నీ భార్యని అపహరించిన వాడిని నేను చంపుతాను అని అంటాడు.

వాలిని నువ్వు చంపగలవని నాకు నమ్మకం కలగటం లేదు. వాలి బలం గురించి చెబుతాను విను. వెయ్యి ఏనుగుల బలం ఉందన్న గర్వంతో దుందుభి సముద్రుడిని యుద్ధానికి రమ్మని పిలిచాడు. సముద్రుడు నేను నీతో యుద్ధం చేయలేను అంటూ, హిమవంతుడి దగ్గరికి పంపితే హిమవంతుడు వాలి దగ్గరికి పంపాడు. దుందుభి రాత్రివేళ వచ్చి వాలిని యుద్ధానికి పిలిస్తే అంతఃపురంలో ఉన్న వాలి, స్త్రీలతో కలిసి వచ్చి చావాలని ఉందా అని దుందుభినడిగాడు. అప్రమత్తంగా ఉన్న వాడిని చంపటం గర్భంలో ఉన్న శిశువుని చంపటం లాంటిది. నువ్వు కావాలంటే ఈ రాత్రి స్త్రీలతో గడిపి రేపు రా అన్నాడు దుందుభి. వాలి స్త్రీలని లోపలికి పంపి, దుందుభితో యుద్ధం చేసి వాడిని చంపి ఆ శరీరాన్ని దూరంగా విసిరిరేస్తే కొన్ని రక్తం చుక్కలు మాతంగ

,

ముని ఆశ్రమంలో పడ్డాయి. వాలి ఈ సమీపానికి వస్తే చస్తాడని శాపం పెట్టాడు మహర్షి. అందుకే ఇక్కడ నాకు వాలి భయంలేదు అన్నాడు సుగ్రీవుడు. వాలిని చంపగల శక్తి తనకి ఉంది అని నీకు నమ్మకం కలగటానికి రాముడు ఏం చేయాలో చెప్పు అంటాడు నవ్వుతూ లక్ష్మణుడు. ఇక్కడ పడి ఉన్న దుందుభి ఎముకల గుట్టని కాలితో దూరంగా తన్నమని అడుగుతాడు సుగ్రీవుడు. రాముడు నవ్వి నీకు ధైర్యం కలగటానికి అలాగే చేస్తానని కాలి బొటన వేలుతో ఆ ఎముకలని పది యోజనాల దూరం విసిరి వేస్తాడు. వాలి విసిరిన దుందుభి శరీరంలో మాంసం ఉండేది. ఇప్పుడు లేదు. అందువల్ల రాముడి బలం తెలియటం కష్టం. ఈ ఏడు మద్ది చెట్లలో ఒకొక్క దాన్నీ కదిలించి ఆకులు అన్నీ రాలగొడతాడు వాలి. కనుక వాటిని నీ బాణంతో ఛేదించు అంటాడు సుగ్రీవుడు. రాముడు వేసిన బాణం ఏడు మద్దిచెట్లనూ భూమినీ ఛేదించి మళ్ళీ అంబుల పొదిలో ప్రవేశిస్తుంది.

ధైర్యం తెచ్చుకున్న సుగ్రీవుడు వెంటనే కిష్కింధకు వెళ్ళి వాలిని యుద్ధానికి పిలుస్తాడు. వాలి సుగ్రీవులని విడివిడిగా గుర్తించలేని రాముడు బాణం వేయడు. సుగ్రీవుడు వాలి ధాటికి తట్టుకోలేక మళ్ళీ మాతంగ ఆశ్రమానికి పారిపోయి వెనకే వచ్చిన రాముడిని సహాయం ఎందుకు చేయలేదు అని అడుగుతాడు. రాముడు కారణం చెప్పి, సుగ్రీవుడికి వాలికి మధ్య తేడా తెలియటం కోసం లక్ష్మణుడి చేత సుగ్రీవుడి మెడకి పువ్వులు ఉన్న గజపుష్పి తీగను

,

చుట్టిస్తాడు. మళ్ళీ కిష్కింధకు బయలుదేరి దారిలో ఉన్న ముక్తి సాధించుకున్న సప్తమునుల ఆశ్రమానికి రామలక్ష్మణులతో పాటు సుగ్రీవుడు అభివాదం చేస్తాడు.

మళ్ళీ సుగ్రీవుడు వాలిని యుద్ధానికి పిలిస్తే బయలుదేరిన వాలిని భార్య తార ఆపటానికి ప్రయత్నం చేస్తుంది. నీతో ఇప్పుడిప్పుడే యుద్ధం చేసి పారిపోయిన సుగ్రీవుడు బలమైన సహాయం ఏదో లేకపోతే నిన్ను యుద్ధానికి రమ్మని మళ్ళీ ఎందుకు పిలుస్తాడు. సుగ్రీవుడితో చెలిమి చేసుకోవటం కోసమే ఋష్యమూక పర్వతం దగ్గరకు రామలక్ష్మణులు వచ్చారని అంగదుడికి చారులు ద్వారా తెలిసింది. అపరిమిత పరాక్రమవంతుడైన రాముడితో వైరం నీకు మంచిది కాదు. సుగ్రీవుడిని యువరాజుగా అభిషేకించి సంధి చేసుకో అన్న తారతో నేను రాముడికి అపకారం ఏమీ చేయలేదు. ధర్మాత్ముడైన రాముడు నన్ను శత్రువుగా ఎందుకు భావిస్తాడు అని చెప్పి సుగ్రీవుడితో యుద్ధానికి వెళ్తాడు.

సుగ్రీవుడు వాలి ధాటికి ఓర్వలేక పోతున్నాడని గ్రహించి రాముడు బాణ ప్రయోగం చేస్తే వాలి పడిపోతాడు కానీ ఇంద్రుడు ఇచ్చిన కాంచనమాల మెడలో ఉండటం వల్ల వెంటనే మరణించడు. రాముడిని చూసి వాలి నువ్వు ధర్మాత్ముడివని నమ్మి తార మాట వినకుండా వచ్చాను. నీకు ధర్మం తెలియదు. నేను నీకు ఏమీ అపకారం చేయలేదు. నా మాంసం, చర్మం నీకు పనికిరావు.

,

నన్ను అడిగి ఉంటే ఒక్క రోజులో సీతను, బందీగా రావణుడిని నీకు తెచ్చి ఇచ్చేవాడిని. ఇంకొకడితో యుద్ధం చేస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉన్న నన్ను చంపినందుకు నీకు అపకీర్తి మాత్రం వస్తుంది అని నిందిస్తాడు. సకల భూమండలం ఇక్ష్వాకుల రాజ్యం. ఎక్కడ అధర్మం జరిగినా శిక్ష విధించటం భరతుడి ప్రతినిధిగా నా బాధ్యత. వాలి వరసలు పట్టించుకోక, తమ్ముడి భార్యని నీ భార్యగా చేసుకున్నందుకు మరణమే శిక్ష. అది అనుభవించావు కనుక నువ్వు స్వర్గానికి పోతావు. వేటాడుతూ అప్రమత్తంగా ఉన్న జంతువుని చంపకూడదనే నియమం లేదు. నువ్వు జంతువువి అనుకుంటే, నిన్ను చాటునుంచి చంపటం అధర్మం కాదు. నీ మీద కానీ, నువ్వు నన్ను నిందించావని కానీ నాకు ఏమీ కోపం లేదు. నువ్వు ప్రశాంతంగా శిక్షని స్వీకరించు అంటాడు రాముడు. రాముడు చెప్పినదే ధర్మమని అంగీకరించి వాలి రాముడిని నిందించినందుకు క్షమాపణ చెప్పుకుని, తన కొడుకు అంగదుడికి అభయం ఇమ్మని అడుగుతాడు. రాముడు అంగీకరిస్తాడు.

వాలి తన మెడలోని కాంచనమాలని తీసేసుకోమని సుగ్రీవుడికి చెబుతాడు. సుగ్రీవుడు అలా చేసిన తరువాత వాలి మరణిస్తాడు. తార వాలి శవాన్ని చూసి ఏడుస్తూ, నేను లేకుండా వాలి స్వర్గంలో కూడా సుఖంగా ఉండలేడు. నన్ను కూడా చంపు. నేను వాలి ఒకటే. అందువల్ల నీకు స్త్రీ హత్యా పాతకం కూడా ఉండదులే

,

అంటుంది రాముడితో. తార, సుగ్రీవుడు ఇతర వానరులతో పాటు రాముడు కూడా దుఃఖిస్తాడు. వాలి అంత్యక్రియలు, సుగ్రీవుడి పట్టాభిషేకం అయిన తరువాత, వానాకాలంలో సీతను వెతకటం కష్టం కనుక శరత్కాలం వచ్చిన తరువాత ఆ పని చేయమని సుగ్రీవుడికి చెప్పి రామలక్ష్మణులు ఒక గుహలో తమ వసతి ఏర్పాటు చేసుకుంటారు.

మద్యం తాగుతూ స్త్రీలతో కాలక్షేపం చేస్తున్న సుగ్రీవుడు వర్షాకాలం సమాప్తమై శరదృతువు మొదలయిందని, సీతను వెతకవలసి ఉన్నదని, పట్టించుకోడు. హనుమంతుడు గుర్తుచేస్తే సేనలని కిష్కింధకు తెప్పించమని సేనాపతి నీలుడికి ఆజ్ఞ ఇచ్చి తిరిగి తన సుఖాలలో మునిగి పోతాడు. సీతావియోగంతో దుఃఖిస్తూ వర్షాకాలం గడిపిన రాముడు సుగ్రీవుడు జాప్యం చేయటం చూసి ముందు దుఃఖించినా తరువాత కోపం తెచ్చుకుని, వాలి వెళ్ళిన మార్గంలో నిన్ను కూడా పంపాలా అని అడుగు అని లక్ష్మణుడిని కిష్కింధకు పంపుతాడు. రాముడి దుఃఖం చూసి కోపంగా ఆ సుగ్రీవుడిని చంపేస్తాను అంటూ బయలుదేరతాడు లక్ష్మణుడు. అలా చేయవద్దు, మంచి మాటలతో కార్యం పూర్తి చేయమని హెచ్చరిస్తాడు రాముడు.

కోపంగా వచ్చిన లక్ష్మణుడిని చూసి కిష్కిందని రక్షించాలనుకుని కొందరు వానరులు రాళ్ళు చెట్లు పట్టుకుని యుద్ధం చేయటానికి

,

సిద్ధమైతే ఇంకొందరు సుగ్రీవుడిని హెచ్చరించటానికి పరుగులు పెడతారు. అంగదుడిని చూసి నేను వచ్చానని సుగ్రీవుడికి చెప్పు అంటాడు లక్ష్మణుడు. మైకంలో ఉన్న సుగ్రీవుడు, వానరుల మాట, అంగదుడి సందేశం కూడా వినిపించుకోడు. చివరికి వానరులు భయపడి అరుస్తొంటే సుగ్రీవుడి మత్తు వదుల్తుంది. ఏమి చెయ్యాలి అని మంత్రులతో సంప్రదింపులు మొదలు పెడతాడు. రాముడికి నీ మీద ప్రేమతోనే లక్ష్మణుడిని పంపాడు. నువ్వు చేసిన తప్పు సరిదిద్దుకో అంటాడు హనుమంతుడు. ఈ లోపల లక్ష్మణుడు అంతఃపురం ప్రవేశించి, స్త్రీల సవ్వడి విని వింటినారితో శబ్దం చేసి స్త్రీలు లేని మూలకి వెళ్ళి నిలబడతాడు. ఆ శబ్దం విన్న సుగ్రీవుడు లక్ష్మణుడిని శాంతింప చేయమని తారని పంపుతాడు. తాగిన మత్తు వల్ల కదిలిపోతున్న కళ్ళతో, తడబడుతున్న అడుగులతో లక్ష్మణుడి దగ్గరకు వచ్చిన తార నీకు ఎవరు కోపం తెప్పించారు అని అడిగితే, స్త్రీ సమక్షంలో ఉన్నాను అన్న విషయం గుర్తుపెట్టుకుని తలదించి నేలను చూస్తూ కోపాన్ని దిగమింగి, నీ భర్తకి తన కర్తవ్యాన్ని ఎందుకు గుర్తు చేయటం లేదు అని అడుగుతాడు లక్ష్మణుడు. నీకు కోపం ఉంది కాని కామం లేదు. కామానికి లోబడి మహర్షులే సిగ్గు వదిలి దేశకాల పరిస్థితులని పట్టించుకోరు. చపల చిత్తుడైన వానరుడు ఈ సుగ్రీవుడు. నీ సోదరుడి వంటి వాడు. నీవంటి వాడు సుగ్రీవుడి తప్పులని పట్టించుకోరాదు. పైగా సుగ్రీవుడు తన కర్తవ్యం పూర్తిగా మర్చిపోలేదు. తొందరగా సేనలని కిష్కింధకు తెప్పించమని

,

ఆజ్ఞాపించాడు. త్వరలోనే కోట్ల కొద్దీ వానర వీరులు సహాయం చేయటానికి వస్తున్నారు అని సమాధానం చెప్పి, మిత్రుడిని భార్యల సమక్షంలో కలుసుకోవటం అధర్మం కాదు. సుగ్రీవుడి దగ్గరకిరా అని అంతఃపురంలోకి తీసుకు వెళ్తుంది తార.

తాగిన మైకంలో, స్త్రీలతో కలిసి సింహాసనం మీద కుర్చుని ఉన్న సుగ్రీవుడిని కోపంగా చూసి రాముడి సందేశం పూర్తిగా వినిపిస్తాడు లక్ష్మణుడు. సుగ్రీవుడిని నిందించడం భావ్యం కాదు. సుగ్రీవుడు కృతఘ్నుడు కాడు. రాముడి కృప వల్లనే తనకి రాజ్యం, సుఖం లభించాయని ఎప్పుడూ మరిచిపోడు. విశ్వామిత్రుడంతటివాడే ఘృతాచి అనే అప్సరసతో పది సంవత్సరాలు ఒక రోజులా గడిపి తన తపస్సు పాడుచేసుకున్నాడు. ఇన్ని సంవత్సరాలు కష్టాలు అనుభవించిన తరువాత సుగ్రీవుడికి రుమ, నేను లభించాము. కొద్ది మాసాలు సుఖాలలో మునిగి పోవటం క్షమించవలసిన అపరాధం. పైగా రావణుడు ఉండే లంకలో వంద కోట్లకి పైగా రాక్షస వీరులు ఉన్నారని వాలి మాటలు వల్ల నేను గ్రహించాను. వాళ్ళని జయించటానికి సుగ్రీవుడు పిలిపించిన వానర వీరులు ఇప్పుడే వస్తారు. నువ్వు శాంతించు అంటుంది తార.

లక్ష్మణుడు శాంతించాడని నమ్మకం కలిగిన తరువాత సుగ్రీవుడు మహా శక్తివంతుడైన రాముడికి ఎవరి సహాయమూ అక్కర్లేదు. రాముడే రావణుడిని చంపి సీతను తెచ్చుకుంటాడు. కేవలం

,

చిరు సహాయం చేయటానికి పక్కన ఉంటాను నేను అంటాడు సుగ్రీవుడు. రాముడి దుఃఖం సహించలేక నిన్ను దూషించాను. క్షమించు అంటాడు లక్ష్మణుడు. ప్రపంచంలో ఉన్న వానరులని అందరినీ తక్షణం కిష్కింధకు రప్పించమని హనుమంతుడికి ఆజ్ఞ ఇస్తాడు సుగ్రీవుడు. అలా వచ్చిన వానర సేనకి విడిది ఏర్పాట్లు చేసి సుగ్రీవుడు లక్ష్మణుడితో కలిసి రాముడి దగ్గరికి వచ్చి ఈ సమస్త సేనని ఉపయోగించుకోమని చెబుతాడు. వీళ్ళు చేయవలసినది ఏమిటో నువ్వే నిర్ణయించు అని అంటాడు రాముడు. ప్రపంచంలో సీత కోసం వెతకవలసిన ప్రదేశాలన్నీ ఏకరువు పెట్టి, నాలుగు దిక్కులలో వెతకటానికి నలుగురు వానర వీరులని సేనానాయకులుగా నియమిస్తాడు సుగ్రీవుడు. ఒక్కొక్క నాయకుడికి కొన్ని వేల వానరులని తోడుగా ఇచ్చి అన్ని ప్రదేశాలు వెతకమని ఆజ్ఞ ఇస్తాడు. నెల రోజులలో వెనక్కి రాని వాళ్ళకి కఠిన శిక్ష విధిస్తాను అని హెచ్చరిస్తాడు. హనుమంతుడే ఈ కార్యం సాధిస్తాడని నా నమ్మకం అంటాడు రాముడితో. ఆ మాట విని హనుమంతుడిని వెనక్కి పిలిచి సీత గుర్తించటానికి వీలుగా తన ఉంగరం ఇస్తాడు రాముడు. నాలుగు దిశలలో ఉన్న ప్రదేశాల గురించి నీకు ఎలా తెలుసు అని రాముడు ప్రశ్నిస్తే, పూర్వం మయావిని తరుముతూ వాలి బిలంలో ప్రవేశించాడు. ఏడాది అక్కడే ఉండి వాలిని మాయావి చంపాడని భయపడి బిలం రాయితో మూసి కిష్కింధకు వచ్చాను. తనని చంపే ఉద్దేశ్యంతో బిలం రాతితో మూసి కిష్కింధకు వచ్చి రాజు అయ్యానని నన్ను

,

తిట్టి, నా వెంటబడి తరిమాడు వాలి. అప్పుడు చూసాను. చివరికి మాతంగముని శాపానికి భయపడి ఆయన ఆశ్రమం సమీపానికి వాలి రాడు అని హనుమంతుడు సలహా ఇచ్చాడు. నేను ఆశ్రమం సమీపంలో ఉన్న ఋష్యమూక పర్వతం మీద అందుకే తల దాచుకున్నాను అంటాడు సుగ్రీవుడు.

మిగతా మూడు దిక్కులకి వెళ్ళిన వానరులు, నెల గడువు దాటక ముందే తిరిగి వచ్చి సీత ఆచూకీ తెలియలేదు అని చెబుతారు. దక్షిణ దిశగా వెళ్ళిన వానరులు మాత్రం చాలా రోజులు వింధ్య పర్వతాలలో వెతికి, తాగటానికి నీరు దొరక్క ఒక మాయా బిలం ప్రవేశిస్తారు. అక్కడ తపస్సు చేసుకుంటున్న స్వయంప్రభ అనే స్త్రీ సహాయంతో సముద్ర తీరం చేరుకుంటారు. సుగ్రీవుడు ఇచ్చిన గడువు దాటి పోయిందని గుర్తించిన వానరులలో అభిప్రాయ భేదాలు కలుగుతాయి. సుగ్రీవుడు కఠినంగా శిక్షిస్తాడు కనుక ఈ మాయా బిలంలోనే శాశ్వతంగా ఉండిపోవాలని తారుడు, అక్కడ కూడా లక్ష్మణుడి బాణాల నుంచి రక్షణ ఉండదు. అందువల్ల సుగ్రీవుడిని శరణు అడగాలని హనుమంతుడు, ఇక్కడే తిండి నీరు తీసుకోక ప్రాయోపవేశం చేసి మరణించటం చాలా మేలని అంగదుడు అంటారు. చివరికి అందరూ అంగదుడు చెప్పినట్టు సముద్ర తీరంలో దర్భలు పరచుకుని ప్రాయోపవేశం చేస్తారు. అక్కడే కొండ మీద గుహలో ఉన్న జటాయువు అన్న సంపాతి, ప్రాయోపవేశం చేసిన వానరులని చూసి నాకు చాలా ఆహారం

,

దొరికింది. ఒక్కొక్క వానరుడు మరణించగానే వాడిని తినేస్తాను అంటాడు. అది విన్న అంగదుడు దుఃఖిస్తూ రాముడి కోసం యుద్ధం చేసి, మరణించి, స్వర్గానికి వెళ్ళిన జటాయువంత అదృష్టం కూడా మనకి లేదు అంటాడు హనుమంతుడితో. ఆ మాట విన్న సంపాతి, అతి విషాద వార్త విన్నాను. జటాయువు నా తమ్ముడు. రెక్కలు కాలటం వలన నేను ఎగరలేను. నన్ను కిందకి దింపి జటాయువు విషయం వివరించి చెప్పండి అంటాడు. అంగదుడు సంపాతిని దింపి రాముడు వనవాసానికి రావడం మొదలుకుని కథ పూర్తిగా చెప్పి జటాయువు నీ తమ్ముడు కనుక రామ కార్యానికి నువ్వు సహాయం చెయ్యి అంటాడు. రెక్కలు లేని ముసలివాడిని, రావణుడి మీద నేను ప్రతీకారం తీర్చుకోలేను. జటాయువుతో పోటీపడి సూర్యుడి దిశగా ఎగురుతూ ఉంటే జటాయువు వేడి తట్టుకోలేక పోతున్నాడు అని గ్రహించి నా రెక్కల నీడలోకి తీసుకున్నాను. నా రెక్కలు కాలిపోటం వల్ల ఈ వింధ్య పర్వతాలలో పడి ఉండిపోయాను. రావణుడు ఏడుస్తున్న స్త్రీని ఎత్తుకు పోవటం చూసాను. సముద్రానికి దక్షిణ తీరంలో, ఇక్కడికి వంద యోజనాల దూరంలో ఉన్న లంకా నగరంలో రావణుడు ఉంటాడు. మా జాతి పక్షులు అంత దూరం కూడా చూడగలవు. రావణుడి అంతఃపురంలో రాక్షస స్త్రీల మధ్య ఉన్న సీతని నేను చూడగలుగుతున్నాను. నా రెక్కలు కాలిన కొత్తలో కలుసుకున్న నిశాకరుడనే ఋషి రామ కార్యానికి సహాయం చేసినప్పుడు నా రెక్కలు తిరిగి వస్తాయని చెప్పాడు అంటూ ఉండగానే సంపాతికి

,

రెక్కలు తిరిగి వస్తాయి. సంపాతి ఎగిరి వెళ్ళి పోతూ, మీ యొక్క ప్రయత్నం సఫలం అవుతుంది అనటానికి నా రెక్కలు రావటమే సాక్ష్యం అంటాడు. సముద్రతీరం చేరుకున్న వానరులు వంద యోజనాల దూరం ఎలా దాటాలి అని చర్చ మొదలు పెడతారు. ఇతర వానర వీరులు మేము దూకలేమని ఒప్పుకుంటారు. నేను దూకగలను. కానీ వెనక్కి రాగలనని నమ్మకం లేదు అంటాడు అంగదుడు. రాజు ఎప్పుడూ ఇతరుల చేత పని చేయించాలి ఆని జాంబవంతుడు అప్పటి వరకు దూకగలడో లేదో చెప్పని హనుమంతుడిని పుట్టగానే సూర్యుడి వరకూ ఎగిరావు నువ్వు. నీ శక్తి నీకు తెలియటంలేదు. నువ్వే వెళ్ళి. సీతను కలిసి మమ్మల్ని సుగ్రీవుడు శిక్షించకుండా రక్షించు అంటాడు. హనుమంతుడు నేను వెళతాను. లంకలో సీత కనపడకపోతే లంకనే పెళ్ళగించి కిష్కింధ తీసుకుపోతాను అంటూ తన శరీరాన్ని పెంచుకుని, సమీపంలో ఉన్న మహేంద్ర పర్వతం ఎక్కి తూర్పు దిశగా తిరిగి బ్రహ్మకి, ఇంద్రుడికి తన తండ్రి వాయుదేవుడికి నమస్కారం చేసి దక్షిణ దిశకు తిరిగి, లంక దిశగా ఎగరటం మొదలు పెడతాడు.

ముందర మైనాకమనే పర్వతం సముద్రంలోనుంచి పైకి వచ్చి హనుమంతుడిని అడ్డగిస్తుంది. రొమ్ముతో దానిని పడగొడతాడు. మైనాకుడు మానవ రూపంలో కనపడి, రాముడి పని మీద వెళుతున్న నీకు విశ్రాంతి స్థానం ఇద్దామని పైకి వచ్చాను. నీ తండ్రి వాయుదేవుడు నన్ను ఇంద్రుడి బారి నుంచి కాపాడాడు

,

అంటాడు. హనుమంతుడు తొందర పని ఉంది, ఆగలేను అని అంటూ ముందుకి వెళ్తాడు. ఆ తరువాత సురమ ఎదురుపడి కనపడ్డ వాడిని మింగటానికి నాకు దేవతలు వరం ఇచ్చారు అంటుంది. శరీరం చిన్నది చేసుకుని నోటిలోకి వెళ్ళినట్లే వెళ్ళి వెనక్కి వస్తాడు. హనుమంతుడి తెలివితేటలని మెచ్చుకున్న సురమ ఆశీర్వాదం చేస్తుంది. ఇంకా కొంచెం దూరం వెళ్ళిన తరువాత సింహిక హనుమంతుడి నీడని పట్టుకుని లాగి మింగడానికి ప్రయత్నం చేస్తుంది. ఇంకొక సారి శరీరం చిన్నదిగా చేసుకుని, సింహిక నోట్లో ప్రవేశించి మర్మావయాలని చీల్చి, దానిని చంపి బయటకు వస్తాడు హనుమంతుడు. లంకానగరం చేరుకుని చీకటి పడేవరకు ఆగుతాడు. చిన్న పిల్లి పరిమాణంలో లోపలికి వెళ్ళబోతుంటే లంకా నగరం, రాక్షసి రూపంలో అడ్డు పడుతుంది. ఆ రాక్షసిని ఓడించి లంకలో ప్రవేశించి రావణుడి అంతఃపురంతో సహా లంకానగరం వెతుకుతాడు. నిద్రపోతున్న రావణుడిని చూసీ చూడగానే ఒక అడుగు వెనక్కి వేస్తాడు. పక్కనే నిద్రపోతున్న మండోదరిని చూసి ఒక క్షణం సీత అని భ్రమపడి కోతి గంతులు వేస్తాడు. తరువాత సీత రాముడి కోసం దుఃఖిస్తూ ఉంటుంది కానీ ఇలా సుఖంగా రావణుడి పక్కన నిద్రపోతూ ఉండదు అని ఆలోచించి మళ్ళీ వెదకటం మొదలు పెడతాడు.

ఎంత వెతికినా సీత కనపడక పోతే రకరకాలుగా ఆలోచిస్తాడు. సముద్రంలో పడిపోయిందా? లేక తనకి వశం కాలేదన్న కోపంతో

,

రావణుడు చంపేసాడా? సీత జాడ సరిగ్గా తెలుసుకోకుండా వెనక్కి వెళితే సుగ్రీవుడు శిక్షిస్తాడా? శిక్షిస్తాడని నమ్మి అంగదుడు ఇతర వానరులు మళ్ళీ ప్రాయోపవేశం చేస్తారు. సీత కనపడలేదు అని చెబితే రాముడు బతకడు. ఆ కారణంగా లక్ష్మణుడు భరతుడు సుగ్రీవుడితో సహా అయోధ్యలోనూ, కిష్కిందలోనూ చాలామంది మరణిస్తారు. అందువల్ల చెప్పకూడదు అనుకుంటే నేను ఇక్కడే అగ్నిప్రవేశం చేయనా? సన్యాసిలా బ్రతకనా? పోనీ రావణుడిని బంధించి రాముడి దగ్గరికి తీసకుపోనా? ఇలాంటి ఆలోచనలతో సతమతమైన హనుమంతుడు సకలదేవతలని ప్రార్థించి మళ్ళీ మళ్ళీ వెతకాలి అని నిర్ధారణ చేసుకుని అశోకవనంలోకి వస్తాడు. అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య, చెట్టుకింద నేల మీద కూర్చుని దుఃఖిస్తున్న స్త్రీని చూసి సీతేనా కాదా అన్న ఆలోచనలో పడతాడు. రాముడు వర్ణించిన సీత నగలు ఈ స్త్రీకి ఉన్నాయి. రావణుడు ఎత్తుకు పోతుంటే తాము చూసిన స్త్రీలాగే ఉంది. తమ మధ్య పడేసిన నగలు చుట్టిన గుడ్డ ఈ స్త్రీ చీర లాగే ఉంది. తమ మధ్య పడేసిన నగలు ఈ స్త్రీ వంటిమీద లేవు. ఈ అన్నింటిని కలిపి చూస్తే నేను చూస్తున్నది సీత అని తెలుస్తోంది అనుకుంటాడు. జనక మహారాజు కూతురు, దశరథ మహారాజు కోడలు, రాముడి భార్య అయిన సీత స్థితి చూసి దుఃఖిస్తాడు హనుమంతుడు.

పొద్దున్నే రావణుడు నిద్ర లేచి తన ఇతర భార్యలతో, దాసీలతో వచ్చి తన భార్య అవమని సీతను అడగటం, ఒక పతివ్రతని

,

కామ దృష్టితో చూస్తున్న నీ కళ్ళు ఎందుకు నేలమీద పడటం లేదో నాకు తెలియదు, రాముడు నిన్ను నీ వాళ్ళనీ అందరినీ చంపేస్తాడు అని సీత తిట్టటం, రావణుడికి కోపం వచ్చి నేను ఇచ్చిన గడువులో రెండు మాసాలు మిగిలాయి. ఈలోపల నువ్వు నా భార్య అవటానికి కనక ఒప్పుకోకపోతే నిన్ను వండించుకుని తింటాను అని బెదిరించటం, కాపలా ఉన్న రాక్షస స్త్రీలతో సీతని నయాన్నో భయాన్నో ఒప్పించమని చెప్పి వెళ్ళటం చూస్తాడు హనుమంతుడు. మెత్తగా చెబితే సీత వినటం లేదని రాక్షస స్త్రీలు నిన్ను ఇప్పుడే చంపి తినేస్తామని బెదిరిస్తారు. సీత పూర్తిగా భయపడుతుంది. నేను ఏడుస్తున్నట్టే లంకలోని ప్రతి ఇంట్లోనూ ఏడుపులు వినిపిస్తాయి అని తిడుతుంది. రాముడు ఎందుకు నన్ను రక్షించటానికి రాలేదు? రావణుడు ఏదైనా మాయచేసి చంపాడా? సన్యాసం తీసుకున్నాడా? అని చివరికి తన జడతోనే ఉరి పోసుకోవటానికి సిద్ధం అవుతుంది.

ఇవన్నీ చూస్తున్న హనుమంతుడు సీతని సముదాయించి, ఆత్మహత్య చేసుకోకుండా ఆపి, తను మారువేషంలో వచ్చిన రావణుడిని కాను అని నమ్మించి మాట్లాడటం ఎలా అని ఆలోచించి చివరికి చెట్టు కొమ్మలలోనే ఉండి సీత వినేటట్టు రామకథ చెబుతాడు. విన్న సీత హనుమంతుడితో మాట్లాడటం మొదలు పెట్టినా రావణుడు కాదని పూర్తిగా నమ్మదు. రాముడి గురించి, సుగ్రీవుడితో స్నేహం గురించి, వివరంగా చెప్పి, సీతకి

,

రాముడి ఉంగరం ఇస్తాడు హనుమంతుడు. చిన్న కోతిలా ఉన్న హనుమంతుడు దుఃఖిస్తున్న సీతతో నా భుజం మీద మోసుకుని రాముడి దగ్గరికి ఇప్పుడే తీసుకుని వెళ్తానని అంటే సీత నమ్మదు. తన శరీరం ఆకాశాన్ని అంటేలా పెంచి చూపితే నువ్వు ఈ లంకనే పెళ్ళగించి తీసుకుపోగలవు కానీ అది రాముడికి గౌరవం కాదు. నా అంతట నేను పరాయి పురుషుడిని తాకను. ఈ చూడామణిని రాముడికి గుర్తుగా ఇచ్చి రావణుడు పెట్టిన రెండు మాసాల గడువు లోపల వచ్చి లంకని జయించి నన్ను తీసుకు వెళ్ళమని చెప్పు అంటుంది సీత. తిరిగి వెళ్ళే ముందు రాక్షసుల శక్తి తెలియటం, రావణుడిని కలవటం కూడా ముఖ్యం అని నిశ్చయించి అశోకవనం ధ్వంసం చేసి అడ్డు వచ్చిన వాళ్ళని చంపటం మొదలు పెడతాడు హనుమంతుడు.

నీతో మాట్లాడిన వానరుడు ఎవరు అని రాక్షస స్త్రీలు అడిగితే మాయా రూపాలు ధరించే మీకే తెలియాలి. నాకు కూడా అతన్ని చూస్తే భయంగా ఉంది అంటుంది సీత. కొడుకు అక్షుడితో సహా తాను పంపిన వీరులు అందరినీ హనుమంతుడు చంపటం తెలిసి పెద్ద కొడుకు ఇంద్రజిత్తుని పంపుతాడు రావణుడు. తన బాణాల నుంచి హనుమంతుడు తప్పించుకుంటున్నాడు అని గుర్తించి హనుమంతుడిని బ్రహ్మాస్త్రం ప్రయోగించి బంధిస్తాడు ఇంద్రజిత్తు. ఆ బంధంతో నేలమీద పడినవాడిని రాక్షసులు తాళ్ళతో కడితే బ్రహ్మాస్త్ర బంధం తొలిగి పోతుంది. బ్రహ్మాస్త్ర బంధం

,

తొలిగి పోయిందని హనుమంతుడికి తెలియదు కానీ ఇంద్రజిత్తు గుర్తించి ప్రమాదంలో పడ్డామని అనుకుంటాడు.

బంధితుడై రావణుడి సభలో ప్రవేశపెట్ట బడిన హనుమంతుడు రావణుడి తేజస్సు చూసి నివ్వెరపోయి అధర్మపరుడు కాకపోతే దేవతలకి రక్షకుడు అయివుండేవాడు అనుకుంటాడు. అటు రావణుడు హనుమంతుడి తేజస్సు చూసి నన్ను కైలాసంలో శపించిన నందీశ్వరుడు ఇలా వానర రూపంలో కదిలి వచ్చాడా అనుకుంటాడు. నీ దర్శనం కోసమే నీ వాళ్ళని చంపాను. ఇంకొకడి భార్యని దొంగిలించటమనే అధర్మం చేయటం వల్ల సమస్త లంకా నగరం సర్వనాశనం అవుతుంది. వాలిని ఒక్క బాణంతో చంపగలిగిన రాముడు సమస్త సృష్టిని నాశనం చేసి మళ్ళీ సృష్టించగలడు అంటాడు హనుమంతుడు. కోపించిన రావణుడు ఈ వానరుణ్ణి చంపమని ఆజ్ఞ ఇస్తే విభీషణుడు దూతని ఎవరూ చంపకూడదు, అలాంటప్పుడు ఇటువంటి పని నీ వంటి గొప్పవాడు అసలు చేయకూడదు అని వారిస్తాడు. ఈ మాట ఒప్పుకోని రావణుడికి, వీడిని చంపితే రామలక్ష్మణులని నీతో యుద్ధం చేయటానికి ఎవరు తీసుకు వస్తారు? కోట్లకోద్దీ మహావీరులున్న సేనకి నాయకుడవై దేవతలని జయించిన నీవంటి అసమాన వీరుడు యుద్ధం చేసే అవకాశం ఎప్పుడూ పోగొట్టుకోకూడదు అని విభీషణుడి అంటే, నీ సలహా నచ్చింది,

,

హనుమంతుడిని చంపనక్కరలేదు తోకకి నిప్పుపెట్టి నగరంలో అన్ని చోట్లా ప్రదర్శించండి అని ఆజ్ఞ ఇస్తాడు.

హనుమంతుడి తండ్రి వాయుదేవుడికీ అగ్నిదేవుడికీ స్నేహం. హనుమంతుడి తోకకి నిప్పు పెట్టారు అని తెలిసిన సీత హనుమంతుడికి ఏ ఆపదా కలిగించ వద్దని అగ్నిదేవుడిని ప్రార్థిస్తుంది. ఈ కారణాల వల్ల మంట హనుమంతుడి తోక చివర మాత్రమే నిలిచిపోతుంది. నగర రక్షణ వ్యవస్థని పూర్తిగా చూడటం కోసం కొంచెం సేపు రాక్షసులతో పాటు వీధులలో తిరిగి హనుమంతుడు బంధాలు వదిలించుకుని నగర రక్షకుల మీద తిరగబడి వాళ్ళని చంపి తన మండుతున్న తోకతో నగరమంతా తగలబెడతాడు. చివరికి తోకని సముద్రంలో ముంచి చల్లార్చిన తరువాత అనాలోచితంగా లంకని పూర్తిగా కాల్చాను. సీతకి ఏమైనా అపాయం జరిగిందేమో అని కంగారు పెడతాడు. నా తోకనే కాల్చని అగ్ని సీతకి అపాయం కలిగించదు అని ధైర్యం తెచ్చుకుంటాడు. తరువాత చారణుల మాటలతో సీతకి ఏమీ అపాయం కలగలేదు అని తెలుస్తుంది. సీతని మళ్ళీ కలిసి నమస్కారం చేసి సెలవు తీసుకుని మళ్ళీ సముద్రం దాటుతాడు. తనకోసం ఎదురు చూస్తున్న అంగదుడు జాంబవంతుడు మొదలైన వానరులని కలిసి జరిగినది పూర్తిగా చెబుతాడు. అందరితో కలిసి కిష్కింద తిరిగి వచ్చి రాముడికి సీత సందేశం చెప్పి చూడామణి ఇస్తాడు. దుఃఖిస్తూ నన్ను సీత దగ్గరకి ఇప్పుడే

,

తీసుకువెళ్ళమంటాడు రాముడు. హనుమంతుడు మా ఇక్ష్వాకు వంశానికి చేసిన సహాయానికి ప్రతిఫలంగా ఏమీ ఇవ్వలేను. ఎంత అయినా ఇవ్వొచ్చు. ఈ ఆలింగనం ఇస్తున్నాను అని కౌగలించుకుంటాడు. తరువాత సముద్రాన్ని దాటడం ఎలా అని బెంబేలు పడతాడు. కంగారు పడవద్దని సుగ్రీవుడు ధైర్యం చెప్పిన తరువాత హనుమంతుడిని లంకా నగరం రక్షణ వ్యవస్థ వర్ణించమని అడిగితే వివరాలు చెప్పి నేను కొంత మంది రాక్షసులని చంపి కోటకి కొంత నష్టం కలిగించాను అని క్లుప్తంగా చెబుతాడు. రాముడు ఈ క్షణమే మంచి ముహూర్తం ఉంది అని సేనతో బయలుదేరుతాడు. వానరసేన సముద్రతీరం చేరిన తరువాత తన సీతా వియోగ దుఃఖం లక్ష్మణుడితో మళ్ళీ పంచుకుంటాడు రాముడు.

రావణుడు మంత్రులతో, ఇతర రాక్షస వీరులతో సభ చేసి, నాకు హనుమంతుడి వల్ల గొప్ప అవమానం జరిగింది. ఎలాగో అలా రాముడు సముద్రం దాటతాడు, లంకకి ముట్టడి వేస్తాడు అని అనిపిస్తోంది. మనం ఏమి చేయాలో సలహా ఇవ్వండి అని అడుగుతాడు. మనం అప్రమత్తంగా ఉండటం వల్ల సీతని కలవటం లంకని కాల్చటం చేయగలిగాడు హనుమంతుడు. దేవతలే నీకు ఓడిపోయారు. ఈ నర వానరుల గురించి దిగులు పెట్టుకోకు అంటూ రాక్షస ముఖ్యులు ఎవరికి వారే వానరసేనని, రామలక్ష్మణులని చంపగలమని బీరాలు పలుకుతారు. సామ

,

దాన మార్గాలతో పని సాధ్యమయినప్పుడు యుద్ధానికి దిగటం మంచిది కాదు. సీతను రాముడికి ఇచ్చేసి నీకు యుద్ధభయం లేకుండా చేసుకో అంటాడు విభీషణుడు. ఈ మాట విన్నవెంటనే రావణుడు సభ ముగించి వెళ్ళిపోతాడు.

అంతఃపురానికి వెళ్ళి ఆంతరంగిక మంత్రులతో కూర్చుని ఉన్న రావణుడిని విభీషణుడు కలిసి లంకానగరంలో కనపడుతున్న దుశ్శకునాల వివరాలు చెప్పి సీతను వెనక్కి పంపమని మళ్ళీ వేడుకుంటాడు. భయపడటానికి ఏ కారణం కనపడటంలేదు నాకు. నేను సీతను ఇవ్వను అని చెప్పి పంపుతాడు రావణుడు. సమస్త లంకా వాసులతో మళ్ళీ సభ చేసి రావణుడు నేను సీతని ఎత్తుకువచ్చాను. నా భార్య అవటానికి సీత ఒక సంవత్సరం గడువు అడిగింది. వానరులతో కలిసి రామలక్ష్మణులు లంక వరకూ వస్తే ఏం చెయ్యాలి? సీతను ఇవ్వకుండా వాళ్ళని చంపే మార్గమేమిటి అని అడుగుతాడు. సీతను ఎత్తుకువచ్చే ముందు ఎవరినైనా సంప్రదించావా? నువ్వు చేసిన తప్పుని నేను సరి చేస్తాను. రామలక్ష్మణులని, వానరులు అందరినీ చంపేస్తాను. నువ్వు భయపడకు అంటాడు సభలో ఉన్న కుంభకర్ణుడు.

రావణుడికి కుంభకర్ణుడు అన్న మాట నచ్చలేదని గ్రహించిన మహాపార్శ్వుడు నువ్వు సీతను బలవంతం చేయకపోయావా అంటాడు. నేను గతంలో పుంజికస్థలని బలవంతం చేసాను.

,

అప్పుడు బ్రహ్మ కోపించి, భవిష్యత్తులో ఏ స్త్రీని బలవంతం చేసినా తల పగిలి చస్తావని శాపం పెట్టాడు. శాపభయం వల్ల నేను ఆ పని చేయలేదు. అయినా నేనంటే దేవతలకే భయం. ఈ నర వానరులు సముద్రం దాటలేరు. ఒకవేళ దాటినా నాకు ఏ భయమూ లేదు. రాముడికి నా శక్తి తెలియదు అని అంటాడు రావణుడు. రాముడి ముఖ్యబలం ధర్మం అని మీలో ఎవ్వరూ గుర్తించటం లేదు. రాముడిని మీరెవరూ జయించలేరు. నువ్వు సీతను రాముడికి ఇచ్చెయ్యి అని మళ్ళీ అంటాడు విభీషణుడు. ఇంద్రజిత్తు కోపించి మన వంశం వాళ్ళు ఎవ్వరూ నీలా పిరికి వాళ్ళు కారు. ఇంద్రుడినే బంధించాను నేను. మా అందరినీ భయపెట్టాలని చూడకు అంటాడు. నీది సభలో మాట్లాడ తగిన వయసు కాదు. నువ్వూ నిన్ను మాట్లాడనిచ్చిన వారూ రాముడి చేతిలో చావతగిన వాళ్ళు అంటాడు విభీషణుడు. నువ్వు మిత్ర రూపంలో ఉన్న శత్రువువి. జ్ఞాతి ఎప్పుడూ చెడు జరగాలనే కోరుకుంటాడు. మావటివాడి కంటే, అంకుశం కంటే, సాటి ఏనుగు వల్లే ఏనుగుకి భయం అనే కథ అందుకే చెబుతారు. ఇంకెవరైనా నీలా మాట్లాడి ఉంటే చంపేసి ఉండే వాడిని అని తిడతాడు రావణుడు.

నువ్వు నా అన్నవి. నీకు నన్ను తిట్టే అధికారం ఉంది. కానీ ఈ మాటలని క్షమించలేను అంటూ నలుగురు మంత్రులతో కలిసి ఆకాశంలోకి ఎగిరి వానరసేన దగ్గిరికి వస్తాడు విభీషణుడు. ఈ

,

రాక్షసులని చంపెయ్యాలి అంటున్న సుగ్రీవుడితో, విభీషణుడు శరణు కోరి వచ్చాడని రాముడికి చెప్పమని అంటాడు. శరణు ఇవ్వటం గురించి మీ మీ అభిప్రాయాలు చెప్పండి అని వానర వీరులని అడుగుతాడు రాముడు. నీకే అన్నీ తెలుసు అంటూనే విభీషణుడిని నమ్మటం ఎలా? వీడు రాక్షసుడు. రాక్షసులు మాయావులు. అందులో వీడు రావణుడి తమ్ముడు. అన్ననే వదిలి శత్రువుతో కలవాలని అనుకుంటున్నవాడు. భవిష్యత్తులో మనని మాత్రం వీడు మోసం చేయ్యడా? వీడి ఆంతర్యం ఎలా తెలుస్తుంది? అసలు నమ్మి చేరదీయటం ఎందుకు అంటూ చర్చ మొదలు పెడతారు మిగిలిన వానర వీరులు. ఒక్క హనుమంతుడు మాత్రం ఇటువంటి చర్చవల్ల నిజం తెలియదు. వాలిని చంపి సుగ్రీవుడికి రాజ్యం ఇచ్చినట్టే తనకి లంకా రాజ్యం ఇప్పిస్తావని వచ్చాడు విభీషణుడు. వీడిని స్వీకరించవచ్చు అని అంటాడు. రాముడు ఈ మాటతో అంగీకరిస్తూ, శత్రువులతో కలవటం సామాన్య జ్ఞాతి లక్షణం. భరతుడి వంటి సోదరులు, నా వంటి కొడుకులు, సుగ్రీవుడి వంటి మిత్రులు చాలా అరుదుగా మాత్రమే కనపడతారు. ఈ హేతువాద చర్చ కంటే ముఖ్యమైన ధర్మం ఏమిటో చెబుతాను. మంచివాడు అయినా కాకపోయినా శరణు అన్న వాడిని స్వీకరించటం ధర్మం. నన్ను శరణు కోరిన వాడికి సకల ప్రపంచంనించి రక్షణ ఇవ్వటం నా వ్రతం. వచ్చినది విభీషణుడైనా రావణుడైనా ఒకటే అంటాడు.

,

తన పాదాలకి నమస్కారం చేసిన విభీషణుడిని రావణుడి శక్తి సామర్థ్యాలు, రాక్షసవీరుల బలపరాక్రమాల వివరంగా చెప్పమని అడుగుతాడు రాముడు. వివరాల అన్నీ చెప్పిన విభీషణుడితో నిన్ను లంకా నగరానికి రాజుని చేయకుండా నేను అయోధ్యకి తిరిగి వెళ్ళను అని మాట ఇచ్చి, ఇప్పుడే సముద్రజలం తెచ్చి విభీషణుడిని లంకానగర రాజుగా అభిషేకించమని లక్ష్మణుడిని ఆజ్ఞాపిస్తాడు. తరువాత సుగ్రీవుడు తాము సైన్యంతో సముద్రం దాటటానికి ఏదైనా ఉపాయం చెప్పమని విభీషణుడిని అడిగితే రాముడు సముద్రుడిని ప్రార్థించాలి. ఇక్ష్వాకువంశంలో జన్మించిన సగరుడు భూమిని తవ్వించగా ఏర్పడినది సముద్రం. సహజంగా సముద్రుడికి ఇక్ష్వాకు వంశంలోనే పుట్టిన రాముడికి సహాయం చేయటం ధర్మం అవుతుంది అంటాడు విభీషణుడు. రాముడికి ఈ సూచన నచ్చుతుంది. సముద్రతీరంలో దర్భలు పరుచుకుని సముద్రుడిని ధ్యానిస్తూ పడుకుంటాడు రాముడు.

సముద్రతీరంలో ఉన్న పెద్ద వానర సైన్యాన్ని చూసిన రావణుడి చారుడు శార్దూలుడు హడావిడిగా లంకానగరం వెళ్ళి పెద్ద సేనని వెంట తీసుకుని మహావీరులైన రామలక్ష్మణులు సముద్రానికి అవతలి తీరం చేరారు. వాళ్ళలో విభేదాలు కల్పించే ప్రయత్నం చేయటం మంచిది అని సలహా ఇస్తాడు. రావణుడు శుకుడనే రాక్షసుడితో సుగ్రీవుడికి సందేశం పంపుతాడు. పక్షి రూపంలో శుకుడు వచ్చి నీకూ నాకూ శత్రుత్వం ఏమీ లేదు, నేను రాముడి

,

భార్యని అపహరిస్తే నువ్వు కలగచేసుకోవలసిన కారణం ఏమీ లేదు. సముద్రం దాటి మీరు లంకకి రాలేరు. అందువల్ల నువ్వు కిష్కింధకు తిరిగి వెళ్ళు అని నీతో చెప్పమని రావణుడు నన్ను పంపాడు అని సుగ్రీవుడితో అంటాడు. ఈ మాటలు వింటున్న వానరులు శుకుడిని పట్టుకుని కొడితే దూతని చంపకూడదు అని అరుస్తాడు. రాముడు కలగచేసుకుని శుకుడిని విడిపిస్తాడు. నా సందేశానికి సమాధానం చెప్పమని సుగ్రీవుడిని అడుగుతాడు శుకుడు. నువ్వు నా మిత్రుడివి కాదు. నా మిత్రుడి శత్రువు అయిన కారణంగా నా శత్రువువి అయ్యావు. నిన్ను నీ వాళ్ళనీ చంపటానికి నేను వచ్చాను. రామలక్ష్మణులు దగ్గర ఉండగా సీతను ఎందుకు ఎత్తుకు వెళ్ళలేదు? అని అడిగానని చెప్పు అంటాడు సుగ్రీవుడు. వీడు దూత కాదు చారుడు. మన సైన్యాన్ని పరిశీలిస్తున్నాడు. వీడిని బంధించమని సుగ్రీవుడికి చెబుతాడు అంగదుడు.

తాను మూడు రోజులు ధ్యానించిన తరువాత కూడా సముద్రుడు ప్రత్యక్షం కాకపోవడంతో కోపించి రాముడు బాణాలతో సముద్రాన్ని కల్లోలపరచి, ఈ సముద్రాన్ని పూర్తిగా ఎండకొడతాను, నా సైన్యం కాలి నడకన లంక చేరుకుంటుంది అంటూ బ్రహ్మాస్త్రం సంధించి, నీరు వెనక్కి పోవటం గమనించి బాణాన్ని వదలడు. రాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయటానికి సిద్దం అవగానే ప్రపంచమంతా గందరగోళం అవుతుంది.

,

సముద్రుడు ప్రత్యక్షమై పంచభూతాలలో మార్పులు ఉండవు. అలాంటిదే సముద్రం కూడా. లోతు తగ్గదు. ఈదుతూ ఎవరూ దీనిని దాటలేరు. కామ మోహ భయాలకు లొంగి నేను ఈ నీటిని కదలిక లేని ఘన పదార్థంగా మార్చలేను. కానీ నాలోని విష జంతువుల వల్ల ప్రమాదం లేకుండా నీ సైన్యం లంక చేరటానికి మార్గం చూపుతాను అంటాడు. అమోఘమైన ఈ బాణం ఎక్కడ ప్రయోగించను అని అడిగిన రాముడితో ఉత్తరాన్న ద్రుమకుల్యం మీద ప్రయోగించు. నా నీటిని తాగే పాపాత్ములైన అభీరులు అక్కడ ఉన్నారు అంటాడు సముద్రుడు.

రాముడు వదిలిన బాణం వల్ల ద్రుమకుల్యంలో ఉన్న పాపులు నశించటమే కాక భూమి పగిలి ఎప్పుడూ పాతాళం నుంచి నీరు పైకి చిమ్ముతూ ఉంటుంది. సముద్రంలా కనిపించే ఆ నుయ్యి వ్రణమనే పేరుతో ప్రసిద్ధి చెందింది. బాణం చా అ లోపల భాగంలో ఉష్ణోగ్రత ఎక్కువై చుట్టుపక్కల ప్రాంతం ఎండి ఎడారి అయింది. దేవతలకి సాటి అయిన బల పరాక్రమాలు కలవాడు, విద్వాంసుడు అయిన రాముడు తన వల్ల ఏర్పడిన ఆ ఎడారికి ఇచ్చిన వరం వల్ల అక్కడ పశువులకి పచ్చటి గడ్డి, గొప్ప ఓషధులు, సుగంధ ద్రవ్యాలు, పళ్ళు,దుంపలు లభిస్తాయి. ఇదే తరువాత కాలంలో మరుకాంతకం అనే పేరుతో ఇది ప్రసిద్ధం అయింది. విశ్వకర్మ కొడుకైన నలుడు సేతువు నిర్మిస్తాడు. నేను దానిని కాపాడతాను అని మాట ఇచ్చి సముద్రుడు అదృశ్యం

,

అవుతాడు. నలుడు వానరులు తెచ్చిన చెట్లు లతలు రాళ్ళు మొదలైన వాటితో ఐదు రోజులలో సేతువు నిర్మాణం చేస్తాడు. సైన్యంతో లంక చేరి, తన సేనని వ్యూహంలో నిలబెట్టి, ఇప్పుడు శుకుడిని వదలమని సుగ్రీవుడికి చెబుతాడు రాముడు.

తన దగ్గరకి వచ్చిన శుకుడిని చూసి కోతుల చేతికి చిక్కావా నీ రెక్కలు విరిగాయి అని ఎక్కిరించిన రావణుడితో ఖర, విరాధ, కబంధులని చంపిన రాముడు గొప్ప సేనతో సీత సమీపానికి వచ్చాడు. వెంటనే సీతని ఇచ్చెయ్యి లేదా యుద్ధానికి సిద్ధపడు అంటాడు శుకుడు. సృష్టి అంతా ఏకమై నామీద దండెత్తినా నేను సీతను వెనక్కి ఇవ్వను అని ముందు కోపంగా చెప్పి, తనని తానే పొగుడుకుని, సేతువు నిర్మాణం నమ్మలేకపోతున్నాను, మీరు వెళ్ళి ఇది ఎలా సంభవం అయిందో, ఈ సేన ఎంత పెద్దదో, మహావీరులు ఎవరెవరో తెలుసుకు రండి అని శుకుడితో పాటు సారణుడిని పంపుతాడు రావణుడు. వానర రూపంలో సేనని పరీక్షిస్తున్న వాళ్ళని పట్టుకుని విభీషణుడు రాముడి దగ్గరికి తెస్తాడు. రాముడు నవ్వుతూ ఇంకా చూడాలంటే విభీషణుడు చూపిస్తాడు. ఆయుధాలు చేతలేని మిమ్మల్ని శిక్షంచను. వెళ్ళి రావణుడితో ఏ బలం చూసుకుని నా భార్యని అపహరించావో అది చూపించు. నిన్ను, నీ వారితో సహా చంపి విభీషణుడిని లంకానగరానికి రాజుని చేస్తానని చెప్పండి అంటాడు రాముడు. రావణుడి దగ్గరికి వచ్చి, మమ్మల్ని వానరులు చంపకుండా

,

రాముడు రక్షించాడు. వానర వీరులు, రామలక్ష్మణులు లంకని సర్వ నాశనం చెయ్యకముందే సీతను ఇచ్చెయ్యి అంటారు శుక సారణులు. సృష్టి అంతా ఏకమై దండెత్తినా సీతను వెనక్కి ఇవ్వను అని కోపంగా మళ్ళీ చెప్పి, శుక సారణులతో కలిసి ఎత్తైన తన అంతఃపురం మీదకి ఎక్కి వానర సేనని చూసి దీనిలో ముఖ్య వీరులని చూపమని అడుగుతాడు రావణుడు. వాళ్ళ సమాధానం విని, నా ఉప్పు తిని శత్రువులని పొగిడారని వాళ్ళని తిడతాడు. శార్దూలుడి నాయకత్వంలో ఇంకొందరు చారులని పంపుతాడు.

వాళ్ళూ పట్టుబడిపోతారు. వాళ్ళని రాముడు చంపకుండా వదిలి పెడతాడు. వెనక్కి వచ్చి తాము పట్టుపడ్డామన్న విషయంతో పాటు సువేల పర్వత ప్రాంతమంతా వానర సైన్యాలతో నిండి ఉన్నాయి వెంటనే సీతని ఇచ్చెయ్యి లేదా గొప్ప యుద్ధానికి సిద్ధపడు అంటారు. ప్రపంచమంతా ఏకమై దండెత్తినా సరే సీతను వెనక్కి ఇవ్వను అని కోపంగా చెప్పిన రావణుడు మళ్ళీ ఇంకొకసారి శత్రు సైన్యం లోని ముఖ్య వీరుల బలపరాక్రమాలని చెప్పమని అడుగుతాడు. ఏ వానర వీరుడు ఏ దేవతా పుత్రుడో వివరిస్తారు చారులు. మళ్ళీ అదే విధమైన సమాధానం విన్న రావణుడు తన మంత్రులతో కొంతసేపు చర్చిస్తాడు. మంత్రులని పంపించేసి మాయ బాగా తెలిసిన రాక్షసుడు విద్యుజ్జిహ్వుడిని పిలిచి రాముడి శిరస్సు, విరిగిన విల్లు తయారు చేయించి సీత

,

దగ్గరకు తీసుకు వచ్చి ప్రహస్తుడు రాముడిని, వానర వీరులని చంపి మిగిలిన వానర సైన్యాన్ని తరిమివేశాడు. నువ్వు నా భార్య అవటానికి ఒప్పుకో అంటాడు. ఆ మాట నమ్మి సీత దుఃఖిస్తూ ఉండగా మంత్రులు, సేనాధిపతి ప్రహస్తుడు అతి అవసరమైన నిర్ణయం తీసుకోవటం కోసం తమ దర్శనం కోసం వేచి ఉన్నారని ప్రతీహారి వచ్చి చెప్పితే రావణుడు వెళ్తాడు. వెంటనే రావణుడు చూపించిన మాయా శిరస్సు విల్లు అదృశ్యం అవుతాయి.

సరమ అనే రాక్షసి ఇది రావణుడి మాయ, రాముడు వానర సేనతో లంకా చేరుకున్నాడు, నేను అదృశ్యంగా రావణుడి సభకి వెళ్ళి అసలు విషయం తెలుసుకుని నీకు చెబుతాను అంటూ సీతను ఓదార్చుతుంది. నిన్ను రాముడికి ఇచ్చి సంధి చేసుకోమని సభలో వృద్ధులైన మంత్రులు చెబితే రావణుడు వినలేదు. నేను చెబుతున్నది నిజం. రాక్షస సేన యుద్ధ సన్నాహాల చప్పుడు నీకు వినపడుతోందా అని సరమ అన్న తరువాత సీతకి కొంత వరకు శాంతి లభిస్తుంది. సేతువు కట్టిన రాముడు మానవుడు కాదు. ఈ రూపంలో ఉన్న విష్ణువు అని నా అభిప్రాయం. శక్తివంతునితో శత్రుత్వం కూడదు. నీ చేతిలో ఓడిపోయిన దేవ గంధర్వ యక్షులు నీ నాశనం కోసం ప్రార్థిస్తున్నారు. తాపసులు, యజ్ఞాలు చేసే బ్రాహ్మణులు కూడా నీ వంటి అధర్మపరులైన అసురుల మరణం కోరుతారు. సీతను రాముడికి ఇచ్చి సంధి చేసుకో అని సలహా ఇస్తాడు రావణుడి తల్లికి తండ్రి అయిన మాల్యవంతుడు.

,

రావణుడు కోపగించి తాతని తిట్టి, నన్ను రెండు ముక్కలుగా నరికినా నేను ఇంకొకరికి తల వంచను. ఇది నా తత్వం. ఇది మారదు అంటాడు.

రావణుడు లంకా నగరద్వారాల రక్షణకి వీరులని తగిన సైన్యంతో నియమిస్తాడు. ఆ వివరాలన్నీ విభీషణుడి మంత్రుల ద్వారా తెలుసుకుని తగిన ప్రతివీరులని, సైన్యాన్ని ఏర్పాటు చేస్తాడు రాముడు. లంకని పరిశీలించటం కోసం తన అనుచరులతో కలిసి రాముడు సువేల పర్వతం ఎక్కుతాడు. రాజభవనం మీద కనపడిన రావణుడి మీదదూకి మల్లయుద్ధం మొదలుపెడతాడు సుగ్రీవుడు కానీ జయించలేక పోతాడు. రావణుడు మాయలని ప్రయోగించే ప్రయత్నం చేస్తున్నాడని గ్రహించి వెనక్కి సువేల పర్వతం మీద ఉన్న రాముడి దగ్గరికి వెళ్ళిపోతాడు. ఇలాంటి దుడుకు పనులు రాజు ఎప్పుడూ చేయకూడదని మందలిస్తాడు రాముడు. సీతని వెనక్కి ఇచ్చి జీవించి ఉండటానికి నీకు ఇదే ఆఖరి అవకాశమని రావణుడికి చెప్పమని అంగదుడిని దూతగా పంపుతాడు రాముడు. బ్రహ్మ వరమిచ్చాడన్న అహంకారంతో దేవతలు దగ్గరనుంచి మానవుల వరకు ఎందరికో దుఃఖం కలుగచేసిన నిన్ను శిక్షించడానికి వచ్చాను. సీతను వెనక్కి ఇచ్చి నన్ను శరణు వేడకపోతే నీ బంధుమిత్రులతో సహా అందరినీ చంపుతాను అన్న అంగదుడి సందేశం విని కోపించి వీడిని పట్టుకోమని ఆజ్ఞాపిస్తాడు రావణుడు. పట్టుకున్న రాక్షసులతో

,

సహా రాజభవనం మీదకి ఎగిరి, ఆ రాక్షసులని విదిలించి పడేసి రాజభవనం శిఖరాన్ని విరగతన్ని వెనక్కి వెడతాడు అంగదుడు. యుద్ధం మొదలవుతుంది. ఇంద్రజిత్తు, ఇంకా కొందరు రాక్షస వీరులు, రామలక్ష్మణులతో, ఇతర వానర వీరులతో ద్వంద్వ యుద్ధాలు చేస్తారు. సాయంత్రానికి కొందరు రాక్షస వీరులు మరణిస్తారు. అంగదుడు ఇంద్రజిత్తు సారథిని చంపి రథాన్ని ఆయుధాలని నాశనం చేస్తాడు. రాక్షసులు చీకటి పడటంకోసం ఎదురు చూడటం మొదలు పెడతారు.

వానరులది పైచేయి అవటం, తాను అంగదుడి చేతిలో ఓడటం వల్ల కోపించిన ఇంద్రజిత్తు అదృశ్యమై నాగాస్త్రాన్ని ప్రయోగించి రామలక్ష్మణులని బంధిస్తాడు. తరువాత వారి శరీరంలో ప్రతి భాగాన్ని గాయపరుస్తాడు. ఇతర వానర వీరులు కూడా తీవ్రంగా గాయపడతారు. దేవతలు సైతం వీళ్ళని విడిపించలేరు అని గర్విస్తున్న ఇంద్రజిత్తు నాగబంధాలలో ఉన్న రామలక్ష్మణులలో ఏ విధమైన కదలికగానీ ఊపిరి తీసుకుంటున్న లక్షణాలు కానీ కనపడక వాళ్ళు మరణించారని తండ్రికి చెబుతాడు. రావణుడు పరమ సంతోషంతో సీతని పుష్పక విమానంలో తీసుకు వెళ్ళి రామలక్ష్మణుల స్థితి చూపించమని సీతని కాపలా కాస్తున్న త్రిజట మొదలైన రాక్షస స్త్రీలని ఆజ్ఞాపిస్తాడు.

,

రామలక్ష్మణుల స్థితి చూసి దుఃఖిస్తున్న సుగ్రీవుడు మొదలైన వానర వీరులని ఓదారుస్తూ సత్యధర్మాలయందు మాత్రమే ఆసక్తి ఉన్న వారికి మృత్యుభయంలేదు అంటాడు విభీషణుడు. సీత రామలక్ష్మణులని చూసి దుఃఖిస్తుంటే త్రిజట, వారి ముఖాలని చూస్తే మరణించినట్టు కనపడటంలేదు. అంతేకాక నీ భర్త కనక మరణించే ఉంటే పుష్పక విమానాన్ని ఎక్కలేక పోయేదానిని నువ్వు. అందువల్ల దుఃఖించకు అని శాంత పరుస్తుంది. క్షీర సముద్రం నుంచి ఓషధులని తేవాలని సుషేణుడు, వీళ్ళని కిష్కింధకు తీసుకు వెళ్ళండి, నేను ఒక్కడినే రావణుడిని చంపి సీతను తీసుకుని వస్తానని సుగ్రీవుడు మాట్లాడుతూ ఉండగా గరుత్మంతుడు వస్తాడు. రామలక్ష్మణులని బంధించిన సర్పాలు భయపడి సముద్రంలోకి ప్రవేశిస్తాయి. గరుత్మంతుడి స్పర్శతో రామలక్ష్మణుల గాయాలు మాయమై సుఖం లభిస్తుంది. తండ్రి లాగా వచ్చిన నువ్వు ఎవరు అని రాముడు ప్రశ్నిస్తే, నేను నీ ప్రాణ సమానమైన స్నేహితుడిని. మన సంబంధం ఏమిటో తరువాత తెలుస్తుంది నీకు. రాక్షసులు చాలా మాయా యుద్ధాలు చేస్తారు జాగ్రత్తగా ఉండాలి అని చెప్పి రాముడి అనుమతి తీసుకుని గరుత్మంతుడు వెళ్ళిపోతాడు. రామలక్ష్మణులు సర్పబంధం నుంచి తప్పించుకున్నారని, అందుకే వానరులు సంతోషించి కోలాహలం చేస్తున్నారని తెలుసుకుని రావణుడు చాలా దిగులు పడతాడు. ధైర్యం తెచ్చుకుని వరుసగా ధూమ్రాక్ష, వజ్రదంష్ట్ర, అకంపనులని యుద్ధానికి పంపుతాడు. ముగ్గురూ వానరవీరుల

,

చేతిలో మరణిస్తారు. నువ్వు, నేను, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, నికుంభుడు తప్ప ఇంక ఎవ్వరూ లంకానగరాన్న ఈ ముట్టడి నుంచి విడిపించ లేదనిపిస్తోందని తన సేనాధిపతి ప్రహస్తుడితో అంటాడు రావణుడు. స్థైర్యం లేకపోవడం వానరుల స్వభావం. నిన్ను చూసి భయంతో రామలక్ష్మణులని వదిలి పారిపోతారు. అప్పుడు ఆ ఇద్దరూ నీకు దొరికి పోతారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీ సలహా ఏమిటో చెప్పు. అది వినటానికి కటువుగా ఉన్నా లేకున్నా సరే అంటాడు రావణుడు. మహారాజా ఈ విషయం గురించే కదా మంత్రులు మధ్య అభిప్రాయ భేదాలు కలిగాయి? అప్పుడు నేను సీతను ఇచ్చేయడం మంచిదని చెప్పాను. లేకపోతే యుద్ధం తప్పదని మనం అప్పుడు అనుకున్నదే. ఇన్నాళ్ళూ నీ దగ్గర సత్కారాలు పొందిన నేను నీకోసం ప్రాణాలకి తెగించి యుద్ధం చేయటానికి సిద్ధం అంటూ యుద్ధానికి వెళతాడు ప్రహస్తుడు. వానర సైన్యాధిపతి నీలుడు రాక్షస సైన్యాధిపతి ప్రహస్తుడిని సంహరించాడని తెలిసుకున్న రావణుడు స్వయంగా యుద్దానికి సిద్ధం అవుతాడు.

రావణుడు, వెంట వచ్చిన ఇంద్రజిత్తు మొదలైన వీరుల పేర్లు, బల పరాక్రమాలు రాముడికి చెబుతాడు విభీషణుడు. ముందు రావణుడి తేజస్సుని దేవతలని మించి ఉందని మెచ్చుకుని, తరువాత సీతను అపహరించిన వీడిని ఇప్పుడు శిక్షిస్తాను అంటాడు రాముడు. మీరు నాతో ఉంటే నగరాన్ని రక్షించటానికి

,

ఎవరూ లేరని గుర్తించి వానర సైన్యం దాడి చేయవచ్చు. మీరు వెనక్కి వెళ్ళండి. నేను ఒక్కడినే వీరితో యుద్ధం చేస్తానని వాళ్ళని వెనక్కి పంపుతాడు రావణుడు.

వాళ్ళు వెళ్ళిన తరువాత వానర సైన్యాన్ని చెల్లాచెదురు చేస్తున్న రావణుడిని సుగ్రీవుడు ఎదిరిస్తాడు. రావణుడి బాణం దెబ్బకి మూర్ఛ పోయిన తమ రాజు సుగ్రీవుడిని చూసి రావణుడిని ఎదిరించిన ఇతర వానర వీరులు రావణుడి ధాటికి తట్టుకోలేక పోతారు. హనుమంతుడు రావణుడిని సమీపించి నరవానరుల వల్ల నీకు మృత్యుభయం ఉంది. నా దెబ్బతో నువ్వు చస్తావు అంటాడు. తప్పకుండా కొట్టు. రావణుడిని కొట్టాననే కీర్తి నువ్వు సంపాదించుకో. తరువాత నేను నిన్ను చంపేస్తాను అంటాడు రావణుడు. హనుమంతుడు, కొడుకు అక్షుడిని గుర్తు తెచ్చుకో అంటాడు. కోపం వచ్చి రావణుడు కొట్టిన దెబ్బకి హనుమంతుడు ముందు వణికి తరువాత తేరుకుని తాను కూడా రావణుడిని ఒక దెబ్బ కొడతాడు. ఆ దెబ్బకి వణికిన రావణుడు నువ్వు చాలా బలవంతుడివి అంటే, నిన్ను చంపలేకపోయిన నా బలం గొప్ప ఏమిటి. ఈసారి నిన్ను తప్పకుండా చంపుతాను అంటూ మళ్ళీ కొట్టడానికి సిద్ధం అవుతాడు హనుమంతుడు. కోపించి రావణుడు కొట్టిన దెబ్బకి హనుమంతుడు కొంత సేపు కదల లేక పోతాడు. హనుమంతుడిని వదలి రావణుడు వానర సేనాధిపతి నీలుడితో యుద్ధం చేయటం మొదలు పెడతాడు. తన బాణాల నుంచి

,

చాకచక్యంగా తప్పించుకుంటున్న నీలుడి మీద రావణుడు ఆగ్నేయాస్త్రం ప్రయోగిస్తాడు. అగ్నిదేవుడి కొడుకు అవటం వల్ల నీలుడు మరణించడు కానీ స్పృహ మాత్రం కోల్పోతాడు. తమ నాయకులు రావణుడి ఎదుట నిలబడ లేకపోవటం గమనించి వానరులు రాముడిని శరణు వేడుకుంటారు.

యుద్ధానికి సిద్ధం అవుతున్న రాముడితో వీడిని చంపటానికి నేను చాలు. నాకు అనుమతి ఇయ్యి అంటాడు లక్ష్మణుడు. రాముడు అంగీకరించి, రావణుడు చాలా గొప్ప వీరుడు. నువ్వు జాగ్రత్తగా యుద్ధం చెయ్యి అని చెబుతాడు. లక్ష్మణుడు రావణుడితో ఈ వానరులని వదిలి నాతో యుద్ధం చెయ్యి అని ఆహ్వానిస్తాడు. రావణుడి బాణంతో గాయపడినాకూడా లక్ష్మణుడు, రావణుడిని గాయపరిచి అతని విల్లు కూడా విరగ్గొడతాడు. రావణుడు శక్తి విసురుతాడు. దాని మీద లక్ష్మణుడు బాణాలు ప్రయోగిస్తాడు. కానీ అది ఆగక లక్ష్మణుడి వక్షస్థలం ప్రవేశిస్తుంది. సృహ తప్పిన లక్ష్మణుడిని ఎత్తుకు పోవాలని రావణుడు ప్రయత్నం చేస్తాడు. కైలాస పర్వతాన్ని కదిలించిన రావణుడు నేను విష్ణువుని అని అనుకున్న లక్ష్మణుడిని కదపలేక పోతాడు. హనుమంతుడు వచ్చి ఒక గుద్దు గుద్దితే రావణుడు నెత్తురు కక్కి స్పృహ తప్పి పోతాడు. లక్ష్మణుడి మీద భక్తిశ్రద్ధలు ఉన్న హనుమంతుడు లక్ష్మణుడిని ఎత్తుకుని రాముడి దగ్గరికి తీసుకు వెళతాడు. రావణుడితో యుద్ధం చేయటానికి వెళుతున్న రాముడిని నా వీపు

,

మీద కూర్చుని యుద్ధం చెయ్యి అంటాడు హనుమంతుడు. రాముడు రావణుడిని నిందిస్తాడు. గతాన్ని గుర్తు తెచ్చుకుని హనుమంతుడిని గాయపరుస్తాడు రావణుడు. రాముడికి చాలా కోపం వచ్చి రావణుడి సారథిని, రథం గుర్రాలని చంపి, రథాన్ని, ఆయుధాలని చివరికి రావణుడి కిరీటాన్ని నాశనం చేస్తాడు. నిరాయుధుడిగా రణరంగంలో నిలబడిపోయిన రావణుడితో నా పక్షపు వీరులతో గొప్పగా యుద్ధం చేసి అలసి పోయిన నిన్ను ఇప్పుడు చంపను. వెళ్ళి విశ్రాంతి తీసుకుని మళ్ళీ రమ్మని చెబుతాడు రాముడు.

నేను చేసిన గొప్ప తపస్సు పూర్తిగా వ్యర్థం అయింది. నేను ఇంద్రుడంతటి వాడిని. ఒక మానవుడి చేతిలో ఓడిపోయాను. నరుడి వల్ల నాకు మృత్యుభయం ఉంటుందని బ్రహ్మ ఆనాడే చెప్పాడు. నా వంశంలో పుట్టినవాడు నిన్ను చంపుతాడు అని ఇక్ష్వాకువంశపు రాజు అనరణ్యుడు కూడా శపించాడు. రాముడు ఆ శాపం నిజం చేయటానికి పుట్టినట్టు కనపడుతోంది. నన్ను శపించిన వేదవతే జనకుడి కూతురు సీత అనుకుంటాను. ఉమాదేవి, నంది, రంభ మొదలైనవారు కూడా నన్ను శపించిన వారే. మీరందరూ నన్ను రక్షించటానికి ప్రయత్నాలు చేయాలి అని తన అనుచరులకి చెప్పి, నగర రక్షణ వ్యవస్థని పటిష్టం చేసి, తొమ్మిది రోజులైంది కుంభకర్ణుడు నిద్రపోయి. వాడు మళ్ళీ లేవటానికి ఆరు నెలలో, ఎనిమిది నెలలో పడుతుంది. ముందు

,

వాడిని లేపండి. వాడు లేస్తే నాకు దుఃఖం ఉండదు అంటాడు రావణుడు. అతి కష్టంతో కుంభకర్ణుడిని లేపుతారు రావణుడి సేవకులు. రావణుడి దగ్గరికి బయలుదేరిన కుంభకర్ణుడు, కోట గోడల బయట నుంచి రాముడికి, వానర సైన్యానికి కనపడతాడు. వానరులు భయంతో అన్ని వైపులకీ పారిపోవటం చూసిన రాముడు, ఇది ఎవరు అని విభీషణుడిని అడుగుతాడు. ఇతను కుంభకర్ణుడు, రావణుడి తమ్ముడు. ఇతర రాక్షసులు వరాల సంపాదించి బలవంతులు అవుతారు. ఇతను పుట్టుకతోనే బలవంతుడు. పుట్టగానే కనపడిన ప్రతి జీవాన్ని తినటం మొదలు పెట్టాడు. ఇంద్రుడు వజ్రాయుధం ప్రయోగిస్తే పెద్దగా అరిచి ఐరావతం యొక్క దంతం పీకి దానితోనే ఇంద్రుడి వక్షస్థలం మీద పొడిచాడు. వీడిని ఆపకపోతే త్వరలో అన్ని లోకాలు ఖాళీ అవుతాయి అని దేవతలు, ఋషులు బ్రహ్మతో మొరపెట్టుకున్నారు. ఎప్పుడూ నిద్రపోతూ ఉండు అని బ్రహ్మ శాపం పెట్టాడు. నీ మునిమనవడు వీడు. కనీసం నీ శాపానికి కాల వ్యవధి ఏర్పాటు చెయ్యి అని వేడుకున్నాడు రావణుడు. ఆరు నెలలు నిద్రపోయి ఒక రోజు మెలకువగా ఉంటాడు అన్నాడు బ్రహ్మ. నీకు భయపడి వీడిని నిద్ర లేపాడు రావణుడు. వీడిని చూడగానే భయపడి పారిపోతున్న వానరులు యుద్ధం ఎలా చేస్తారు? ఇది మరబొమ్మ అని వాళ్ళకి చెప్పండి అని అంటాడు విభీషణుడు.

,

రావణుడి దగ్గరికి వచ్చి నీకు వచ్చిన ఆపద ఏమిటి? నన్ను ఎందుకు నిద్రలేపావని అడుగుతాడు కుంభకర్ణుడు. రాముడు సముద్రం మీద సేతువు కట్టించి, తన సైన్యంతో వచ్చి లంకని ముట్టడించాడని నీకు తెలియదు. రాక్షస వీరులు చాలామంది మరణించారు. వానర సైన్యంలో మాత్రం ఏమీ నష్టం కనపడటం లేదు. నువ్వు తప్ప, మిగిలిన లంకావాసులని రక్షించగలవాళ్ళు ఎవరూ లేరు అంటాడు రావణుడు.

కుంభకర్ణుడు నవ్వి, మంత్రి సదస్సులో ఆలోచించినప్పుడు ఏ చెడు జరుగుతుందని అనుకున్నామో దాన్ని కొనితెచ్చుకున్నావు. నువ్వు ఎవరినీ సంప్రదించకుండా సీతను అపహరించే నిర్ణయం బలగర్వంతో తీసుకున్నావు. మంత్రుల గుణగణాలు పరీక్షించి వారితో సంప్రదింపులు చెయ్యకుండా పనులు మొదలుపెడితే ఇలాంటి కష్టాలు కలుగుతాయి. నీ మంచి కోరేవాళ్ళు ఇచ్చిన సలహా నువ్వు స్వీకరించలేదు. తమ్ముడు విభీషణుడు చెప్పినది వినటం మనకి మంచిది అంటాడు. నువ్వు నాకు గురువువి అయినట్టు ధర్మబోధ చేయకు. మారని గతాన్ని గురించి బాధ పడటం వృథా. చేయగల సహాయం చేసేవాడినే బంధువు అని అంటారు. చేతనైతే నేను చేసిన తప్పు సరిచెయ్యి అంటాడు రావణుడు. అన్నకి కోపం వచ్చిందని గ్రహించిన కుంభకర్ణుడు, నేను బ్రతికి ఉండగా నువ్వు బాధ పడవలసిన అవసరం లేదు.

,

రామలక్ష్మణులతో పాటు సకల వానర సైన్యాన్ని నేను ఒక్కడినే చంపేస్తాను. నువ్వు సుఖంగా ప్రశాంతంగా ఉండు అంటాడు.

పక్కనే ఉన్న రావణుడి మంత్రి మహోదరుడు కలగచేసుకుని, నువ్వు చేసిన ధర్మబోధ తప్పు. చేసిన పని సఫలం కావడం మాత్రమే ముఖ్యం. ఎవరినీ సంప్రదించకుండా సీతను ఎత్తుకు రావడం ఏ విధంగానూ తప్పు కాదు. నువ్వు ఒంటరిగా యుద్ధానికి వెళతాను అనటం తప్పు. పద్నాలుగు వేల రాక్షసుల చంపిన రాముడితో నువ్వు యుద్ధం చేయటం సాధ్యం కాదు. ఆ యుద్ధం నుంచి పారిపోయి వచ్చిన రాక్షసులతో మాట్లాడితే రాముడి శక్తి తెలుస్తుంది అని కుంభకర్ణుడికి చెప్పి మహారాజా తేలికగా సీత నీకు వశం అయ్యే మార్గం చెబుతాను. కుంభకర్ణుడితో పాటు ఇంకా కొందరు వీరులని రాముడిని చంపటానికి పంపాను అని నగరంలో ప్రకటించు. మేము గెలిస్తే పని ఎలాగో జరుగుతుంది. లేకపోయినా మేము వెనక్కి రాగానే రాముడిని చంపినందుకు మాకు బహుమతులు ఇచ్చి నగరం అంతా విజయం చాటించు. సీత నమ్ముతుంది. వైభవంగా బ్రతికిన సీతకి నగలు మొదలైనవి ఇయ్యి. ఎలాగో రాముడు చచ్చిపోయాడని నమ్మిన సీత నీకు లొంగిపోతుంది అంటాడు. ఇది విన్న కుంభకర్ణుడు నీలాంటి మంత్రుల మూలంగానే రావణుడికి ఇంత నష్టం జరిగింది అని మహోదరుడిని తిట్టి, నేను రాముడిని చంపుతాను అని అన్నకి మాట ఇస్తాడు. రావణుడు నవ్వుతూ, మహోదరుడికి రాముడు

,

అంటే భయం. అందుకే యుద్ధం వద్దని అంటున్నాడు. కానీ వానరులు బలవంతులు. ఒంటరిగా వెళితే, ఏమరుపాటుగా ఉన్నప్పుడు దెబ్బ తీస్తారు. నువ్వు సైన్యం తోడుగా తీసుకుని వెళ్ళు అంటాడు రావణుడు.

కుంభకర్ణుడు యుద్ధరంగంలో అడుగు పెట్టగానే కొంతమంది వానర వీరులు కూడా భయంతో పారిపోవటం చూసి, విజయమో వీరస్వర్గమో అని యుద్ధం చేయకుండా పిరికివాళ్ళ లాగా ఇదేం పని అంటూ అంగదుడు వాళ్ళని వెనక్కి తీసుకువస్తాడు. కానీ కుంభకర్ణుడి చేతితో అందరూ ఓడిపోతారు. హనుమంతుడు గాయపడి స్పృహ కోల్పోతాడు. ఆంగదుడిని రక్షించే ప్రయత్నంలో సుగ్రీవుడికి కూడా స్పృహ తప్పుతుంది. ఒక్క సుగ్రీవుడిని బంధిస్తే చాలు యుద్ధం పూర్తయిపోతుందని ఆలోచించిన కుంభకర్ణుడు స్పృహ లేని సుగ్రీవుడిని ఎత్తుకుని నగరంలోకి వెళ్తాడు. స్పృహ వచ్చిన తరువాత సుగ్రీవుడు కుంభకర్ణుడి ముక్కు చెవులు కొరికి తప్పించుకుని తన సైన్యంతో కలుస్తాడు. కోపంగా వెనక్కి వచ్చిన కుంభకర్ణుడు వానరులతో పాటు రాక్షసులని కూడా తినటం మొదలుపెడతాడు. తనని వెతుక్కుంటూ వచ్చిన కుంభకర్ణుడిని రాముడు చంపేస్తాడు. తమ్ముడి మరణవార్త విన్న రావణుడు దుఃఖిస్తూ ఇక నాకు లంక ఎందుకు? సీత ఎందుకు? నేను ధర్మాత్ముడు విభీషణుడు చెప్పినప్పుడు వినలేదు. ప్రహస్తుడు కుంభకర్ణుడు కూడా చెప్పారు అని అంటాడు. నువ్వు దేవతలని

,

జయించిన మహా వీరుడివి, అధైర్యంగా దుఃఖించకూడదు. నేను యుద్ధానికి వెళ్ళి నీకు విజయం సాధిస్తాను అంటాడు రావణుడి కొడుకు త్రిశిరుడు. త్రిశిరుడి సోదరులు అతికాయుడు, నరాంతక, దేవాంతకులు కూడా యుద్ధానికి బయలుదేరతారు. రావణుడు సంతోషించి ఇతర వీరులని, సైన్యాన్ని తోడు ఇచ్చి పంపుతాడు.

అంగదుడు, హనుమంతుడు, సుగ్రీవుడు వంటి వానర వీరులు త్రిశిరుడిని, నరాంతక దేవాంతకులని, వారికి తోడుగా వచ్చిన రావణుడి తమ్ముళ్ళు మహోదర మహాపార్శ్వులతో యుద్ధం చేసి వాళ్ళని చంపుతారు. కానీ అతికాయుడితో యుద్ధం చేయలేక పోతారు. లక్ష్మణుడు అతికాయుడితో భయంకరమైన యుద్ధం చేసి, చివరికి వాయుదేవుడి సలహా ప్రకారం బ్రహ్మాస్త్రంతో వాడిని చంపుతాడు. సర్పబంధాలనుంచి రామలక్ష్మణులని దేవతలు కూడా విడిపించలేరు అనుకుంటే వాళ్ళు తప్పించుకోవటం, తాను పంపిన ఇందరు మహావీరులైన రాక్షసులు మరణించటం గుర్తు తెచ్చుకుని దుఃఖిస్తాడు రావణుడు.

నేను బ్రతికి ఉండగా నువ్వు దుఃఖించ వలసిన అవసరం లేదు. నేను ఇవాళ రామలక్ష్మణులతో సహా వానర సైన్యాన్ని చంపెస్తాను అని ఇంద్రజిత్తు యుద్ధానికి బయలుదేరుతాడు. యుద్ధరంగం సమీపించి, తన వెంట వచ్చిన సైన్యాన్ని చుట్టూ కాపలా ఉంచి

,

ఆగ్నిలో హోమం చేస్తాడు. విజయాన్ని సూచించే శకునాలు కనపడతాయి. అగ్నిదేవుడు స్వయంగా ఆహుతి స్వీకరిస్తాడు. తన రథాన్ని, ఆయుధాలని బ్రహ్మాస్త్రంతో మంత్రించి అదృశ్యమై వానరులతో నిర్భయంగా యుద్ధం చేయమని రాక్షస సైన్యంతో అంటాడు ఇంద్రజిత్తు. అదృశ్యంగానే ఉండి రామలక్ష్మణుల మీద, వానర సైన్యం మీద అన్ని దిక్కులనుంచి బాణవర్షం కురిపిస్తాడు. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. సకల వానర సైన్యాన్ని నాశనం చేస్తున్నాడు. అదృశ్యంగా ఉన్న వీడిని చంపటం కుదరదు. మనిద్దరం కూడా ఈ బాణం వర్షం వల్ల స్పృహ కోల్పోయిన తరువాత వాడు సంతోషించి నగరానికి తిరిగి వెళ్తాడు అని అంటాడు రాముడు. రామలక్ష్మణులు బ్రహ్మాస్త్రాన్ని గౌరవించారేగాని మరణించ లేదని గుర్తించిన విభీషణుడితో బ్రహ్మాస్త్రానికి నమస్కారం చేసిన హనుమంతుడు ఈ సైన్యంలో బ్రతికి ఉన్నవాళ్ళని వెతుకుదాం అంటాడు.

జాంబవంతుడిని క్షేమమా అని అడుగుతాడు విభీషణుడు. నీ గొంతు విని గుర్తిస్తున్నాను. హనుమంతుడు క్షేమమే కదా అని అంటాడు జాంబవంతుడు. రామలక్ష్మణుల క్షేమం, వానరరాజు సుగ్రీవుడి క్షేమం అడగకుండా ముందు హనుమంతుడి గురించి ఎందుకు అడిగావు అంటాడు విభీషణుడు. హనుమంతుడు ఉంటే మనందరికీ బ్రతుకు ఉంటుంది. అతను లేకపోతే మనం బ్రతికి ఉన్నా మరణించిన వాళ్ళతో సమానమే అని అంటాడు

,

జాంబవంతుడు. తనకి నమస్కారం చేస్తున్న హనుమంతుడితో వెంటనే వెళ్ళి హిమాలయ, కైలాస శిఖరాల మధ్య ఉన్న ఔషధీ శిఖరం మీద వెలుగుతూ ఉండే మూలికలని తెచ్చి మా అందరి ప్రాణాలు కాపాడు అంటాడు జాంబవంతుడు. వెంటనే ఎగిరి తమదాకా వచ్చిన హనుమంతుడిని చూసి ఔషధీ మూలికలు మాయమౌతాయి. రాముడికి సహాయం చేయని మూలికల మీద కోపించి హనుమంతుడు పూర్తి శిఖరాన్ని పెళ్ళగించి తీసుకుని వస్తాడు. రామలక్ష్మణులతో సహా సకల వానర సైన్యం మూలికల వాసన వల్ల సంపూర్ణంగా ఆరోగ్యవంతులు అవుతారు. ఆ తర్వాత పర్వతాన్ని వెనక్కి తీసుకు వెళతాడు హనుమంతుడు.

కుంభకర్ణుడు, అతికాయుడు వంటి చాలామంది మహావీరులు మరణించారు. ఇప్పుడు రావణుడు బలహీనుడయ్యాడు. మీరు లంకా నగరాన్ని కాల్చండని వానరులని ఆజ్ఞాపిస్తాడు సుగ్రీవుడు. వానరులు లంకని కాల్చడం, రాక్షసుల ఇక్కట్లు తెలుసుకుని రావణుడు కోపించి, కుంభకర్ణుడి కొడుకులని ఇతర వీరులని నగరాన్ని రక్షించటానికి పంపుతాడు. వాళ్ళని కూడా వానరులు సంహరించారని విని ఖరుడి కొడుకు మకరాక్షుడిని పంపుతాడు. వానరులని తరిమేసి, నా తండ్రిని చంపిన నిన్ను చంపేస్తాను అంటూ రాముడితో యుద్ధానికి సిద్ధం అవుతాడు మకరాక్షుడు. రాముడు మకరాక్షుడిని చంపేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న రావణుడు దుఃఖిస్తూ ఈ రామలక్ష్మణులని చంపటానికి నువ్వే

,

సమర్థుడివి అంటూ ఇంద్రజిత్తుని మళ్ళీ యుద్ధానికి పంపుతాడు. ఇంద్రజిత్తు ఇంకొకసారి హోమం చేస్తాడు. మళ్ళీ అగ్ని స్వయంగా వచ్చి ఆహుతి స్వీకరిస్తాడు. ఇంద్రజిత్తు అదృశ్యమై రణరంగానికి వచ్చి రామలక్ష్మణుల మీద, వానర సైన్యం మీద అన్ని దిక్కుల నుంచి ఎడతెగని బాణవర్షం కురిపిస్తాడు. తీవ్రంగా గాయపడినా రామలక్ష్మణులు కూడా దివ్యాస్త్రాలు ప్రయోగించి ఇంద్రజిత్తుని గాయపరుస్తారు. కనపడని శత్రువు వల్ల వందలాది వానరులు మరణించటం చూసి కోపించిన లక్ష్మణుడు, ఈ లోకంలో ఉన్న రాక్షసులని అందరినీ చంపటానికి నేను బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాను, అనుమతించమని రాముడితో అంటాడు. ఒక్కడిని చంపటానికి అందరినీ చంపకూడదు. యుద్ధం చేయని వాడిని, దాక్కున్న వాడిని, చేతులు జోడించి శరణు కోరిన వాడిని, పారిపోతున్న వాడిని, అశ్రద్ధగా ఉన్నవాడిని చంపకూడదు. గొప్ప అస్త్రాలని ప్రయోగించి వీడిని చంపటానికి ఇప్పుడే ప్రయత్నం చేద్దాము. వీడు కనపడితే చాలు మహావీరులైన వానరులు చంపేస్తారు. వీడు ఎక్కడ దాక్కున్నా నా అస్త్రాన్ని తప్పించుకోలేడు అంటూ పరమ దుర్మార్గుడైన ఇంద్రజిత్తుని ధర్మ బద్ధంగా చంపే మార్గం ఆలోచిస్తూ ఉంటాడు రాముడు. ఆ మాటలు విన్న ఇంద్రజిత్తు నగరంలోకి వెళ్ళిపోతాడు. మళ్ళీ మరణించిన రాక్షస వీరులని గుర్తు తెచ్చుకుని, సిగ్గుపడి యుద్ధరంగానికి పశ్చిమ ద్వారం లోంచి వస్తాడు.

,

తన ఎదురుగా ఉన్న రామలక్ష్మణులని వానరసైన్యాన్ని మోసం చేయటానికి మాయా సీతని సృష్టించి వధించాలని నిర్ణయిస్తాడు ఇంద్రజిత్తు. తన రథంలో ఉన్న మాయా సీతను జుట్టు పట్టుకుని ఈడ్చటం, చివరికి ఇంద్రజిత్తు కత్తితో నరకటం హనుమంతుడు చూస్తాడు. కోపంతో హనుమంతుడు రాక్షసుల మీద విరుచుకు పడినా త్వరలోనే ఈ దుర్వార్త రాముడికి, సుగ్రీవుడికి చెప్పి, ఏం చేయమంటారో తెలుసుకోవాలని నిర్ణయించి, వానరులతో సహా యుద్ధరంగం నుంచి వెనక్కి వస్తాడు. ఇంద్రజిత్తు నికుంభిలకి వెళ్ళి హోమ కార్యక్రమం మొదలు పెడతాడు. హనుమంతుడు తెచ్చిన వార్త విన్నవెంటనే రాముడు మూర్ఛపోతాడు. నీవంటి ధర్మాత్ముడికి ఇలాంటి కష్టాలు కలగటం చూస్తే నాకు ధర్మం లేదు అనిపిస్తోంది. ధర్మం కనుక ఉంటే రావణుడు నరకంలో ఉండాలి. నీకు దుఃఖం రావణుడికి సుఖం కలుగుతున్నాయి అంటే అధర్మం సుఖాన్ని ధర్మం దుఃఖాన్ని ఇస్తాయి. దర్మాచరణ వల్ల సుఖం దొరకక పోయినప్పుడు ధర్మాచరణ అనేది ఉంది అని ఎందుకు నమ్మాలి? ధర్మం ఇంత బలహీనమైనదే అయితే ధర్మాన్ని వదిలేయడం మంచదని నా అభిప్రాయం. పరాక్రమాన్ని ఆధారంగా చేసుకుని నువ్వు సఫలత సాధించు. దశరథుడు నీకు రాజ్యాభిషేకం చేస్తానని మాట ఇచ్చి తప్పాడు. నువ్వు రాజ్యం, సుఖం వదిలి ఎందుకు అడవికి వచ్చావు? ఆ విధంగా ఐశ్వర్యం కోల్పోవటం వల్లనే నువ్వు నీ ప్రియమైన భార్యని పోగొట్టుకున్నావు. నువ్వు నీ దుఃఖించటమాపి నాకు అనుమతి ఇయ్యి. నా వదినని

,

చంపిన ఆ రాక్షసుడిని, లంకా నగరాన్ని కూడా భస్మం చేస్తాను అంటాడు లక్ష్మణుడు కోపంగా. ఇంతలో విభీషణుడు వచ్చి మీ అందరూ ఇంత దుఃఖిస్తూ ఉండటానికి కారణం ఏమిటి అని అడుగుతాడు. ఇంద్రజిత్తు సీతను చంపాడని సుగ్రీవుడు చెబితే, విభీషణుడు, సముద్రం ఎండిపోవటం ఎంత అసంభవమో ఇది కూడా అంతే అసంభవం. మీరు దుఃఖిస్తూ ఉండగా తాను నికుంభిలకి వెళ్ళి తన హోమం పూర్తి చేసుకుని అదృశ్యమై యుద్ధానికి రావడం కోసం ఇంద్రజిత్తు ఈ మాయ సృష్టించాడు. వాడి హోమం పూర్తి అవకుండా వాడిని చంపాలి. హోమం పూర్తి అయితే వాడినెవరూ జయించలేరు. లక్ష్మణుడు, నేను, ఇతర వీరులు నికుంభిలకి వెళ్ళటానికి అనుమతి ఇయ్యి అంటాడు రాముడితో.

లక్ష్మణుడిని, హనుమంతుడిని, ఇతర వానర వీరులని తీసుకు వెళ్ళి విభీషణుడు నికుంభిలలో రాక్షసవీరుల కాపలా పెట్టుకుని హోమం చేస్తున్న ఇంద్రజిత్తుని వాళ్ళకి చూపిస్తాడు. విభీషణుడి సూచన ప్రకారం కాపలా కాస్తున్న రాక్షసులని హనుమంతుడు ఇతర వానరులు చంపటం మొదలుపెడతారు. హనుమంతుడి బారి నుంచి రాక్షసులని రక్షించటం కోసం హోమకార్యం ఆపి ఇంద్రజిత్తు రథం ఎక్కి యుద్ధానికి వస్తాడు. మళ్ళీ నికుంభిల ప్రవేశించి హోమం పూర్తి చేసే లోపల ఇంద్రజిత్తుని చంపమని లక్ష్మణుడిని హెచ్చరిస్తాడు విభీషణుడు. నువ్వు నా పినతండ్రివి.

,

శత్రువులతో కలిసి సొంత వాళ్ళని నాశనం చేస్తున్నావు. నువ్వు అధర్మపరుడివి అని నిందిస్తాడు ఇంద్రజిత్తు. నేను రాక్షసులలో జన్మించానే కాని నాది రాక్షస ప్రవృత్తి కాదు. నీ తండ్రి ఋషులని చంపి, దేవతలని ధిక్కరించి ఇంకొకరి భార్యని చెరపట్టాడు. అందుకే అన్నని వదిలి వెళ్ళాను. ఆ ప్రవర్తన కారణంగానే నువ్వు, నీ తండ్రి, మీతో పాటు, లంకానగరం కూడా నాశనం అవుతున్నది అంటాడు విభీషణుడు. యుద్ధం చేయటం మొదలు పెడుతూ, గతంలో నిన్ను ఓడించి బంధించానని మరచిపోకు అంటాడు ఇంద్రజిత్తు. ఇప్పటి వరకూ కనపడకుండా దొంగలాగా యుద్ధం చేసావు. నా కంటికి ఇప్పుడు కనపడ్డావు. నిన్ను చంపకుండా వదలను అంటాడు లక్ష్మణుడు. ఇద్దరూ బాణాలతో, అస్త్రాలతో భయంకరమైన యుద్ధం చేస్తారు. చివరికి ఇంద్రాస్త్రం సంధించి రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, యుద్ధంలో వెనకడుగు వెయ్యని వాడు అయితే ఈ బాణం ఇంద్రజిత్తుని చంపాలి అని బాణం వదులుతాడు లక్ష్మణుడు. ఆ బాణంతో ఇంద్రజిత్తు తల తెగి నేలమీద పడుతుంది.

కొడుకు మరణించాడని తెలిసి రావణుడు కొంతసేపు దుఃఖించి, హటాత్తుగా సీతను చంపేస్తానంటూ బయలుదేరుతాడు. ఎవరు పట్టుకున్నా ఆగక తనని చంపటానికి వస్తున్న రావణుడిని చూసి సీత భయపడి, ఆనాడు హనుమంతుడి వీపు మీద ఎక్కి వెళ్ళి ఉండి ఉంటే ఈ చావు నుంచి తప్పించుకుని ఉండే దానిని అని

,

అంటుంది. బుద్ధిమంతుడైన సుపార్శ్వుడు అనే మంత్రి, సాక్షాత్తు దిక్పాలకుడైన కుబేరుడి తమ్ముడివి. వేద విద్యలు సంపూర్ణంగా తెలిసిన వాడివి. గొప్ప పనులు చేసిన వాడివి. కోపంతో ధర్మం మరిచి స్త్రీ హత్య చేయటం నీకు తగదు. ఈ కోపం రాముడి మీద చూపించు. నాలాంటి వాళ్ళతో కలిసి యుద్ధానికి బయలుదేరు. విజయం లభిస్తే సీత కూడా లభిస్తుంది అంటాడు. ఆ మాట నచ్చిన రావణుడు సీతను వదిలి వెనక్కి వెళ్ళిపోతాడు. తన సభ చేరుకున్న రావణుడు కొడుకు మరణించిన దుఃఖంతో, మిగిలిన సేనాపతులకి చేతులు జోడించి, మీరందరూ సైన్యాన్ని తీసుకుని సకల ఆయుధాలతో రాముడిని చుట్టుముట్టి చంపండి. ఒకవేళ అది సాధ్యం కాడకపోయినా మీతో యుద్ధం చేసి గాయపడిన రాముడిని రేపు నేను చంపగలుగుతాను అని అంటాడు. తనని చుట్టుముట్టిన రాక్షస సైన్యాన్ని ఒంటరిగానే ఎదిరించి, రోజులో ఎనిమిదవ భాగం సమయంలో రాముడు, పదివేల రథాలని, పద్దెనిమిది వేల ఏనుగులని, ఇరవై నాలుగు వేల గుర్రాలని, వాటి రౌతులని, రెండు లక్షల పదాతి సైనికులని చంపేస్తాడు. ఆ తరువాత, తన పక్కన ఉన్న విభీషణుడితో, వానర వీరులతో మాట్లాడుతూ రాముడు, నేను, త్ర్యయంబకుడు శివుడు మాత్రమే ఇలా యుద్ధం చేయగలం అంటాడు.

భర్తలని, కొడుకులని, సోదరులని కోల్పోయి రాక్షస వనితలు దుఃఖిస్తూ ఈ రాముడు రాక్షస సంహారం చేయటం కోసం వచ్చిన

,

శివుడో, విష్ణువో, ఇంద్రుడో లేక యముడో అయివుండాలి. మన దుఃఖానికి కారణం సూర్పణఖ. సౌందర్యం ఏమాత్రమూ లేని ఆ ముసలి రాక్షసి మన్మధుడి లాంటి రాముడిని మోహించి అన్ని లోకాలలోనూ నవ్వులపాలు అయింది. ఇది రెచ్చగొట్టడం వల్ల రాముడితో యుద్ధం చేసిన ఖరుడు, పద్నాలుగు వేల రాక్షసులు చచ్చారు. వాళ్ళు చచ్చారని సీతను ఎత్తుకుని వచ్చి రాముడితో శత్రుత్వం తెచ్చుకున్నాడు రావణుడు. సీత వాడికి లొంగలేదు. విరాధుడిని, కబంధుడిని, వాలిని, చంపిన రాముడు అడవిలో ఏడుస్తున్న సుగ్రీవుడికి వానర రాజ్యం ఇచ్చాడు. ఇవన్నీ గుర్తించే విభీషణుడు సీతని వెనక్కి ఇవ్వమంటే రావణుడికి నచ్చలేదు. ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు మరణించిన తరువాత కూడా నిజం తెలుసుకోవటం లేదు. మానవుడి వల్ల నీకు భయం ఉండదని రావణుడికి బ్రహ్మ వరం ఇవ్వలేదు. రావణుడి కారణంగా కష్టాలు అనుభవించిన దేవతలని ఓదారుస్తూ మీ కోసం సర్వ రాక్షసులని చంపటానికి ఒక స్త్రీ జన్మిస్తుంది అని చెప్పాడు శివుడు. సీతే ఆ స్త్రీ. ఇక నించి దానవులు, రాక్షసులు భయపడుతూ బతుకుతారని బ్రహ్మ చెప్పనే చెప్పాడు. మనని రక్షించగలిగే వాళ్ళు ఎవ్వరూ కనపడటంలేదు. ముందే రాముడి శరణు కోరాడు విభీషణుడు అని రావణుడికి వినపడేటట్టు అంటారు రాక్షస స్త్రీలు.

మిగిలిన సైన్యాన్ని, రాక్షసవీరులని కూడగట్టుకుని, ఇవాళ ఈ వానరులని, రామలక్ష్మణులని చంపి దుఃఖిస్తున్న మనవారికి

,

సాంత్వన కలిగిస్తాను అని తన పక్కనే ఉన్న వీరులకి చెబుతూ యుద్ధానికి బయలుదేరుతాడు రావణుడు. వెంట ఉన్న ముగ్గురు రాక్షస వీరులని వానర వీరులు చంపటం చూసి మహా కోపంతో వానర సైన్యాన్ని చెల్లాచెదురు చేస్తాడు. రామరావణుల యుద్ధం మొదలు అవుతుంది. దివ్యాస్త్రాలు ప్రయోగిస్తూ ఒకరిని ఒకరు గాయపరచుకుంటూ మహాయుద్ధం చేస్తారు. అన్నకి గాయాలు ఆవటం చూసి లక్ష్మణుడు కోపంతో రావణుడి రథ ధ్వజం విరిచి సారథిని చంపుతాడు. విభీషణుడు రావణుడి రథానికి పూన్చిన గుర్రాలను చంపుతాడు. రావణుడు రథం దిగి విభీషణుడి మీద విసిరిన శక్తిని లక్ష్మణుడు బాణాలతో విరగ్గొడతాడు. రావణుడు ఇంకా బలమైన శక్తిని విభీషణుడి మీద ప్రయోగించబోతే మళ్ళీ లక్ష్మణుడు అడ్డు వస్తాడు. నువ్వు చాలా గొప్ప యుద్ధం చేసి విభీషణుడిని రక్షిస్తున్నావు కానీ ఈ శక్తి నీ ప్రాణాలు తీస్తుంది అంటూ రావణుడు ఆ శక్తిని లక్ష్మణుడి మీద ప్రయోగిస్తాడు. అది చూసి రాముడు ఈ ప్రయత్నం విఫలమై లక్ష్మణుడు క్షేమంగా ఉండుగాక అంటాడు.

శక్తి తగిలి స్పృహ తప్పి నేలమీద పడిపోతాడు లక్ష్మణుడు. అలా మరణించిన వాడిలా పడి ఉన్న లక్ష్మణుడిని చూసి ఒకవైపు దుఃఖిస్తూ, యుద్ధం చెయ్యడం ఆపే అవకాశం లేక రాముడు రావణుడితో యుద్ధం కొనసాగిస్తాడు. లక్ష్మణుడి వక్షస్థలంలో చాటుకున్న శక్తిని వానర వీరులు వెలికి తీయలేక పోవడం

,

గమనించి, రాముడు తనే బలం ఉపయోగించి తీసి, శక్తిని విరుస్తాడు. ఆ పని చేస్తున్న రాముడిని తీవ్రంగా గాయపరుస్తాడు రావణుడు. ఒకవైపు రావణుడితో యుద్ధం చేస్తూ లక్ష్మణుడు నాకు ప్రాణంతో సమానం. అతడే మరణిస్తే నాకు సీత ఎందుకు? విజయం ఎందుకు? అని దుఃఖిస్తున్న రాముడికి తార తండ్రి సుషేణుడు, లక్ష్మణుడు మరణించలేదని ధైర్యం చెప్పి, వెంటనే ఓషధి పర్వతం దగ్గరకి మళ్ళీ వెళ్ళి మూలికలని తీసుకు రమ్మని హనుమంతుడిని పంపుతాడు. క్షణంలో ఓషధి పర్వతం చేరిన హనుమంతుడు మూలికలని గుర్తించలేక, తాను కనుక ఆలస్యం చేస్తే లక్ష్మణుడికి ప్రమాదం అవుతుందనే ఉద్దేశంతో, పర్వతాన్నే పెకలించి తీసుకు వస్తాడు. హనుమంతుడి శక్తి చూసి రాక్షసులు, వానరులు కూడా ఆశ్చర్యపోతారు. సుషేణుడు ఆ మూలికలతో లక్ష్మణుడిని క్షణంలో ఆరోగ్యవంతుణ్ణి చేస్తాడు.

ఇంకొక రథం మీద రావణుడు యుద్ధానికి వస్తాడు. రాముడు నేల మీద నిలబడి యుద్ధం చేయటం సరికాదని ఇంద్రుడు నా రథం కవచం, విల్లంబులు రాముడి కోసం తీసుకు వెళ్ళమని సారథి మాతలితో చెబుతాడు. ఆ రథానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, దానిని ఎక్కి మళ్ళీ యుద్ధం చేయటం మొదలు పెడతాడు రాముడు. రాముడు బాణం సంధించటానికి కూడా అవకాశం లేకుండా బాణవర్షం కురిపించి, ఇంద్రుడి రథం గుర్రాలని, సారథి మాతలిని గాయపరిచి, ధ్వజం విరిగకొట్టిన రావణుడి

,

పరాక్రమాన్ని చూసి వానర వీరులు, విభీషణుడు, ఆకాశంలో ఉన్న ఋషులు దేవతలు దుఃఖిస్తారు. కోపంతో రాముడి కళ్ళు ఎర్రబడతాయి. ఆ రూపం చూసి సకల సృష్టితో పాటు రావణుడు కూడా భయపడతాడు. అయినా కోపంతో, నీ ప్రాణాలతో పాటు నీ తమ్ముడి ప్రాణాలు కూడా తీస్తుంది ఇది అంటూ తన మహాశక్తిని విసురుతాడు రావణుడు. తన బాణాలు ఆ శక్తిని ఆపలేకపోవటం చూసి రథంలో ఉన్న ఇంద్రుడి శక్తితో మహాశక్తిని నాశనం చేస్తాడు రాముడు. ఆ తరువాత బాణాలతో రావణుడిని, అతని రథం గుర్రాలని తీవ్రంగా గాయపరుస్తాడు. రావణుడు మళ్ళీ రాముడిని గాయపరుస్తాడు. గాయాలని లెక్ఖచేయక యుద్ధం కొనసాగిస్తూ,, రావణుడిని తీవ్రంగా నిందిస్తాడు రాముడు. నాకు తెలియకుండా సీతను ఎత్తుకుపోయిన నువ్వు శూరుడివి కావు. ఒక సిగ్గులేని దొంగలా ప్రవర్తించావు. కుబేరుడి తమ్ముడివి అయివుండి, గొప్ప తపస్సు చేసిన నువ్వు ఇంకొకరి భార్యని అపహరించిటం అనే మర్యాదస్తుడు చేయరాని పని చేసి, పైగా నేను శూరుడిని అని చెప్పుకుంటున్నావు. నేను అక్కడే ఉన్నప్పుడు సీతాపహరణానికి ప్రయత్నించి వుంటే అప్పుడే ఖరుడిని కలుసుకుని ఉండేవాడివి. నేను ఇప్పుడు నిన్ను చంపితీరుతాను అంటాడు. రాముడి ధాటికి విల్లు ఎక్కుపెట్టను కూడా లేక పోతున్న రావణుడిని చూసి సారథి రథాన్ని రణరంగం నుంచి పక్కకి తప్పిస్తాడు. కొద్ది సమయంలోనే రావణుడు తెప్పరిల్లి రథాన్ని మళ్ళించినందుకు సారథితో, నేను చేతకాని వాడిని అనుకున్నావా లేక శత్రువుల ధనం తీసుకుని,

,

ఎన్నడూ యుద్ధంలో వెన్ను చూపలేదనే నా ఘనతని నాశనం చేసావా, అని తిడతాడు. ఎత్తు పల్లాలు చూసి రథం నడిపినట్టే, గుర్రాల అలసట, రథికుడి స్థితి గమనించి రథం నడపటం సారథి కర్తవ్యం. గుర్రాలు గాయపడటం, నువ్వు కూడా కదలలేక పోవటం చూసి రథం మళ్ళించాను. విశ్రాంతి లభించడం వల్ల నువ్వు, గుర్రాలు కూడా కోలుకోవటం జరిగింది. ఇప్పుడు మళ్ళీ యుద్ధానికి వెళ్ళవచ్చు అంటాడు సారథి. ఆ మాట అంగీకరించి సారథికి తన కంకణం బహుమతిగా ఇస్తాడు రావణుడు. తిరిగి రణరంగానికి వచ్చిన రావణుడి ఎదురుగా యుద్ధం చేసి చేసి అలసిపోయిన రాముడు ఉండటం గమనించిన అగస్త్యుడు రాముడికి ఆదిత్య హృదయం ఉపదేశించి విజయం కోసం మూడు సార్లు జపించమని చెబుతాడు. రాముడు శుచిగా జపం చేస్తాడు. మళ్ళీ రామరావణ యుద్ధం మొదలు అవుతుంది. వానరులు, రాక్షసులు కూడా తాము యుద్ధం చేయటం ఆపి, ఏడు రోజులు నిర్విరామంగా జరిగిన ఆ భయంకర యుద్ధం చూస్తూ నిలబడి పోతారు. ఆకాశంలో దేవతలు సైతం ఎవరు గెలుస్తారో ఊహించలేక రాముడు విజయుడవాలని పలుకుతూ ఉండి పోతారు. రాముడు నూటొక్క సార్లు రావణుడి తల నరికినా ప్రతి సారీ కొత్త తల మొలుస్తుంది. సారథి మాతలి బ్రహ్మాస్త్రం ప్రయోగించమని రాముడికి గుర్తు చేస్తాడు. బ్రహ్మాస్త్రం మంత్రించి ఇంద్రుడి మహా బాణంతో రావణుడిని సంహరిస్తాడు రాముడు. మహా పరాక్రమశాలి, తపస్సంపన్నుడు అయిన అన్న, నా మాట

,

వినక చనిపోయాడు అని అంటాడు విభీషణుడు దుఃఖిస్తూ. రాముడు ఓదారుస్తూ యుద్ధంలో మరణించి స్వర్గం చేరుకున్న వీరులని గురించి దుఃఖించ కూడదు. రావణుడి శరీరానికి అంత్యక్రియలు చెయ్యి. ఎప్పుడూ శత్రుత్వం మరణంతో అంతం అవుతుంది. మనం కావాలనుకున్నట్టే రావణుడు మరణించాడు కదా. ఇక రావణుడితో నీకున్న సంబంధమే నాకూ ఉంటుంది అంటాడు.

రావణుడి భార్యలు రణరంగానికి వచ్చి రావణుడి మృతశరీరం చూసి ఏడుస్తారు. దేవతలని, యక్ష గంధర్వులని జయించిన నువ్వు ఒక మానవుడి చేతిలో మరణించినందుకు సిగ్గు పడటం లేదా? లోకాలన్నీ జయించిన నిన్ను అడవిలో తిరిగే మానవుడు చంపాడు అంటే నమ్మకం కలగదు. జన్మస్థానంలో నీ తమ్ముడు ఖరుడిని చంపగానే తెలిసిపోయింది రాముడు మానవుడు కాడు అని. ఒక కోతి దేవతలు కూడా ప్రవేశించలేని లంకానగరంలో చొరపడినప్పుడే మేమంతా కంగారు పడ్డాము. సముద్రం మీద సేతువు కట్టించగానే రాముడు మానవుడు కాదు అని ధృడంగా తెలిసింది. యముడో లేక ఇంద్రుడో ఈ రూపంలో వచ్చాడా అని తర్కించాను కానీ ఇంద్రుడికి నిన్ను ఎదిరించే ధైర్యం ఎక్కడిది? తెలిసిపోయింది. సర్వ శక్తిమంతుడైన విష్ణువు, వానర రూపంలో ఉన్న దేవతలతో కలిసి నరుడి రూపంలో వచ్చాడని. నువ్వు ఇంద్రియాలని అణిచి శక్తి సంపాదించి మూడు లోకాలని జయిస్తే

,

ఆ ఇంద్రియాలే నీ చావుకి కారణం అయ్యాయి. రాముడితో వైరం వద్దు అని నేను చెబితే నువ్వు వినలేదు. విభీషణుడూ, నా తండ్రీ చెప్పినా నువ్వు మాత్రం వినలేదు. మహా పతివ్రత అయిన సీతని కామించి నువ్వు ఎత్తుకు వచ్చావు. అగ్నిదేవుడికి కూడా నువ్వంటే భయం. అందుకే నువ్వు అప్పటికి అప్పుడే భస్మం అవలేదు. కావలసినంతమంది స్త్రీలు నీ అంతఃపురంలో ఉన్నారు. సీత నాకంటే అందగత్తె కాదు. కానీ నువ్వు మోహంవల్ల తెలుసుకోలేక పోయావు. ఎవరి మృత్యువుకైనా కారణం కావాలి. నీ మృత్యువు కారణాన్ని నువ్వే స్వయంగా ఇంటికి తీసుకొచ్చుకున్నావు. నీ మూలంగా తమ భర్తలని పోగొట్టుకున్న పతివ్రతల కన్నీరు నిన్ను చంపింది. ఏనాడూ యుద్ధంలో పిరికితనం చూపని నువ్వు ఒక పిరికివాడిలా మాయ లేడితో రాముణ్ణి దూరంగా పంపించి సీతని ఎందుకు ఎత్తుకొచ్చావు అంటూ ఒకవైపు రావణుడి మరణానికి హేతువులు వెతికుతూ రెండవ వైపు తన సుఖ సౌభాగ్యాలు పోయినందుకు విపరీతంగా దుఃఖిస్తుంది మండోదరి.

ఈ స్త్రీలని వెనక్కి పంపి రావణుడి అంత్యక్రియలు చేయమని విభీషణుడికి చెబుతాడు రాముడు. రావణుడు ఇతరుల భార్యని అపహరించటం, తాపసులని హింసించడం లాంటి అధర్మమైన కార్యాలు చేసాడు. నేను అంత్యక్రియలు చేయవచ్చా అంటూ విభీషణుడు ధర్మసందేహం వ్యక్తం చేస్తాడు. నీ సహాయంతో నేను యుద్ధం గెలిచాను. నీకు ప్రత్యుపకారం చేయటం నా

,

ధర్మం. అందుకే నీకు ధర్మం చెబుతున్నాను అంటూ రాముడు మళ్ళీ శత్రుత్వం మరణంతో అంతమవుతుంది. మనం కావాలి అనుకున్న రావణుడి మరణం లభించింది. ఇక రావణుడితో నీకున్న సంబంధం నాకూ ఉంది అంటాడు. విభీషణుడు అంత్యక్రియలు చేసి స్త్రీలని సముదాయించి ఇంటికి పంపించి రాముడి దగ్గరికి తిరిగి వస్తాడు. రాముడి ఆజ్ఞ ప్రకారం బంగారు బిందెతో సముద్రజలం తెప్పించి విభీషణుడిని లంకానగరానికి రాజుగా అభిషేకిస్తాడు లక్ష్మణుడు. విభీషణుడి దగ్గర అనుమతి తీసుకుని అతని అంతఃపురంలో ప్రవేశించి తన విజయవార్త సీతకు చెప్పమని హనుమంతుడిని పంపుతాడు రాముడు.

హనుమంతుడు అశోకవనం ప్రవేశించి, రావణుడిని చంపిన రాముడు విభీషణుడిని లంకానగరానికి రాజుని చేసాడు అని సీతకి చెబుతాడు. శుభవార్త తెచ్చిన నీకు బహుమానంగా ఎంత గొప్ప వస్తువు ఇచ్చినా తక్కువే అంటూ సీత తన సంతోషం వ్యక్తం చేస్తుంది. నీ మాటలే నాకు దివ్యాభరణాల కంటే ఎక్కువ. శత్రువు మీద విజయం సాధించి సంతోషంతో వెలుగుతున్న రాముడి ముఖం చూడటం నాకు స్వర్గంలో రాజ్యం చేయటం కంటే చాలా ఎక్కువ అంటాడు హనుమంతుడు. అన్ని మంచి గుణాలు నీలో ఉన్నాయని హనుమంతుడిని మెచ్చుకుంటుంది సీత. నువ్వు అనుమతిస్తే ఇన్నాళ్ళూ నిన్ను బెదిరించి కష్టపెట్టిన ఈ రాక్షస స్త్రీలనందరినీ చంపుతాను అంటాడు హనుమంతుడు.

,

వాళ్ళ తప్పు ఏమీ లేదు. సేవకులు రాజు ఆజ్ఞ పాటిస్తారు. నా దురదృష్టమే నా దుఃఖానికి కారణం. నేను బలహీనురాలిని. ఈ సేవకులని క్షమిస్తాను. నువ్వు గతంలో పాపాలు చేసావు, అని మంచి నడవడిక కలవారు తాము రక్షించాల్సిన వ్యక్తితో అనరు అని ఋషులు చెప్పారు. సత్పురుషులు వీళ్ళు పాపులా, వధింప తగినవారా, మంచివారా అని తర్కించక, అందరితోనూ కరుణతో వ్యవహరిస్తారు. కామరూపులైన రాక్షసులు లోకంలో అందరినీ హింసిస్తారు. అది వారి స్వభావమే కదా అంటుంది సీత. నువ్వు రాముడికి తగిన భార్యవి. రాముడికి నీ సందేశం ఏమిటి అని అడుగుతాడు హనుమంతుడు. భర్తని చూడాలని కోరుతున్నాను అని చెప్పు అంటుంది సీత. వేగంగా రాముడి దగ్గరికి తిరిగి వచ్చిన హనుమంతుడు సంతోషంగా ఆ సందేశం అందచేస్తాడు.

హనుమంతుడి సందేశం విని రాముడు తల వంచుకుని కళ్ళల్లో నీళ్ళు కుక్కుకుంటూ పక్కన ఉన్న విభీషణుడితో, సీతకి స్నానం చేయించి అలంకారం చేయించి తీసుకురమ్మని చెబుతాడు. విభీషణుడు చెప్పిన ఈ మాట విన్న సీత అవన్నీ చేసుకోకుండా భర్త దగ్గరకి వెళ్తాను అంటుంది. నువ్వు నీ భర్త ఆజ్ఞ పాటించాలి కదా అంటాడు విభీషణుడు. సీత భర్త ఆజ్ఞ ప్రకారం స్నానమూ అలంకారమూ చేయించుకుంటుంది. విభీషణుడు అందలం ఎక్కించి రాముడి దగ్గరికి సీతని తీసుకు వస్తాడు.

,

చాలాకాలం రాక్షసుడి ఇంట ఉన్న సీత తన దగ్గరికి వచ్చిందని తెలియగానే రాముడికి సంతోషం, దైన్యం, కోపం ఒక్కసారిగా కలుగుతాయి. తాను ఉన్న చోటికే సీతను తీసుకు రమ్మంటాడు రాముడు. అక్కడ ఉన్న వానరులని, రాక్షసులని దూరంగా పంపి సీతారాములకి ఏకాంతం ఏర్పాటు చేయటానికి ప్రయత్నిస్తాడు విభీషణుడు. ఆ కోలాహలమంతా విన్న రాముడు, ఆ ఏర్పాట్లు ఆపించి, దుఃఖం, వివాహం వంటి సమయాలలో ఇతరులు స్త్రీలని చూడకూడదనే పట్టింపు లేదు. సీత అతి దుఃఖంలో ఉంది. పైగా నేను ఇక్కడే ఉన్నాను. కనుక నా వానర పరివారం సీతను చూడవచ్చు. అందలం దిగి సీతను ఇక్కడికే రమ్మని చెప్పు అంటాడు. కటువుగా మాట్లాడుతున్న రాముడిని చూసి లక్ష్మణుడు, ఇతర వానర వీరులు రాముడికి సీత మీద కోపం వచ్చిందా అని సందేహిస్తారు. విభీషణుడి వెనుక నెమ్మదిగా నడుస్తూ కొంగులో ముఖం దాచుకుని సీత రాముడి దగ్గరకి వచ్చి భర్తని పిలుస్తుంది.

పక్కన ఉన్న సీత ఎదుట తన మనసులో ఉన్న కోపం అంతా వెళ్ళగక్కుతూ రాముడు మహాయుద్ధం చేసి, శత్రువుని చంపి నిన్ను గెలుచుకున్నాను. దైవం నాకు కలిగించిన అవమానాన్ని స్వశక్తితో నేను తొలిగించుకోగలిగాను. నా ప్రతిజ్ఞ నెరవేర్చుకుని స్వాతంత్ర్యం సంపాదించుకున్నాను. మానవుడి గొప్పతనం తనకి అయినా అవమానాన్ని తొలిగించుకోటం లోనే తెలుస్తుంది. నేను,

,

నాతోపాటు, హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు మొదలైన వారి పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది అంటాడు. ఈ మాటలు వింటున్న సీత కంటి నుంచి కారిన కన్నీరు చూసి జనాపవాద భయంతో మరింత కోపం తెచ్చుకుని రాముడు, ఇదంతా నేను నీకోసం చేయలేదని, నా గొప్ప వంశం యొక్క గౌరవం నిలబెట్టటానికి చేసానని తెలుసుకో. సందేహాస్పదమైన నడవడిగల నువ్వు జబ్బుపడ్డ కంటికి దీపం లాగా నాకు నొప్పి కలిగిస్తున్నావు. అందువల్ల నీ అవసరం నాకు లేదు. ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళవచ్చు నువ్వు. రావణుడి కంటపడి అతని చేతికి చిక్కిన నిన్ను, పరాయి ఇంట నివసించిన స్త్రీని, గొప్ప వంశంలో జన్మించిన వాడు మళ్ళీ ఎలా స్వీకరించగలడు? లక్ష్మణ భరత శత్రుఘ్న సుగ్రీవ విభీషణులలో ఎవరు కావాలంటే వారియందు మనసు నిలిపి సుఖంగా ఉండు. సౌందర్యవతివైన నిన్ను ఇంతకాలం తన ఇంట్లో ఉండగా చూసి రావణుడు ఊరికే ఎలా ఉండి ఉంటాడు అని అంటాడు.

సంస్కారం లేని మానవుడిలా నాకు కర్ణ కఠోరమైన ఇటువంటి మాటలు ఎందుకు వినిపిస్తున్నావు అని అడుగుతుంది సీత కన్నీరు కారుస్తూ. ప్రపంచంలో స్త్రీలనందరినీ నిందిస్తున్నావు నువ్వు. కాముకుడైన రావణుడు నన్ను ముట్టుకుంటే ఆ తప్పు దైవానిదే కానీ ఆపటానికి శక్తిలేని నాది కాదు. నా ఆధీనంలో ఉన్న నా మనస్సులో నువ్వు మాత్రమే ఉన్నావు. ఈశ్వరుడి కృప లేని

,

నేను నా ఆధీనంలో లేని శరీరాన్ని ఏం చేయగలను. ఇన్ని సంవత్సరాల దాంపత్యం తరువాత భూమి లోంచి పుట్టిన నన్ను నువ్వు నమ్మలేకపోతే మరణమే నాకు గతి. నన్ను వెతుక్కుంటూ హనుమంతుడు వచ్చినప్పుడే నన్ను వదిలి వేస్తున్నానని చెప్పి ఉంటే నేను అప్పుడే మరణించేదానిని. నీకు నీ స్నేహితులకు యుద్ధం చేసే శ్రమ ఉండేదే కాదు. నువ్వు కోపానికి లొంగిపోయిన బలహీనుడైన పురుషుడి లాగా స్త్రీల స్వభావాన్ని చూపుతున్నావు అంటూ రాముడికి సమాధానం చెప్పిన సీత, పరుల ఎదురుగా భర్త నోటి నుంచి ఇటువంటి మాటలను విన్న తరువాత నాకు జీవించాలని లేదు. నువ్వు చితి ఏర్పాటు చెయ్యి. నేను అగ్నిలో ప్రవేశిస్తాను అంటుంది దుఃఖిస్తున్న లక్ష్మణుడితో. ఆ మాటలు విని కోపంగా రాముడి వంక చూస్తాడు లక్ష్మణుడు. రాముడి ముఖకవళికలను బట్టి తాను చితి ఏర్పరచటం రాముడికి అంగీకారమే అవుతుందని భావించి, లక్ష్మణుడు సీత చెప్పినట్టు చితి ఏర్పాటు చేస్తాడు. ప్రళయకాల రుద్రుడిలా ఉన్న రాముడి ముఖం చూడటానికి కానీ, రాముడితో మాట్లాడటానికి కానీ అక్కడ ఉన్న వారెవరివల్లా కాలేదు. తలవంచుకుని ఉన్న రాముడికి ప్రదక్షిణ చేసి అగ్ని దగ్గరకు వచ్చి సకల దేవతలకి నమస్కారాలు చేసి పవిత్రమైన నడవడిగల నాపై నా భర్తకి నమ్మకం లేదు. ఆలోచనలో, మాటలో, ఆచరణలో అన్ని ధర్మాలు తెలిసిన రాముడిని వ్యతిరేకించి ఉండకపోయి ఉంటే అగ్ని నన్ను రక్షించుగాక అంటూ అగ్నికి ప్రదక్షిణ చేసి అగ్నిలో ప్రవేశిస్తుంది.

,

ఇది చూసి అక్కడున్న స్త్రీలు, వానరులు రాక్షసులు హాహాకారాలు చేస్తారు. దీనంగా ఆ అరుపులు వింటూ రాముడు కొంచెం సేపు స్థాణువులా ఉండిపోతాడు.

అప్పుడు బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు ఇతర దేవతలతో కలిసి రాముడి దగ్గరికి వచ్చి, దేవతలలో అతి ముఖ్యమైనవాడివై ఉండి సీత అగ్నిలో ప్రవేశిస్తూంటే అతి సాధారణ మానవుడిలా ఎలా ఊరుకున్నావు అని వినయంగా అడుగుతారు. నన్ను నేను నరుడిగా దశరథుడి కొడుకైన రాముడిగా గుర్తిస్తున్నాను. నేను ఎవరో, ఎవరికి సంబంధించిన వాడినో, ఎక్కడ నుంచి వచ్చానో దైవ స్వరూపులైన మీరు చెప్పండి నాకు అంటాడు రాముడు. నారాయణుడివి నువ్వే, ఆదివరాహం నువ్వే అని మొదలుపెట్టి విష్ణువు విశ్వరూపాన్ని వర్ణించి, రావణుడిని చంపటం కోసం నరుడిగా, లక్ష్మి సీతగా అవతరించారు అంటాడు బ్రహ్మ. చితి లోంచి స్వయంగా అగ్నిదేవుడే సీతను తీసుకుని వచ్చి సీత పాతివ్రత్యాన్ని మెచ్చుకుంటూ నా ఆజ్ఞ మేరకు సీతను మళ్ళీ స్వీకరించమని రాముడికి చెబుతాడు. సీతలో ఏ దోషమూ లేదని నాకు తెలుసు. తన తేజస్సే సీతను రక్షించగలదు అని తెలుసు. కానీ రావణుడి ఇంటిలో ఉన్న సీతను పరీక్షించకుండా స్వీకరిస్తే నన్ను లోకం కాముకుడు అని అనుకునేది. అన్ని లోకాలకీ సీత పాతివ్రత్యం తెలియటం కోసమే సీత అగ్నిలో ప్రవేశిస్తూంటే నేను

,

ఊరుకోవలసి వచ్చింది. అన్ని లోకాలలో ప్రసిద్ధి చెందిన మీరు నా హితవు కోరి చెప్పినది ఆచరిస్తాను అంటాడు రాముడు.

రావణుడిని చంపినందుకు రాముడిని అభినందించిన శివుడు, అయోధ్యకి వెళ్ళి పట్టాభిషేకం చేసుకుని రాజ్యపాలన చెయ్యి. భరతుడిని, తల్లులని, పౌరులని సంతోషపెట్టు. ఇక్ష్వాకువంశాన్ని ఉద్ధరించు. అశ్వమేధ యాగం కూడా చేసిన తరువాత నువ్వు దేవలోకానికి వస్తావు. విమానంలో ఉన్న నీ తండ్రి దశరథుడిని కలుసుకో అంటాడు. సీతారామలక్ష్మణులు దశరథుడి దగ్గరికి వెళ్ళి అభివాదం చేస్తారు. నువ్వు లేని స్వర్గం నాకు నచ్చుడం లేదు. నువ్వు అరణ్యానికి వెళ్ళటంవల్ల దేవతలకి చాలా మంచి జరిగింది. నీ తండ్రినై నేను తరించాను. నీ పట్టాభిషేకాన్ని చూడగలిగే కౌసల్య, పౌరులు అదృష్టవంతులు అంటాడు దశరథుడు. నిన్ను, నీ కొడుకునీ కూడా త్యజించాను అని కైకకి ఇచ్చిన శాపాన్ని వెనక్కి తీసుకోమని రాముడు కోరితే దశరథుడు అంగీకరిస్తాడు. సీతారాములకి సేవ చేయటం వల్ల నువ్వు గొప్ప కీర్తిని సంపాదించుకున్నావు. నాకు చాలా సంతోషం కలిగించావు. రాముడు పరబ్రహ్మ స్వరూపుడు. దేవతలందరి హృదయాలలో దాగిన నిజం అదే అంటాడు దశరథుడు లక్ష్మణుడితో. ప్రేమగా సీతను పలకరించి, రాముడు నిన్ను త్యజించాను అన్నాడని కోపించకు. నీ మంచికోరి, నీ పవిత్రత అందరికీ స్పష్టం చేయటం కోసమే రాముడు అలా చేసాడు. నువ్వు చేసిన పని ఇంకే స్త్రీ

,

చేయలేదు. వారందరి కంటే నీకే ఎక్కువ కీర్తి లభిస్తుంది. భర్తకి సేవ చేయటం గురించి నీకు చెప్పే అవసరం లేదు. కానీ నేను చెబుతున్నాను. రాముడే నీ దైవం అని సీతతో చెప్పి దశరథుడు స్వర్గానికి తిరిగి వెళ్ళిపోతాడు.

ఇంద్రుడు స్వర్గానికి తిరిగి వెళ్ళే ముందు రాముడిని ఏదైనా వరం కోరుకోమంటాడు. రావణుడితో యుద్ధంలో నాకోసం మరణించిన ఎలుగుబంట్లు వానరులు తిరిగి బతకాలి, వాళ్ళకి పుష్కలంగా పళ్ళు, తేనే, నీరూ దొరకాలి అని వరం అడుగుతాడు రాముడు. గతంలో నేను ఇటువంటి వరం ఎవరికీ ఇవ్వలేదు, కానీ నువ్వు అడిగావు కనుక ఇస్తాను అని అంటాడు ఇంద్రుడు. మరణించిన ఎలుగుబంట్లు, వానరులు తిరిగి బ్రతుకుతారు. దేవతలందరూ స్వర్గానికి వెళ్ళి పోతారు.

మర్నాడు ఉదయం తానుచేసే అతిథి సత్కారాలు స్వీకరించమని వేడుకున్న విభీషణుడితో నేను వెంటనే బయలుదేరి అయోధ్య చేరుకోవాలి. సుగ్రీవుడికి, ఇతర వీరులకి సత్కారాలు చెయ్యి. అదే నాకు సత్కారం. వనవాసం పూర్తవగానే వస్తానని భరతుడికి మాట ఇచ్చాను అంటాడు రాముడు. కుబేరుడిని యుద్ధంలో ఓడించి రావణుడు పుష్పక విమానాన్ని తెచ్చుకున్నాడు. ఆ విమానం ఎక్కి మీరు ఇవాళే అయోధ్య చేరుకోగలరు అని అంటాడు విభీషణుడు. రాముడు పుష్పకం ఎక్కి వానరులకి యుద్ధంలో

,

సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి తమ నివాసాలకి వెళ్ళటానికి అనుజ్ఞ ఇస్తాడు. వానరులు అందరికీ విభీషణుడు సత్కారాలు చేస్తాడు. వానరులు అయోధ్యకి వచ్చి పట్టాభిషేకం చూడటానికి అనుమతి ఇవ్వమని అడిగితే వారినీ విభీషణుడిని అతని మంత్రులని కూడా పుష్పక విమానంలో ఎక్కించుకుని అయోధ్యకు బయలుదేరుతాడు రాముడు.

దారిలో సీతకు యుద్ధరంగం, సేతువు, కిష్కింద మొదలైనవి చూపుతాడు. సీత కోరికపై తార, రుమ వంటి వానర స్త్రీలని కూడా వెంట తీసుకుని వేగంగా భరద్వాజుడి ఆశ్రమం చేరుకుంటాడు. వనవాసం మొదట ఇచ్చిన మాట ప్రకారం వచ్చిన రాముడితో నువ్వు నీ పరివారం నా అతిథి సత్కారాలు స్వీకరించి ఒక రాత్రి నా దగ్గర ఉండమంటాడు భరద్వాజుడు. రాముడు అంగీకరించి, తను శత్రువులని జయించి బలవంతులైన స్నేహితులతో కలిసి వస్తున్నట్టు గుహుడికి, భరతుడికి చెప్పమని హనుమంతుడిని పంపుతాడు. భరతుడి ప్రవర్తన, గుహుడు చెప్పిన విషయాల ఆధారంగా తానే రాజుగా ఉండాలని భరతుడికి ఏదైనా కోరిక ఉందా అని తెలుసుకుని, తామందరూ అయోధ్య చేరే లోపల కలుసుకోమని కూడా హనుమంతుడికి చెబుతాడు రాముడు. గుహుడికి వార్త అందజేసిన హనుమంతుడు నందిగ్రామంలో పాదుకలు పూజిస్తూ, తాపసిలా రాముడి కోసం ఎదురు చూస్తున్న భరతుడిని కలుసుకుంటాడు. భరతుడు వార్త విని, సంతోషించి

,

హనుమంతుడికి విలువైన బహుమానాలు ఇస్తానని చెప్పి రావణ వధ గురించి వివరాలు అడుగుతాడు. రాముడు చిత్రకూటం వదిలి వెళ్ళటం దగ్గర నుంచి భరద్వాజుని ఆశ్రమానికి పుష్పక విమానంలో రావటం వరకు జరిగినది అంతా హనుమంతుడు భరతుడికి చెబుతాడు. రాముడికి స్వాగతం చెప్పడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి, తల్లులతో, పౌరులతో రాముడికి ఎదురు వెళ్తాడు భరతుడు. రాముడికి, సీతకి నమస్కారించి, వానరులు, విభీషణుడు చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెబుతాడు. నువ్వు తిరిగి రావటంతో నా జన్మ సఫలం అయింది. నీ నగరాన్ని, నీ కోశాగారాన్ని, నీ సైన్యాన్ని నువ్వు పరీక్షించుకో. నీ తేజస్సు సహాయంతో అన్నిటినీ పదింతలు చేయగలిగాను అంటాడు భరతుడు రాముడితో. ఈ మాటలు వింటున్న వానరులకి, రాక్షస రాజు విభీషణుడికి కంట్లో నీళ్లు తిరుగుతాయి.

రాముడు తల్లులకి, గురువు వశిష్టుడికి నమస్కరించి కూర్చున్న తరువాత, నా తల్లిమీద గౌరవంతో నువ్వు నాకు ఇచ్చిన రాజ్యాన్ని నీకు తిరిగి ఇస్తున్నాను. ఈ రాజ్యభారం మొయ్యగల శక్తి నీకు మాత్రమే ఉంది. నీ పట్టాభిషేకం చూడాలని ఈ ప్రపంచంలో అందరూ ఆశిస్తున్నారు. ఈ భూమి ఉన్నంతకాలం, దాని చుట్టూ నక్షత్రాలు తిరుగుతూ ఉన్నంత కాలం, ఈ లోకాల మీద నీ ఆధిపత్యం చెలాయించు అని అంటాడు భరతుడు. రాముడు అంగీకరిస్తాడు. వానరవీరులు అయిదు వందల నదుల నుంచి,

,

నాలుగు సముద్రాల నుంచి తెచ్చిన నీటితో సీతారాములకి ఎంతో వైభవంగా పట్టాభిషేకం జరుగుతుంది. తనకి సహాయపడిన వానరులకి, విభీషణుడికి సత్కారాలు చేసి వారి వారి రాజ్యాలకి పంపుతాడు రాముడు. ఎల్లప్పుడూ నా తోడూనీడగా ఉన్న నిన్ను యువరాజు చేస్తాను అని రాముడు అంటే లక్ష్మణుడు ఒప్పుకోడు. భరతుడిని యువరాజుగా చేసుకుని రాముడు సోదరులతో కలిసి పదకొండు వేల సంవత్సరాలు రాజ్యం చేసాడు. రామరాజ్యంలో ప్రజలందరూ ధర్మం పాటిస్తూ సుఖ సంతోషాలతో ఉంటారు. రామాయణం చదివినా విన్నా ఈ జీవితంలోనూ పరలోకంలోనూ కూడా సుఖం లభిస్తుంది.

రాక్షసుల నుంచి లోకాలని, ఋషులని రక్షించి, రాజ్యాభిషేకం చేసుకున్న రాముడిని అభినందించటం కోసం నాలుగు దిక్కుల నుంచి మహర్షులందరూ అయోధ్యకు వస్తారు. రాముడు తగిన విధంగా వారిని సత్కరిస్తాడు. అగస్త్యుడు రావణుడిని, ఇతర రాక్షసులని చంపినందుకు, అంతకంటే ఎక్కువగా ఇంద్రజిత్తుని చంపినందుకు తమ సంతోషాన్ని ప్రకటిస్తాడు. రావణుడికంటే కుంభకర్ణుడికంటే ఇంద్రజిత్తు ఎందుకు గొప్పవాడు? అసలు రావణుడికి ఇంత శక్తి ఎలా వచ్చింది అని రాముడు ప్రశ్నిస్తాడు. అగస్త్యుడు రావణుడి వంశ చరిత్ర చెప్పటం మొదలు పెడతాడు. బ్రహ్మ మానస పుత్రుడైన పులస్త్య మహర్షి అతని కొడుకు విశ్రవసు గొప్ప తపస్సు చేసిన వాళ్ళు. విశ్రవసు పెద్ద కొడుకు వైశ్రవణుడు

,

దిక్పాలకుడిని అవ్వాలనే కోరికతో తపస్సు చేస్తే బ్రహ్మ ఆ వరంతో పాటు పుష్పక విమానం కూడా ఇస్తాడు. వైశ్రవణుడే ధనానికి అధిపతి అయిన కుబేరుడు. తను ఉండటానికి అనువైన చోటు చూపమని తండ్రిని అడుగుతాడు కుబేరుడు. లంకా నగరంలో ఉండు. ఇదివరకు అక్కడ రాక్షసులు ఉండేవారు. విష్ణువుతో యుద్ధంలో ఓడిపోయి వాళ్ళు ఇప్పుడు పాతాళంలో దాక్కున్నారు అంటాడు తండ్రి.

రాక్షసులు అందరూ పులస్త్యుడి సంతానం అని అనుకున్నాను నేను. మొదట లంకలో ఉన్న రాక్షసులు ఎవరని అడుగుతాడు రాముడు. బ్రహ్మ ముందు నీటిని సృష్టి చేశాడు. తరువాత కొన్ని జీవాలని సృష్టి చేసి మీరు నీటిని రక్షిస్తారా అని అడిగాడు. రక్షిస్తాము అని చెప్పిన జీవులకి రాక్షసులు అని, పూజిస్తాము అని చెప్పిన జీవులకి యక్షులని పేర్లు పెట్టాడు. మహా బలవంతులైన ఒక రాక్షసుడు హేతి. హేతి మునిమనమలు మాల్యవంతుడు, సుమాలి, మాలి. వాళ్ళు తపస్సు చేసి బలవంతులై, విశ్వకర్మని తమకోసం ఒక నగరం నిర్మించమని అడుగుతారు. ఇంద్రుడి ఆజ్ఞ ప్రకారం తాను నిర్మించిన లంకా నగరంలో ఉండమంటాడు విశ్వకర్మ. తాము విష్ణువుకంటే, శివుడికంటే బలవంతులమనే గర్వంతో వాళ్ళు ముగ్గురూ దేవతలతో యుద్ధం చేయటానికి వస్తారు. యుద్ధంలో విష్ణువు మాలిని చంపుతాడు. ఇతర రాక్షస వీరులు పారిపోయి పాతాళంలో దాక్కున్నారు. రావణుడు, అతని

,

కొడుకులు తప్ప నీతో యుద్ధంలో మరణించిన రాక్షస వీరులు, విభీషణుడి మంత్రులు కూడా, ఆ ముగ్గురి సంతానమే. కైకేయి రావణుడి తల్లి, సుమాలి కూతురు అని వివరిస్తాడు అగస్త్యుడు.

తన తండ్రిని కలిసేందుకు పుష్పక విమానం మీద వెళుతున్న కుబేరుడిని పాతాళం నుంచి భూమిమీదకి వచ్చిన సుమాలి చూసి అలాంటి అదృష్టం తమకి కూడా కలగాలని ఆలోచించి, తన కుమార్తె కైకసిని విశ్రవసువుని వరించమని పంపుతాడు. కైకసి విశ్రవసువు ఆశ్రమానికి వస్తుంది. ఏ కార్యం మీద వచ్చావు అని ఋషి అడిగితే నా మనసులో కోరిక మీరే తెలుసుకోండి అని అంటుంది. నీ కోరిక గ్రహించాను. కానీ నువ్వు అసుర సంధ్య వేళ వచ్చావు. అందువల్ల నీకు పుట్టే పిల్లలు క్రూరులు, దుష్టులు అవుతారు అంటాడు విశ్రవసువు. నాకది సంతోషం కలిగించదు అంటుంది కైకసి. అసుర సంధ్యాకాలం అయిపోయింది. కనుక నీ ఆఖరి కొడుకు ధర్మాత్ముడవుతాడు అంటాడు ఋషి. కైకసికి వరుసగా రావణుడు, కుంభకర్ణుడు, సుర్పణఖ, విభీషణుడు పుడతారు. కొంతకాలం తరువాత కైకసి రావణుడికి పుష్పక విమానం మీద వెళుతున్న కుబేరుడిని చూపించి నువ్వు కూడా అన్నకన్నా గొప్ప వాడివి కావాలి అంటుంది.

రావణుడు అంగీకరించి, తమ్ముళ్ళతో కలిసి తపస్సు చేయటం మొదలుపెడతాడు. బ్రహ్మ నీకు ఏం వరం కావాలని రావణుడిని

,

అడుగుతాడు. నాకు మృత్యువు ఉండకుండదు అని తన కోరిక చెబుతాడు రావణుడు. అది కుదరదు అని బ్రహ్మ అంటాడు. మానవులు గడ్డిపోచల వంటి వాళ్ళు. వాళ్ళ వల్ల నాకు ఎప్పుడూ ఏ భయమూ లేదు. కనుక మానవులు తప్ప ఇంకెవ్వరి చేతిలో నాకు మృత్యువు లేకుండా వరం ఇయ్యి అని రావణుడు అడిగితే బ్రహ్మ ఆ వరంతో పాటు కావాలి అనుకున్న రూపం కలుగుతుంది అని కూడా వరం ఇస్తాడు. ఎప్పుడూ ధర్మమే తప్ప అధర్మం చేయకుండా ఉండటం వరంగా కోరుకుంటాడు విభీషణుడు. నీలో రాక్షస గుణాలు లేవు. నీకు అమరత్వం కూడా ఇస్తున్నాను అంటాడు బ్రహ్మ. చివరికి వరం కోరుకోమని కుంభకర్ణుడిని అడగబోతున్న బ్రహ్మని దేవతలు ఆపి, ఏ వరం లేకుండానే వీడు కనపడిన వాళ్ళని కనపడినట్టు తినేస్తున్నాడు. ఇక వరం కూడా దొరికితే లోకాలు మిగలవు అంటారు. సరస్వతి కుంభకర్ణుడి నాలిక మీద నిలిచి నాకు నిద్ర కావాలి అని అడిగిస్తుంది. బ్రహ్మ వరం ఇచ్చి వెళ్ళిపోతాడు. తరువాత కుంభకర్ణుడు దుఃఖిస్తాడు.

సుమాలి రావణుడిని కలిసి, లంక నుంచి కుబేరుడిని వెళ్ళగొట్టి నువ్వు రాజువి అవటం న్యాయం. మొదట ఆ నగరం రాక్షసులది అంటాడు. ముందు రావణుడు తన అన్నని ఎదిరించడానికి సందేహిస్తాడు. కానీ దేవతలు దానవులు అన్నదమ్ములే అయినా యుద్ధాలు చేస్తూనే ఉన్నారు. వీరుడు ఎప్పుడూ తన శక్తి చూపాలి అని నచ్చచెబుతాడు ప్రహస్తుడు. నాకు లంకా రాజ్యం ఇచ్చెయ్యి

,

అంటూ కుబేరుడి దగ్గరికి ప్రహస్తుడిని దూతగా పంపుతాడు రావణుడు. నావి నీవి అనే భేదాలు ఎందుకు. కలిసి ఉందాం అని సమాధానం చెప్పి కుబేరుడు తండ్రి దగ్గరికి వెళ్ళి సలహా అడుగుతాడు. నా మాట కూడా రావణుడు వినిపించుకోలేదు. నువ్వు కైలాస పర్వతం దగ్గరకి వెళ్ళి కొత్త నగరం ఏర్పాటు చేసుకో అంటాడు తండ్రి. ఖాళీ అయిన లంకా నగరానికి రాజు అవుతాడు రావణుడు. సూర్పణఖకి వివాహం చేసిన రావణుడు మయుడి కూతురు మండోదరిని పెళ్ళి చేసుకుంటాడు. ఆమెకు ఇంద్రజిత్ అని గొప్ప బిరుదు సంపాదించుకున్న మేఘనాథుడు పుడతాడు. కుంభకర్ణుడికి విభీషణుడికి కూడా వివాహాలు జరిపిస్తాడు రావణుడు.

రాజ్యం సంపాదించుకున్న రావణుడు దేవతలని, యక్షులని, ఋషులని బాధించటం, నందనవనం నాశనం చేయటం వంటి తప్పుడు పనులు చేస్తున్నాడని విని కుబేరుడు రావణుడి దగ్గరికి దూతను పంపుతాడు. పౌలస్త్య వంశంలో పుట్టిన వాడికి ఇలా ప్రవర్తించటం తగదు. నీ ఆగడాలు భరించలేక, దేవతలు నిన్ను చంపే మార్గాలు వెతుకుతున్నారు. నీ ప్రవర్తన మార్చుకోవటం మంచిది అని కుబేరుడి మాటగా దూత చెబుతాడు. రావణుడు కోపించి, ఆ దూతని చంపి, కుబేరుడిని, ఇతర దిక్పాలకులని చంపేస్తాను అంటూ యుద్ధానికి బయలుదేరుతాడు. ముందు కుబేరుడిని ఓడించి అతని పుష్పక విమానాన్ని లాక్కుంటాడు.

,

పుష్పకం ఎక్కి వెళుతోంటే కైలాస పర్వతం దగ్గర పుష్పకం ఆగిపోతుంది. పార్వతి పరమేశ్వరులు ఏకాంతంలో ఉన్నారు. అందువల్ల నీ విమానం ఆగిపోయింది. వెనక్కి వెళ్ళు అని నంది పంపిన దూత చెబితే కోపంగా పుష్పకం దిగివచ్చి నందిని కోతి ముఖం అని వెక్కిరిస్తాడు. కోతులే నీ చావుకి కారణం అవుతాయి అని నంది శపిస్తాడు. నన్ను ఆపటానికి ఈ శివుడు ఎవడు, ఈ కైలాస పర్వతాన్ని నేను పెళ్ళగిస్తాను అంటూ ఆ పర్వతాన్ని కదుపుతాడు. శివుడు తన కాలి బొటనవేలుతో నొక్కితే పర్వతం కదలటం ఆగిపోవటమే కాక రావణుడి భుజాలు పర్వతం కింద ఇరుక్కు పోతాయి. వేయి సంవత్సరాలు ప్రార్థించిన తరువాత శివుడి దయ వల్ల రావణుడు విడుదల అవుతాడు. నువ్వు చాలా పెద్ద గొంతుతో అరిచావు. కనుక పుట్టినప్పుడు నీకు పెట్టిన దశగ్రీవుడనే పేరుతో కాక రావణుడు అనే పేరుతో ప్రసిద్ధుడివి అవుతావు అంటాడు శివుడు.

కైలాసం నుంచి బయలుదేరిన రావణుడికి దగ్గరలో తపస్సు చేసుకుంటున్న ఒక అత్యంత అందమైన స్త్రీ కనపడుతుంది. విష్ణువుకి భార్యని అవటం కోసం నేను తపస్సు చేస్తున్నాను అని అన్న ఆ వేదవతితో నేను విష్ణువు కంటే గొప్ప వాడిని, నన్ను పెళ్ళాడు అంటాడు, వేదవతి వినకపోతే జుట్టు పట్టుకుంటాడు రావణుడు. వేదవతి కోపించి, నిన్ను చంపటానికి అయోనిజగా పుడతాను అని చెప్పి తన తపశ్శక్తితో అగ్ని పుట్టించుకుని దగ్ధం

,

అవుతుంది. ఆ వేదవతే సీతగా అవతరించిందని రాముడికి చెబుతాడు అగస్త్యుడు.

ఆ తరువాత రావణుడు యజ్ఞం చేస్తున్న మరుత్తుడి దగ్గరికి వచ్చి నాతో యుద్ధం చెయ్యి. లేదంటే నాకు ఓడానని ఒప్పుకో అంటాడు. మరుత్తుడు యుద్ధానికి సిద్ధం అవుతాడు కానీ యజ్ఞం చేయిస్తున్న సంవర్తునుడు, యజ్ఞం ఆపి యుద్ధం చేయకూడదు అంటే ఆగిపోతాడు. రావణుడు అనేక ఇతర రాజులని కూడా యుద్ధానికి పిలుస్తాడు. రావణుడి బలపరాక్రమాలు బాగా తెలిసిన రాజులు తమ ఓటమి అంగీకరించి బ్రతికిపోతారు. కానీ ఇక్ష్వాకు వంశంలో పుట్టిన అనరణ్యుడు మాత్రం యుద్ధంలో మరణించే ముందు, నా వంశస్థుడు నిన్ను చంపుతాడు అని శపిస్తాడు.

నారదుడు రావణుడి దగ్గరికి వచ్చి, యముడికి భయపడే ఈ సాధారణ మానవులతో నువ్వు యుద్ధం చేయటం బాగాలేదు, యముడితోనే యుద్ధం చెయ్యి అని చెబుతాడు. రావణుడికి ఈ మాటనచ్చి యముడితో యుద్ధానికి వెళతాడు. రావణుడిని గెలిచే ఇంకో మార్గం కనపడక యముడు తన కాలదండం ప్రయోగించి రావణుడిని చంపటానికి సిద్ధపడతాడు. బ్రహ్మ అడ్డుకుంటాడు. రావణుడు కాలదండం వల్ల మరణిస్తే నేను వాడికి ఇచ్చిన వరం తప్పవుతుంది. మరణించకపోతే దానితో అందరూ మరణిస్తారు అని నీకు ఇచ్చిన మాట తప్పవుతుంది అంటాడు. యముడు

,

చేసేది లేక మాయమైపోతాడు. రావణుడు తన గెలుపు ప్రకటించి అందంగా కనపడిన దేవ, దానవ, మానవ స్త్రీలను బలవంతంగా వెంట తీసుకుని లంకకి తిరిగివస్తాడు.

తన కొడుకు మేఘనాథుడు అనేక యజ్ఞాలు చేసి అంతరిక్షంలో నడిచే రథం, దివ్యాయుధాలు, యుద్ధంలో అదృశ్యం అవటానికి మాయ, ఇతర అస్త్రాలు సంపాదించాడని తెలిసి మన శత్రువులైన దేవతలకి పూజలుచేసి వరాలు పొందటం మంచిపని కాదు అంటాడు. తరువాత స్వర్గం మీద దండయాత్ర చేయటానికి వెళ్తాడు. నలకూబరుడిని కలుసుకోవటానికి వెళ్తున్న రంభని బలాత్కారం చేస్తాడు. ఇక ముందు ఏ స్త్రీని బలవంతం చేసినా తల ఏడు చెక్కలవుతుందని నలకూబరుడు శపిస్తాడు.

రావణుడు యుద్ధం చేయటానికి రాగానే, ఇంద్రుడు విష్ణువుని సహాయం చేయమని అడుగుతాడు. రావణుడిని చంపి బ్రహ్మ వరాన్ని వమ్ము చేయకూడదని విష్ణువు కూడా అంతర్ధానం అయిపోతాడు. దేవతలతో యుద్ధంలో రావణుడు గెలవలేక పోతుంటే, మేఘనాథుడు అదృశ్యమై తన మాయతో ఇంద్రుడిని బంధించి లంకకి తీసుకుపోతాడు. అందుకే ఇంద్రజిత్తు అనే పేరు వచ్చింది. బ్రహ్మ స్వయంగా లంకానగరం వచ్చి ఇంద్రుడిని విడుదల చేయమని అడుగుతాడు. ఇంద్రజిత్తు తనకి మృత్యువు లేకుండా వరం ఇస్తే ఇంద్రుడిని వదులుతాను అంటాడు. అది

,

సాధ్యం కాదు అంటాడు బ్రహ్మ. అయితే నేను ముందు యజ్ఞం సక్రమంగా చేసి యుద్ధానికి వెళితే నాకు విజయం లభించాలి. కేవలం యజ్ఞం అసంపూర్ణం అయినప్పుడు నాకు మరణం సంభవం అని వరమియ్యి అని అడుగుతాడు ఇంద్రజిత్తు. బ్రహ్మ అడిగిన వరాన్ని ఇచ్చి ఇంద్రుడిని స్వర్గానికి తీసుకు వెళ్తాడు. అగస్త్యుడు చెప్పిన విషయాలు విని, రావణుడిని ఎదిరించగల రాజులు ఎవ్వరూ లేకపోయారా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తాడు రాముడు. కార్తవీర్యార్జునుడు రావణుడిని ఓడించి బంధించాడు. పులస్త్యుడు వచ్చి తన మనవడిని విడిచి పెట్టమని అడిగితే ఋషి మాట విని రావణుడిని వదిలిపెట్టి అగ్ని సాక్షిగా స్నేహం చేసుకున్నాడు. వాలితో యుద్ధం చేయటానికి కిష్కింధకు వెళితే సముద్రతీరంలో వాలి సంధ్యావందనం చేస్తున్నాడని చెబుతారు మంత్రులు. సముద్రతీరంలో వాలిని వెనకనుంచి పట్టుకోవాలని రావణుడు ప్రయత్నం చేస్తాడు. వాలి రావణుడిని తన చంకలో బంధించి పట్టుకుని, నాలుగు సముద్రాలలో సంధ్యావందనం పూర్తిచేసుకుని కిష్కింధకు తిరిగి వస్తాడు. వాలి బలాన్ని చూసి ఆశ్చర్యపోయిన రావణుడు కోరి వాలితో స్నేహం చేసుకున్నాడు అని చెబుతాడు అగస్త్యుడు.

హనుమంతుడికే వాలి, సుగ్రీవ, రావణుల కంటే ఎక్కువ బలం ఉంది అనిపిస్తుంది. హనుమంతుడి సహాయం లేకుండా నేను రావణుడిని చంపలేకపోయే వాడిని. కానీ అంత బలం ఉండి,

,

సుగ్రీవుడిని వాలి తరిమేస్తే ఏ సహాయం చెయ్యకుండా ఎందుకు ఊరుకున్నాడో నాకు అర్థం కావడం లేదు అంటాడు రాముడు. అప్పుడు అగస్త్యుడు పుట్టగానే అందరు దేవతల దగ్గిరా వరాలు పొందిన హనుమంతుడు అల్లరిపనులతో ఋషులని వేధిస్తోంటే భృగు అంగీరశ వంశజులైన మహర్షులు, ఎవరో ఒకరు గుర్తు చేసిన తరువాతే నీ శక్తి నీకు తెలుస్తుంది అని శపించారు. అందుకే సుగ్రీవుడికి తాను సహాయం చేయగలనని అనుకోలేదు అని అగస్త్యుడు చెబుతాడు. రావణుడి జీవితంలో జరిగిన మరి కొన్ని సంఘటనల వివరాలు చెప్పిన తరువాత అగస్త్యుడు ఇతర ఋషులు రాముడి దగ్గర సెలవు తీసుకుని తమ ఆశ్రమాలకి వెళ్ళిపోతారు. పట్టాభిషేకానికి వచ్చిన రాజులు కూడా రాముడు చేసిన సత్కారాలు స్వీకరించి తమ రాజ్యాలకు వెళ్ళిపోతారు. వానరులని, విభీషణుడిని కొంతకాలం తన దగ్గర ఉంచుకుని, పేరుపేరునా వారికి తన కృతజ్ఞతలు తెలిపి, సత్కారాలు చేసి వారిని సాగనంపుతాడు రాముడు.

సీతారాములు ఉద్యానవనంలో ఆనందిస్తూ ఉండగా రాముడికి సీత గర్భవతి అని తెలుస్తుంది. ఆ సమయంలో సీత మరొకసారి గంగా తీరంలోని ముని ఆశ్రమాలు చూడాలని ఉంది అంటే రాముడు అంగీకరిస్తాడు. అంతఃపురం వదిలి తన స్నేహితులని కలుసుకుందుకు వచ్చిన రాముడు భద్రుడితో నా గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో సందేహించకుండా చెప్పు అని

,

అడుగుతాడు. నువ్వు సముద్రం మీద సారథి నిర్మించటం గురించి, రావణుడిని చంపటం గురించి గొప్పగా చెప్పుకునే ప్రజలు, రావణుడు ఎత్తుకుపోయి తన ఇంట్లో అన్ని రోజులు ఉంచుకున్న సీతను నువ్వు తిరిగి భార్యగా స్వీకరించటాన్ని ప్రశ్నిస్తున్నారు. యథా రాజా తథా ప్రజా అని మేమందరం కూడా ఇతరుల ఇళ్ళలో కాలం గడిపిన భార్యలని తిరిగి స్వీకరించాలా అంటున్నారు అంటాడు భద్రుడు. ఇతర స్నేహితులు కూడా రాముడికి నమస్కరించి, భద్రుడు చెప్పినది నిజమే అంటారు.

తక్షణమే ఏకాంతంలో తన తమ్ముళ్ళకి ఈ సంగతి చెప్పి, సీతను గంగానది దాటించి వాల్మీకి ఆశ్రమం దగ్గర వదిలి రమ్మని లక్ష్మణుడికి ఆజ్ఞ ఇస్తాడు రాముడు. లక్ష్మణుడు సీతను గంగ దాటించి రాముడి ఆజ్ఞ తెలిపి దుఃఖిస్తూ వెనక్కి వస్తాడు. నదీ సమీపంలో ఒక స్త్రీ దుఃఖిస్తూ ఉందని ముని కుమారులు చెబితే, సీత అని గ్రహించిన వాల్మీకి వచ్చి

సీతను సముదాయించి, తన ఆశ్రమం పక్కన ఉన్న తపస్సు చేసుకునే స్త్రీల దగ్గర సీత ఉండటానికి ఏర్పాటు చేస్తాడు. లక్ష్మణుడు అయోధ్యకు తిరిగి వచ్చి దుఃఖిస్తున్న రాముడితో, ముందు ముందు ప్రజలలో రాముడు రాజకార్యాలని నిర్లక్ష్యం చేస్తున్నాడని ఒక కొత్త అపవాదు రాకుండా చూసుకో అని హెచ్చరిస్తాడు. లక్ష్మణుడు చెప్పిన మాట చాలా ముఖ్యమని అంగీకరిస్తూ, తన బాధ్యతలు మరిచిపోవటం వల్ల నృగ

,

మహారాజు ఊసరవెల్లిగా జీవించాడన్న కథ, ఇంకా కొన్ని పురాణ కథలు రాముడు లక్ష్మణుడికి చెబుతాడు.

మధువు గొప్ప శివ భక్తుడు, ధర్మాత్ముడు. శివుడు అతనికి తన త్రిశూలాన్ని ఇచ్చి, అది చేతిలో ఉన్నంతకాలం ఎవరూ నీతో యుద్ధం చేసి గెలవరని వరం ఇస్తాడు. మధువు కొడుకు లవణాసురుడు ఆ త్రిశూలం తనని రక్షిస్తుందనే ధైర్యంతో అందరినీ బాధిస్తున్నాడు, వాడి బారినుంచి తమని రక్షించమని కొందరు మునులు రాముడిని వేడుకుంటారు. లవణాసురుడిని చంపటానికి ఎవరు వెళతారు అని భరతుడిని, శత్రుఘ్నుడిని అడుగుతాడు రాముడు. వెంటనే భరతుడు నేను వెళతాను అంటాడు. భరతుడు పద్నాలుగు సంవత్సరాలు తాపసిలా ఉండి నీ బదులు రాజ్యం చేసాడు. మళ్ళీ కష్టం అనుభవించటం ఎందుకు. నన్ను పంపు అంటాడు శత్రుఘ్నుడు. రాముడు అంగీకరించి. ఇప్పటికిప్పుడు శత్రుఘ్నుడిని మధురకి రాజుగా అభిషేకించమని భరత లక్ష్మణులకి చెప్పి, నువ్వు అభ్యంతరం చెప్పకు అంటాడు శత్రుఘ్నుడితో. నేను పెద్దవాడు భరతుడి మాటకి ఎదురు చెప్పటం వల్ల ఈ శిక్ష పడింది. చిన్నవాడికి ముందర రాజ్యాభిషేకం వంశ సాంప్రదాయం కాదు. కానీ ఇప్పుడు ఏమైనా అంటే రాముడి మాటకి ఎదురు చెప్పటం అవుతుంది అనుకుని శత్రుఘ్నుడు బాధపడతాడు.

,

పొద్దున్నే లవణాసురుడు త్రిశూలం చేత లేకుండా వేటకి వెళ్తాడు. కనుక వాడికి మళ్ళీ కోటలో ప్రవేశించి త్రిశూలం చేపట్టే అవకాశం ఇవ్వకుండా చంపెయ్యాలి. సైన్యాన్ని విడిగా పంపించు. నువ్వు ఒక్కడివే లవణాసురిడికి అనుమానం కలగకుండా వెళ్ళి కార్యం సాధించు అని రాముడు శత్రుఘ్నుడికి చెబుతాడు. దారిలో శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమంలో ఆగుతాడు. ఆ రాత్రి ఆశ్రమంలో స్త్రీలు, సీతారాములని కీర్తించటం విని, సీత ఆశ్రమంలో క్షేమంగా ఉందని, కొడుకులు పుట్టారని తెలుసుకుని చాలా సంతోషిస్తాడు. లవణాసురుడిని చంపి శత్రుఘ్నుడు మధురాపురి నిర్మించుకుని రాజ్యం చేస్తూ ఉంటాడు.

ఒక బ్రాహ్మణుడు చిన్న వయసులోనే మరణించిన తన కొడుకు శరీరం రాముడి వద్దకు తీసుకు వచ్చి, ఈ అకాల మరణానికి కారణం రాజు దోషమే. నువ్వు నా కొడుకుని బ్రతికించకపోతే నేను ఇక్కడికిక్కడే ఆత్మహత్య చేసుకుంటాను అని పట్టుపడతాడు. రాముడు తన మంత్రులను, ఋషులను పిలిచి ఈ విషయం గురించి అడుగుతాడు. నాలుగు పాదాల మీద ధర్మం నడవటం, బ్రాహ్మణులు మాత్రమే తపస్సు చేయటం, కృతయుగం యొక్క లక్షణాలు. మూడు పాదాల మీద ధర్మం నడవటం, క్షత్రియులు బ్రాహ్మణులతో పాటు తపస్సు చేయటం త్రేతాయుగం లక్షణాలు. అలాగే ద్వాపర యుగంలో రెండు పాదాలు, కలియుగంలో ఒక పాదం మీద ధర్మం నడుస్తుంది. కలియుగంలో శూద్రులు కూడా

,

తపస్సు చేస్తారు. నీ రాజ్యంలో ఎవరో ఒక శూద్రుడు తపస్సు చేస్తున్నాడు. అది యుగధర్మాన్ని అతిక్రమించటం అవుతుంది. అకాలమరణానికి ఆ అధర్మమే కారణం అంటాడు నారదుడు. రాముడు పుష్పకవిమానంలో రాజ్యం అంతా వెదికి శంబూకుడనే శూద్రుడు తపస్సు చేస్తున్నాడని కనిపెట్టి వాడి శిరస్సు ఖండిస్తే దేవతలు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే. మరణించిన బాలుడిని బ్రతికించమని అడుగుతాడు రాముడు. ఆ బాలకుడు బ్రతికాడు. రాజు విధించిన శిక్ష అనుభవించిన శంబూకుడు కూడా స్వర్గానికి చేరుకున్నాడు అని చెప్పి దేవతలు తిరిగి స్వర్గానికి వెళ్ళిపోతారు.

రాముడు సమీపంలో ఉన్న అగస్త్యుడి ఆశ్రమానికి వెళ్ళి ఆయన ఆతిథ్యం స్వీకరించి ఆయన చెప్పిన పురాణ కథలు వింటూ ఒక రాత్రి గడుపుతాడు. అయోధ్యకి తిరిగి వచ్చి రాముడు భరతుడిని లక్ష్మణుడిని నేను రాజసూయ యాగం చేయటం గురించి మీ అభిప్రాయాలు చెప్పమని అడుగుతాడు. రాజసూయ యాగం చేస్తే పౌరుషం ఉన్న రాజులందరూ వ్యతిరేకిస్తారు. యుద్ధాలలో జనక్షయం జరుగుతుంది. మానవులందరూ ధర్మావతారుడైన తండ్రిగా భావిస్తున్నారు నిన్ను. కనుక నీవంటివాడు రాజసూయ యాగం చేయకూడదు అంటాడు భరతుడు. ఈ మాట నచ్చిన రాముడు వెంటనే నేను రాజసూయ యాగం చేయను అంటాడు. లక్ష్మణుడు అశ్వమేధ యాగం చెయ్యి. అది చాలా పవిత్రమైన యజ్ఞం. వృత్రాసురుణ్ణి చంపిన పాపం పోవటానికి ఇంద్రుడు ఆ

,

యజ్ఞం చేసాడు అంటాడు. రాముడు అంగీకరించి అశ్వమేధ యాగం చేసి పురుషత్వం తిరిగి పొందిన ఇల కథ చెబుతాడు. నైమిశారణ్యం చాలా పవిత్రమైన స్థలం. అందువల్ల నేను యజ్ఞం అక్కడ చేయాలని అని నిర్ణయించాను అంటాడు. వైభవంగా అశ్వమేధ యాగం చేస్తాడు. వాల్మీకి తన శిష్యులు లవకుశులతో కలిసి యజ్ఞభూమికి వస్తాడు. రాముడు వినేటట్టు రామాయణం గానం చేయమని వాళ్ళకి చెబుతాడు. రాముడు వాళ్ళు మునుల ఎదుట గానం చేస్తూంటే విని తన సభకి రప్పించి రామాయణం పాడమని చెబుతాడు. వాళ్ళు పాడుతోంటే సభికులకి వారిలో రాముడి పోలికలు స్పష్టంగా కనిపిస్తాయి.

లవకుశులకి రాముడు బహుమతిగా పద్దెనిమిది వేల బంగారు నాణాలు ఇస్తే మేము తాపసులం, మాకు బంగారం ఏందుకు అని నిరాకరిస్తారు. వారి ద్వారా ఈ కావ్యం వాల్మీకి రచించారని తెలుసుకుని రాముడు లవకుశులు తన కొడుకులని గ్రహిస్తాడు. సీత తన పవిత్రతను నిరూపించుకోవటం కోసమూ, నా కోసమూ కూడా, పరిషత్తులో శపథం చేయటానికి అంగీకరిస్తుందా అని వాల్మీకిని అడగమని దూతలని పంపుతాడు. స్త్రీకి పతి దేవుడు. తప్పకుండా ఆజ్ఞానుసారం రేపు ఉదయం శపథం చేస్తుందని సమాధానం పంపుతాడు వాల్మీకి. సీత శపథం చూడటం కోసం సమస్త దేవతలు, రాక్షసులు, వానరులు, ఋషులూ పౌరులూ సభకి వస్తారు. వాల్మీకి వెనుక, కాషాయ వస్త్రాలు ధరించి, తల

,

వంచుకుని, మనసులో రాముడిని స్మరిస్తూ సీత ప్రవేశిస్తుంది. ముందుగా వాల్మీకి లవకుశులు రాముడి పుత్రులు, సీత పరమ పతివ్రత అని నేను ఘోషిస్తున్నాను. ఇది నిజం కాకపోతే నా సకల తపస్సు నశించుగాక అంటాడు. రాముడు వాల్మీకి మహర్షికి చేతులు జోడించి, నాకు సీత మీద ఏ అనుమానం లేదు. కేవలం లోకాపవాదుకి భయపడి సీతను త్యజించాను. మీరు దయచేసి నన్ను క్షమించండి అంటాడు. సీత నేను పవిత్రురాలనైతే భూమి నాకు దారి ఇచ్చుగాక అంటుంది. భూమిని చీల్చుకుంటూ వచ్చి బంగారు సింహాసనం మీద కూర్చున్న భూదేవి సీతను తీసుకుని వెళ్ళి పోతుంది.

రాముడు దుఃఖం ఆపుకోలేక భూదేవిని బతిమాలుకోవటం బెదిరించటం చూసి బ్రహ్మ రాముడితో ఇక మీరు పై లోకంలో కలుసుకుంటారు అని అనునయించి, కుశలవులని జరగబోయే రామకథ కూడా చెప్పమని తన లోకానికి తిరిగి వెళ్ళిపోతాడు. లవకుశులు రాముడు సువర్ణ సీతని పక్కన పెట్టుకుని నూరు అశ్వమేధ యాగాలు చేయటం, పదకొండు వేల సంవత్సరాలు రాజ్యపాలన చేసిన తరువాత బ్రహ్మ పంపగా కాలపురుషుడు వచ్చి రాముడిని అవుతారం సమాప్తం చేసి, పై లోకాలకి రమ్మని చెప్పటం, రామలక్ష్మణభరతశత్రుఘ్నుల ఎనిమిది కొడుకులని ఎనిమిది రాజ్యాలకి రాజులుగా అభిషేకించి అయోధ్యావాసులని వెంట తీసుకుని రాముడు సరయూ నదిలో ప్రవేశించి అవతారం

,

సమాప్తి చేయటం వివరంగా చెబుతారు. రామరాజ్యంలో ప్రజలు ధర్మం పాటిస్తూ సుఖ సంతోషాలతో ఉంటారు. రామాయణం చదివినా విన్నా ఈ జీవితంలోనూ పరలోకంలోనూ కూడా సుఖం లభిస్తుందన్న ఫలశృతితో వాల్మీకి రామాయణం పూర్తవుతుంది.

,

వాల్మీకీయం : త్రివేణి

వాల్మీకి రామాయణం[1] నాకు త్రివేణి సంగమంగా కనపడుతుంది. గంగా యమునలు అంతర్వాహిని అయిన సరస్వతితో కలిసి త్రివేణి అయింది అన్నది మన విశ్వాసం. ధర్మవేణి, కథావేణి, అంతర్వాహిని అయిన లీలతో కలిసి వాల్మీకి రామాయణాన్ని త్రివేణి చేస్తున్నాయి. ఒక రాజకుమారుడు తండ్రి ఆజ్ఞ మేరకు అడవిలో ఉంటూ తన భార్యని అపహరించిన బలవంతుడైన శత్రువుని బలమైన స్నేహితుల సహాయంతో చంపి తిరిగివచ్చి రాజైనాడన్నది కథావేణి. తల్లి ఏదో ఒక విధంగా గొప్ప రాజ్యం సంపాదించి పెడితే తనకన్నా కేవలం ఒకే ఒక్క రోజు పెద్ద అయిన అన్నను తోసిపుచ్చి తాను రాజవటం ధర్మం కాదని రాజ్యం వద్దు అన్న భరతుడు, తండ్రే స్వయంగా నువ్వు నన్ను తొలగించి రాజ్యాభిషేకం చేసుకోమని అన్నా, ఆ తమ్ముడే రాజ్యం

---

[1] వాల్మీకీయం వ్యాసానికి ఆధారం సాంప్రదాయిక దాక్షిణాత్య రామాయణ ప్రతి. పుల్లెల శ్రీరామచంద్రుడుగారు బాలానన్దిని పేరుతో టీకా తాత్పర్యాలని జోడించి ప్రచురించారు. ఈ త్రివేణి వ్యాఖ్యకి కూడా వారి పుస్తకం లోని మూల శ్లోకాలే ఆధారం. నా ప్రణాళికకి అవసరం లేనికొన్ని ఉపాఖ్యానాలని వర్ణనలని, రెండు వ్యాసాలలో వదిలేశాను. వాల్మీకి రామాయణ ప్రతులలో ప్రక్షిప్తాలు వెతకటం, ఒక నరుడిని తరువాత తరాల వాళ్ళు దేవుడు చేసారు అనే హేతువాదంలో భాగం.

నీది అన్నా, అది అధర్మం కనుక పధ్నాలుగు సంవత్సరాలు అడవిలో గడిపిన రాముడు మనకి ధర్మ వేణిలో కనపడతారు. మరణించిన జటాయువుని ఉద్దేశించి రాముడు అన్న మాటలో అంతర్వాహిని అయిన లీల తొంగి చూస్తుంది.

బ్రహ్మ వరం[2] వల్ల నరులు తప్ప ఇంకెవరూ తనని చంపలేరు. నరులా బలహీనులు. కనుక నేను అమరుడినే అని అనుకున్న పౌలస్త్యుడిని, నరుడిగా జన్మించి, ధర్మాచరణతో శక్తిసంపాదించి వధించటమే రామకథలో పరాత్పరుని లీల. పౌలస్త్యుని వధ కథావేణికీ ధర్మవేణికీ కూడా గమ్యం. అందుకే వాల్మీకి నేను రాసిన గ్రంథాన్ని రామాయణం లేదా మహత్తరమైన సీతా చరితం లేదా పౌలస్త్య వధ అనవచ్చు అని ముందుగానే చెప్పారు. నిజానికి అన్ని ధర్మకథల్లో లీలా, ధర్మమూ కనపడుతూనే ఉంటాయి. కానీ లీల అంతర్వాహిని కాక ప్రస్ఫుటంగా కనపడుతూ వుంటుంది. రావణుడు తపస్సు చేసి బ్రహ్మ నుంచి సంపాదించుకున్న వరం మూలంగా రామావతారంలో లీల అంతర్వాహిని అవటం తప్పనిసరి అయ్యింది. కేవలం లీల అంతర్వాహిని అవటమే వాల్మీకి రామాయణం యొక్క విశిష్టత

[2] ఈ పుస్తకం చివర ఈ త్రివేణి వ్యాఖ్యలోని విశేషాలన్నీ వాల్మీకి రామాయణంలో ఉన్నాయని వ్యాఖ్యాధారాలు చూపాను.

కాదు. మన మిగతా గ్రంథాలు ధర్మాచరణ యొక్క విశిష్టతని గుర్తించినా ధర్మాచరణ వల్ల తపస్సు కంటే కూడా ఎక్కువ శక్తి లభిస్తుంది అనవు. ప్రపంచంలోని అన్ని మానవ సమాజాలలో దేవుడి గురించి ఆలోచనలు, కథలు వ్యాఖ్యానాలు కనపడుతూనే ఉంటాయి. కానీ మర్త్యులు, అంటే ఎప్పుడో ఒకప్పుడు మరణించే జీవులు, తమ సాధన ద్వారా అమరులని అనగా మరణంలేని దైవశక్తులని ఓడించి సాక్షాత్తు ఈశ్వరుడినే ఎదిరించగలరు అనటం మన ధర్మంలో మాత్రమే కనపడుతుంది. దేవతలకి, ఈశ్వరుడికి మధ్య ఉన్న ఈ తేడా కూడా ఇంక ఎక్కడా కనపడదు. అమరులు తమ అధికారాలని దుర్వినియోగం చేయటం, తమ తమ పదవులకి ముప్పు రాకుండా చూసుకోవటం కూడా మన ధర్మ కథల్లో తరుచు కనపడుతుంది. ఒకవైపు ఈ అమరులని అదుపులో పెడుతూ రెండవ వైపు సృష్టి నియమానుసారం నడపటం కోసం, అమరుల కంటే శక్తివంతులుగా తయారైన మర్త్యుల నుంచి అమరులని రక్షించటం ఈశ్వరుడి బాధ్యత.

అతి శక్తివంతులైన మర్త్యులు ధర్మమార్గాన్ని వదిలితే ఈశ్వరుడి సార్వభౌమత్వాన్ని ధిక్కరిస్తారు. ఇతర మర్త్యులు తమని మించిన శక్తులు సంపాదించుకుంటారన్న భయంతో వారిని బాధిస్తారు. సృష్టిని నియమానుసారం నడవనివ్వరు. ఈ లోకకంటకుల

నుంచి బలహీనులని రక్షించేవాడు కూడా ఈశ్వరుడే. విష్ణువు అవతారాలన్నీ రకరకాల పరిస్థితులలో ఈ బాధ్యతా నిర్వహణ వర్ణన. దీనినే సంక్షిప్తంగా లీల అంటున్నాము[3].

వాల్మీకి రామాయణంలో మాత్రమే మన ధర్మంలోని ముఖ్య అంశాలు అన్నీ కథా రూపంలో స్పష్టంగా కనపడుతాయి. ఇతర అవతారాలలో తన కర్తవ్యం దైవశక్తితో నిర్వహించే ఈశ్వరుడు, రావణ వధ మాత్రమే ధర్మాచరణ వల్ల లభించిన శక్తితో చేస్తాడు. ఈ విషయం స్పష్టం చేయటం వాల్మీకి రచనలోని ఇంకో విశిష్టత. మన సమస్త దైవ కథలనీ వెతికితే పతివ్రతలను మినహాయిస్తే ధర్మాచరణ వల్ల అసాధారణ కార్యాన్ని సాధించిన ఏకైక పాత్ర రాముడే. వాల్మీకి రామాయణం ఆధారంగా రామకథలు రాసిన ఇతరులు, రావణుడి వధకి, ఈశ్వరుడు ఇతర లోకకంటకులని చంపటానికి ఉన్న తేడా గుర్తించరు. దృష్టి భక్తి మీద, రచనా రమణీయత మీద కేంద్రీకరించి, ధర్మాచరణ యొక్క ఆవశ్యకత స్పష్టం చెయ్యరు. రాముడు నరుడైనప్పుడు ధర్మనిష్ఠ మాత్రమే రావణుడి తపఃశక్తిని మించగలదని ఒప్పుకోరు. ఈ రామకథలు

[3]మొదటి వ్యాసంలో చర్చించిన విషయాలు ఇక్కడ మళ్ళీ కనపడతాయి. మాటిమాటికీ అక్కడ చూడమని పాఠకులకు సూచించటం కంటే మళ్ళీ రాయటమే మేలు అనిపించింది.

రాసిన తరువాతి రచయతలు భక్తులే. కానీ ధర్మ ప్రాధాన్యతను గుర్తించినవారు కాదు. రావణుడి వరబలం రాముడు నరుడిగా జన్మించటంతో సరిపెడతారు. కొన్ని కొన్ని రామకథలలో ఈ మినహాయింపు కూడా లేదు. రాముడు కృష్ణావతారంలో లాగా నారాయణ స్వరూపంతో ఆవిర్భవిస్తాడు. అప్పుడప్పుడు తన ఈశ్వరత్వాన్ని, కృష్ణావతారంలో లాగా స్పష్టంగా చూపుతాడు. రావణుడి వరం గురించి ఈ రచయితలు అసలు పట్టించుకోరు.

ఇంతేకాక వాల్మీకి రామాయణం ఒక మహా వజ్రం. వజ్రం యొక్క విశిష్టత అణువుల మధ్య ఉన్న బంధాల వల్ల కలుగుతుంది అంటుంది ఆధునిక రసాయన శాస్త్రం. రామాయణంలో వివిధ సంఘటనల మధ్య ధార్మిక కథా లీలా బంధాలు చాలా తేలికగా కనపడతాయి. “అలినొకటొకటికి లంకెలు నీవే” అని పాడారు అన్నమాచార్యులు, వాల్మీకి రామాయణం చూసే కాబోలు. వీటిని ఎత్తి చూపటం మాత్రమే ఈ రచన యొక్క ఉద్దేశ్యం. ఈ లంకెలని గుర్తించటానికి విశేషమైన వేదాంత పాండిత్యం, సంస్కృత భాషా పరిజ్ఞానం కూడా అవసరంలేదు. ఒక చూపులోనే అవి చాలా స్పష్టంగా కనబడతాయి. వజ్రాన్ని చూసే దృక్పథం ఏమాత్రం మారినా కొత్త మెరుపులు కనపడటం సామాన్యం. దృక్పథాలు అనంతం. అందువల్ల రామాయణంలో ఉన్న అనంతమైన ఈ

ధార్మిక కథా లీలా బంధాలని పూర్తిగా ఎత్తి చూపటం అసంభవం. ఆలోచించిన కొద్దీ కొత్త విశేషాలు నాకు కనపడుతూనే ఉంటాయి[4]. అందువల్ల ఈ వ్యాఖ్య ఎప్పటికీ అసంపూర్ణమే. ముక్త పద్యాల సంపుటి లాగా ఈ వ్యాఖ్యలోని విడి భాగాలు ఏ విషయానికి ఆ విషయం స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటాయి. వాటి సహాయంతో మన ధర్మాన్ని వాల్మీకి రామాయణం ఎంతగా ప్రతిబింబిస్తుందో చూపించే ప్రయత్నం ఈ త్రివేణి వ్యాఖ్యానం.

వాల్మీకి

రామాయణంలోని మొదటి శ్లోకాలలో పదహారు గొప్ప గుణాలు పరిపూర్ణంగా ఉన్న మానవుడు ఎవరైనా ఉన్నాడా అని వాల్మీకి నారదుడిని అడుగుతాడు. దానికి జవాబుగా నారదుడు రాముడు ఉన్నాడని చెప్పి రామకథ సంక్షిప్తంగా చెబుతాడు. రావణుడు అత్యంత తపశ్శక్తి సంపన్నుడై, దేవతలను జయించి, నరులని తృణప్రాయంగా భావించి, వారివల్ల తప్ప ఇంకెవరివల్లా మరణం లేదనే వరం సంపాదించుకున్నాడని వాల్మీకి మహర్షికి తెలుసు. ఎలా తెలుసు? రావణుడు ముల్లోకాలను చాలాకాలంగా తల్లడిల్లి

[4] ఈ వ్యాఖ్యని నేను నవీకరిస్తూనే ఉంటాను

చేసిన వాడు కనుక తెలుసు. అందువల్ల రాముడు రావణుడిని చంపాడు అనగానే, ఒక నరుడు అంత శక్తి ఉన్న రావణుడిని ఎలా చంపగలిగాడు అనే ప్రశ్న వాల్మీకి మహర్షికి కలగటం సహజం. రావణుడి గురించి చాలా వివరాలు పాఠకులకి ఉత్తర కాండ చదివితేనే తెలుస్తాయి.

రావణుడి వంటి లోకకంటకులను శివుడో, నారాయణుడో, దుర్గో చంపటం అన్ని పురాణ కథలలో ఉంటుంది. కానీ రావణుడు సంపాదించుకున్న తెలివైన వర ప్రభావం వల్ల దేవుళ్ళు ఎవరూ రావణుడిని చంపలేరు. నరుడైన రాముడు తపస్సు చేసి శక్తి సంపాదించుకున్నాడని నారదుడు చెప్పలేదు. తపస్సు చేసిన వారు మహర్షుల లాగా రాగ ద్వేషాలకు అతీతులు అవుతారు. మోక్షం సాధించాలి అనుకుటారు కానీ రావణుడిని చంపటానికి పూనుకోకపోవచ్చు. రాగ ద్వేషాలు ఉన్న మర్త్యులకి శక్తి కూడా ఉంటే మరో రావణుడి లాగా తయారు అవుతారు. ఇందువల్ల రాముడి శక్తి ధర్మము అని వాల్మీకికి స్పష్టంగా తెలిసిపోతోంది. ఈ విషయం “రామో విగ్రహవాన్ ధర్మః”, “ధర్మావతారః”, రాముడు రూపం ధరించిన ధర్మము, ధర్మము యొక్క అవతారము అని సూచనగా మాత్రమే చెబుతారు.

నారదుడు చెప్పిన సంక్షిప్త రామాయణం వినీవినగానే వాల్మీకి చెప్పిన శ్లోకం “మానిషాద ప్రతిష్టాం త్వం... అని మొదలౌతుంది. కామ పరవశమై ఉన్న పక్షి జంటలో ఒక దానిని చంపినందుకు నీకు అపకీర్తి శాశ్వతంగా కలుగు గాక అని దీని అర్థం. ఇదే రామాయణానికి మొదటి శ్లోకం, క్రౌంచ పక్షుల జంటలో ఒక దానిని చంపిన నిషాధుడికి వాల్మీకి ఇచ్చిన శాపం అంటుంది మన సాంప్రదాయం. నిషాధుడు చేసిన పని అధర్మం, పాపం అని వాల్మీకి కూడా అంటారు. కానీ ఆ పక్షి శోకానికి స్పందించి ఈ శ్లోకం ఎందుకు రచించాను అని తనని తాను ప్రశ్నించుకుంటారు వాల్మీకి. జంతువుని వేటగాడు ఏ సమయంలో అయినా, ఎలా అయినా చంపవచ్చు అని వాలి ప్రశ్నకి సమాధానంగా కిష్కింధ కాండంలో స్వయంగా రాముడే చెబుతాడు. మరి నిషాధుడు చేసినది అధర్మం ఎందుకు అయింది? వాల్మీకి, నిషాదుడికి శ్లోక రూపంలో శాపం ఎందుకు ఇచ్చారు? రాముడు ఆ మాట అనక పోయినా రామకథకి ఏ లోటూ రాదు. మరి అన్నాడని మహర్షి స్పష్టంగా ఎందుకు చెప్పినట్లు? పైన చెప్పిన లంకెలలో ఇది మొదటిది.

వాల్మీకి మాట ఒక శాపం కాక కేవలం ఆర్తితో దుఃఖం వ్యక్తం చేయటం అనుకుంటే? నిషాధుడు కేవలం తన ధర్మం తాను

పాటించాడు. దానివలన క్రౌంచ పక్షుల జంటలో ఒక పక్షికి శోకం కలిగింది. దీనిని చూసిన సామాన్యులకి, ఆ సంఘటన గురించి విన్నవారికి కూడా అయ్యో పాపం అనిపిస్తుంది. కానీ ఈ సామాన్య సంఘటన జితేంద్రుడైన వాల్మీకి మహర్షికి దుఃఖం ఎందుకు కలిగించింది? ఆ పక్షి దుఃఖం చూడగానే సామాన్య మానవుడిలా తన ధర్మం పాటించిన ఆ నిషాధుడిని జితేంద్రియుడైన వాల్మీకి మహర్షి ఎందుకు తిట్టారు? అప్పుడే రామకథ విని ఉండటం వల్ల. ధర్మం తప్పని రాముడు ఈ లోకంలో చాలా కాలం దుఃఖం అనుభవించాడు. “అడిగి సుఖమెవరు అనుభవించిరిరా ఆది దైవమా రామా” అని కీర్తించారు త్యాగరాజు. అసలు ఆ నిజ నరావతారం అనుభవించింది ఏమిటని?

ఏకపత్నీవ్రతుడైన రాముడు తాను ఈ భూమిని పరిపాలించిన పదివేల సంవత్సరాలు సీతా వియోగ దుఃఖం అనుభవించాడు. రాముడి దుఃఖం సీత లంకలో ఉన్న ఏడాదికీ, వాల్మీకి ఆశ్రమంలో ఉన్న పది సంవత్సరాలుకి పరిమితం కాలేదు. అదే మహర్షిని కదల్చిన ఆ రామకథ లోని ఆర్తి. ఆ ఆర్తి కారణంగానే వాల్మీకి నిషాధుడు పక్షిని చంపటం చూసి తిట్టారు. అంతేకాదు తాను పలికిన ఆ మానిషాధ శ్లోకం గురించి అంత ఆలోచించారు.

రెండు ధర్మాలలో ఒకటి ఎంచుకోవాలసి రావటం, అందువల్ల వ్యక్తి దుఃఖించటం, అదే అసలైన విషాదమని భావించటం, కేవలం మన సంస్కృతిలో మాత్రమే కనపడుతుంది. దీనివల్ల పాఠక, శ్రోతలకి కరుణరస అనుభూతి కలుగుతుంది. కేవలం రామాయణంలోనే కాదు మన ఇతర ధర్మ గ్రంథాలలో కూడా పెద్ద పెద్ద మలుపులు రెండు ధర్మాలు మధ్య ఇలాంటి ఘర్షణవల్ల కలుగుతాయి[5]. రాముడి దుఃఖం ఈవిధమైన ధర్మాల రాపిడిలో ఉద్భవించిన నిజమైన విషాదం. అది మహర్షిని కదిలించింది. అందుకే "మానిషాద... " శ్లోకం రామాయణానికి పునాది. వాల్మీకి సృష్టించినది కేవలం సమ విభాగాలతో పాడటానికి అనువైన అనుష్టుప్ ఛందస్సు కాదు. ఆ ఛందస్సు వేదాలలో ఉన్నదే. సంఘటనలని వర్ణించటంతో ఆగక భావ వర్ణనతో మనస్సుని ఆకర్షించేది శ్లోకం. ఇదీ వాల్మీకి ఆదికవి అవటానికి కారణం. భావవర్ణనకి వాల్మీకి నాంది పలకటం వల్లనే అనుసరించిన ఇతర కవులు మహా కావ్యాలు నిర్మించారు. వాల్మీకి దర్శించిన రాముడి చరిత్ర లోని ఆర్తి పరాశరభట్టరు తన గుణరత్నకోశంలో,

---

[5]పాశ్చాత్యుల ప్రభావంతో ఆధునిక భారతీయులు అన్ని దుఃఖాలనీ విషాదమంటున్నారు కానీ పాశ్చాత్య దృష్టిలో వ్యక్తికి అన్యాయమైన విఫలత్వం వల్ల దుఃఖం కలుగుతుంది. ప్రేక్షకులకి జాలి, తమకి కూడా ఇటువంటి అనుభవం కలుగుతుంది అనే భయం కలుగుతాయి. ధర్మ సంకటంలో పడ్డ మానవుడి మీద జాలి చూపే సాహసం ఎవరికీ ఉండదు.

మాలాంటి మనవుల కోసం సీతకు ఇన్ని కష్టాలా? వారికి ఈ కష్టాలు రావటానికి కేవలం వారి యొక్క కరుణా స్వభావమే కారణం. నేను ఆ కరుణా స్వభావాన్నే నిందిస్తున్నాను అనే భావ పరిపక్వతకి దారి చూపింది. విడి విడిగా సంఘటనల వల్ల కాక సమిష్టిగా వాల్మీకి రామాయణం వల్ల రామభక్తి కలుగుతుంది. వాల్మీకి రామాయణంలో లీల అంతర్వాహిని కనుకనే భక్తి మార్గానికి దారి సూటిగా ఉండదు.

ఒక ముఖ్యమైన విషయం గుర్తించాలి. “సర్వమేవ దుఃఖం వివేకినః”, వివేకం ఉన్న వాడు ఈ లోకమంతా దుఃఖమే అని తెలుసుకుంటాడు, అన్న సాంఖ్య జ్ఞాన మార్గాల లాగో, అలాంటి మార్గాన్నే ప్రబోధించిన బౌద్ధ జైన ధర్మాల లాగో సన్యాసాశ్రమానికి పెద్ద పీట వెయ్యదు రామకథ. భగవద్గీతలో “యోగః కర్మసు కౌశలం”, చేసే పనిలో పరిపూర్ణ నిపుణతే యోగం, అంటాడు కృష్ణ పరమాత్మ. ఆ కర్మయోగాన్ని అసలు యోగమనే మాట కూడా ఎత్తకుండా నిర్వచించినది వాల్మీకి రామాయణం. సన్యాసులు ఈ కథలో ముఖ్యం కాదు. భక్తులు కూడా లేరు. గుహుడు, శబరి, జటాయువు, విభీషణుడు, ఆఖరికి హనుమంతుడు కూడా ధర్మ నిష్ఠాపరులుగానే కనపడతారు. మన ధర్మం యొక్క మౌలిక

రూపాన్ని అర్థం చేసుకోవటానికి వాల్మీకి రామాయణం ముఖ్యం అనటానికి ఇది ఒక ఉదాహరణ.

వాల్మీకి కథా శిల్పం

మన సనాతన ధర్మాన్ని నిర్వచించటానికి ఇంత ఆవశ్యకమూ నిర్ణాయకమూ అయిన వాల్మీకి రామాయణం యొక్క కథా శిల్పం చాలా విలక్షణమైనది. ప్రాచీన తెలుగు సంస్కృత, కావ్యాలని పరిశీలించిన విద్వాంసులు రచయితలకి కావ్యం లోని విడి విడి పద్యాలు మీద తప్ప, సమిష్టిగా కావ్యం మీద శ్రద్ధ ఉన్నట్టు కనపడదు, అని అంటారు. రాత ప్రతులు తప్ప మరేమీ లేని పురాతన కాలంలో పుస్తకాలని చదవటం కంటే గురువు నోటి మాట వినటమే విద్య నేర్చుకోవడానికి ఉన్న మార్గం. పాట లాగా సాగే పద్యాలని నోటి మాటగా నేర్చుకోవడం తేలిక. అంతేకాక తప్పులు ఉంటే దిద్దుకోవటానికి ఛందస్సు యొక్క నియమాలు సహాయపడుతాయి[6]. కానీ కాలం గడిచిన కొద్దీ క్లిష్టమైన ఛందస్సులలో, తేలికగా అర్థంకాని విధంగా పద్యాలని రాసి సాటి విద్వాంసులని ఆశ్చర్యపరచి, వారి మెప్పు పొందటం సంస్కృత

[6] మౌఖిక సాహిత్యం కనుక వాల్మీకి రామాయణంలో ప్రక్షిప్తాలు ఉంటాయని ఊహించటం తేలిక. వాటిని గుర్తించామనటం వ్యక్తిగత అభిప్రాయం.

వాఙ్మయం లోనే కాక, తెలుగు సాహిత్యంలో కూడా, కవులకు గమ్యం అయింది. విడి విడి పద్యాలు మీద శ్రద్ధ పెట్టి, సమిష్టి కావ్యాన్ని నిర్లక్ష్యం చేయడానికి ఇదే కారణం. అందరికీ తెలిసిన కథలనే మళ్ళీ మళ్ళీ కావ్య వస్తువులుగా స్వీకరించటం కూడా కారణమే.

వాల్మీకి రామాయణం దీనికి పూర్తిగా వ్యతిరేకం. వాల్మీకి రాసినది సాధారణ మానవుల కోసం, విద్వాంసుల మెప్పు కోసమో లేక రాజాదరణ కోసమో కాదు. అందుకే అనేక సందర్భాల్లో అరణ్య, ఋతు, ఆయుధ, శకున వర్ణనలు, పెద్ద పెద్ద పేర్ల జాబితాలలా చేర్చబడ్డాయి. ఇవి ఆధునికులకి విసుగు కలిగిస్తాయి. కానీ వీటి ఉపయోగం కూడా గుర్తించవచ్చు. ప్రతి చిన్న పనికి శకునాలు చూసుకునే వారు శ్రోతలైనప్పుడు ముఖ్యమైన సంఘటనలకి మాటిమాటికీ శకునాలు చెప్పటం సహజం. దట్టమైన అడవి అని ఒక్క మాట చెప్పి మిగతా వివరాలు ఊహకి వదిలి వేయటం సామాన్యులకి రుచించదు కదా? అందుకే ప్రతిసారీ రకరకాల చెట్ల పేర్లు, పక్షుల పేర్లు, జంతువుల పేర్లు చెబుతారు మహర్షి.

వాల్మీకి రచనని విద్వాంసుల కోసం సృష్టించబడిన రచనతో పోల్చి చూస్తే ఈ తేడా చక్కగా తెలుస్తుంది. సుగ్రీవుడు కోట్ల కొద్దీ

వానరులని పోగుచేసి నాలుగు దిక్కులలో అన్ని చోట్లా సీత కోసం వెతికించాడు అని చెప్పాలి. వానరులు పడ్డ శ్రమ తెలియటం కోసం వాల్మీకి మూడు వందల పైచిలుకు శ్లోకాలు చెప్పారు. ముందర సుగ్రీవుడు నాలుగు దిశలలో వెతకవలసిన ప్రదేశాలని ఏకరువు పెడతాడు. తర్వాత వాలి తనని తరుముతూ ఉంటే వీటినన్నింటినీ తాను చూశానని రాముడికి చెబుతాడు. తర్వాత వానరుల ప్రయాణ సన్నాహాలు, మిగిలిన వాళ్ళు నిరాశతో వెనక్కి వచ్చారని చెప్పిన తరువాత దక్షిణ దిశగా హనుమంతుడితో బయలుదేరిన వానరులు వింధ్య పర్వతం దగ్గర పడిన కష్టాలు వర్ణించారు. దీనినే సుగ్రీవుడు ఆజ్ఞాపించగా వానరులు, సీత కోసం "లోకాలన్నీ ఆర్తిగా వెతుక్కున్న రాముడి ఆలోచనల లాగా"[7] వెతికారు అని ఒక్క శ్లోకంతో సరిపెట్టారు కవి కులగురువు కాళిదాసు. ఇది విద్వాంసులకి బాగుంటుంది. సామాన్యులు వినటానికి వాల్మీకి కావ్యం బాగుంటుంది. చాలా చోట్ల ముందర అధ్యాయం లోని విషయాలను మళ్ళీ చెప్పటం కనపడుతుంది. ఇదీ శ్రావ్య కావ్యం యొక్క లక్షణమే.

వాల్మీకి చెట్ల పేర్లు చెప్పారు కానీ ప్రకృతిని పరిశీలించలేదు అని స్పష్టంగా తెలుస్తుంది. ఒక్క ఉదాహరణ చాలు. రావణుడు

[7] రఘువంశంలో 12వ సర్గ 58వ శ్లోకం

మారీచుడిని కలవటానికి వస్తూ, సముద్రతీరంలో తాటి చెట్లతో పాటు సాల వృక్షాలు. సముద్రతీర సరోవరాలలో ఉప్పునీటిలో ఉండని కమలాలు, హంసలు చూస్తాడు. లంకానగరం కోట దగ్గర నుంచి రాజరిక వ్యవస్థ వరకు ఏ వర్ణనలోనూ కూడా వాస్తవికత కనపడదు. రూపాలు మారటం, మంత్ర తంత్రాలు ఆధునికులకి ఎలాగో అసహజంగానే ఉంటాయి. కానీ వీటిలో కొన్ని కథకి చాలా అవసరం. ఉదాహరణకి లంకలో ప్రవేశించటానికి పిల్లి అంత చిన్నగా ఉండే హనుమంతుడు, సముద్రం దాటటానికి, సీతకు ధైర్యం చెప్పటానికి పెద్ద కొండ లాగా అవటం కథకి ముఖ్యం. మారీచుడు, రావణుడు రూపాలు మార్చుకోలేకపోతే కథ లేదు.

మహర్షి చేసిన రెండు ముఖ్యమైన వర్ణనలు పుష్పక విమానం[8], హనుమంతుడు సముద్రాన్ని దాటటం. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే వాల్మీకి కథా శిల్పం చక్కగా అర్థమవుతుంది. అయోధ్య వంటి నగరాలలో ఉన్న పెద్ద భవనాల గోపురాలని విమానాలు అన్నారు మహర్షి. సామాన్య భవన విమానాలు కదలవు. పుష్పక విమానం వర్ణన ఇతర రాజభవనాల వర్ణన లాగే బంగారంతో, రత్నాల అలంకారాలతో నిండి ఉంటుంది. తేడా ఏమిటి? పుష్పకం అంటే ఒక రకమైన దేవాలయమనే అర్థం కూడా ఉంది. కథా వర్ణన

[8] ఇది యంత్ర వర్ణన కాదు కానీ అనేక వివాదాలకి దారి తీసింది.

ప్రకారం పుష్పక విమానం యజమాని మనసులో కోరిక ప్రకారం ఆకాశంలో ఎగురుతుంది. అది దైవశక్తి ఆధారంగా కదిలేది. అందుకే సర్పబంధంలో ఉన్న రామలక్ష్మణులు మరణించారు అనుకుని ఏడుస్తున్న సీతకి ధైర్యం చెబుతూ, నీ భర్త మరణించి ఉంటే నువ్వు ఈ పుష్పక విమానం ఎక్కలేక పోయేదానివి అని అంటుంది త్రిజట అనే రాక్షసి. అంటే పుష్పక విమానం గాలిలో ప్రయాణం చేయటం కూడా ఒక రకమైన అతీంద్రియ శక్తిగా అర్థం చేసుకోవాలి. పూర్వకాలంలో పర్వతాలకి రెక్కలు ఉండేవి, ఇంద్రుడు వాటిని తెగకొట్టాడు అని హనుమంతుడికి మైనాకుడు చెబుతాడని గుర్తించాలి.

దేవతలు, గంధర్వులు, సిద్ధులు, దివ్యలోకాలని చేరుకునే మానవులు విమానాలలో వెళతారనే వర్ణన వాల్మీకి అనేకచోట్ల చేసారు. దేవతలు కూడా చంపలేని రావణుడిని చంపి రాముడు అయోధ్య తిరిగి వెళ్ళటానికి తగిన వాహనం ఒక దివ్య విమానమే అవుతుంది. బహుశా ఇందుకే పుష్పక విమానం ప్రసక్తి తీసుకు వచ్చారు మహర్షి. రావణుడి వద్ద పుష్పక విమానమే కాక గాలిలో ఎగిరే రథాలు ఉండేవి. సీతాపహరణం చేయటానికి అటువంటి రథంలో వచ్చాడు. దానిని జటాయువు ధ్వంసం చేసినా సీతని పట్టుకుని ఆకాశంలో ఎగురుతూ లంక చేరుతాడు. ఇంద్రజిత్తు

రథం, అక్షయుడి రథం కూడా ఆకాశంలో వెళ్ళగలిగేవి అని వర్ణించారు మహర్షి. కానీ ఈ రథాలన్నీ మామూలుగా భూమిమీద నడిచే రథాల లాగే గుర్రాలు లేకపోతే గాడిదలో పూన్చినవి. వాటికి సారథులు కూడా ఉంటారు, దైవ సంబంధమైన అతీంద్రియ శక్తులని సామాన్యులు అర్థం చేసుకోవటానికి వీలుగా ఉండటం కోసం వారి అనుభవంలో ఉండే విషయాలకి అసాధారణమైన సామర్థ్యాలు చూపుతున్నారని గుర్తించాలి. కదలని పర్వతాలు భవనాల మీద ఉండే విమానాలు, గుర్రాలు ఈడుస్తున్న నేల మీద నడిచే రథాలు అందరూ చూసినవే.

హనుమంతుడు సముద్రం దాటటాన్ని వర్ణించటానికి వాల్మీకి "ప్లుతం" అనే సంస్కృత పదం వాడారు. ఈ మాటని సంస్కృత సాహిత్యంలో గెంతటం, ఈదటం, తేలటం, ఎగరటం వంటి అనేక అర్థాలతో వాడతారు. హనుమంతుడు తన శరీరాన్ని పెంచి కొండని కాళ్ళతో గట్టిగా నొక్కి గాలిలోకి ఎగిరాడు అని వర్ణించారు మహర్షి. ఇది స్పష్టంగా ఈతకొట్టడానికి నీటిలోకి దూకటాన్ని పోలి ఉంది. అలాగే హనుమంతుడి తొడల వేగానికి చెట్లు పువ్వులు కొంత దూరం అదే దిశలో కదిలి ఆ తరువాత సముద్రంలో పడిపోయాయి అని వర్ణించారు. గట్టుని తన్ని నీటిలో ఈదుతూ వెళితే నీటి పైన తేలే పువ్వులు ఆకులు ఇలాగే కొంచెం దూరం

తోడు వస్తాయి. లంక చేరేలోపల హనుమంతుడు మైనాకుడితో, మాట్లాడతాడు. తన శరీరం చిన్నది చేసుకుని సురమ నోటిలో ప్రవేశించి బయటికి వస్తాడు. సింహిణి ముఖంలో ప్రవేశించి దానిని చంపి బయటికి వస్తాడు. ఈ వర్ణనలని అన్నిటినీ కలిపి చూస్తే, హనుమంతుడు ఎగిరాడు, గెంతాడు అనటం కంటే గాలిలో ఈదాడు అనటం సరి అయిన వర్ణన అనిపిస్తుంది. ఇదీ అతీంద్రియ శక్తే అవుతుంది. నీటిలో మానవులు ఈదగలరు. మహా శక్తమంతులైన వానరులు మాత్రమే అంతంత దూరాలు గాలిలో ఈదగలరు. ఈ శక్తి కథావేణిలో చాలా ముఖ్యం. సీతని వెతుకటానికే కాక సంజీవని పర్వతం తేవటానికి, పట్టాభిషేకం కోసం నాలుగు దిక్కుల నించి సముద్ర జలం తేవటానికి ఈ శక్తి అవసరం అయింది.

పాఠకులలో, శ్రోతలలో భావాలు కలిగించటం కోసం మహర్షి అతిశయోక్తులని విరివిగా వాడారు. అవి కూడ తేలికగా అందరికీ అర్థం అయేటట్టు ఉంటాయి. ఇటువంటి కొన్ని వర్ణనలని మళ్ళీ మళ్ళీ వాడారు మహర్షి. ఉదాహరణకి యుద్ధంలో గాయపడ్డ వ్యక్తిని ఎర్రగా విరగపూసిన మోదుగ చెట్టులా ఉన్నాడనో, చాలా బాణాలు గుచ్చుకుని ముళ్ళపందిలాగా, లేకపోతే వెయ్యి కిరణాలు కనపడే సూర్యుడి లాగానో ఉన్నాడు అని చాలా చోట్ల

చెబుతారు. ఇవి అసహజంగా ఉండటం ముఖ్యం కానే కాదు. సామాన్యులు ఆ వర్ణన లోని భావం అర్థం చేసుకుంటే చాలు. మహర్షి సామాన్యుల కోసం రాసారు అని ఇంతకు ముందు కూడా చూసాము. విద్వాంసుల మెప్పు ఆ జితేంద్రియుడైన మహర్షికి అవసరంలేదు. అందుకే జటిలమైన ఉపమానాలు వాడరు.

అసహజ వర్ణనలకంటే పరస్పర విరుద్ధ కథనాలు పాఠకులు, శ్రోతలు కూడా తేలికగా గుర్తిస్తారు. వాల్మీకి రచనలో అవి తరచూ కనపడతాయి[9]. దండకారణ్యంలో విశ్వామిత్రుడు తన యజ్ఞం చేసాడు అని అంటాడు మారీచుడు రావణుడితో. ఆ యజ్ఞం చేసిన ప్రదేశం అయోధ్యకి కొద్ది రోజుల నడక అన్న బాలకాండ వర్ణనకి ఇది పూర్తిగా వ్యతిరేకం. వివాహానికి వచ్చిన మేనమామతో కేకయ రాజ్యానికి వెళ్ళమని భరత శత్రుఘ్నులని పంపుతాడు దశరథుడు. వాళ్ళు అయోధ్యలో ఉండి ఉంటే కైకేయి పన్నాగం ఫలించేది కాదు. పట్టాభిషేకం గురించి వార్త కేకయ రాజైన తన మామగారికి, ధర్మాత్ముడని పేరు పడ్డ సీత తండ్రి జనకుడికి తెలియకుండా జాగ్రత్త పడతాడు దశరథుడు. రాముడితో నీ తమ్ముడు వెనక్కి రాకుండానే నీకు పట్టాభిషేకం చేయాలని నిర్ణయించాను అంటాడు. ఈ వర్ణన ప్రకారం భరతుడు వెళ్ళిన

[9] అందుకే వీటి ఆధారంగా ప్రక్షిప్తాలు గుర్తించకూడదని నా అభిప్రాయం.

కొద్ది రోజుల తర్వాత ఈ పట్టాభిషేక ప్రయత్నం జరిగింది అని అనిపిస్తుంది. కానీ నేను పన్నెండు సంవత్సరాలు అయోధ్యలో అన్ని సుఖాలు అనుభవించాను అంటుంది సీత రావణుడితో. అంటే భరతుడు మేనమామతో అన్ని సంవత్సరాలు ఉన్నాడా? తన కాళ్ళమీద పడ్డ భరతుడితో నిన్ను గుర్తు పట్టలేక పోయాను అంటాడు రాముడు. అది పన్నెండు సంవత్సరాల తరువాత చూడటం వల్లా? జటలు, వల్కలు ధరించటం వల్లా? భరతుడు దుఃఖంతో చిక్కిపోవటం మూలంగానా? పరస్పర విరుద్ధ కథనం ఉందని మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది.

అలాగే విరాధుడు ముందు నన్ను శస్త్రాలు ఛేదించలేవు అని అంటాడు. మరుసటి అధ్యాయంలో రాముడు వాడి బాహువులు తెగ కొడతాడు. ముందు అధ్యాయంలో వాడు ఒక రాక్షసుడు. మరుసటి అధ్యాయంలో వాడు శాపగ్రస్తుడైన యక్షుడు. పరస్పర విరుద్ధ కథనాలకు పరాకాష్ట కబంధుడు. మొదట ఈ రూపంలో బెదిరిస్తే ముని శాశ్వతంగా ఆ రూపంలోనే ఉండమని శాపం ఇచ్చాడు అని చెప్పి ఆ తరువాత శ్లోకాలలో ఇంద్రుని ఎదిరిస్తే నా తలను శరీరం లోపలికి తోసేసాడు అని చెబుతాడు. సుగ్రీవుడు మొదటి సారి రాముడితో వాలిని గురించి వివరాలు చెబుతూ వాలి మాయావిని తరుముతూ గుహలోకి వెళ్లాడని చెబుతాడు.

వాలి నన్ను తరుముతోంటే నాలుగు దిక్కులలో ప్రపంచంలో ఉన్న ఈ ప్రదేశాలన్నీ చూసాను అని చెబుతూ వాలి దుందుభిని తరుముతూ గుహలోకి వెళ్ళాడంటాడు. తాను పుంజకస్థలను బలాత్కరిస్తే బ్రహ్మ శాపం ఇచ్చాడని రావణుడు ప్రహస్తుడికి యుద్ధ కాండలో చెబుతాడు. అదే అగస్త్యుడు రాముడికి రావణ చరిత్ర చెబుతూ రంభని బలాత్కరిస్తే నలకూబరుడు శాపం ఇచ్చాడని ఉత్తర కాండలో చెబుతాడు. ఇలాగే అహల్య కథ కూడా. బాలకాండలో విశ్వామిత్రుడు చెప్పిన కథలో వచ్చినవాడు గౌతముడి రూపంలో ఉన్న ఇంద్రుడు అని అహల్యకి తెలుసు. ఉత్తర కాండలో అగస్త్యుడు చెప్పిన కథలో అహల్యకి తెలియదు. విశ్వామిత్రుడు నాకు చెప్పిన కథతో తేడా ఎందుకు ఉంది అని రాముడు అగస్త్యుడిని అడగడు[10].

వాల్మీకి రచనలో ఇతరుల రచన ప్రక్షిప్తం అవటం వల్ల ఈ రకం తేడాలు వచ్చాయి అనుకున్నా, ఆ ప్రక్షిప్తాలు కలిపిన పూర్వీకులు కూడా వాస్తవికతనీ, వైరుధ్యాలనీ పట్టించుకోలేదు అని స్పష్టం అవుతోంది. మన పూర్వీకులకి గ్రంథాల, కథల గమ్యం ధర్మాన్ని నిర్వచించటం, ప్రజలు ధర్మమార్గంలో నడిచేటట్టు చూడటం

---

[10] ఇది మన సభ్యతలో వాస్తవికతని నిరాకరించటం మామూలే అని తెలుపుతుంది. అందుకే హిందువులు "చరిత్రకారులు" కాలేదు.

అని తెలుసు. వాల్మీకి రామాయణంలో సహజత్వం వెతకటం పరస్పర విరుద్ధ కథనాల ఆధారంగా ఎన్ని వందల సంవత్సరాల క్రితం ఏ రకమైన మార్పులు వచ్చాయో గుర్తించటం నాస్తికుల పని. నాస్తికులు కాని వారికి అనవసర శ్రమ[11].

వాల్మీకికి కథావేణి ధర్మాచరణతో లభించే శక్తిని, అంతర్వాహినిగా ఉన్న ఈశ్వరుడి లీలని, స్పష్టం చేసే ముఖ్య సాధనం. అందుకే "సహజత్వాన్ని" అసలు పట్టించుకోని మహర్షి, తను ముఖ్యమని అనుకున్న విషయాలు చెప్పేటప్పుడు చిన్న చిన్న మాటలని కూడా తూచి తూచి వాడుతారు. రాముడు వాలితో అన్న మాట ఎంత విలువైనదో పైన చూసాము. అలాగే ఒకసారి కనపడి మాయమయ్యే పాత్రలు, తరిచి చూస్తే ఎంతో ముఖ్యం అని తెలుస్తుంది. ఇవే పైన నేను చెప్పిన వజ్రంలోని మెరుపులు. హనుమంతుడు, రామలక్ష్మణులు, సీతా కూడా ధర్మాచరణ మీద శ్రద్ధ వహించిన సాధారణ మానవులే అని చూపటానికి వాల్మీకి చేర్చిన అనేక చిన్న మెరుపులని నేను గుర్తించాను. గుర్తించనివి ఉండనే ఉంటాయి. కనుకనే ఈ వ్యాసం అసంపూర్ణం అన్నాను.

[11]తాము ఎంచుకున్న పరస్పర విరుద్ధ కథనాలని మాత్రం ఎత్తి చూపి ఉత్తర కాండని, బాల కాండలో కొన్ని అధ్యాయాలని ప్రక్షిప్తాలంటారు ఆధునిక బుద్ధిజీవులు.

వాల్మీకి రామాయణానికి మొదట దైవ ప్రార్థన కానీ, ప్రస్తావన కానీ లేక పోవటం అతి విచిత్రమైన విషయం. తిన్నగా ఏ ఉపోద్ఘాతం లేకుండా వాల్మీకి మహర్షి నారదుడిని (ఈ విధంగా) అడిగారు అన్న శ్లోకంతో రామాయణంలో మొదటి అధ్యాయం సంక్షిప్త రామాయణం మొదలు అవుతుంది. ఈ అధ్యాయం ప్రక్షిప్తమని వాదించే మహానుభావులు చాలామందే ఉన్నారు. కానీ నారదుడు రామకథ చెప్పటమే వాల్మీకికి ప్రేరణ అని ఇంతకు ముందు చూసాము . అందువల్ల సంక్షిప్త రామాయణ అధ్యాయం ప్రక్షిప్తం కాదు, చాలా ముఖ్యమైనది అని గుర్తించవచ్చు.

వాల్మీకి రామాయణం ప్రతులలో మొదటి నాలుగు అధ్యాయాలు, జరుగుతున్నది జరుగుతున్నట్లు చేసిన వర్ణన. రాముని చరిత్ర కుశలవులు రాముడి ఎదుట గానం చేసిన కవిత. అయోధ్యలో కాక నైమిశారణ్యంలో రాముడు చేసిన అశ్వమేధ యాగం సమయంలో ఇది జరిగిందని ఉత్తర కాండ చదివితే కానీ తెలియదు. రాముడు వాళ్ళని తన కొడుకులని గుర్తించటం, వాల్మీకిని, సీతను సభకి పిలిపించటం, సీత శపథం చేసి భూమిలోకి వెళ్ళి పోవటం, దుఃఖిస్తున్న రాముడిని ఓదార్చడానికి బాలకాండలో లాగా బ్రహ్మ రావటం, కుశలవులని జరగబోయే

కథ చెప్పమనటం మాత్రం వర్తమాన వర్ణన. వాళ్ళు పాడిన ఆ భవిష్యత్కథ ఉత్తర కాండలోని చివరి కొద్ది అధ్యాయాలు.

తాటక

రాముడు చేసిన మొట్టమొదటి కార్యం తాటకని చంపటం. వాల్మీకి రామాయణంలో రాముడి జన్మనుంచి విశ్వామిత్రుడు దశరథుని సభకు రావటం వరకు జరిగిన కథ కేవలం ముప్పై శ్లోకాలలో వర్ణింపబడింది. విశ్వామిత్రుడితో కలిసి వెళుతున్న సమయంలో ఈ ఆశ్రమం ఎవరిదీ, ఇక్కడ నదిలో ఇంత ఎక్కువ చప్పుడు ఎందుకు వస్తోంది మొదలైన మాటల్ని మినహాయిస్తే రాముడు పలికిన మొట్టమొదటి గంభీరమైన మాట తాటక స్త్రీ, అయినా చంపు, అన్న విశ్వామిత్రుడి ఆదేశానికి సమాధానం.

స్త్రీని చంపటం అధర్మం అని అనేకసార్లు నొక్కి చెప్పారు మహర్షి. దశరథుడి అంత్యక్రియలు పూర్తి అయిన తరువాత ఎదురైన మంథరని శత్రుఘ్నుడు చంపేస్తానంటే, నువ్వు అలాంటి పని చేస్తే రాముడు నీతోనూ నాతోనూ కూడా మాట్లాడడు అంటాడు భరతుడు. ఇంద్రజిత్తు మరణించిన తర్వాత దుఃఖావేశంతో సీతను చంపటానికి బయలుదేరి, మంత్రి ఇది నీవంటి వాడు

చేయతగిన పని కాదు అంటే మానేస్తాడు రావణుడు. ఈ సీతను మింగేస్తాను అని మీదకి వచ్చిన సూర్పణఖని చంపకుండా ముక్కూ చెవులూ కోయటం, ఆ తర్వాత రామలక్ష్మణులు సీతని వెతికే సమయంలో లక్ష్మణుడిని మోహించి వేధించిన రాక్షసి అయోముఖికి కూడా అదే శిక్ష వేయటం స్త్రీని చంపరాదనే నియమం వల్లనే. లంఖిణి స్త్రీ కనుక చంపకుండా ఒక దెబ్బ కొట్టి వదిలేస్తాడు హనుమంతుడు. ఇంద్రజిత్తు మాయా సీత జుట్టుని పట్టుకుంటే, బ్రహ్మర్షి వంశంలో పుట్టి ఇలాంటి పాపిష్టి పని చేసావు. ఘోర నరకానికి పోతావని తిడతాడు హనుమంతుడు. తార కూడా రాముడితో నన్ను చంపితే నీకు స్త్రీ హత్యా దోషం అంటదు, నేనూ వాలీ ఒకటే, కాబట్టి నన్ను కూడా చంపేసి మమ్మల్ని కలుపు అని ఏడుస్తూ చెబుతుంది.

మరి అంత హేయమైన కార్యాన్ని రాముడు చేసిన మొట్టమొదటి కార్యంగా చూపటం ఎందుకు? పైగా శతృఘ్నుడు మంధరని చంపే ప్రయత్నం చేయటం, రావణుడు సీతని చంపుతానని బయలుదేరటం మొదలైన వివరాలు కథాపరంగా అనవసరం. వాటిని తొలిగించితే కథలో ఏమీ లోటు రాదు. వాల్మీకి తప్పితే ఇతరులు రాసిన రామకథలలో ఇవి అరుదుగా కనపడతాయి.

తాటకా వధలో ఇంకా కొన్ని విచిత్రాలు కనపడతాయి. మారీచ సుబాహులని చంపటానికి రాముడిని పంపమని దశరథుడిని అడిగాడు విశ్వామిత్రుడు. తాటక పేరు ఎత్తలేదు. ఎత్తనివాడు తాటకావనం వదిలి ఇంకోదారిలో రాముడిని తన ఆశ్రమానికి ఎందుకు తీసుకు వెళ్ళలేదు? అయోధ్యనుంచి బయలుదేరి, పక్కనే ఉన్న సరయూనది ఒడ్డున రాముడికి బల-అతిబల అనే మంత్రాలు ఉపదేశించాడు విశ్వామిత్రుడు. వెయ్యి ఏనుగుల బలం ఉన్న తాటకని చంపమని చెప్పే ముందు అస్త్రాలెందుకు ఉపదేశించలేదు? దశరథుడు రాముడు అస్త్ర విద్య నేర్చుకోలేదని ముందుగా చెప్పనే చెప్పాడు.

కథాపరంగా బల-అతిబల ఉపదేశించటం అవసరం. అప్పటి వరకు సుకుమారంగా రాజభవనంలో సుఖాలు అనుభవించిన రాముడిని ఆకులూ గడ్డిపరకలు పరిచి నది ఒడ్డున పడుక్కోమనే ముందు, ఆకలిదప్పులు, శారీరిక బాధలు తెలియకుండా ఆ మంత్రాలు ఉపదేశించాడు. మరి అస్త్రాలు ఉపదేశించకపోవటం ఏమిటి? కథాపరంగా అర్థంకాని ఈ విషయాలన్నీ రాముడు విశ్వామిత్రుడికి చెప్పిన మాట, ఆ తర్వాత వర్ణించిన విషయాలు ధర్మ పరంగా స్పష్టం చేస్తాయి.

నా తండ్రి నన్ను నీ కింకరుడిగా, నువ్వు ఏది చెయ్యమంటే అది చెయ్యమని పంపాడు. ఆయన మాట వినడం నా ధర్మం. అందువల్ల నీ ఆజ్ఞ మేరకు తాటకను చంపుతాను అంటాడు రాముడు. స్త్రీలని ఇదివరలో కొంతమంది మహనీయులు లోకకళ్యాణం కోసం చంపారు అని ఉదాహరణలు ఇచ్చాడు విశ్వామిత్రుడు. రాముడు వాటిని పట్టించుకోలేదు. తండ్రి మాట వినటం ధర్మం. మిగతా విషయాలు అనవసరం అని రాముడి ఉద్దేశ్యం. వేయి ఏనుగుల బలం ఉన్న తాటకని ఎదిరించే శక్తి నాకు ఉందా లేదా అనేది కూడా అప్రస్తుతం. ధర్మో రక్షతి రక్షితః. ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే నాకు శక్తి లేకపోతే నన్ను రక్షిస్తుంది. ధర్మం మీద ఈ విశ్వాసం రాముడికి ఉంది అని చూపటం కోసం విశ్వామిత్రుడు తాటకని చంపిన తరువాత కానీ అస్త్రాలు ఉపదేశించలేదు. అంతేకాదు, ఇంద్రుడు వచ్చి ధర్మాచరణకి ప్రతిఫలంగా అస్త్రాలు ఇవ్వమని విశ్వామిత్రుడికి చెప్పిన తర్వాత అవి ఉపదేశించబడ్డాయి. విశ్వామిత్రుడు తన దగ్గర ఉన్న అస్త్రాలు ఇష్టం వచ్చినట్టు ఇచ్చెయ్యలేదు. అతని దగ్గర అన్ని అస్త్రాలు ఉన్నాయని చెప్పిన వశిష్టుడు అవి దశరథుడికి ఇచ్చి మారీచ సుబాహులని చంపించమని అడగడు. అలా చేస్తానని దశరథుడు చెప్పడు. విశ్వామిత్రుడు సైతం అలా ఎవరికో ఒకరికి

అస్త్రాలు ఇవ్వొచ్చు కదా అని ఆలోచించడు. ఏతావాతా తాటకని చంపినది రాముడి బాహుబలం కాదు, ధర్మబలం.

మిగతా విషయాలు కూడా ఈ ధర్మ దృష్టిని ఉద్దీపింపచేస్తాయి. దశరథుడిచేత రాముడికి అస్త్ర విద్య తెలియదని చెప్పించడం అందుకే. శతృఘ్న రావణుల గురించి చెప్పటం కూడా అందుకే. ఒకటి అయోధ్య కాండలో. ఇంకొకటి యుద్ధ కాండలో. ఇవే నేను మనవి చేసుకున్న లంకెలు. ఎంతెంత దూరంలో ఉన్నాయో గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇంకో విషయం. విశ్వామిత్రుడు అస్త్రాలు ఉపదేశించగానే రాముడు వాటిని ఉపసంహరించటం నేర్పమని అడుగుతాడు. ధర్మం మీద శ్రద్ధ ఉన్నవాడు మాత్రమే ఇలా చేస్తాడు. దీనికి ప్రతిఫలంగా ఉపసంహరించటం నేర్పటమే కాక మరిన్ని అస్త్రాలు ప్రసాదించారు మహర్షి.

ఈ ఘట్టంలో రెండు రకాల అసహజ వర్ణనలు కనపడతాయి. విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు దశరథుడి రాజసభ నుంచి బయలుదేరి, ఆ రాత్రి సరయూ నది ఒడ్డున విశ్రమించారు. మరునాడు ఒకే ఒక్క రోజు కాలినడకతో అంగదేశం చేరారు. అక్కడే సరయూ గంగా సంగమం. సరయూ నది దాటగానే తాటకావనం. అయోధ్యకి మరీ అంత దగ్గరలో తాటక ఉంటే

రాముడికి తెలియకుండా ఎలా ఉంది? అలాగే రెండు మూడు రోజుల కాలి నడకలో ఆ ముగ్గురూ యాగం చేస్తున్న ఆశ్రమం, అక్కడ నుంచి విశాల నగరం, అక్కడి నుంచి మిథిలా నగరం చేరుకుంటారు. కానీ జనకుడు పంపిన దూతలకి వేగవంతమైన గుర్రాలు ఉన్నా మిథిల నుంచి అయోధ్య వెళ్ళటానికి మూడు రోజులు కావాల్సి వచ్చింది.

ఈ ఘట్టంలోని వర్ణనల ప్రకారం విశాల నగర రాజైన సుమతి, విశ్వామిత్రుడు, రాముడు, బ్రహ్మ మానస పుత్రుల వంశీయులు. ఎటొచ్చీ రాముడు ముప్పయ్యో తరంవాడు, సుమతి పదిహేనవ తరం, విశ్వామిత్రుడు నాలుగవ తరం. ఉత్తర కాండలో వర్ణన ప్రకారం రావణుడు కూడా బ్రహ్మ మానస పుత్రుడైన పులస్త్యుడి మనవడు. ఎలా సమకాలీకులు అయ్యారని అడగకూడదు[12].

పరస్పర విరుద్ధ కథనాలు ఇక్కడితో ఆగవు. ఉత్తర కాండలో నహుషుడు, యయాతి, యదువుని తండ్రి శపించటం వంటి కథలు ఉన్నాయి. అవి భారతంలో చంద్ర వంశ రాజుల కథలు. ఒకటి గుర్తించాలి. సూర్య చంద్ర వంశాలు రెండూ బ్రహ్మ మానస

---

[12] ఇటువంటి వంశావళుల ఆధారంతో చేసిన తమ “శోధన” హేతువాదం అంటారు ఆధునిక బుద్ధిజీవులు.

పుత్రుల వంశాలు. సూర్య వంశంలో ఇక్ష్వాకు బ్రహ్మకు నాలుగో తరం. రాముడు ముప్పై ఒకటవ తరం వాడు. చంద్ర వంశంలో యయాతి ఎనిమిదో తరం. పాండవులు నలభై నాలుగో తరం[13]. వశిష్ఠుడు కల్యాణం ముందు చదివిన వంశక్రమంలో కూడా నహుషుడు యయాతి అనే తండ్రి కొడుకు ఉన్నారు. కానీ ఈ యయాతి కొడుకు నాభాగుడు. దశరథుడి తాత. అంటే చంద్ర వంశ రాజైన నహుషుడికి చాలా తరాల తరువాత వాడు.

ఉత్తర కాండలో నిమి ఇక్ష్వాకు కొడుకు అనటం మాత్రం పెద్ద సమస్యే. అప్పుడు సీత కూడా సూర్య వంశంలో జన్మించిన జనకుడి కూతురు అవుతుంది. కల్యాణానికి వరస కుదరదు. మామూలుగా స్తోత్ర పాఠాలలో జనకుడు సోమవంశం వాడని చెబుతారు. నిమి గురించి వ్యాఖ్యాతలు కూడా గమనించిన సూచన లేదు. లేదంటే నహుషుడు యయాతి లాగే నిమి మిథి (జనకుడు) అనే పేర్లు ఉన్న రాజులు సూర్య చంద్ర వంశాలు రెంటిలోనూ ఉన్నారు అని సమర్థించుకోవాలి. కానీ మిథి పేరుమీద నగరం మిథిల అయిందని చివరకు చెప్పటంవలన

[13] రాముడు బ్రహ్మ మానసపుత్రుడైన కశ్యపుడికి ఎన్నో తరం వాడో వివాహం ముందు వశిష్ఠుడు చెప్పిన వంశావళిలో లెక్క పెట్టవచ్చు. పాండవుల గురించి వివరాలు మాత్రం మహాభారతంలోంచి తీసుకోవాలి.

ఇదీ కష్టమే. బాలకాండలో జనకుడు వివాహం ముందర తన వంశావళిలో స్పష్టంగా మిథి నిమి కొడుకే అంటాడు. లేదంటే నిమి శరీరం కోల్పోయి కంటి కదలికలో మిగిలి ఉన్నాడు. శరీరాన్ని మధించగా మిథి పుట్టాడు. నిమి శరీరం కేవలం పంచ భూతాల కలయిక. ఇక్ష్వాకు వంశంతో సంబంధం లేదు అంటూ దీనిని పరస్పర విరుద్ధ కథనాలలో చేర్చుకోవాలి[14].

లక్ష్మణుడు

రామాయణంలో ఆది నుండి అంతం వరకు రాముడిని నీడ లాగా అనుసరించిన వాడు లక్ష్మణుడు. తాటక వధ ముందు రాముడి గంభీరమైన మాటల లాగే లక్ష్మణుడి మొట్టమొదటి మాటలు రామాయణాన్ని అర్థం చేసుకోవటానికి చాలా ముఖ్యం. కైకేయికి దశరథుడు ఇచ్చిన వరాల వల్ల తాను దండకారణ్యంలో పద్నాలుగు సంవత్సరాలు ఉండాలని రాముడు కౌసల్యకి చెప్పిన తర్వాత, కౌసల్య దుఃఖాన్ని చూసి లక్ష్మణుడు ఆవేశంగా తండ్రినీ పినతల్లి కైకేయినీ తిట్టి బలవంతంగా రాజ్యాభిషేకం చేసుకోమని

[14] ఈ కథ అన్ని ప్రాంతాల ప్రతులలో లేదు అని కొన్ని విమర్శనాత్మక ప్రతులలో తొలగించారు. నేను సాంప్రదాయిక దాక్షిణాత్య ప్రతిని అనుసరిస్తున్నాను. కథలు వ్యాఖ్యానానికి అవసరం లేదు అని వదిలాను. కానీ నాకు అర్థం కాకపోతే యింకో ప్రతి ఆధారంగా వదలటం తప్పు. పరస్పర విరుద్ధ కథనాలు నా వ్యాఖ్యనానికి అడ్డు రావు. .

రాముడికి చెబుతాడు. అంతవరకూ రామలక్ష్మణులు ఇద్దరూ విశ్వామిత్రుడిని ఈవిధంగా ప్రశ్నించారు అని తప్ప లక్ష్మణుడు ఒక్కడూ ఒక్క మాట మాట్లాడినట్టు కూడా వాల్మీకి చెప్పలేదు.

కోపంగా అవసరమైతే తండ్రితో సహా రాముడిని ఎదిరించే వారిని అందరినీ నేను చంపేస్తానని అన్న లక్ష్మణుడు రాముడు అది ధర్మం కాదు అనగానే లొంగిపోయాడు. ఆవేశమూ ధర్మ నిష్ఠా రెండూ లక్ష్మణుడి స్వభావమే. మళ్ళీ చిత్రకూటంలో భరతుడి సైన్యాన్ని చూసి భరతుడిని కైకేయిని కూడా చంపేస్తాను అంటే రాముడు ఆపుతాడు. ఇక్కడ కోపంలో స్త్రీని చంపరాదనే విషయం కూడా లక్ష్మణుడు మర్చిపోయాడు. పౌలస్త్య వధకి రాముడి ధర్మ నిష్ఠ ఎంత ముఖ్యమో లక్ష్మణుడు కోపధారి అవటం కూడా అంతే ముఖ్యం. కోపధారీ ఆవేశపరుడు కాకపోతే సీత అన్న మాటలకి కోపగించుకుని సీతను ఒంటరిగా వదిలి వెళ్ళేవాడే కాదు. ఒక స్త్రీ మాటలకి కోపం తెచ్చుకుని నా ఆజ్ఞ ఉల్లంఘించటంలో నువ్వు తప్పు చేసావు అని రాముడు స్పష్టంగా చెబుతాడు.

ఈవిధంగా కథావేణికి అత్యవసరమైన లక్ష్మణుడి ప్రవృత్తిని కూడా వాల్మీకి రాముడి విజయం ఒక్క ధర్మం మీదే ఆధారపడిందని నిరూపించటానికి కూడా ఉపయోగించారు. మొదట రావణుడితో

యుద్ధం చేసింది లక్ష్మణుడు. రావణుడు ప్రయోగించిన శక్తితో గాయపడి "నేను విష్ణువునే” అని భావించి తెప్పరిల్లుతాడు. రెండవసారి రావణుడితో యుద్ధం చేసి మళ్ళీ శక్తి ప్రయోగం వల్ల లక్ష్మణుడు గాయపడతాడు. హనుమంతుడు లక్ష్మణుడి కోసం సంజీవనీ పర్వతం తెస్తాడు.

విష్ణువు అమరుడు. కానీ రావణుడికి బ్రహ్మ ఇచ్చిన వరం వలన అమరులు రావణుడిని చంపలేరు. లక్ష్మణుడు నేను విష్ణువుని అనుకోవటం నాకు ఉన్న ధర్మ బలం రావణుడిని చంపటానికి చాలదు అని ఒప్పుకోవడమే. ఉత్తర కాండలో యముడు తన కాలదండంతో రావణుడిని చంపుతానంటే బ్రహ్మ ఆపుతాడు. దండం పనిచేస్తే నేను రావణుడికి ఇచ్చిన వరం తప్పవుతుంది. చంపలేక పోతే నేను సృష్టించి నీకు ఇచ్చిన కాలదండం తప్పు అవుతుంది అంటాడు. యముడు ఇంక యుద్ధం చేయకుండా అంతర్ధానమైపోతాడు. విష్ణువు కూడా ఇంద్రుడికి చెబుతాడు. నీకు సహాయం చేసి రావణుడిని చంపి బ్రహ్మ వరం వమ్ము చేయకూడదు అని. రామావతారంలో ధర్మ బలంతో జయం సాధించాడు విష్ణువు. రామునికి ఉన్న ధర్మబలం లక్ష్మణునికి లేదనటం ఈ విషయాన్ని నొక్కి చెబుతుంది. దీనికి కారణం లక్ష్మణుడు తండ్రిని, తల్లి కైకేయిని, అన్న భరతుడిని, ధిక్కరిస్తూ

అన్న మాటలు. వాల్మీకి ఈ ధర్మబంధం ఇంతటితో ఆపలేదు. రావణుడిని కుంభకర్ణుడిని రాముడే చంపాడు. కానీ ఇంద్రజిత్తు వీరిద్దరి కంటే కూడా బలవంతుడు అని మహర్షులు ఉత్తర కాండంలో రాముడికి చెబుతారు. ఇంద్రజిత్తుని చంపింది మాత్రం లక్ష్మణుడు. కానీ అస్త్రాలతో కాదు. రాముడు ధర్మాత్ముడైతే ఈ బాణం ఇంద్రజిత్తు శిరస్సు ఖండించుగాక అని బాణప్రయోగం చేస్తాడు. మళ్ళీ వాల్మీకి రాముడి అసలు బలం ధర్మము అన్న విషయం గుర్తు చేస్తున్నారు. రాముడిని నేను చంపుతానంటే నేను చంపుతాను అని రాక్షస వీరులు రావణుడి ఎదుట బీరాలు పలుకుతూ ఉంటే విభీషణుడు మీరెవ్వరూ రాముడి బలం ధర్మమని గుర్తించటం లేదు అని స్పష్టంగా చెబుతాడు.

లక్ష్మణుడు మొదటి సారి తమ తండ్రిని నిందించినప్పుడు కొంచెం అనునయంగా మాట్లాడతాడు రాముడు. రెండవసారి చిత్రకూటం వస్తున్న భరతుడి సైన్యాన్ని చూసి లక్ష్మణుడు కోపంగా వాళ్ళందరినీ చంపేస్తానని మళ్ళీ అంటాడు. ఈసారి రాముడు కొంచెం గట్టిగా మందలిస్తాడు. నీకు రాజ్యం కావాలంటే చెప్పు. ఇవ్వమని భరతుడికి చెబుతాను. అతను నా మాట కాదనడు అంటాడు. మూడవసారి లక్ష్మణుడు పంచవటిలో భరతుడిని మెచ్చుకుని కైకేయిని నిందిస్తాడు. రాముడు ఇలా

పెద్దల్ని నా వద్ద నిందించవద్దు అని స్పష్టంగా చెబుతాడు. లక్ష్మణుడి స్వభావాన్ని నొక్కి చెప్పటమే కాక క్రమంగా రాముడి మందలింపు యొక్క తీవ్రత పెరగటం కూడా చూపించారు వాల్మీకి. సీతాపహరణం తర్వాత విశ్వామిత్రుడు ఇచ్చిన అస్త్ర బలం ఉన్న రాముడు సీతను ఇప్పటికిప్పుడు వెనక్కి ఇవ్వకపోతే సకలలోకాలనీ నాశనం చేస్తాను అంటాడు. అలా చేయటం ధర్మ విరుద్ధమని లక్ష్మణుడు చెప్పగానే వింటాడు. కథాపరంగా చూస్తే రామలక్ష్మణుల ఆవేశాలు మానవ సహజం. వెనక్కి తగ్గటం ధర్మ నిష్ఠ. లక్ష్మణుడు మూడు సార్లు ఆవేశపడటం రాముడితో ఉన్న తేడా చూపిస్తుంది. రాముడి విరహ వర్ణన ఆధునికులకి నవ్వు తెప్పిస్తుంది. బహుశా అందుకే రాముడు తన విరహ వేదన లక్ష్మణుడితో పెంచుకోవటం ఎంతవరకు న్యాయం అని ఎవరూ ప్రశ్నించినట్టు లేదు. అప్పటికే లక్ష్మణుడు దాదాపు పద్నాలుగు సంవత్సరాలు భార్యకి దూరంగానే ఉన్నాడు కదా? రాముడు లక్ష్మణుడితో తన విరహం పంచుకోవటం ఏమిటి అని అడిగితే సనాతన ధర్మం యొక్క నిజరూపం బయట పడుతుంది. తమ్ముడు సేవకుడు, అన్నకు సేవ చేయటం సేవా ధర్మం అనుకున్నప్పుడు అది న్యాయంమే. తండ్రి రాముడిని అడవికి పంపవచ్చు అంటాడు రాముడు. ఇంకొక తండ్రి సునస్సేపుడిని యజ్ఞపశువుగా అమ్మాడు.

కొన్ని రామకథలలో లక్ష్మణుడు ఆదిశేషువు అవతారమనీ భరత శత్రుఘ్నులు శంఖుచక్రాలనీ రాముడు ఒక్కడే సంపూర్ణంగా విష్ణువు యొక్క అవతారం అని ఉంటుంది. అందుచేత లక్ష్మణుడు నేను విష్ణువుని అనుకున్న విషయం వదిలేస్తారు. కానీ వాల్మీకి స్పష్టంగా బాలకాండలో దేవతలు విష్ణువుని తనని తాను నాలుగు భాగాలుగా చేసుకుని దశరథుడి పుత్రులుగా జన్మించమనే చెబుతారు. అంతేకాదు ఉత్తర కాండలో ముందు లక్ష్మణుడు తన అవతార పరిసమాప్తి చేస్తాడు. అక్కడ కూడా విష్ణువులో నాలుగవ భాగం తిరిగి దేవలోకం చేరుకుందనే చెబుతారు. విష్ణువు ఇలా నలుగురిగా జన్మించడానికి కారణం ఒకరికైనా ధర్మాచరణతో శక్తి సంపాదించి రావణుడిని చంపే అవకాశం లభిస్తుందని.

వాల్మీకి రామాయణంలో పాయసంలో సగం కౌసల్య, ఎనిమిదవ వంతు కైకేయి స్వీకరిస్తారు. మొదటిసారి పావువంతు ఇంకొకసారి ఎనిమిదవ వంతు సుమిత్ర స్వీకరించింది. కానీ కాళిదాసు రఘువంశంలో దశరథుడు పాయసం కౌసల్యాకి కైకేయికి సగం సగం ఇచ్చాడు. తమ సగ భాగాలలో ఆ ఇద్దరూ సుమిత్రకి సగం సగం ఇచ్చారు అని వర్ణించారు. ఇటు రామలక్ష్మణులు, అటు

భరతశత్రుఘ్నులూ జంటలు అవటానికి హేతువు సృష్టించారు కాళిదాసు. రామాయణంలో వారి కార్య ప్రాముఖ్యత చూసిన వారికి వాల్మీకి వర్ణనే సరి అయినది అనిపిస్తుంది. దశరథుడు పాయసం ధర్మం ప్రకారం మొదట కౌసల్యకి, చిన్న భార్య కాబట్టి చివరికి కైకేయికి ఇచ్చాడు. మొత్తం కైకేయికి ఇచ్చి ఉంటే రామాయణం లేదు.

మొత్తం వాల్మీకి రామాయణంలో అత్యంత సహజమైన ఘట్టం ఇంద్రజిత్తు మాయా సీతను వధించిన వార్త విని లక్ష్మణుడు చేసిన ధర్మనింద. ధర్మ మార్గంలో ఉన్న వారికి దుఃఖం తప్ప మరేమీ దొరకదంటూ వాపోవటం అత్యంత సహజం. రాముడి విరహదుఃఖం వర్ణన కేవలం ఒక అతిశయోక్తి. అక్కడక్కడ సీతా, రాముడు విలపిస్తూ విధిని దూషించటంలో సహజత్వం ఉంది. కానీ రాముడు దుఃఖించినా ధర్మాచరణ చేయకపోతే సుఖపడే వాళ్ళం కదా అనలేదు. ఆ హద్దు దాటుతాడు లక్ష్మణుడు. సమస్త లోకాలని నాశనం చేస్తానంటూ బెదిరించటంలో రాముడు ఒక్క క్షణం ధర్మ నిష్ఠ కోల్పోయినట్లే ఇంద్రజిత్తు మరణం తరువాత తనని చంపటానికి వస్తున్న రావణుడిని చూసిన సీత ఆ రోజున హనుమంతుడి వీపు మీద వెళ్ళి ఉంటే ఇలాంటి చావునుంచి

తప్పించుకునే దానిని కదా అంటూ క్షణికంగా ధర్మనిష్ఠ హద్దు దాటుతుంది.

దశరథుడు ధర్మాచరణ సంతోషంగా కాక దుఃఖిస్తూ చేశాడు. కొన్ని చోట్ల రాముడు కూడా అదే విధంగా ప్రవర్తించాడు. ఏతా వాతా రామాయణ దృష్టిలో ఆచరణేగానీ మానసిక స్థితి ముఖ్యం కాదు. ఇదే మొన్నమొన్నటి దాకా నడుస్తూ వచ్చిన మన సామాజిక ప్రవర్తనలో కనపడుతుంది. కారణం పూర్తిగా మరణాంతర సుఖ దుఃఖాల మీద దృష్టి ఉండటం. ధర్మాచరణ మరణాంతర సుఖం కోసమని రాముడు అనేక చోట్ల చెబుతాడు. ఇంతకు ముందు కూడా మనవి చేసినట్టు ధర్మాచరణ రాముడికి కేవలం దుఃఖమే కలిగించినా, అది వాల్మీకి దృష్టిలో, మన ప్రాచీన సంప్రదాయలో ముఖ్యం కాదు. ఇదే విధంగా రాముడు పరబ్రహ్మ స్వరూపమైనా ఆచరణ చేత నరుడు. మళ్ళీ వాల్మీకి దృష్టికోణం ఇతర రామాయణ రచయతల కంటే విభిన్నంగా ఉంటుంది. అవటానికి రెండూ లీలామానుష అవతారాలే అయినా కృష్ణుడు ఆచరణలో పూర్ణ పరబ్రహ్మ స్వరూపం. వాల్మీకి రామాయణంలో రాముడు కాదు.

రాముడికి తాను విష్ణువుని అనే స్పృహ ఉంది అనుకోవచ్చు. అవసరమైనప్పుడు లక్ష్మణుడు నేను విష్ణువుని అనుకున్నాడు కదా. కానీ వాల్మీకి దృష్టిలో అది మానవులు దుఃఖిస్తూ ధర్మాచరణ చేయటం లాగే ముఖ్యం కాదు. అందుకే నన్ను నేను మానవుడనే "భావిస్తున్నాను" అంటాడు రాముడు బ్రహ్మతో. వాల్మీకికి రాముడి మాటలు చేతలు మానవుడిని స్ఫురింపచేస్తే చాలు.

ధర్మాచరణ వల్ల లభించేది దుఃఖమే అన్న లక్ష్మణుడి మాటకి సహజమైన ప్రతిబింబం జాబాలి రాముడికి చేసిన నాస్తిక బోధ. ప్రత్యక్షంగా కనపడని పరలోకం గురించి అర్థం లేని ఆలోచనలు వదిలి ఈ లోకంలో సుఖపడు అంటాడు జాబాలి. జాబాలి ఒక నాస్తికుడు కాడు నువ్వు వెనక్కి అయోధ్య రావాలనే కోరికతో ఇలా వాదించాడు అంటాడు వశిష్టుడు. జాబాలి కూడా స్వయంగా నాకు ధర్మం ఏమిటో తెలుసు అంటాడు. అతను నిజంగానే నాస్తికుడా కాదా అన్న చర్చ అనవసరం. కానీ దానికి రాముడి ప్రతిస్పందన చాలా ముఖ్యం. అనేకమంది ఋషులు చెప్పిన మాటమీద విశ్వాసంతో నేను పరలోకం ఉందని, ధర్మాచరణ చెయ్యాలని నిర్ణయం తీసుకున్నాను అంటాడు రాముడు.

ఇది తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి బోధ. మహాభారతంలో యక్ష ప్రశ్నకి సమాధానంగా యుధిష్ఠిరుడు “మహాజనాః ఏన గతా స పంథా”, గొప్పవారి ఆచరణే ధర్మము అని ఇదే చెబుతాడు. ఒక్క ముఖ్య విషయం ఎవరూ ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. అనుసరించ తగిన మహాజనులు ఎవరు అన్నది. అది మాత్రం ఎవరికి వారే తేల్చుకోవాలి[15]. ఆ స్వతంత్రం వల్లనే మన ధర్మం సామాజిక పరిస్థితులకు అతీతమై ఈనాటికీ ఆచరణ యోగ్యం అయింది.

రాముడు అనని ఇంకొక మాట కూడా చాలా ముఖ్యం. రాముడు నా తండ్రి నీవంటి నాస్తికుడికి ఆశ్రయం ఇవ్వటాన్ని నేను నిందిస్తున్నాను అని మాత్రమే అన్నాడు కానీ ఈ జాబాలిని కట్టుబట్టలతో దేశం నుంచి బహిష్కరించమనో లేక శిరచ్ఛేదం చేయమనో భరతుడికి చెప్పలేదు. జాబిలి నిజంగానే నాస్తికుడు అవాలి అనుకుంటే అవనీ. ఆ నిర్ణయం తీసుకోవటం అతని ఇష్టం. పర్యవసానం అతనే అనుభవిస్తాడు. ఈ స్వాతంత్ర్యమే మనధర్మం యొక్క విశిష్టత.

---

[15] నా మొదటి వ్యాసంలో స్పష్టం చేసినట్టు సంపూర్ణంగా ఈశ్వరత్వాన్ని ప్రదర్శించినవారి ఆదేశాలు మాత్రమే ధర్మమా కాదా అని ప్రశ్నించక్కరలేదు. ఇతర విషయాలలో మహాజనుల ఆచరణని గమనించి, వారినే ఆదర్శంగా తీసుకుని మన నిర్ణయం తీసుకోవాలి

మారీచుడు, రావణుడి ప్రథమ దర్శనం

మారీచుడు లేకపోతే రామాయణమే లేదంటారు చాలామంది. రాముడు సుబాహువుని చంపి మారీచుడిని కేవలం దూరంగా తరమటంలో చాలామందికి రాముడి దైవత్వం కనపడుతుంది. మారీచుడు చాలా సంవత్సరాల తర్వాత మాయాలేడిగా రావాలి కాబట్టి రాముడు చంపలేదు అంటారు. ఇది లీలావేణిలో భాగం అనుకోవచ్చు. కానీ ఇదే సంఘటనని కథాపరంగా కూడా అర్థం చేసుకోవచ్చు.

యుద్ధం మొదలయ్యే ముందర మాయావి విద్యుజ్జిహ్వుడి చేత రాముడి తల, ధనుస్సు తయారు చేయించి సీతను మోసగిస్తాడు రావణుడు. అలాగే మాయా సీతను వధించి హనుమంతుడిని మోసగిస్తాడు ఇంద్రజిత్తు. కాబట్టి మారీచుడు లేకపోతే మాయ లేడి ఉండదు అనుకోవక్కరలేదు. అలా మోసం చేయగల ఇతర రాక్షసులు చాలామంది ఉన్నారు. వాల్మీకి దృష్టిలో మారీచుడు ముక్తి కోరుకోలేదు. తన ప్రాణాలు పోతున్న సమయంలో కూడా తన ప్రభువు కార్యం చేయటానికి ప్రయత్నం చేశాడు. మారీచుడు అరణ్యంలోని ప్రతి ఆకులో రాముడు నాకు కనపడుతున్నాడు

అన్నాడు. “ర” అనే అక్షరంతో మొదలయిన ఏ మాట విన్నా నాకు భయం కలుగుతోంది అన్నాడు. రావణుడికి భయపడి మాయలేడి రూపం ధరించినట్లు కనపడుతుంది. కానీ రాముడి బాణం తగిలి మరణిస్తూ లక్ష్మణుడు సీతను వదిలి రాకపోతే రావణుడు సీతాపహరణం చేయలేడు అని ఆలోచించి హా సీతా హా లక్ష్మణా అని రాముడి గొంతుతో అరుస్తాడు. అంటే శతృత్వం వల్ల సర్వత్రా రాముడు కనపడినా ఆ సర్వాత్ముడికి శరణాగతి చేయాలనే బుద్ధి రాలేదు. భాగవతంలో శతృత్వంతో కంసాదులు మోక్షం సాధించారని నారదుడు చెబుతాడు[16]. ఈ భావం వాల్మీకి ఎక్కడా చూపలేదు.

కథాపరంగా ఇంకొక విధంగా ఈ సంఘటనలని చూడవచ్చు. అకంపనుడు దండకారణ్యంలో ఖరుడు దూషణుడు మొదలైన పద్నాలుగు వేలమంది రాక్షసులని రాముడు చంపేశాడు అని చెప్పినప్పుడు పాఠకులకి రావణుడు మొదటిసారి కనపడతాడు. మొదట నేను వెళ్ళి ఆ రాముడిని చంపేస్తాను అన్న రావణుడు,

[16] గోప్యః కామాద్ భయాత్ కంసో ద్వేషాచ్చైద్యాదయో నృపాః । సంబంధాద్ వృష్ణయః స్నేహాద్ యూయం భక్త్యా వయం విభో ॥ భాగవతం 7,1,31. గోపికలు కామంతో, కంసుడు భయంతో, శిశుపాలుడు మొదలైన వారు ద్వేషంతో, బంధుత్వంతో యాదవులు, స్నేహం తో మీరు (పాండవులు), భక్తితో మేము (నారదుడు) మోక్షానికి దగ్గర అవుతున్నాము.

అకంపనుడు నువ్వు ఆ పని చెయ్యలేవు. నువ్వు వెళ్ళి సీతను దొంగిలించి తీసుకుని వస్తే రాముడు తనంతట తానే బెంగతో చచ్చిపోతాడు అన్న సలహా వింటాడు. వినటంలోనే రావణుడి మానసిక దౌర్బల్యం బయటపడుతోంది. నేను చేతకాని వాడినని అలాంటి సలహా ఇచ్చావు అని కోపించడు. మారీచుడు కూడా అకంపనుడి లాగే రాముడి చేతిలో దెబ్బ తిన్న వాడే కనుక మారీచుడి సలహా సహాయం అడగటానికి వెళ్తాడు. మారీచుడు కూడా రాముడిని నువ్వు జయించలేవు అంటే రావణుడు వెనక్కి మళ్ళుతాడు.

తర్వాత సూర్పణఖ సీత అందం వర్ణించి ప్రలోభ పెడితే మళ్ళీ మారీచుడి దగ్గరికి వస్తాడు. ఈ సందర్భంలో కొన్ని వర్ణనలు విచిత్రంగా ఉన్నాయి. ఎవడు నీ ముక్కు చెవులు కోసి నాతో శత్రుత్వం కోరుకున్న మూర్ఖుడు అని సూర్పణఖని చూడగానే ఖరుడు అడిగాడు కానీ రావణుడు అడగలేదు. నువ్వు చారులని నియమించి రాజ్యంలో జరుగుతున్నదేమిటో తెలుసుకోవటం లేదని రావణుడిని తిడుతుంది సూర్పణఖ. తిడుతూ తిడుతూ మధ్యలో రెండు శ్లోకాలలో రాముడు పద్నాలుగు వేల రాక్షసులని, నీ తమ్ముడు ఖరుడిని చంపాడు అని చెబుతుంది. రావణుడు తనవారిని చంపినందుకు కోపించక స్థిమితంగా రాముడి శక్తి,

ఆయుధాలు, ఇతర వివరాలు అడుగుతాడు. పైగా ఎందుకిలా తిడుతోందని ఆలోచిస్తాడు. రాముడు మన్మధుడితో సమానమైన అందగాడు అని మొదలుపెట్టి సూర్పణఖ రామలక్ష్మణుల శక్తి వర్ణించటంతో ఆగక సీతని వర్ణించి నీ కోసం తీసుకువద్దామని ప్రయత్నం చేస్తే లక్ష్మణుడు నా ముక్కు చెవులు కోసాడు అని అబద్ధం చెబుతుంది. అకంపనుడు చెప్పాడు కనుక రావణుడికి ముందే తెలుసు. అందుకే ఉత్తేజితుడు కాలేదని అనుకోవాలా, లేక అంత శక్తివంతుడైన నరుడితో పోట్లాట పెట్టుకో కూడదు అనుకున్నాడా? సూర్పణఖ మాత్రం రావణుడు ఇలా స్పందిస్తాడు అని ఊహించింది. అందుకే తన కక్ష తీర్చుకోవటానికి రావణుడి స్త్రీ లోలత్వాన్ని వాడుకుంది.

స్త్రీ లోలుడు కనుక ఈ సారి మారీచుడి వద్దంటే వినడు. మొదటి సారి మారీచుడు చెప్పిన కొద్ది మాటలు విని వెనక్కి వచ్చిన రావణుడు రెండవసారి మారీచుడు రాముడి చేతిలో తాను రెండుసార్లు దెబ్బ తిన్న విషయం, ఆ తరువాత ప్రతి చెట్టులో రాముడిని చూసి భయపడటం మొదలైన అనేక విషయాలు చెప్పినా వినడు. ఇది రావణుడి స్త్రీ లోలత్వాన్ని నొక్కి చెబుతుంది. ఏతావాతా తన వాళ్ళని చంపినందుకు ఇలా చేస్తున్నాను అని రావణుడు మారీచుడికి చెప్పినది అబద్ధం అని చూపిస్తున్నారు

మహర్షి. రావణుడు సోదరుడు ఖరుడిని చంపినందుకో, చెల్లెలు సుర్పణఖ ముక్కు చెవులు కోసినందుకో ప్రతీకారంగా సీతని అపహరించలేదు. తన స్త్రీ లోలత్వం వల్ల చేసాడు. అకంపనుడు సుర్పణఖ కంటే ముందు చెప్పాడనే వర్ణన అ విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఎటొచ్చీ సూర్పణఖ లంకకి వచ్చిన తరువాత చేసిన రావణుడి వర్ణనా, రావణుడి మారీచుడి ఆశ్రమానికి ప్రయాణం వర్ణనా మహర్షి విపులంగా చేసారు. అకంపనుడి వృత్తాంతంలో ఈ వర్ణనలు లేక కథ చకచకా కదిలిపోతుంది.

ఇక్కడ కథాపరంగా మారీచుడి ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది. అకంపనుడు ఒక్క ముహూర్త కాలం జరిగిన యుద్ధం నుంచి పారిపోయిన వాడు మాత్రమే. స్వయంగా విశ్వామిత్రుడి యజ్ఞాన్ని రాముడు రక్షించే సమయంలో దెబ్బ తిన్నవాడు మారీచుడు. ఆ తర్వాత కూడా రాముడిని ఎదిరించి ఓడిపోయి పారిపోయిన వాడు. అంత శక్తి ఉన్న రాముడితో నువ్వు వైరం పెట్టుకోవద్దు అని చెప్పటానికి తగినవాడు మారీచుడు. ఈ కథా పరమైన విశ్లేషణ మారీచుడిని యాగ సంరక్షణ సమయంలో చంపకపోవటమనే లీల అంతర్వాహిని అంటే ఏమిటో స్పష్టం చేస్తుంది. రాముడి మాటలు, చేతలు భక్తులకి అవతార లీలగా కనపడినా వాటిని ధర్మపరంగా లేదా కథాపరంగా కూడా అర్థం చేసుకోవచ్చు.

రాముడు అవతార పురుషుడా, కాదా అనే ప్రశ్నకి సమాధానం తర్కం ఇవ్వలేదు.

తాటకా సంహారంలో ప్రథమ దర్శనంలోనే ఏవిధంగా రాముడి ధర్మ నిరతి స్పష్టం అయిందో అలాగే రావణుడి ప్రథమ దర్శనం ఇతడు మహాశక్తిమంతుడయినా వీరుడు, ధైర్యవంతుడు కాదు కుటిలుడు అని స్పష్టం చేసింది. తరువాత ఇది బలపడుతూనే ఉంటుంది. మారీచుడిని మాయాలేడిగా పంపి సీతను మోసం చేయటం అందరికీ తెలుసు. విద్యుజ్జిహ్వుడి మాయ సహాయం తీసుకుని మోసం చెయ్యాలని చూడటం అందరికీ తెలియదు. సర్పాలతో బంధించబడిన రామలక్ష్మణులను సీతకు చూపి, ఏదో విధంగా, ఇప్పటికిప్పుడు లొంగదీసుకోవాలని ప్రయత్నం చేసిన రావణుడు ధీరుడా? యుద్ధం ముందు మూడుసార్లు వానరసేనని చూసి రమ్మని చారులని పంపిస్తాడు రావణుడు. వెనక్కి వచ్చిన చారులు వానరుల శక్తి సామర్థ్యాల గురించి గొప్పగా చెబుతారు. శుకసారణులు చెప్పినది విని శత్రువులని పొగుడుతున్నారని వాళ్ళని తిడతాడు. రావణుడికి కావాల్సింది వానరులని నువ్వు తేలికగా ఓడించగలవు అనే పొగడ్త. హనుమంతుడు అక్షయ కుమారుడిని, ఇతర రాక్షసుల వీరులని చంపి లంకాదహనం చేసాడన్నది మర్చిపోడానికి సాకు. రెండవసారి వానర వీరులు

గురించి గొప్పగా చెప్పిన శార్దూలుడిని ఇతర చారులని పొమ్మని, వెంటనే విద్యుజ్జిహ్వుడిని పిలిచి రాముడి శిరస్సుని తయారు చేయించి సీతను లొంగదీసుకుందామని ప్రయత్నిస్తాడు. ఇక్కడ రావణుడి మానసిక దౌర్బల్యమూ, స్త్రీ లోలత్వమూ అతి స్పష్టంగా కనపడుతాయి.

అలాగే హనుమంతుడు వచ్చి లంకకాల్చి వెళ్ళగానే రావణుడు కిష్కింధ మీదకు దండయాత్ర చేయలేదు. వానర సైన్యం వచ్చి లంకని ముట్టడించేదాకా ఆగాడు. సీతాపహరణం లాగే ఇది కూడా వీరుడు చేయవలసిన పని కాదు. రాముడూ సీతా కూడా అంటారు భర్త దగ్గర లేని సమయం చూసుకుని దొంగతనంగా భార్యని ఎత్తుకువచ్చి, “నేను వీరుడిని” అని చెప్పుకుంటున్నావా అని. అందరికంటే స్పష్టంగా మందోదరి రావణుడి మరణం తర్వాత చెబుతుంది. తాత్కాలికంగా ఇంద్రియాలను తొక్కిపెట్టి నువ్వు వరాలు సంపాదించావు. ఆ ఇంద్రియాలే నిన్ను చంపాయి అని. రావణుడు తన ఇంద్రియాలను తొక్కిపెట్టి, తపస్సు చేసి అపారమైన శక్తి సాధించిన వాడే. కానీ ఇతరత్రా కేవలం ఒక దుర్మార్గుడే కాదు మానసికంగా దుర్బలుడని చూపుతుంది అతని ప్రథమ దర్శనం. నన్ను ధనానికి లోబడే కులట లాగా చూస్తుంటే నీ కళ్ళు ఎందుకు నేలమీద రాలటం లేదో నాకు తెలియటం

లేదు అంటుంది సీత. మొదటిసారి నిద్ర పోతున్న రావణుడిని చూసి ఒక అడుగు వెనక్కి వేస్తాడు హనుమంతుడు. మొదటిసారి యుద్ధమరంగానికి వచ్చిన రావణుడిని హనుమంతుడు కొడితే రావణుడు కదిలిపోతాడు కానీ చావడు. ఆ దెబ్బ తిని నువ్వు చాలా బలవంతుడివి అన్న రావణుడితో, నా దెబ్బ తిని ఇంకా నువ్వు బ్రతికి ఉన్నప్పుడు నా బలం గొప్ప ఏమిటి అంటాడు హనుమంతుడు. క్షణంలో సంజీవని పర్వతం తీసుకురాగల హనుమంతుడి కంటే కూడా రావణుడు శక్తిమంతుడు. అందుకే లంక నుంచి తిరిగి వచ్చిన తరువాత హనుమంతుడు ఇతర వానర వీరులతో అంటాడు, రావణుడు ఎంతో తపస్సు చేసాడు, లేకపోతే అగ్ని లాంటి సీతను ముట్టుకోగలిగేవాడు కాదు అని. ఇవన్నీ ఉత్తర కాండంలో వర్ణించిన దేవతల మీద రావణుడి విజయాల కంటే స్పష్టంగా, రావణుడు ఎంత కఠోర తపస్సు చేసి ఎంత శక్తి సంపాదించాడో తెలుపుతాయి.

స్వర్గం మీద దండయాత్ర సమయంలో సేన ముందు నుంచున్న రావణుడు, తన వాళ్ళు అందరూ చచ్చిన తర్వాత యుద్ధానికి దిగుతాడు. సేవకుల బ్రతుకులు ఎట్లాగయినా రాజువే. వాళ్ళని ముందు పంపటం రాజధర్మం అని సమర్థించవచ్చు. తనని దేవతలు చంపలేరు కానీ నర వానరులు చంపగలరని గ్రహించి

సీతని అపహరించిన సమయంలో లాగే భయం వల్ల వెనక్కి తగ్గాడు అని కూడా అనవచ్చు. ఆఖరికి ఇంద్రజిత్తు మరణించిన తరువాత కూడా మిగిలిన రాక్షసులతో ముందు మీరు రాముడిని గాయపరచండి. తర్వాత రాముడిని తేలికగా చంపగలుగుతాను అంటాడు. ఈ విధంగా తనవారినందరినీ ముందు యుద్ధానికి పంపటమే, మారీచుడి లాగే రావణుడు కూడా ముక్తి కోరుకోలేదని చూపిస్తుంది. ఇందుకే అరణ్య కాండ మొదటే విరాధుడి ప్రసక్తి వస్తుంది. విరాధుడు రావణుడికి ఒక వ్యతిరేక ప్రతిబింబం. ప్రత్యక్షంగా రాముడి ఎదుటే సీతాపహరణం చేస్తాడు. ఒక్కడే మరణిస్తాడు. రావణుడు నిజంగానే పూర్వజన్మ స్మృతి కలిగి ఉండి రాముడి చేతిలో మరణించాలనే కోరిక కలవాడయితే దొంగతనంగా సీతాపహరణం చేసేవాడా? తన వారిని అందరినీ చంపుకోవటం చేసేవాడా?

మర్త్యులు తాత్కాలికంగా ఇంద్రియాలను తొక్కిపెట్టి వరాలు సంపాదించి దేవతలని అధిగమించగలరనటం మన ధర్మాన్ని అర్థం చేసుకోటానికి చాలా ముఖ్యమైన విషయమని ఇంతకు ముందు కూడా చర్చించాము. ఆధునిక రావణ భజనకి వాల్మీకి

రామాయణంలో ఏవిధమైన ఆధారమూ కనపడదు[17]. రావణుడు గొప్ప శివభక్తుడనటం కూడా వాల్మీకి తరువాత రామ కథలు రాసిన వారి కథనం[18]. విభీషణుడిని ఓదార్చే సమయంలో రాముడే రావణుడు గొప్ప శివ భక్తుడు అన్నాడు అంటారు కొన్ని రామకథా రచయితలు. వాల్మీకి అలా చెప్పలేదు. రాముడు విభీషణుడికి ఓదార్పుగా యుద్ధంలో మరణించిన వీరులని గురించి దుఃఖించకూడదు అని మాత్రమే అంటాడు. ఉత్తర కాండలో రెండు సార్లు మాత్రమే రావణుడి భక్తి గురించి వర్ణన ఉంది. పుష్పక విమానం ఆగిపోతే నందిని చూసి నవ్వి, నంది ఇచ్చిన శాపాన్ని లక్ష్యం చేయక, శివుడిని ధిక్కరించి కైలాసం ఎత్తబోతే శివుడు బొటన వేలుతో నొక్కితే భుజాలు కైలాసం కింద ఇరుక్కుపోతాయి. ఆ సమయంలో మంత్రుల సలహా మేరకు వేయి సంవత్సరాలు ప్రార్థిస్తే శివుడు కరుణించి భుజాలని

---

[17] ఉత్తరకాండలో రావణుడు సూర్య చంద్రులని జయించాడని, వాలి కార్తవీర్యులతో భంగపడినట్టే కపిల, బలి, శ్వేతదీప వాసులైన స్త్రీలతో భంగపడాడని కథలు ఉన్నాయి. వీటితో పాటు రావణుడు విష్ణువు చేతిలో మరణం కావాలనుకున్నాడనే కథ కూడా ఉంది. ఇది అరణ్య, సుందర, యుద్ధ కాండలో ప్రస్ఫుటంగా కనపడే రావణుడి వర్ణనని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. అందుకే నేను దీనిని పట్టించుకోలేదు.

[18] కారణం సమీప చరిత్రలో భక్తిని మాత్రమే గౌరవించి, కర్మ మార్గాన్ని నిందించటం చాలా ఎక్కువ అవటం వలన యోగ తపో మార్గాలతో రావణుడు శక్తులు, వరాలు సంపాదించుకున్నాడని ఒప్పుకోలేకపోవటం కావచ్చు. విదేశీయ మతావవలంబుల చేతిలో చిత్తుగా ఓడిపోవడం కూడా కారణం కావచ్చు.

విడిపిస్తాడు అని ఒక వర్ణన. అప్పుడే ఇంత గట్టిగా అరిచిన నిన్ను అందరూ రావణుడు అని పిలుస్తారు అంటాడు శివుడు. రావణుడు పుట్టినప్పుడు పెట్టిన పేరు దశగ్రీవుడు. కార్తవీర్యుడితో యుద్ధం చెయ్యాలని వెతుక్కుంటూ వేస్తే అతను నర్మదా నదిలో భార్యలతో జలకాలాడుతుంటాడు. రావణుడు నది ఒడ్డున శివ పూజ చేశాడన్న వర్ణన రెండవది.

ఒక్క సంఘటనలో మాత్రమే కనపడే విరాధుడి వంటి వారు కూడా రామాయణం యొక్క కథావేణిలో ముఖ్యభాగం అవటం మొదట మనవి చేసిన లంకెలు. వ్యతిరేక ప్రతిబింబ పాత్రల వర్ణన సూక్ష్మంగా నిర్వహించిన రామాయణ కథావేణి శిల్పానికి నిదర్శనం. వ్యతిరేక ప్రతిబింబం పాత్రలకి విరాధుడి కంటే గొప్ప ఉదాహరణ విశ్వామిత్రుడు.

విశ్వామిత్రుడు

వాల్మీకి రామాయణంలో రావణుడిలాగా తపస్సుచేసి గొప్ప శక్తి సంపాదించుకున్నవాడు విశ్వామిత్రుడు మాత్రమే. సుగ్రీవుడు, వాలి, హనుమంతుడు మొదలైన వానర వీరులు పుట్టుకతో శక్తిమంతులు. రాముడి శక్తి ధర్మం. విశ్వామిత్రుడు రావణుడికి

ఒక వ్యతిరేక ప్రతిబింబం. నిజానికి కేవలం రావణుడికే కాదు సమస్త రాక్షస ప్రవృత్తికి వ్యతిరేక ప్రతిబింబం. పురాణకథలలో కనపడే రాక్షసులు అందరికంటే రావణుడు చాలా ఎక్కువ శక్తి సంపాదించుకున్నాడు. హిరణ్యకశిపు, హిరణ్యాక్ష, భస్మాసురాది రాక్షసులని అవలీలగా చంపిన విష్ణువుకి నిజనరావతారం దాల్చి, తాను, లక్ష్మీ అనేక కష్టనష్టాలను అనుభవించి, దేవతాంశులైన వానరుల సహాయం తీసుకుంటేనే కానీ రావణుడిని చంపటం సాధ్యం కాలేదు. అటువంటి రావణుడికి విశ్వామిత్రుడు దీటైన వ్యతిరేక ప్రతిబింబం. విశ్వామిత్రుడు తపశ్శక్తి వల్ల కాక స్వశక్తితో రాజ్యం చేశాడు. ఎంత తపస్సు చేసినా తనకి అమరత్వం కావాలని కోరలేదు. రావణుడు శక్తి పెంచుకుని మృత్యువుని దూరం చేసుకోవచ్చనే ఆశతో తపస్సు చేసాడు. ఆ తపశ్శక్తి వల్లనే రాజు కూడా అయ్యాడు.

విశ్వామిత్రుడు సంచిత కర్మని నాశనం చేసుకున్న అనేకమంది జీవన్ముక్తులలో ఒకడు కాదు. ప్రారబ్ధ కర్మనే మార్చుకున్న ఏకైక మానవుడు. పూర్వజన్మలలో చేసిన కర్మ వల్ల కూడగట్టుకున్న పాప పుణ్యాలలో ఒక భాగాన్ని ప్రారబ్ధ కర్మగా మానవుడు ప్రస్తుత జన్మలో అనుభవించితీరాలని, మిగిలిన సంచిత కర్మని మాత్రం ధర్మ, కర్మ, భక్తి మార్గాలతో మానవులు నాశనం చేసుకోగలరని,

అది సాధించిన వాళ్ళు ఇకముందు జనన మరణాలు ఉండని జీవన్ముక్తులని మన సాంప్రదాయం. ఈశ్వరుడికి మాత్రమే కర్మ బంధం, ప్రారబ్ధం ఉండవు[19].

విశ్వామిత్రుడి కఠోర దీక్ష ప్రారబ్ధాన్ని మార్చుకోవడం ఎంత కష్టమో తెలుపుతుంది. ధర్మ గ్రంథాల నిర్వచనాన్ని అర్థం చేసుకోటానికి వాల్మీకి రామాయణం ముఖ్యం అని పైన చెప్పిన మాటకి ఇది ఒక ఉదాహరణ. విశ్వామిత్రుడు కేవలం మరుసటి జన్మలో నాకు బ్రాహ్మణత్వం కావాలని వరం అడిగి ఉంటే అంత కఠోర తపస్సు అవసరం అయ్యేది కాదు. విశ్వామిత్రుడు ఈ జన్మలోనే బ్రహ్మర్షిగా అవటానికి ప్రయత్నం చేసాడు. రావణుడిలాగే రాజసంతో శక్తులు సాధించటం విశ్వామిత్రుడి దీక్షలో మొదటి మెట్టు మాత్రమే. వశిష్టుడితో తలపడి బ్రహ్మబలమే గొప్పదని గ్రహించి మారటం, అంత కఠోర తపస్సు చేయడం ఆఖరి క్షణంలో కూడా మారని రావణుడి తత్వాన్ని ఎత్తి చూపిస్తుంది. మన ధర్మ గ్రంథాలలో తపస్సంపన్నులూ బ్రహ్మర్షులూ చాలామంది కనపడతారు. కానీ ఎంత వెతికినా ఇంకో విశ్వామిత్రుడు కనపడడు. రావణుడికి

---

19 ఆధునికులు తమ గురువు ఇతర జీవన్ముక్తులందరికంటే గొప్పవాడని చెప్పుకోవటం కోసం తమ తమ గురువులని పురాణాలు వర్ణించని ఆధునిక అవతార పురుషులని చెప్పుకుంటారు.

అంత అరుదైన ప్రతిబింబం కాబట్టే విశ్వామిత్రుడి చరిత్ర వాల్మీకి రామాయణంలో అంత విపులంగా పదిహేను అధ్యాయాలలో వర్ణించబడింది. కథాపరంగా రాముడికి అస్త్రాలు ఇచ్చి మిథిలకి తీసుకు వెళ్ళిన వాడు విశ్వామిత్రుడు. కానీ కథాపరంగా కూడా వీటికంటే ఈ వ్యతిరేక ప్రతిబింబాన్ని చూపటం ముఖ్యం.

శతానందుడు రాముడికి చెప్పిన విశ్వామిత్రుడి కథ, సైన్యంతో యుద్ధానికి వెళుతున్న విశ్వామిత్రుడు వశిష్ఠుడిని కలవటానికి రావటంతో మొదలౌతుంది. తనని చూడవచ్చిన విశ్వామిత్రుడి సకల సైన్యానికి ఆతిథ్యం ఇస్తానని చాలా సార్లు బతిమాలుకుని ఆ విధంగా తన వద్ద కామధేనువు ఉందని తెలుపుతాడు వశిష్టుడు. విశ్వామిత్రుడికీ సైన్యానికీ ఆతిధ్యం ఇస్తానని వశిష్టుడు బలవంతం ఎందుకు చేసినట్టు? నందిని తనవద్ద ఉందని రాజుకి తెలపకపోవటం అధర్మం కనుక.

ఒక విషయం గమనించాలి. రామాయణం దృష్టిలో రాజరికానికీ, మన మామూలు దృక్పథానికీ, చాలా పెద్ద తేడా వుంది. వాల్మీకి ప్రకారం రాజు ప్రపంచంలో ఎక్కడ అధర్మం జరిగిందని తెలిసినా సరి చేయాలి. రాముడు వాలిని చంపినప్పుడు నేను సకల భూమండలానికీ రాజైన భరతుడి ప్రతినిధిని అంటాడు. కేవలం

అయోధ్యాధిపతి అవటంవల్ల భరతుడు సకల భూమండలానికి రాజు అవలేదు. వనవాసం మొదలు పెడుతూ గంగానది చేరే ముందరే వెనక్కి తిరిగి అయోధ్యానగర దేవతకి నమస్కారం చేస్తాడు రాముడు. సీతా పరిత్యాగం నిర్ణయించినప్పుడు సీతను గంగానది ఆవలి ఒడ్డున వదిలి రమ్మని లక్ష్మణుడికి చెబుతాడు. అంటే గంగానది తన రాజ్యానికి సరిహద్దు అనే కదా? ఒకటికి రెండు సార్లు రాజు ధర్మాన్ని రక్షించడానికి, ఉల్లంఘించినవారిని శిక్షించటానికి ధర్మబద్ధంగా అందరి ఆదాయం నుంచి ఆరవ వంతు తీసుకోవచ్చు అని చెబుతారు వాల్మీకి. రాజ్యసీమలు రాజు ఈవిధంగా పన్నులు వసూలు చేసుకోవడానికి మాత్రమే. ధర్మాన్ని రక్షించడానికి ప్రతి రాజు సకల భూమండలానికి అధిపతే. కనుక విశ్వామిత్రుడు వశిష్ఠుడి ఆశ్రమం ఉన్న ప్రదేశానికి రాజా అన్న ప్రశ్న లేదు. మళ్ళీ ఈ ఆదర్శం ఎంతవరకు ఆచరించబడింది అని వాస్తవిక దృష్టితో ప్రశ్నించితే వాల్మీకి రామాయణం లోని వర్ణనల ఆధారంగానే ఆచరణ కేవలం రాముడు, విశ్వామిత్రుడు వంటి కథలోని ముఖ్య పాత్రలకి మాత్రమే పరిమితమైంది అని ఒప్పుకోవాలి. రాజుల గురించి, యుద్ధాల గురించి చేసిన కొన్ని వర్ణనలలో ఈ విధమైన ధర్మం కాక మన మామూలు దృక్పథం, సహజత్వం కనపడతాయి. కానీ అవి రామాయణం యొక్క ధర్మ కథా లీలా వేణులకి ముఖ్యం కాదు. వాల్మీకి అశ్వమేధ యజ్ఞ

వర్ణన కూడా పూర్తిగా ధర్మ దృష్టితో చేసారు. రాముడు రాజసూయ యాగం చేయటం గురించి మీ అభిప్రాయం చెప్పండి అంటే భరతుడు వద్దు, దానివల్ల రాజులతో యుద్ధాలు, ప్రజలకి దుఃఖం కలుగుతాయి. నిన్ను అందరూ తండ్రిగా భావిస్తారు. నీ వంటి వాడు రాజసూయ యాగం చేయకూడదు అంటాడు. రాముడు వెంటనే నేను చెయ్యను అని అంటాడు. అప్పుడు లక్ష్మణుడు అశ్వమేధ యాగం చేయమని చెబుతాడు. దీని అర్థం అశ్వమేధ యాగం వల్ల యుద్ధాలు జరగవనేకదా. వాల్మీకి రామాయణంలో సగరుడు, అంబరీషుడు చేసిన అశ్వమేధ యాగాలకి విఘ్నం కలిగించినది ఇంద్రుడు. ఇతర రాజులు కాదు. మహాభారతంలో అశ్వమేధ పర్వం వర్ణన చూసి తరువాత రాసిన రామ కథా రచయితలు, లవకుశులు అశ్వాన్ని ఆపి రాముడితో అతని తమ్ముళ్ళతో యుద్ధం చేసారని కల్పించారు. ఇది త్రేతాయుగ ధర్మానికి ద్వాపర యుగ ధర్మానికి తేడా అని కూడా అనవచ్చు.

కామధేనువుని బలవంతంగా సొంతం చేసుకోవాలి అనుకోటంలో కూడా విశ్వామిత్రుడు కొంతవరకు మాత్రమే రావణుడి లాగా బల ప్రయోగంతో తనకి ఏది కావాలంటే అది లాక్కునే మనస్తత్వం చూపుతాడు. కానీ విశ్వామిత్రుడిది పూర్తి రాజసం. రావణుడి లాగా బలహీనులని మాత్రమే ఎదిరించడు. కుటిలుడు కాడు. సమస్త

సైన్యానికి ఆతిథ్యం సృష్టించగలిగిన ఆ ధేనువు సైన్యాన్ని కూడా సృష్టిస్తుందేమో[20] అని భయపడడు. సొంత కొడుకులతో సహా సైన్యం నాశనమైతే తపస్సు చేసి అస్త్రాలు వరంగా సంపాదించి మళ్ళీ కయ్యానికి దిగుతాడు. తను ప్రయోగించిన అస్త్రాలన్నీ వశిష్టుడి బ్రహ్మదండంలో లీనమవటం చూసి క్షత్రియ బలం కంటే బ్రహ్మ బలం గొప్పది అని గ్రహించి బ్రహ్మర్షి అవటానికి తపస్సు మొదలు పెడతాడు. మొదటి దర్శనంలోనే రావణుడికి వ్యతిరేక ప్రతిబింబం అని తెలిసిపోతుంది.

శతానందుడు చెప్పిన విశ్వామిత్రుడి కథలో రెండవ సంఘటన త్రిశంకుడి వృత్తాంతం. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన త్రిశంకుడు తన శరీరంతో స్వర్గానికి వెళ్ళాలని ఆశ పడితే కులగురువు వశిష్టుడు అది కుదరదు అంటాడు. తనని ఆశ్రయించిన త్రిశంకుడి కోసం యజ్ఞం చేస్తాడు విశ్వామిత్రుడు. హావిర్భాగం స్వీకరించటానికి దేవతలు రారు. కోపం వచ్చి ఇంకో సృష్టి చేయటానికి సిద్ధం అవుతాడు విశ్వామిత్రుడు. రావణుడిని మించిన శక్తిమంతుడని స్పష్టం. కానీ తనకున్న శక్తిని తన కోసం కాక ఇతరుల కోసం

[20] కామధేనువు శకులని, యవనులని సృష్టించింది అన్న మాటల ఆధారంగా రామాయణం రచనా కాలం నిర్ణయించే వారు, ఆ మాటలు ప్రక్షిప్తాలా, రచనా కాలంలో ఆ మాటలకి ఇతర అర్థాలు ఉన్నాయేమో అని మాత్రం ఆలోచించరు.

ఉపయోగించటంలో రావణుడికి వ్యతిరేక ప్రతిబింబం. ధర్మ మార్గంలోనే ఉన్నాడు. నిజానికి త్రిశంకుడికి అభయం ఇవ్వటం లోనూ వశిష్ఠుడి కొడుకులని ఘోరంగా శపించడంలోనూ కరుణ కన్నా వశిష్ఠుడిని మించాలనే రాజసం ఎక్కువగా కనిపిస్తుంది. రావణుడు స్వర్గం మీద దండయాత్ర చేస్తే ఇక్కడ విశ్వామిత్రుడు దేవతలని బెదరగొట్టి కొంతవరకూ త్రిశంకుడికి ఒక శాశ్వతమైన గొప్ప స్థానం ఇప్పించగలిగాడు. ఇదీ త్రిశంకుడికి ఇవ్వటం కోసం కష్టపడ్డాడు. తన కోసం కాదు. రాముడు కూడా ఇదే విధంగా సముద్రుడిని బెదరగొట్టి తన సేతువు నిర్మాణ కార్యానికి సహాయం సంపాదించుకున్నాడని గుర్తించాలి.

తరువాత వర్ణించబడిన శునశ్శేపుడి[21] కథలో విశ్వామిత్రుడికి కలిగినది కరుణ. అంబరీశుడు అశ్వమేధ యాగం చేస్తుంటే గుర్రాన్ని ఇంద్రుడు దొంగిలిస్తాడు. యజ్ఞం ఆగకూడదు, ఎవరైనా నరుడిని యజ్ఞ పశువుగా కొని తెమ్మంటారు యజ్ఞం చేయిస్తున్న ఋషులు. శునశ్శేపుడి తండ్రి పెద్దకొడుకుని అమ్మనంటే తల్లి ఆఖరి వాణ్ణి అమ్మను అంటుంది. తల్లితండ్రులకి అక్కరలేని

[21] ఇవి తండ్రికి కొడుకుని అమ్మే అధికారం ఉందని చెప్పడానికి రాసిన కథలని, మన గ్రంధాలు చెదురు మదురుగా నరబలిని ప్రస్తావించినా అది కేవలం మాటలకే పరిమితమని నా అభిప్రాయం.

మధ్యవాడిని నేను. నన్ను అమ్మారని భావించి ఆవులు నా తండ్రికి ఇచ్చి నన్ను యజ్ఞపశువుగా తీసుకుని వెళ్ళు అంటాడు శునశ్శేపుడు. దారిలో తన మేనమామ అయిన విశ్వామిత్రుడిని కలుసుకుని రక్షించమని వేడుకుంటాడు శునశ్శేపుడు.

శునశ్శేపుడి బదులు తన కొడుకులలో ఒకడిని వెళ్ళమంటే ఎవరూ సిద్ధపడరు. తన మాట వినలేదన్న కోపంతో కొడుకులని శపిస్తాడు. ఇది విశ్వామిత్రుడు ఇంకా క్రోధాన్ని జయించలేదని చూపుతుంది. విశ్వామిత్రుడు శునశ్శేపుడికి మంత్రం ఉపదేశించి జపించమని చెబుతాడు. మంత్రబలం వల్ల ఇంద్రుడు అశ్వం లేక పోయినా, నర బలి జరగకుండానే రాజుకి యజ్ఞ ఫలం ఇస్తాడు. ఆ తరువాత మేనకని మోహించటంవల్ల విశ్వామిత్రుడి తపస్సు చెడుతుంది. అయినా మేనకని శపించలేదు. తప్పు తనది అని చెప్పుకునే స్థైర్యం కలిగింది. మళ్ళీ రంభని శపించి ఒక అడుగు వెనక్కి వేసాడు. ఈవిధమైన పట్టుదల, ఎదురు దెబ్బ తగిలినా మళ్ళీ గమ్యం చేయటానికి ప్రయత్నం చేయటం గొప్ప విషయం. ఒక విషయం గమనించాలి. విశ్వామిత్రుడు స్పష్టంగా రావణుడి కంటే శక్తిమంతుడు. మరి రావణ వధ కోసం రామావతారం ఎందుకు అవసరం అయింది? ఇతరులు కూడా తపస్సు చేసి తన కంటే శక్తివంతులు అవుతారేమో అనే భయం

వల్లనే కదా రావణుడు, ఇతర రాక్షసులు మునులని హింసించే వాళ్ళు? రావణుడు మునులని తాపసులని తాను స్వయంగా హింసించడు. మారీచ సుబాహుల వంటి అనుచరులని మాత్రం పంపుతాడు. మళ్ళీ రావణుడి బెరుకుతనం కనపడుతుంది. అటువైపు నుంచి చూస్తే విశ్వామిత్రుడు, అగస్త్యుడు, వశిష్ఠుడు మొదలైన మహర్షులు అకారణంగా రావణుడికి శాపాలు కూడా ఇవ్వలేరు. వాల్మీకి రామాయణం యొక్క బాలకాండలో రాముడి బాల్యవర్ణన లేనే లేదు. విశ్వామిత్రుడి చరిత్ర కాక విశ్వామిత్రుడు చెప్పిన పురాణం కథలు పది పన్నెండు అధ్యాయాలు ఉన్నాయి. విశ్వామిత్రుడి చరిత్ర కంటే రామాయణంలో వీటి స్థానం అర్థం చేసుకోవటం తేలిక. అప్పటికి పదహారు ఏళ్ళు కూడా లేని రాముడు సర్వజ్ఞుడైన విశ్వామిత్రుడిని ప్రశ్నించటం, రాత్రిళ్ళు కథలు చెప్పించుకోవటం కథాపరంగా అతి సహజం.

అలాగే ఉత్తరకాండలో కూడా పట్టాభిషేకం తరువాత రాముడిని అభినందించటానికి వచ్చిన మునులు మహా యుద్ధం చేసిన రావణుడి గురించి, ఇంద్రజిత్తు గురించి, వానరుల గురించి కథలు వివరంగా చెప్పుకోవటం సహజం. మిగతా కాండలలో అసలు కథ ఆగకుండా ఉండేందుకు కథలని ఒకటి రెండు

మాటలలో ఉదాహరించి వదిలేస్తారు[22]. ముందు చెప్పినట్టు విశ్వామిత్రుడు బ్రహ్మ మానస పుత్రుడికి నాలుగో తరం వాడు, రాముడు ముప్పైయో తరం వాడు. పైన చెప్పిన అంబరీషుడు వశిష్టుడు వివాహంలో చెప్పిన వంశావళి ప్రకారం రాముడికి ఆరు తరాల ముందు వాడు.

వాలి, వానరోత్పత్తి

వానరుల సహాయం లేకుండా ధర్మావతారుడైన రాముడికి సైతం పౌలస్త్యుడిని వధించటం సంభవం అయ్యేది కాదు. అందుకే పుత్రకామేష్టిలో తనకి లభించిన పాయసం దశరథుడు భార్యలకి ఇవ్వగానే, రాముడు ఇంకా పుట్టకుండానే బ్రహ్మ ఇతర దేవతలని మహా శక్తివంతులైన వానరులని పుట్టించమని చెబుతాడు. ఇది రావణుడు ఎంతటి శక్తి సామర్థ్యాలు కలవాడో సూచిస్తుంది. కానీ రావణుడు తన కోరిన వరంలో నాకు నరులు గురించి భయం లేదు అన్నాడేగాని వానరులని పట్టించుకోలేదు. బ్రహ్మ పుత్రులని వానర రూపంలోనే సృష్టించమని ఎందుకు నిర్దేశించినట్టు? అసలు వానరులంటే ఎవరు? ఉత్తర కాండలో వాలి రావణుడిని

[22] బాల, ఉత్తర కాండలు ప్రక్షిప్తాలు అనే నాస్తికులు ఈ కీలక విషయాల గురించి ఆలోచించరు.

చంకలో పెట్టుకుని ఒకవైపు తాను సంధ్యావందనం చేసుకుంటూ అవలీలగా నాలుగు సముద్రాలలో ముంచుతాడు. మరి అంతటి శక్తిమంతుడిని సృష్టించిన ఇంద్రుడు అటువంటి వారి ద్వారా రావణుడిని ఎందుకు చంపలేక పోయాడు?

ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలంటే మనం మళ్ళీ ధర్మ వేణిని గుర్తించాలి. వాలి ఎంత శక్తిమంతుడైనా రావణుడిలా లోకాలు అన్నిటినీ జయించాలని అనుకోడు. లోకకంటకుడిగా తయారు అవడు. ఇది జంతు స్వభావం. జంతువులు తిండికోసం తప్ప ఇతర జంతువులని చంపవు. ఆడజంతువుల పొందు కోసం పోట్లాడుకున్నా చావు బతుకుల వరకూ వెళ్ళవు. దుందుభి లాంటి రాక్షసులు తాముగా వచ్చి వాలితో పోట్లాడి చచ్చారుగానీ వాళ్ళని వెతికి యుద్ధం చేసి తన గొప్పతనాన్ని చాటాలని వాలి అనుకోడు. రావణుడి లాగా దండయాత్రలు చెయ్యడు. ఇందుకే వాలి వంటి శక్తివంతమైన జంతువులని సృష్టించినా ఇంద్రుడు వారి సహాయంతో రావణుడిని చంపించలేడు. రావణుడి కంటే బలవంతులని సృష్టించటం తేలిక. వాళ్ళు రావణుడిని చంపాలి కానీ తామే లోకకంటకులు అవకూడదు అంటేనే కష్టం. ఇంతకీ వాల్మీకి రామాయణంలో వానరులు జంతువులేనా?

ఒక విషయం గమనించాలి. వానరుల ఆయుధాల ధరించినట్లు వాల్మీకి ఎక్కడా వర్ణించలేదు. అనేక సార్లు వాళ్ళ ఆయుధాలు గోళ్ళు, కోరలు అని, యుద్ధంలో పక్కన ఉన్న చెట్టునో రాయినో తీసి విసరుతారని వర్ణించారు. అంటే రాళ్ళని, చెట్లని కూడా పనిముట్ల లాగా వాడరు. ఒక్క లక్ష్మణుడు కోపంగా సుగ్రీవుడిని కలవటానికి కిష్కింధకు వచ్చినప్పుడు చేసిన వర్ణనలో సుగ్రీవుడి మందిరానికి బయట సాయుధ హస్తులు కాపలి కాస్తున్నారు అన్న మాట ఉంది. కానీ కిష్కింధ బయట కోపంగా వచ్చిన లక్ష్మణుడిని చూసి వానరులు రాళ్ళు చెట్లు పట్టుకున్నారని అన్నారు మహర్షి. అలాగే వానర సైన్యం లంకా చేరినప్పుడు భేరీ శబ్దాలు, వానరుల గర్జన రావణుడు విన్నాడని, గరుత్మంతుడు సర్పబంధాలనుంచి రామలక్ష్మణులని విడిపించిన తరువాత వానరులు శంఖాలు భేరీలు మోగించటం విన్నాడని వర్ణన ఉంది. అలాగే వస్త్రాలు భవనాలు, ఆభరణాలు మొదలైన వాటి ప్రసక్తి ఉంది. వీటినీ పరస్పర విరుద్ధ కథనాలో చేర్చవచ్చు. ముందు వాలి తరువాత సుగ్రీవుడు సమస్త వానరులకి, ఎలుగుబంట్లకి రాజు అంటారు. అక్కడక్కడ కొందరు వానర వీరులని ఆయా ప్రాంతాలలో వానర రాజులు అని అన్నా అంతకంటే ఎక్కువగా శాఖామృగాలు, చెట్టు కొమ్మల మీద ఉండే జంతువులు, అని అంటారు. అన్నిటికంటే ముఖ్యంగా రాముడు తన కోసం మరణించిన వానరులందరూ

బతకాలని ఇంద్రుడిని వరం కోరి, వాళ్ళకి పుష్కలంగా పూలూ, పళ్ళు, దుంపలు, నదులలో నీళ్ళు లభించాలని కూడా వరం అడుగుతాడు. ఇది వానరుల జీవన సరళిని ఎత్తి చూపుతుంది. ఎలుగుబంట్లని వానరులతో చేర్చటానికి కారణం బ్రహ్మ నేను ఇంతకు ముందే జాంబవంతుడిని సృష్టించానని చెప్పటం వల్ల. ఏతావాతా వానరులు రాముడికి చేసిన సహాయానికి, వారి జంతు ప్రవృత్తికి కొంతవరకు అయినా సంబంధం ఉందని ఒప్పుకోవాలి. ఎంత శక్తి ఉన్నా విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కనుక రావణుడితో వైరం పెట్టుకోడు. ఎంత శక్తి ఉన్నా హనుమంతుడు తన స్వార్థం కోసం రావణుడితో కానీ ఇతర రాక్షసులతో కానీ యుద్ధం చెయ్యడు.

సాధారణ మర్త్యుల ప్రవృత్తికి, స్థితప్రజ్ఞుడి ప్రవృత్తికి ఉన్న తేడా భగవద్గీత చదివినంత మాత్రాన్న మనకి తెలియబోదు. వాల్మీకి రామాయణం చదివితే తెలుస్తుంది. జన్మతో నేను ఎవరిని అనే ప్రశ్న వేసుకునే శక్తి లేకపోవటం జంతు ప్రవృత్తి[23]. అందుకే వాటి కామక్రోధాలు పరిమితంగా ఉంటాయి. ఆ ప్రశ్న వేసుకునే శక్తి ఉంటేనే ముక్తి కోసం సాధన చేయగలరు. కానీ ఆ శక్తి ఉన్న జీవులు అవధి లేని కామక్రోధాలకు కూడా వశులు కావచ్చు. ఇది

[23] మనుషులు చీమల లాగా సమిష్టి ప్రయోజనాలకోసం పాటు పడరు. దీనిని మార్చాలనే తపన ఉన్న వాళ్ళు ఈ తేడాలు గ్రహించాలి.

మర్త్యుల ప్రవృత్తి. ఆ ప్రశ్న వేసుకుని ఇంద్రియాలని జయించటం స్థితప్రజ్ఞుడి ప్రవృత్తి. రావణుడి కంటే బలవంతుడైన ఇంకో మర్త్యుడు ధర్మాచరణ చెయ్యకపోతే రావణుడి కంటే కూడా పెద్ద లోకకంటకుడు అవుతాడు. తన శక్తిని ధర్మంతో నిగ్రహించగల ధర్మావతారుడే పౌలస్త్య వధ సాధించగలడు. ఇందుకే బ్రహ్మకి నరావతారానికి సహాయం చేయటానికి నరులని కాక వానరులని నిర్దేశించవలసి వచ్చింది. ఇది ధర్మ వేణిలో ఒక ముఖ్యమైన విషయం.

ఇక వాలివధ గురించి కూడా వాల్మీకి ఉద్దేశం తెలుసుకోవాలి. దుందుభి లాంటి క్షణిక పాత్రని కూడా వాల్మీకి మహర్షి తన ధర్మ-కథ-లీల బంధంలో ఉపయోగించుకున్నారు. సుగ్రీవుడు వాలి బలపరాక్రమాల గురించి చెబుతూ ప్రస్తావికంగా రాముడికి చెబుతాడు, దుందుభి వాలిని యుద్ధానికి పిలుస్తూ అప్రమత్తంగా ఉన్న వాడిని చంపటం భ్రూణ హత్యతో సమానం అని అన్నాడు అని. ఎంత సూక్ష్మ వర్ణన? ఆధునిక నాస్తిక వాదనని ఆనాడే సూచించారు మహర్షి. అలాగే ఇంద్రజిత్తు అదృశ్య యుద్ధంతో విసిగిపోయిన లక్ష్మణుడు నువ్వు ఆనుమతిస్తే నేను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ప్రపంచంలోన ఉన్న రాక్షసులని అందరినీ ఒకేసారి చంపేస్తాను అని రాముడితో అంటాడు. చేతులు జోడించి శరణు

కోరిన వాడిని, యుద్ధం చేయని వాడిని, దాక్కున్న వాడిని, పారిపోతున్న వాడిని, అశ్రద్ధగా ఉన్నవాడిని నువ్వు చంపకూడదు అంటాడు రాముడు. మరి వాలి అప్రమత్తంగా ఉన్నప్పుడే కదా చంపాడు రాముడు? కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే రాముడు వాలితో యుద్ధం చెయ్యలేదు. వాలిని చంపలేదు. వాలిని శిక్షించాడు. రాముడికి వాలిని దండించటం ధర్మం. కానీ వాలితో యుద్ధం చెయ్యడం అధర్మం. వాలితో తన వైరానికి కారణం రాముడికి సుగ్రీవుడు చెబితే నీ భార్యని అపహరించిన వాలిని చంపుతాను అని మాత్రమే ఒకటికి రెండుసార్లు అంటాడు రాముడు. వాలి సుగ్రీవుడిని కట్టుబట్టలతో రాజ్యం నుంచి తరిమేశాడు అన్న మాటకి స్పందించడు. తనే భరతుడికి చెప్పాడు కదా పెద్దవాళ్ళకి ఏ ఆజ్ఞ అయినా ఇచ్చే అధికారం ఉంది అని.

తనంతట తాను సుగ్రీవుడితో స్నేహం చేసి రాముడు వాలితో యుద్ధానికి సిద్ధం అవలేదు. సుగ్రీవుడితో చెలిమి చేయమని రాముడికి చెప్పిన కబంధుడు శాప పరిహారం తరువాత దేవతా సమానుడు. ఆజ్ఞ ప్రకారం రాముడు ముందు సుగ్రీవుడితో చెలిమి చేసి, ఉపకారం చేసాడు. కనుక ప్రత్యుపకారం స్వీకరించవచ్చు. అలాగే మునులు అతిథిగా విచ్చేసిన రాముడికి బహుమతులు ఇవ్వడం వాటిని రాముడు స్వీకరించటం ధర్మమే. మరణించే

ముందు వాలి రాముడితో సుగ్రీవుడి బదులు నన్ను అడిగివుంటే నేను సీతను ఒక్కరోజులో తెచ్చి ఇచ్చేవాడిని అని అంటాడు. కానీ వాలికి రాముడికి సీతను బహుమానంగా ఇచ్చే అర్హత లేదు. అసలు రాముడు అలా ఆలోచించడు.

వాలి అడిగిన ప్రశ్నలన్నిటికీ రాముడు సమాధానం చెప్పాడు. నేను జంతువుని అని నువ్వు అంగీకరిస్తే ఎప్పుడు ఎలా చంపినా అధర్మం కాదు. ఇదే విషయాన్ని ఇంతకుముందు "మానిషాద..." శ్లోకాన్ని చర్చించినప్పుడు గుర్తించాము. జంతువు కాదనుకుంటే కూతురితో సమానమైన తమ్ముడి భార్యను వావి వరసలు పాటించకుండా నీ భార్యను చేసుకున్న నేరానికి రాజు విధించిన శిక్ష అనుభవించాలి. అనుభవించావు కనుక పాప పరిహారం జరిగింది. నువ్వు స్వర్గానికి పోతావు అని అంటాడు. ఇంకొక చిన్న విషయం అంగద రాయబారం. అంగదుడి ద్వారా రావణుడిని సీతని వెనక్కి ఇచ్చి నువ్వు చావు తప్పించుకోమని రాముడు హెచ్చరిస్తాడు. అలాంటి అవకాశం రాముడు వాలికి ఇవ్వలేదు. శిక్ష కాబట్టి. రాముడి చేతిలో చచ్చినంత మాత్రాన వాలికి ముక్తి లభిస్తున్నదని వాల్మీకి చెప్పలేదు. వాలి పశ్చాత్తాపపడి రాముడిని క్షమాపణ అడిగి అంగదుడికి అభయం ఇమ్మని అడిగాడు. వాలి మరణం తరువాత వానరుల దుఃఖాన్ని రాముడు అందుకే

పంచుకున్నాడు. రావణుడి మరణించిన తరువాత దుఃఖిస్తున్న విభీషణుడికి మాత్రం కేవలం వేదాంత బోధచేసాడు. రావణుడి పరాక్రమాన్ని మాత్రమే ప్రశంసించాడు.

వానరులు కామరూపులు కనుక అయోధ్యలో ప్రవేశించినప్పుడు మానవరూపంలో ఉన్నారని చెప్పారు వాల్మీకి. హనుమంతుడి పుట్టుకని వర్ణిస్తూ అంజన మానవరూపం తీసుకుని విహరిస్తూ ఉన్నప్పుడు వాయువు మోహించాడు అన్ని చోట తప్ప వానర స్త్రీలు కామరూపులు అని ఇంక ఎక్కడా చెప్పలేదు. అంటే వానర స్త్రీలు మానవ రూపంలో ఉన్నారా? స్త్రీ పురుష వర్ణనలో ఈ తేడాలో సహజత్వం లేదు.

అలాగే బ్రహ్మ పుత్ర కామేష్టి అయిన తరువాత వానరులని సృష్టించమని చెప్పాడు. కనుక వాలి రాముడి సమ వయస్కుడు అనుకుంటే వాలి ఎప్పుడు రావణుడిని ఓడించినట్టు? ఎప్పుడు దుందుభిని చంపినట్టు? ఎప్పుడు సుగ్రీవుడితో వైరం వచ్చినట్లు? వానర వీరులను వర్ణిస్తూ రావణుడి చారులు, వాళ్ళు దేవతలకి అనేక యుద్ధాలలో సహాయం చేసిన వాళ్ళు అంటారు. సమయ వర్ణనలో మళ్ళీ అసహజత్వం తొంగిచూస్తోంది.

తార, సుమిత్ర, మండోదరి

వాలి గురించి, వానరుల గురించి చర్చిచేటప్పుడు తార ప్రసక్తి రాకమానదు. వాల్మీకి రామాయణంలో తార మూడు సార్లు కనపడుతుంది. మొదట సుగ్రీవుడితో రెండవసారి యుద్ధానికి వెళ్ళొద్దని వాలిని వారించినప్పుడు. తరువాత వాలి మరణించిన తరువాత దుఃఖిస్తూ. ఆ తరువాత కోపంగా కిష్కింధకు వచ్చిన లక్ష్మణుడిని శాంతింప చేసినప్పుడు. మండోదరి, సుమిత్రలతో పాటు తారకు పూర్వజన్మ సుకృతం వల్ల రాముడి పరతత్వ జ్ఞానం ఉందంటారు సాంప్రదాయకులు. కానీ వాల్మీకి రామాయణం ప్రకారం ఇది సందిగ్ధం. మండోదరి మాత్రమే స్పష్టంగా రాముడు విష్ణువు అవతారము అని చెబుతుంది. ఇదికూడా దేవతా విరోధి అయిన రావణుడిని రాముడు చంపటం చూసి మాల్యావంతుడి లాగా ఊహించి ఉండవచ్చు.

వాల్మీకి రామాయణంలో సుమిత్ర, కౌసల్య లాగా బెంబేలు పడదు. తన కొడుకుని అరణ్యావాసానికి పంపేటప్పుడు కన్నీరు పెట్టినా సీతారాములని తల్లితండ్రులుగా అడవిని అయోధ్యగా భావించి రాముడికి సేవ చేయమని లక్ష్మణుడికి స్థైర్యంగా చెబుతుంది. కౌసల్యని ఓదారుస్తూ ధర్మమార్గంలో నడుస్తున్న

రాముడి గురించి దుఃఖించ వద్దు అంటుంది. ఇది కేవలం ధర్మ నిష్ఠ కావచ్చు. రాముడి పరతత్వ జ్ఞానం అనీ అనుకోవచ్చు. కాబట్టి సుమిత్రకి రాముడు విష్ణువు అవతారం అని తెలుసనటం సందిగ్ధం.

తార తెలివితేటలు స్పష్టంగా కనపడుతాయి. వాలిని యుద్ధానికి వెళ్ళవద్దని చెప్పినప్పుడు ఇప్పడే ఓడిపోయి పారిపోయిన వాడు సుగ్రీవుడు. ఏదో బలమైన సహాయం లేకపోతే వెంటనే ఇలా రెండవసారి యుద్ధానికి రాడు అని గ్రహించి వారిస్తుంది. తారకి రాముడి శక్తి కూడా తెలుసు. రాముడంతటి శక్తిమంతుడితో వైరం వద్ధని వాలికి చెబుతుంది. లక్ష్మణుడు కోపంగా వస్తే కామానికి లొంగిపోయిన వారికి గొప్ప ఉదాహరణగా రాముడి గురువైన విశ్వామిత్రుడిని చూపించి శాంత పరుస్తుంది. కానీ తారకి రాముడి పరతత్వ జ్ఞానం ఉందనడానికి ఇవి చాలా? సుగ్రీవుడితో సంధి చేసుకోమంది కానీ రాముడిని శరణు వేడమని అనలేదు. పైపెచ్చు నన్ను కూడా చంపు. నేనూ వాలీ ఒకటే. నీకు స్త్రీ హత్యాదోషం ఉండదు అంటుంది. లక్ష్మణుడి దగ్గరకు వచ్చిన తార వర్ణన చూస్తే ఎప్పటికీ కాదు అనిపిస్తుంది. తాగిన మైకంలో వంటిమీద బట్టలు, నగలు జారి పోతూంటే తూలుతూ వచ్చిన తార జ్ఞాని అని అనుకోలేము. సీతా పరిత్యాగం సాంప్రదాయకులకి

కూడా అలజడి కలిగిస్తుంది. కానీ తార యొక్క ఈ వర్ణన ఎవరికీ ఏవిధమైన ఆలజడీ కలిగించినట్టు లేదు. నిజానికి అది సీతా పరిత్యాగానికి ఉపోద్ఘాతం లాంటిది. స్త్రీ స్వభావం అత్యంత చంచలమైనదని అనటం మన ధార్మిక గ్రంథాలలో చాలా చోట్ల కనపడుతుంది. రాముడితో అరణ్యవాసానికి వచ్చినందుకు సీతని మెచ్చుకున్న అగస్త్యుడు, సాధారణంగా స్త్రీలు ఇలా ఉండరని వాళ్ళని సమిష్టిగా చిన్న చూపు చూస్తాడు. తార యొక్క ఈ వర్ణన ద్వారా ఈ ధోరణిని మాటలలో కాక కథాపరంగా నొక్కి చెప్పారు వాల్మీకి. అందుకే వాలి మరణం తరువాత తార విషాదాన్ని విపులంగా వర్ణించి కేవలం నాలుగు మాసాల తర్వాత, యువ వయస్కుడైన అంగదుడి తల్లి, సుగ్రీవుడి భార్య అయి తాగిన మైకంలో వంటి మీద బట్టలు నగలు జారి పోతూంటే లక్ష్మణుడి దగ్గరకు వచ్చిందని వర్ణించారు.

కేవలం నాలుగు మాసాలలో తార అలా మారటం స్త్రీ చంచల అని నిర్ధారణ చేసిన ఆనాటి వారి అభిప్రాయాలతో మాత్రం ఏకీభవిస్తుంది. కథ ఎప్పుడూ పాఠకుల భావాలకు అనుగుణంగా ఉంటేనే ప్రాచుర్యం పొందుతుంది. వారి భావాలకు వ్యతిరేకంగా ఉంటే, పాఠకుల శ్రద్ధ కథకి, తమ భావాలకకి ఉన్న సంఘర్షణ మీద కేంద్రీకరించడుతుంది. కథ యొక్క సందేశం మరుగు

పడుతుంది. నిజంగా స్త్రీలు అందరూ చంచల స్వభావులా? ఈ విధంగా మానవులలో సగంమందిని నిందించటం, చిన్నచూపు చూడటం, మహానుభావులకి తగునా అని ఆధునిక దృష్టితో అడిగితే నా దృష్టిలో లేదు, కాదు అనక తప్పదు. కానీ పైన చెప్పినట్లు వాల్మీకి ముఖ్య సందేశం "ధర్మో రక్షతి రక్షితః". అది మరుగు పడకుండా, కథావేణికి, పాఠకుల భావనలకి, ఘర్షణ రాకుండా ఉండటం కోసం ఇలా రాసారని సరిపెట్టుకోవాలి.

మంధర, కైకేయి, సూర్పణఖ

వాల్మీకి రామాయణంలో రావణుడు సంపూర్ణంగా దుష్టుడే. ఏ విధమైన మినహాయింపులు లేవు. అలాగే మంధర కైకేయిలు కూడా. వారి మంచి గుణాలని ఎక్కడా మెచ్చుకోలేదు. మంధర, కైకేయి దేవతలకి సహాయం చేయటం కోసం రాముడిని అడవికి పంపారని వాల్మీకి చెప్పలేదు. కైకను దూషించకు. రాముడిని అడవికి పంపటం వల్ల లోక కల్యాణం జరుగుతుందని మాత్రమే భరద్వాజ మహర్షి భరతుడితో అంటారు. దశరథుడు తన వెంట సైన్యాన్ని పౌరులని పంపుతాను అంటే వారించి, రాముడు తాపసిగా బ్రతకడానికి వల్కలు మాత్రమే అవసరం అవుతాయి అంటే, ఆ మాట కోసమే వేచి ఉన్నట్టు కైకేయి అప్పటికప్పుడు

వల్కలు తన చేత్తో ఇస్తుంది. దశరథుడి మరణం తరువాతైనా కైకేయి తప్పు చేసాను అని అనుకున్నట్టు వాల్మీకి చెప్పలేదు. భరతుడికి తండ్రి మరణ వార్త చెప్పినప్పుడు కూడా బాధ వ్యక్తం చెయ్యలేదు. ముందు తన తండ్రి సోదరుల కుశలం కనుక్కొని భరతుడు తండ్రి ఎక్కడ అని అడిగిన తరువాత మర్త్యులు అందరిలాగే నీ తండ్రి కూడా స్వర్గానికి వెళ్ళాడు అని చల్లగా చెబుతుంది. రాముడికి పట్టాభిషేకం అని మంధర చెప్పగానే సంతోషించి బహుమతిగా తన ఆభరణం ఇచ్చినా, మంధర ఎక్కువ కష్టపడవలసిన అవసరం లేకుండానే[24] కైక మారింది. మంధర చెప్పకపోతే కైకేయి భరతుడిని రాజు చేయటానికి ప్రయత్నం చేసి ఉండేది కాదు అని రూఢిగా చెప్పలేము.

భరతుడు, లక్ష్మణుడు కైకేయిని తిట్టటంలో పెద్ద ఆశ్చర్యం లేదు. దశరథుడి రథం నడిపే సూతుడు సుమంత్రుడు అందరి ఎదురుగుండా రాణిని తిట్టటం మాత్రం చాలా గొప్ప ఆశ్చర్యం[25]. కైకేయికి వరాలు ఎలా తీసుకోవాలో చెప్పిన మంధర దశరథుడి అపర కర్మలు పూర్తి అయిన తరువాత కనపడితే శత్రుఘ్నుడు

---

[24] మంధర భరతుడి కొడుకులు కూడా దాసులే అవుతారు అంటుంది. జ్యేష్ఠ పుత్రుడు ఉత్తరాధికారి అయినప్పుడు ఇది ఎల్లప్పుడూ జరిగేదే

[25] ఆధునిక జీవనశైలిలో కులవ్యవస్థని ఎవ్వరూ సమర్థించలేరు. కానీ కులవ్యవస్థ కారణంగా గతాన్నంతా దుయ్యబట్టేముందు ఇటువంటి వాటిని గుర్తిస్తే బావుంటుంది.

చంపెయ్యబోయాడని మనం తాటకా వధని గురించి చర్చించే సమయంలో చూసాము. ఆ సమయంలో మంథర బోలెడు నగలు పెట్టుకుని కోతిలా ఉందని వర్ణించారు మహర్షి. ఈ వర్ణన కూడా రాముడిని అడవికి పంపించినందుకు మంథర కానీ కైకేయి కానీ బాధపడలేదని తెలుపుతుంది.

రాముడికి దండకారణ్యంలో ఉన్న రాక్షసులని, రావణుడిని చంపే అవకాశం ఇచ్చినది సూర్పణఖే. దండకారణ్యంలో ఉండే ఋషులని, హింసిస్తున్న రాక్షసులను చంపుతానని మునులకి మాట ఇచ్చినా రాముడు ఖరుడి మీద దండయాత్ర చెయ్యలేదు. అది ధర్మం కాదు. పది సంవత్సరాలు వివిధ ముని ఆశ్రమాలలో ఉన్నాడు రాముడు, కానీ చంపటానికి ఒక్క రాక్షసుడు దొరకలేదు. ఏ రాక్షసుడూ యుద్ధానికి దిగలేదు. వాళ్ళు రావణుడి లాంటి వాళ్ళు. ఎంతసేపూ బలహీనుల మీద తమ ప్రతాపం చూపిస్తారు.

ధర్మం తప్పకుండా రాక్షసులను చంపటం ఎలాగ? అందుకే రాముడు మహర్షులు సుతీక్షుడినీ, శరభంగుడినీ ఉండటానికి సరైన ప్రదేశం చూపమని అడుగుతాడు. వాళ్ళు కేవలం తాము తపస్సు చేసి సంపాదించుకున్న పుణ్యాలోకాలని రాముడికి ఇవ్వ చూపారు. ఇది లీలా వేణిలో ముఖ్యమైన విషయం. వాళ్ళు

రాముడితో విష్ణువుని దర్శించుకున్నారని సూచన. ఏ ఇతర ధర్మ కథలోనూ ఎవ్వరూ ఈ విధంగా తపఃఫలాన్ని ఇతరులకి ఇవ్వ చూపటం ఉండదు. విశ్వామిత్రుడి లాగా శాపాలు ఇచ్చి తపఃశక్తి కోల్పోవడం మాత్రమే కనపడుతుంది. వారిరువురూ చూపని ప్రదేశం రాముడికి అగస్త్యుడు చూపిస్తాడు. రాముడిని సూర్పణఖ తిరిగే పంచవటిలో పర్ణశాల కట్టుకోమని చెబుతాడు. అగస్త్యుడు ఊహించినట్టే సూర్ఫణఖ మూలంగా అవతార భాధ్యత పూర్తి అవుతుంది. సూర్పణఖ రాముడిని చూసి మోహించి సీతని వదిలి తనని పెళ్ళి చేసుకోమని అడుగుతుంది. భార్య లేకుండా ఉన్న లక్ష్మణుడిని పెళ్ళి చేసుకోమని చెబుతాడు రాముడు. ఇది వ్యంగ్యం. నువ్వు ఇలా అడగటం అధర్మమని సూర్పణఖకి మెత్తగా చెప్పటం. సూర్పణఖ వెంటనే లక్ష్మణుడిని అడగటంతో ఆమెది క్షుద్రమైన కామం, అధర్మం అని స్పష్టం అవుతోంది. నాతో పాటు దాసివి అవటం ఎందుకు అన్నానే మళ్ళీ అడుగు. సౌందర్యం లేని ఆ ముసలి భార్యని వదిలి అందంగా ఉన్న నిన్ను భార్యని చేసుకుంటాడు అని లక్ష్మణుడు వ్యంగ్యంగా అంటాడు. ఆ వ్యంగ్యం అర్థం కాని సూర్పణఖ కోపంగా సీతను మింగుతాను అని మీదకు వస్తుంది. రాముడు అడ్డుపడి శిక్షగా ముక్కు చెవులు కోయమని లక్ష్మణుడిని ఆజ్ఞాపిస్తాడు.

ఈ వివరాలని నొక్కి చెప్పని రామ కథా రచయితలు లక్ష్మణుడు స్త్రీ ముక్కు చెవులు కోయటం అపరాధమనే ఆధునిక పైత్యానికి దారి చూపారు. సూర్పణఖ పగబట్టి, తనకి జరిగిన అవమానం ఎత్తి చూపి ఖరుడిని యుద్ధానికి పంపుతుంది. ఖరుడిని, అతని పద్నాలుగు వేల అనుచరులని చంపటం చూసి రాముడు చాలా బలవంతుడైన నరుడు అని గ్రహించి, రావణుడి స్త్రీ లోలత్వం ఆధారంగా యుద్ధం చేయిస్తుంది. సీతాపహరణం చేయమని ముందు సలహా ఇచ్చింది అకంపనుడు అని ఇంతకు ముందు చూసాము. సూర్పణఖకి రావణుడి లోపాలు పూర్తిగా తెలుసు. బలవంతుడైన నరుడితో తన కోసం యుద్ధం చెయ్యమంటే చెయ్యడేమో అనే బెరుకు వల్ల సీతని ఎరగా చూపింది. నిజానికి ఖరుడు చూడగానే అడిగాడు కానీ రావణుడు నిన్ను కురూపిని ఎవరు ఎందుకు చేసారు అని అడగను కూడా లేదు. నీ కోసం సీతను ఎత్తుకువద్దామని ప్రయత్నం చేస్తే నా ముక్కు చెవులు లక్ష్మణుడు కోసాడు, బలాబలాలు ఆలోచించి రామలక్ష్మణులని చంపి సీతను తెచ్చుకోమని సలహా ఇస్తుంది సూర్పణఖ. స్త్రీ లోలత్వం వల్ల రావణుడు సీతాపహరణం చేసినా కుటిలంగా చేస్తాడు. మారీచుడిని మాయలేడి రూపంలో పంపి ఒంటరిగా ఉన్న సీతను ఎత్తుకువస్తాడు. ఎలాగైతే రావణుడికి విరాధుడు ఒక వ్యతిరేక ప్రతిబింబమో అలాగే అయోముఖి సూర్పణఖకి

వ్యతిరేక ప్రతిబింబం. ఎదురుపడ్డ లక్ష్మణుడిని చూసి మోహించి వేధిస్తుంది. ముక్కు చెవులు కోస్తే ఏడుస్తూ పారిపోతుంది కానీ సూర్పణఖ లాగా పగ తీర్చుకోవాలని ప్రయత్నం చెయ్యదు.

దశరథుడు

రాముడు అవతార భాధ్యత పూర్తి చేసుకోటంలో దశరథుడి పాత్ర కీలకమైనది. రాముడికి పట్టాభిషేకం చెయ్యాలని నిర్ణయించటం రాముడి వనవాసానికి దారి తీసింది. రామాయణం ఆరంభంలో దశరథుని మంత్రుల వర్ణన ఉంది. ముందు వాళ్ళని సంప్రదించి పుత్రకామేష్టి చేసే నిర్ణయం తీసుకున్నాడు దశరథుడు. రాముడి పట్టాభిషేకం గురించి కూడా వారిని సంప్రదించి ప్రజలని ఇతర రాజులనీ సభకి పిలిచి పట్టాభిషేక నిర్ణయానికి వారి అనుమతి కూడా తీసుకున్నాడు. ఒక విధంగా ఇది విచిత్రమైన విషయం. ఇదేమీ ప్రజాస్వామ్యం కాదు కదా? ఎవరు రాజు అవాలి అన్నదీ ఒక ధర్మ నిర్ణయమే తప్ప ప్రజాభిప్రాయం కాదు. వాల్మీకి సగరుడి కొడుకు అసమంజుడి గురించి చెబుతారు. అసమంజుడు, పెద్ద కొడుకు, తన తరువాత రాజు అవవలసినవాడు అయినా చిన్న పిల్లలని అకారణంగా హింస పెడుతున్నాడని ప్రజలు చెప్పటం వల్ల రాజ్యం నుంచి బహిష్కరిస్తాడు సగరుడు. జ్యేష్ట పుత్రుడు

అధర్మం చేస్తే మాత్రమే తన రాజ్యార్హత కోల్పోతాడు. రాముడిని అడవికి పంపటానికి దుఃఖిస్తున్న దశరథుడికి సగరుడి సంగతి గుర్తు చేస్తే మంత్రి సిద్ధార్థుడు ఇదే సమాధానం చెప్పి, రాముడు ఏ అధర్మం చేసాడో కైకేయిని చూపమంటాడు. వివరంగా చూసిన కొద్దీ దశరథుడు నిర్ణయం ఎందుకో హడావిడిగా తీసుకున్నట్టు తెలుస్తుంది. అందుకే ఈ నిర్ణయం వికటించి కైక వరాలకి దారితీసింది. ఉదాహరణకి పట్టాభిషేక నిర్ణయం తీసుకోవటం కోసం సభ ఏర్పాటు చెయ్యి కానీ సీత తండ్రి జనకుడికి, కైకేయి తండ్రికి ఆహ్వానాలు పంపవద్దని మంత్రి సుమంత్రుడికి చెప్పింది దశరథుడు. అదే దశరథుని అశ్వమేధ యాగం సమయంలో జనకుడు, కైకేయ రాజు ముఖ్య అతిథులు. వాళ్ళని స్వయంగా వెళ్ళి తీసుకుని రమ్మని సుమంతుడికి ఆజ్ఞ ఇస్తాడు వశిష్ఠుడు. అప్పటికి సీతారాముల వివాహం జరగను కూడా లేదు. కైకేయి తండ్రికి మాట ఇచ్చి తప్పుతున్నాడు దశరథుడు. ఇక్కడ కైకేయి తండ్రితో ధర్మాత్ముడైన జనకుడిని ప్రస్తావించటం ధర్మ నిష్ఠని గుర్తు చేయటం కోసం. మర్నాడు పట్టాభిషేకం అని ముహూర్తం నిర్ణయించినది కూడా దశరథుడే. చిన్న చిన్న విషయాలు కూడా మంత్రులకి వదలలేదు. రెండు సార్లు రాముడిని తన దగ్గరికి పిలిపించి పట్టాభిషేకం గురించి చెబుతాడు దశరథుడు. తన మేనమామ ఇంట్లో భరతుడు ఉన్నప్పుడే నీ పట్టాభిషేకం పూర్తి

అవాలిని నేను అనుకుంటున్నాను అని రాముడికి చెప్పటమే కాక భరతుడు పెద్దవాడివైన నీకు విధేయుడుగా ఉంటాడు కానీ కాలం ఏం చేస్తుందో చెప్పలేము కదా అని హడావుడి పడతాడు. ఉపవాసం చేయమని తాను స్వయంగా రాముడికి చెప్పి మళ్ళీ ఉపవాసం చెయ్యమని వశిష్టుడితో కబురు పంపుతాడు.

దశరథుడి మానసిక అలజడి కారణం దశరథుడు కైక తండ్రికి నీ కూతురికి పుట్టే కొడుకుని రాజుని చేస్తానని ఇచ్చిన మాట. ఈ విషయం అడవిలో తనని కలుసుకున్న భరతుడికి రాముడు స్వయంగా చెబుతాడు. రాముడికి ముందే తెలుసో, భరతుడితో వచ్చిన మంత్రులు అరణ్యంలో చెప్పారో వాల్మీకి చెప్పలేదు. కానీ దశరథుడి అంత్యక్రియల తరువాత రాజ్యాభిషేకం చేసుకోమని భరతుడితో చెప్పే ముందర అతని మేనమామని వశిష్టుడు సభకి పిలిపిస్తాడు. దశరథుడు మాట ఇచ్చిన విషయం మంత్రులకి తెలుసు అని ఇది సూచిస్తుంది. దశరథుడి మరణం తరువాత సభికులు రాజు ఎవరో నిర్ణయించు. అరాజరికం మంచిది కాదు అంటే దశరథుడు నిర్ణయం చేసేసాడు అంటాడు వశిష్టుడు. కైక తండ్రికి మాట ఇచ్చినా దశరథుడు కౌసల్యకి పాయసం ఇవ్వటం, రాముడు ముందు పుట్టటం వనవాసానికి దారి తీసింది.

వాల్మీకి రామాయణం ప్రకారం మంత్రులు రాజుకి తప్పు ఒప్పులు చెప్పగలరుగానీ రాజు ఆజ్ఞని ధిక్కరించకూడదు. శాసనాధికారం పూర్తిగా రాజుదే. రావణుడు మారీచుడికి స్పష్టంగా చెబుతాడు. రాజుకి సంతోషం కలిగించే మాట మంత్రి చెప్పాలి అని. రామ పట్టాభిషేకం గురించి దశరథుడు తీసుకున్న నిర్ణయానికి, సీతని అపహరించాలని రావణుడి తీసుకున్న నిర్ణయానికి, ఒక పోలిక కనపడుతుంది. ఇద్దరూ మంత్రులని పూర్తిగా సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకున్నారు. అవి పూర్తిగా విఫలం అయ్యాయి. హనుమంతుడు లంకని కాల్చి వెళ్లిపోయిన తరువాత మాత్రమే రావణుడు మంత్రులతో సంప్రదించటం మంచిది అని నీతులు చెప్పి, సీతను వెనక్కి ఇవ్వకుండా ఉండటానికి ఏమి చేయాలో సలహా చెప్పమని అడుగుతాడు. అప్పుడు కూడా, సీత నన్ను ఒక సంవత్సరం గడువు అడిగింది అని అబద్ధం చెబుతాడు. ఒక సంవత్సరం లోపల నా భార్యవి కాకపోతే నిన్ను చంపుతాను అని గడువు ఇచ్చింది రావణుడు. మంచికి చెబితే రావణుడు వినడు అని మంత్రులకి పూర్తిగా తెలుసు. అందుకే రావణుడి సభలో విభీషణుడిని ఎవరూ సమర్థించ లేదు. కానీ ఆఖరి యుద్ధానికి బయలుదేరే ముందు, సీతను వెనక్కి ఇవ్వమని నేను సభలో చెప్పాను అని ప్రహస్తుడు అబద్ధం చెబుతాడు.

రాముడు వనవాసానికి వెళ్ళిన కొద్ది రోజుల లోపే దశరథుడు మరణించాడు. రాముడి దూరమయ్యాడనే బెంగకి తోడు శాపం కూడా ఉంది అంటే మరణం ఇంకొంచెం సహజంగా ఉంటుంది. శ్రవణ కుమారుడి కథ కథావేణికి ముఖ్యం కాదు కానీ అది చాలా విచిత్రమైన వర్ణన. ఏనుగు నీళ్ళు తాగుతున్నచప్పుడు అనుకుని దశరథుడు బాణం వేస్తే శ్రవణ కుమారుడికి తగులుతుంది. నేను బ్రాహ్మణుడిని కాదు వైశ్యుడికి శూద్ర స్త్రీకి జన్మించిన వాడిని కనుక నీకు బ్రహ్మహత్యా పాతకం లేదులే అని శ్రవణుడు దశరథుడితో అంటాడు. కానీ అంతకు ముందు నేను ఋషిని, చంపటానికి ఎవరికి ఏ అపరాధం చేసాను అంటాడు.

వర్ణ సంకరం వల్ల జన్మించిన వాడికి తపస్సు చేసే అధికారం ఉందా? మోక్షం లభిస్తుందా? బ్రహ్మహత్య ఘోర పాతకం. ఇతర కులాల వారిని ప్రమాదవశాత్తు చంపటం అసలు నేరమే కాదా? దశరథుడికి ఏదో ఒక శిక్ష విధించవద్దా? తండ్రి శాపమే శిక్ష అని సరిపెట్టుకోవాలి. దశరథుడు వచ్చి జరిగింది చెబితే శ్రావణ కుమారుడి తండ్రి దశరథుడితో నువ్వు స్వయంగా వచ్చి తప్పు ఒప్పుకున్నావు కనుక నీ తల బ్రద్దలు కాలేదు. తెలియక చేసిన తప్పు కనుక నీకు బ్రహ్మ హత్యా పాతకం లేదులే అంటాడు. దీని అర్థం శ్రవణుడు బ్రాహ్మణుడని కదా? శ్రవణుడు అతని తండ్రి

చెప్పినవి పరస్పర విరుద్ధ కథనాలు. పైగా అవి ధర్మాచరణ గురించి అనేక ప్రశ్నలు లేవదీస్తాయి.

సీతాపహరణం, సీతా పరిత్యాగం

రాముడు ధర్మాన్ని ఉల్లంఘించకుండా రావణుడిని చంపటానికి సీతాపహరణం అవసరం. సూర్పణఖ రెచ్చగొట్టడం వల్ల తానుగా యుద్ధానికి వచ్చి, దండకారణ్యంలోని రాక్షసులని చంపుతాను అని మునులకి ఇచ్చిన మాటని నిలబెట్టుకోటానికి రాముడికి అవకాశం ఇచ్చాడు ఖరుడు. అలాగే సీత సౌందర్యం సూర్పణఖ వర్ణించగా విని స్త్రీ లోలుడు కనుక రావణుడు సీతను అపహరించి రాముడికి లంక మీద దండయాత్ర చేసే అవకాశం ఇచ్చాడు.

రాముడు ఏకపత్నీవ్రతుడని వాల్మీకి ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. కానీ రాముడికి ఒకే భార్య ఉండటం కథాపరంగా, ధర్మపరంగా కూడా అవసరం కనుకనే వాల్మీకి స్పష్టంగా చెప్పటం అవసరం లేదు అనుకున్నారు అనటం న్యాయం. కథాపరంగా విపులంగా చేసిన రాముడి విరహ వర్ణన ఉన్న ఒకే భార్యని సూచిస్తుంది. రాముడికి అనేకమంది భార్యలు ఉండి ఉంటే వారిలో సీతను మాత్రమే తనతో అడవికి తీసుకు వెళ్ళటం వల్ల ధర్మాచరణకి

బాధ కలుగుతుంది. దశరథుడికి వందలాది భార్యలు ఉన్నారని అనేకసార్లు వర్ణించారు వాల్మీకి. రాముడికి చాలామంది భార్యలు ఉంటే దాచవలసిన కారణం ఏమీ లేదు.

పుత్రకామేష్టికి వచ్చిన దేవతలు విష్ణువుతో దశరథుడికి నలుగురు పుత్రులుగా అవతరించమని అడగటం ధర్మాన్ని అనుసరిస్తూ రావణుడితో ఘర్షణ కలిగే అవకాశాలు పెంచటానికి. ఆలోచిస్తే నలుగురు కొడుకులు ఉండటం వల్లే కైక వరాలకీ, వనవాసానికి ఆస్కారం కలిగింది. నలుగురు కొడుకులలో ఒకడు కోపిష్టి అయి సీతను ఒంటరిగా వదిలి వెళ్ళాడు. కోపిష్ఠి అవటం వల్ల పెద్దలని నిందించి, ధర్మబలం కొంత కోల్పోయి అందువల్ల రావణుడిని జయించ లేకపోయిన వాడు లక్ష్మణుడు. రాముడి ఏకపత్నీవ్రతం రావణుడిని చంపటానికి అవకాశం పెంచింది.

సీతాపహరణం తరువాత వాల్మీకి రాముడి విరహాన్ని విస్తారంగా వర్ణించారు. హనుమంతుడు సీతను లంకలో ఉందని చెప్పగానే సీత మరణించినదేమో అన్న భయం తొలగి పోవటం వలన రాముడి వియోగ వర్ణనలో శృంగార భావన కొంచెం ఎక్కువ అవుతుంది. రావణ వధ వరకూ సీతావియోగంతో బాధపడిన రాముడు సీత లభించగానే నలుగురూ ఏమనుకుంటారో అని

ఆలోచిస్తాడు. ఇది సహజం. దొంగిలించబడిన వస్తువు వెనక్కి తీసుకోవాలనే తపనే గానీ ఒకవేళ లభించినా దాని ఉపయోగం ఉండదు అని ముందే ఎవరూ ఆలోచించరు. విరాధుడు సీతను పట్టుకున్నప్పుడు వాడి ఒడిలో సీతను చూడటం కంటే పెద్ద భాధ ఏముంది అని రాముడు దుఃఖిస్తాడు. వాడిని చంపిన తరువాత ఆ విషయం అసలు పట్టించుకోడు. రావణుడి విషయంలో తేడా ఏమిటి? ఇక్కడ లోకం అందరికీ తెలుసు. అక్కడ కేవలం తనకు లక్ష్మణుడికి మాత్రమే తెలుసు. ఈ సొగసు చూపటానికి కూడా విరాధుడి కథనే ఉపయోగించారు మహర్షి.

పురాతన సమాజ భావనల వల్ల సీతాపహరణం తరువాత సీతా పరిత్యాగం అవసరం. ఏకపత్నీ వ్రతుడైన రాముడు నరుడిగా పితృఋణం తీర్చుకోవటం ధర్మవేణిలో అవసరం. అందుకే సీత అగ్నిప్రవేశం చేసినప్పుడు దేవతలకి దిగిరాక తప్పలేదు. పితృ ఋణం తీర్చుకోకుండా నర అవతార సమాప్తి కాదు. దైవ ఆజ్ఞ లేకుండా సీతను స్వీకరించటం నర ప్రవర్తన కాదు.

చాలామంది అనుకునేటట్టు రాముడు శీల పరీక్షగా అగ్నిప్రవేశం చేయమని సీతతో అనడు. నేను నిన్ను స్వీకరించలేను. నీకు ఎక్కడ సుఖంగా ఉంటుందని అనుకుంటే అక్కడ ఉండు అని

మాత్రమే అంటాడు. రాముడి పరుషమైన మాటలని ఎక్కువగా ఎత్తి చూపేవారు లక్ష్మణుడితో అంతకంటే ఎక్కువ పరుషంగా సీత మాట్లాడిందని గుర్తించరు. సీత లక్ష్మణుడిని సందేహించి తిట్టినందుకు రాముడు సీతను నిందించడు. ఒక స్త్రీ మాటకి కోపం తెచ్చుకుని నా ఆజ్ఞ ఉల్లంఘించి నువ్వు తప్పు చేసావు అని లక్ష్మణుడితో ముందే చెప్పాడు.

రాముడి పరుషమైన మాటలకంటే కూడా సామాన్య పాఠకులు గుర్తించని ఇంకొక సంఘటన రాముడు సామాన్య మానవుడిలా ప్రవర్తించటాన్ని ఎత్తి చూపుతుంది. విభీషణుడి పట్టాభిషేకం తరువాత రాముడు సీతకి స్నానం అలంకారం చేయించి తర్వాత నా వద్దకు తీసుకుని రమ్మని చెబుతాడు. ఎందుకు? రావణుడి అంతఃపురంలో ఏడాది గడిపిన సీతని పరిత్యజించబోతున్నాడు. సీత దేవకన్యలా కాక దీనావస్థలో ఉండి ఉంటే ఇతరులు తన కాఠిన్యాన్ని మరింత నిరసిస్తారు కనుక. విజయవార్త చెప్పటానికి తన దగ్గరికి వచ్చిన హనుమంతుడితో సీత తప్పు చేసిన వాళ్ళని కూడా క్షమించాలి అంటుంది. రాముడు తప్పు చెయ్యని సీతని నిందించడాన్ని నొక్కి చెప్పటంకోసం, సరిగ్గా సీతా పరిత్యాగం ముందు వాల్మీకి చేసింది ఈ వర్ణన.

సీత అగ్నిప్రవేశం ముందు రాముడి మాటకి మాట బదులు చెప్పి నువ్వు ఇలా పదిమందిలో అనరాని మాటలు అన్నావు. నాకు ఇక అగ్ని ప్రవేశం చేయడమే మంచిది అని అంటుంది. రాముడిలా పరుషంగా మాట్లాడిన భర్తకి ఏ భార్య అయినా అదే సమాధానం ఇస్తుంది. సీత లక్ష్మణుడితో చితి ఏర్పాటు చెయ్యమని చెబితే రాముడు ఏం మాట్లాడడు. ధర్మపరంగా సీతని పరిత్యజించటం అయిపోయింది. రాముడికి ఇక మాట్లాడే హక్కు లేదు. కోపంగా ఉన్న లక్ష్మణుడు రాముడి ముఖం చూసి అన్నకి అంగీకారమే అనుకుంటాడు. రాముడికి జరగబోయేది తెలుసని పాఠకులు అంతర్వాహిని అయిన లీలని గుర్తించటం కోసం చేసిన వర్ణన. సరిగ్గా అగ్ని ప్రవేశం ముందు సీత నేను పరిశుద్ధురాలనైతే అగ్ని నన్ను రక్షిస్తుంది అంటుంది. ఇంకా రాముడు నరధర్మానుసారం పుత్రులని కని పితృఋణం తీర్చుకోలేదు. కనుక మాటలో తేడా కనపడుతుంది. అదే సీత ఉత్తరకాండలో నేను పరిశుద్ధురాలనైతే భూమి నాకు ప్రవేశం ఇస్తుంది అంటుంది. కొడుకులని రాముడు స్వీకరించటంతో పితృ ఋణం తీరింది కాబట్టి. అగ్ని దేవుడు స్వయంగా వచ్చి సీతను రాముడికి సమర్పిస్తే, దైవాజ్ఞగా సీతను స్వీకరిస్తాడు రాముడు. సీత మీద నాకు అనుమానం ఎప్పుడూ లేదు. కానీ లోకులు కామం కొద్దీ సీతను స్వీకరించానని అంటారు. అందుకే సీతతో అలా మాట్లాడాను అంటాడు రాముడు. సీతను

సముదాయించగల వాళ్ళు అక్కడ ఎవ్వరూ లేరు. కథావేణిలో అది అవసరం. కనుక దేవతలతో కలసి దశరథుడు రావలిసి వచ్చింది.

కానీ దీని వల్ల చాలా సందేహాలు తల ఎత్తుతాయి. మరణం తరువాత స్వర్గంలో ఉన్న దశరథుడికి బ్రతికున్నప్పటి సంబంధ బాంధవ్యాలు ఉండవచ్చా. అప్పుడు ప్రారబ్ధ కర్మ, సంచిత కర్మ ఏమిటి? భగవద్గీతలోని వర్ణనలకి ఇది విరుద్ధం కాదా? అసలు జన్మ మరణ చక్రం అనేది ఉందా లేదా? సీతా, రాముడు కూడా ఒక్కొక్కసారి పూర్వ జన్మని, మిగతా సమయాల్లో శాశ్వతమైన స్వర్గ సుఖాన్ని నమ్మినట్టు కనపడుతుంది. అక్కడక్కడ చాలా కాలం స్వర్గంలో ఉండి పుణ్యం అయిపోయి భూలోకానికి యయాతి తిరిగి వచ్చాడని కూడా ఉంది. మానవుడి గమ్యం స్వర్గమా లేక మోక్షమా అన్నది మన కథలు అన్నింటిలోనూ కనపడే పరస్పర విరుద్ధ కథనలలో ప్రముఖమైనది.

దైవాజ్ఞగా సీతను స్వీకరించిన రాముడు మళ్ళీ లోకాపవాదానికి వెరచి సీతా పరిత్యాగం చేస్తాడు. కేవలం ఒక తాగుబోతు మాట ఆధారంగా రాముడు సీతను పరిత్యాగం చేయలేదు. భద్రుడు ప్రజలందరూ యథా రాజా తథా ప్రజా అని తాము కూడా ఇతరుల

ఇళ్ళల్లో ఉన్న భార్యలను స్వీకరించాలా అనుకుంటున్నారని చెబితే, పక్కనే ఉన్న స్నేహితులు అందరూ రాముడికి సాష్టాంగ నమస్కారం చేస్తూ భద్రుడు చెప్పినది నిజమే అని అంటారు. అప్పుడు రాముడు తమ్ముళ్ళని పిలిచి వారికి చెప్పి, అంతకు ముందు సీత ఋషి ఆశ్రమాలు చూడాలని ఉందన్న మాటని ఆధారం చేసుకుని సీతని గంగ దాటించి వదిలేసి రమ్మని లక్ష్మణుడిని ఆజ్ఞాపిస్తాడు. రెండవసారి సీతా పరిత్యాగం చేసిన తరువాత రాముడి విరహ వర్ణన లేదు. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటి సారి సీతని ఇతరులు ఎత్తుకు పోయారు. ఈ సారి పంపింది తానే. బాధ ఉన్నా వ్యక్తం చేయలేడు. ఇంకొక కారణం. రాజు భాధ్యతలు. రాజు తన బాధ్యతలు నిర్వహించక పోతే నృగ మహారాజుకి ఊసరివిల్లి జన్మ లభించింది అంటాడు లక్ష్మణుడితో. మొదటి సారి రాముడి భాధ్యత సీతను వెతకటం మాత్రమే. రెండవసారి రాజరికం. లవకుశులని రాజపుత్రులు అంటూ ప్రవేశపెట్టారు వాల్మీకి, వాళ్ళు రాముడి కొడుకులు అని సూచిస్తూ[26]. వాళ్ళు రాముడి సభలో గానం చేసినదే రామాయణం అని బాలకాండ లోనే మనకి స్పష్టం అవుతోంది. రాముడు వాళ్ళను తన కొడుకులని గుర్తించి సీత శపథం చేస్తుందా అని

---

[26] కుశలవులు రాముడి సైన్యంతో యుద్ధం చేయటం వాల్మీకి రామాయణంలో లేదు.

వాల్మీకిని దూత ద్వారా అడుగుతాడు. పతి స్త్రీకి ప్రత్యక్ష దైవం. ఇది భర్త ఆజ్ఞ. కనుక చేస్తుంది అంటారు మహర్షి.

వాల్మీకి మహర్షినీ సీతనూ రాముడు సభకు పిలిపిస్తాడు. సీత సభలోకి వచ్చి, రాముడికేసి చూడను కూడా చూడకుండా తలవంచుకుని, శపథంచేసి సమస్త లోకుల ఎదటా భూమిలోకి వెళ్ళిపోయిందని ఉత్తర కాండలోని వర్ణన. ఏకపత్నీవ్రతుడైన రాముడు లవకుశులని స్వీకరించి తన పితృ ఋణం తీర్చుకునే అవకాశం ఈ విధంగా కలుగుతుంది. ఇది నైమిశారణ్యంలో రాముడు చేసిన అశ్వమేధ యాగంలో, సకల మానవులు, దేవతలు చూస్తూ ఉండగా జరుగుతుంది. లంకలో సీత అగ్ని ప్రవేశానికి కేవలం కొద్దిమంది రాక్షసులు, వానరులు మాత్రమే ప్రేక్షకులు.

ఇంద్రజిత్తు

పట్టాభిషేకం తరువాత రాముడిని అభినందించిన మహర్షులు రావణుడి కంటే ఇంద్రజిత్తే గొప్పవాడు అనటం విచిత్రం కాదు. రావణుడితోటి యుద్ధంలో రాముడు అలిసిపోతే అగస్త్యుడు వచ్చి ఆదిత్య హృదయం ఉపదేశిస్తాడు. కానీ ఇంద్రజిత్తు రెండు

సందర్భాలలో రామలక్ష్మణులని కదలలేకుండా బంధించాడు. మొదటిసారి సర్పబంధాలతో బంధిస్తే వాళ్ళని విడిపించటానికి గరుత్మంతుడు రావాలిసి వచ్చింది. రెండవ సారి బ్రహ్మాస్త్రం వల్ల రామలక్ష్మణులతో సహా సకల వానర సైన్యమూ దెబ్బ తింటుంది. హనుమంతుడు ఔషధీ పర్వతం తెచ్చి రక్షిస్తాడు. ఇంద్రజిత్తు అదృశ్యంగా ఉండి యుద్ధం చేయటం కుటిలత్వమే. అయినా రెండు సార్లూ రాముడు ధర్మనిష్ఠతో ఇంద్రజిత్తుని జయించలేక పోయాడు అన్నది నిజం. కానీ లక్ష్మణుడు రాముడి ధర్మనిష్ఠతోనే ఇంద్రజిత్తుని చంపాడు. రాముడు ధర్మాత్ముడు సత్యసంధుడు అయితే ఈ బాణం ఇంద్రజిత్తుని చంపాలి అని అంటూ బాణం వదులాడని ఇంతకు ముందు చర్చించాను.

ఇతర రాక్షసులకి ఇంద్రజిత్తుకి ఒక ముఖ్యమైన తేడా ఉంది. కుంభకర్ణుడి గురించి చెబుతూ, ఇతర రాక్షసులు వరాల వల్ల బలవంతులు. కుంభకర్ణుడు స్వయంగా బలవంతుడన్నాడు విభీషణుడు. నిజానికి ఇంద్రజిత్తు ఇతర రాక్షసులలాగా తపస్సు చేసి వరాలు సంపాదించుకోలేదు. శుక్రాచార్యుడి ఆధ్వర్యంలో యజ్ఞాలు చేసి శక్తి సంపాదించి, ఆ శక్తితో ఇంద్రుడిని బంధిస్తాడు. ఇంద్రుడిని విడిపించడానికి బ్రహ్మ ఇంద్రజిత్తుకి వరం ఇస్తాడు. రావణుడు యముడి మీద విజయం సాధించి లంకకి తిరిగి

వచ్చినప్పుడు అతనికి తెలుస్తుంది మేఘనాథుడు శుక్రుడిని గురువుగా చేసుకుని యజ్ఞాలు చేసి వరాలు పొందాడని. మన శత్రువులకు కానుకలు ఇవ్వడం ఎందుకు చేసారు? పోనీలే అయిపోయింది అయిపోయింది అంటాడు రావణుడు. చాలా ముఖ్యమైన మాట. అంటే దైవశక్తులని స్వశక్తితో (తపస్సు చేసి) అధిగమించడం మెరుగు అని. అంతేకాదు స్వశక్తి, దైవశక్తుల కంటే గొప్పదనీ ఈశ్వర శక్తి లేదనీ భావించటమే అసుర, దానవ, రాక్షస లక్షణం. నిశాచరులు ఈ తప్పుడు మార్గంలో నడచేవారు మాత్రమే. రాత్రివేళ తిరగేవారు అని శబ్దార్థం తీసుకోకూడదు. హనుమంతుడు సూర్యాస్తమయం వరకు ఆగి రాత్రి లంకలోకి అడుగు పెడతాడు. నిశాచరులు నిద్రపోకపోతే రాత్రి వరకు ఆగటం ఎందుకు? అలాగే హనుమంతుడికి తెల్లవారుజామున సీత కనపడుతుంది. సూర్యోదయం అవగానే వందమాగధులు స్తోత్రం చేస్తే రావణుడు లేచి సీత దగ్గరకు వస్తాడు. అంటే నిశాచరుడు కాదనే కదా. రాక్షసులు, దైత్యులు, అసురులు కూడా ఈశ్వర విరోధులు. ఈ తప్పు మార్గంలో నడిచే వారిలో జన్మించిన వాడు కనుక అప్పుడప్పుడు విభీషణుడిని కూడా నిశాచరుడు అనటం కనపడుతుంది.

మూడుసార్లు అదృశ్యంగా ఉండి యుద్ధం చేసాడు ఇంద్రజిత్తు. సీతను వెతుకుతూ వచ్చిన హనుమంతుడిని పట్టుకోవటం కోసం అశోకవనం వచ్చినప్పుడు ఇంద్రజిత్తు అదృశ్యంగా యుద్ధం చెయ్యలేదు. వానర సైన్యంతో యుద్ధం మొదలయినప్పుడు కూడా అదృశ్యం అవకుండా యుద్ధం చేస్తాడు. మొదటి రోజు యుద్ధంలో అంగదుడి చేతిలో దెబ్బతింటాడు. అప్పుడు కోపం వచ్చి అదృశ్యమై రామలక్ష్మణులని సర్పబంధంలో బంధిస్తాడు. రెండుసార్లు యుద్ధం చేయటానికి వచ్చే ముందర యజ్ఞం పూర్తి చేస్తాడు. కానీ యజ్ఞాలు నికుంభిలకు వెళ్ళి చెయ్యలేదు. యుద్ధ భూమి దగ్గరే రాక్షసులని కాపలా ఉంచి యజ్ఞం పూర్తి చేస్తాడు. మొదటిసారి యజ్ఞం పూర్తి చేసి వచ్చి బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడు. హనుమంతుడు మొదటిసారిగా ఓషధి పర్వతాన్ని తీసుకు వస్తాడు. రెండవసారి అదృశ్యంగా ఉండి బాణాలతో అందరినీ హింసిస్తే, ఇంద్రజిత్తు మీద కోపించి లక్ష్మణుడు బ్రహ్మాస్త్రం ప్రయోగించి ప్రపంచంలోని రాక్షసులందరినీ ఒకేసారి చంపేస్తాను అంటాడు. రాముడు వారించి, ఈ ఇంద్రజిత్తు అదృశ్యంగానే ఉన్నప్పటికీ వాడిని ధర్మమార్గంలో చంపడానికి నేను మార్గాలు ఆలోచిస్తున్నాను, వాడు కనపడితే వానర వీరులు చంపేస్తారు, మూడు లోకాలలో ఎక్కడ దాక్కున్నా సరే నా దివ్యాస్త్రాలతో చంపగలను అనటం వింటాడు. ఆ మాటలు విని భయపడి

నగరంలోకి వెళ్ళిపోతాడు. మరణించిన రాక్షసులని గుర్తు తెచ్చుకుని తన పిరికితనానికి సిగ్గు పడి తిరిగి యుద్ధానికి వస్తాడు. రాముడి ఆలోచన భంగం చేయటానికి, అదృశ్యం అవటం కోసం తాను యజ్ఞం చేస్తున్నప్పుడు తనని వెతుకుతన్న వానరులు చూస్తారేమో అనే భయంకొద్దీ, మాయా సీతని వధించి గుప్తంగా యజ్ఞం నికుంభిలలో ఆరంభిస్తాడు. మాయాసీతని వధించటమనే మోసానికి ఒడిగట్టాక ఇంద్రజిత్తు యజ్ఞం పూర్తి చేయలేకపోవటం ధర్మవేణిలో సూచన. ఇంద్రజిత్తు చంపినది మాయా సీత అని తెలియక దుఃఖిస్తున్న రాముడికి విభీషణుడు నికుంభిలలో యజ్ఞం చేస్తున్నాడని చెప్పటం వల్ల యజ్ఞానికి విఘ్నం కలుగుతుంది. అలా యజ్ఞం పూర్తి కానప్పుడు మాత్రమే మరణం సంభవం అన్నదే ఇంద్రజిత్తుకి బ్రహ్మ ఇచ్చిన వరం. ఇంద్రజిత్తు యజ్ఞం సక్రమంగా చేసిన రెండు సార్లు స్వయంగా అగ్నిదేవుడు వచ్చి ఆహుతి స్వీకరిస్తాడు. ఈ వర్ణన దైవశక్తికి ఈశ్వరత్వానికి ఉన్న తేడా చూపుతుంది. దైవశక్తికి స్వాతంత్ర్యం లేదు. యజ్ఞం సరిగ్గా చేసినప్పుడు ఇంద్రజిత్తుకి ఫలం ఇచ్చి తీరాలి. ఈ దృష్టిలో చూసినప్పుడు చతుర్ముఖ బ్రహ్మ దైవశక్తే గాని ఈశ్వరుడు కాదు. శివుడిలో ద్వంద్వం కనపడుతుంది. శివుడిని భక్త సులభుడు అంటారు. తేలికగా ప్రసన్నుడై ఏ వరం అడిగినా ఇస్తాడు. అందుకే అనేకమంది అసురులు శివభక్తులు. కానీ

శివభక్తులందరూ అసురులు కారు. విష్ణువుని ఆపదలనుంచి తప్పించుకోవటానికి ప్రార్థించినవారు పురాణ కథలలో తరచు కనపడతారు కానీ విష్ణువు దగ్గర వరాలు సంపాదించుకున్న భస్మాసురుడు, రావణుడు వంటి దుష్టులు కనపడరు. అసుర భావాన్ని వదులుకోకుండా విష్ణువు ప్రసన్నుడు కాదు. ఆపదలో కాపాడమని విష్ణువుని వేడుకున్నా లేక శివుడిని వేడుకున్నా ఈశ్వరత్వాన్ని ధిక్కరించే అసురత్వం ఉండదు[27]. ధర్మాత్ముడైన బలికి తల మీద విష్ణు పాదం తగిలే వరకు అహంకారం పోలేదు. బలికి ద్రౌపదికి ఇదే తేడా.

ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వలన రాముడితోసహా అందరూ పడిపోతే హనుమంతుడు, విభీషణుడు ఎందుకు పడిపోలేదు? హనుమంతుడి విషయంలో రెండు పరస్పరం విభేదించే వివరాలు కనపడతాయి. ఒకటి హనుమంతుడిని ఏ అస్త్రాలూ బాధించవని బ్రహ్మ ఇచ్చిన వరం. రెండవది మొదటి సారి ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం నార బంధాల వలన విడిచి పోతుంది. ఇంకొకసారి అవసరం వస్తే బ్రహ్మాస్త్రం కూడా పనిచేయదు కాబట్టే ఇంద్రజిత్తు బాధపడతాడు. విభీషణుడుని

---

[27] శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో శివపూజని నిరాకరించటానికి కారణం భక్తుడిని ఈ అసురుడైపోయే ప్రమాదంనుంచి కాపాడటం అని సర్దుబాటు చెయ్యవచ్చు.

ఎందుకు బ్రహ్మాస్త్రం బాధించలేదో వాల్మీకి చెప్పలేదు. అక్కడ విభీషణుడు ఎందుకు? హనుమంతుడు లేకపోతే అందరం లేనట్లే అన్న జాంబవంతుడి మాటకి ఒక శ్రోత కావాలి కనుక. జాంబవంతుడి మాట రాముడు నిజంగా మనుజావతారం అని చూపటానికి చాలా ముఖ్యం. కానీ ఈ ఘట్టంలోని మొదటి శ్లోకాలలో వానర వీరులు రాముడు పడిపోయాడని గమనించి దుఃఖిస్తారు. తరువాతి శ్లోకాలలో విభీషణుడు, హనుమంతుడు వెతికితే వాళ్ళంతా మరణించారని ఉంటుంది. తరతరాలుగా ఎవరూ పట్టించుకోని పరస్పర విరుద్ధ కథనాలు ఇవి. అలాగే ఇంద్రజిత్తు అదృశ్య యుద్ధం వర్ణనలో అనేక సార్లు పరస్పర విరుద్ధ కథనాలు ఉన్నాయి. ఇంద్రజిత్తు అదృశ్యం అయ్యాడు అన్న తరువాత వానరులు వాడి మీద రాళ్ళూ చెట్లూ విసిరితే కోపించి బాణాలు వేసాడనే వర్ణన కనిపిస్తుంది. వాళ్ళకి ఎలా కనపడ్డాడు?

విభీషణుడు

ఇతరుల రామకథలలో విభీషణుడి కంటే విభీషణ శరణాగతి ముఖ్యం. ఏ మినహాయింపూ లేకుండా రక్షించమని అడిగిన వాళ్ళని అందరినీ రక్షిస్తాను ఆఖరికి రావణుడు అయినా సరే

అని రాముడు తను విష్ణువుని అన్న విషయం స్పష్టం చేశాడని నమ్ముతారు భక్తులు. రాముడు చెప్పిన ఆ శ్లోకాన్ని చరమ శ్లోకం[28] అని ప్రత్యేకంగా గౌరవిస్తారు. వాల్మీకి రామాయణంలో ఈ మాట అనేముందు అహంకారి అయిన శత్రువే అయినా సరే చేతులు జోడించి అడిగితే రక్షించి తీరాలి. లేకపోతే చేసిన పుణ్యమంతా నాశనం అవుతుంది అంటాడు రాముడు. ప్రతి మానవుడికీ ఇదే ధర్మం. ఇది కేవలం అవతార పురుషుడి లక్షణం కాదు. మరి అహంకారి అయిన శత్రువు అవసరం తీరిన తరువాత ద్రోహం చేస్తే? ఈ ప్రశ్న అడిగితేనే మన ధర్మం యొక్క అసలు లక్షణం తెలుస్తుంది. ధర్మం ఎప్పుడూ పరలోక సుఖం కోసం, మోక్షం కోసం. ఈ లోకంలో క్షణికమైన సుఖం కోసం కాదు. జాబాలి నాస్తిక వాదానికి సమాధానంగా రాముడు ఇది స్పష్టం చేస్తాడు. దుష్టుడికైనా శరణు ఇవ్వటం ధర్మం అన్న రాముడి మాట కూడా అదే చెప్తుంది. దుష్టుడు శరణం అడిగి మోసం చేస్తే ఈ భూలోకంలో దుఃఖం కలిగినా ధర్మాచరణ వల్ల పరలోకంలో సుఖం ఇస్తుంది. రాముడి లీలని కనిపించీ కనిపించని అంతర్వాహిని చెయ్యటం కోసం మహర్షి ఈ మాట అన్నారు అని కూడా అనవచ్చు.

---

[28] ఈ శ్రీరామ చరమశ్లోకంతో పాటు "సర్వధర్మాన్ పరిత్యజ్య...." (శ్రీమద్భగవద్గీత18/66) కృష్ణ చరమ శ్లోకమని భావిస్తారు

తన అన్నని వదిలి శత్రువులతో చెయ్యి కలిపిన విభీషణుడు ఒక ధర్మాత్ముడు అనటం చాలా మందికి నచ్చదు. కానీ తన అన్నని యుద్ధంలో ఓడించి పుష్పక విమానం లాక్కున్నది రావణుడు అని గుర్తించాలి. అంతే కాక ఏదో ఘనకార్యం చేసినట్టు తానే సీతాపహరణ సమయంలో చెప్పుకుంటాడు. బహుశా వాల్మీకి రామాయణంలో కుబేరుడి కథ ఉన్నది అందుకేనేమో. తపస్సు చేసి దిక్పాలకుడు, అమరుడు అవుతాడు కుబేరుడు. తపస్సు చేసి ఎప్పుడూ ధర్మమే తప్ప అధర్మం చేయకుండా ఉండటం వరంగా కోరుకుంటాడు విభీషణుడు. బ్రహ్మ నీకు అమరత్వం కూడా ఇస్తున్నాను అంటాడు విభీషణుడితో. ఇది స్పష్టంగా ధర్మాచరణ పట్ల చూపిన శ్రద్ధకి ప్రతిఫలం.

కుబేరుడిలాగే, విభీషణుడు కూడా అడగకుండా అమరత్వం సంపాదించుకున్నాడని అమరత్వం వరంగా ఇమ్మని బ్రహ్మని కోరుకున్న రావణుడూ, ఇంద్రజిత్తు కూడా పట్టించుకోరు. వారికి అమరత్వం కావలసినది అధర్మం చేయటానికి. విభీషణుడు మూడు సార్లు సలహా ఇస్తాడు సీతను రాముడికి ఇచ్చేయమని. మూడో సారి, ఇంద్రజిత్తు పినతండ్రిని తిడుతూంటే ఆపకపోగా, నువ్వు నా శత్రువువి అని విభీషణుడిని తిడతాడు రావణుడు. అప్పుడు విభీషణుడు వెళ్ళి పోతాడు. మూడు సార్లు చెప్పినా

వినని రావణుడిని వదిలి వెళ్ళటం ధర్మాచరణలో ముఖ్యమైన విషయం.

విభీషణుడు అన్నతో, అన్న కొడుకుతో, తన ఇతర బంధువులతో యుద్ధం చేసాడు. రావణుడు పంపిన గూఢచారులని రాముడికి పట్టిచ్చాడు. అంతేకాక మళ్ళీ అదృశ్యంగా రణరంగానికి రావటం కోసం ఇంద్రజిత్తు హోమం చెయ్యాలి. అందుకే వాడు నికుంభిల వెళ్ళాడు. మీరు దుఃఖిస్తూ ఉండి ఈ విషయం గ్రహించకుండా ఉండేందుకు మాయా సీతని వధించాడు. ఆ యజ్ఞం మధ్యలో ఆగితేనే ఇంద్రజిత్తుని చంపటం సాధ్యం అని కూడా రాముడికి చెప్పేస్తాతాడు. వాల్మీకి రామాయణంలో విభీషణుడు రాముడికి చెప్పిన రహస్యం ఇది ఒక్కటే. కానీ స్నేహితుడిని ఇంద్రజిత్తు మోసం చేస్తున్నాడు అని తెలిసికూడా చెప్పకపోవటం అధర్మం అవుతుంది. ధర్మ సూక్ష్మం గుర్తించకపోతే విభీషణుడు చేసినది ధర్మం ఎలా అయిందో అర్థం అవదు.

రావణుడి సభలో, మీరు ఎవ్వరూ రాముడి శక్తి ధర్మం అని గుర్తించటం లేదు అన్నట్టుగానే రాముడిని సర్పబంధంలో చూసి దుఃఖిస్తున్న వానర వీరులని ఓదారుస్తూ, సత్యధర్మాలమీద శ్రద్ధ ఉన్న వారికి మృత్యుభయం లేదు అంటాడు. సముద్రం మనం

ఎలా దాటాలి అని సుగ్రీవుడు అడిగితే రాముడు సముద్రుడిని వేడుకోవాలి. సగరుడు సముద్రుడికి సహాయం చేసాడు. కనుక సగరుడి వంశస్తుడైన రాముడికి సహాయం చేయటం సముద్రడికి ఉచితంగా ఉంటుంది అంటూ రాముడికి నచ్చిన ధర్మ పరమైన సమాధానం ఇస్తాడు.

రాముడికి విభీషణుడి ఆవశ్యకత రావణుడిని చంపటానికి కాదు, రావణుడిని చంపిన తరువాత ఉంటుంది. రావణుడిని చంపి లంకని అరాజకంగా వదలటం ధర్మం కాదు. తాను లంకకి రాజు అవలేడు. తనది వానర సైన్యం. రావణుడి బంధువులు మిగల లేదు. విభీషణుడు లేకపోతే లంకకి ఒక ధర్మపరుడైన రాజుని రాముడు ఎక్కడ నుంచి తెస్తాడు?

ధర్మనిష్ఠ

వాల్మీకి రామాయణంలో దుష్టుల వర్ణనా నైపుణ్యం ఇంతకు ముందు చూసాము. రాముడి శక్తి ధర్మం అని గుర్తించాము. కానీ ఉదాత్తమైన పాత్రలలో, సీతారాములతో సహా, చిన్న చిన్న దోషాలు వాల్మీకి రామాయణంలో కనపడతాయి. ఉదాహరణకు రాముడు

వనవాసానికి బయలుదేరాడు. రథం ఆపమని అరుస్తూ వెనుకే వస్తాడు దశరథుడు. రథం ఆపవద్దు. తల్లితండ్రుల బాధ నేను సహించలేను. అంతగా వెనక్కి వచ్చాక ఎందుకు ఆపలేదు అని మహారాజు అడిగితే, చప్పుడులో ఆ పిలుపు వినపడలేదని చెప్పు అంటాడు సుమంత్రుడితో. ఇది అబద్ధం చెప్పమనటమే. సీతతో నీకోసం నేను ఈ యుద్ధం చెయ్యలేదనటం అబద్ధమా? అంతకు ముందు లంకనించి తిరిగివచ్చిన హనుమంతుడిని ఇప్పుడే సీత దగ్గరికి నన్ను తీసుకుని వెళ్ళమని దుఃఖించటం అబద్ధమా? ఖరుడు యుద్ధంలో రాముడి చేతిలోని విల్లుని విరక్కొడతాడు. చివరి క్షణంలో మీద మీదకి వచ్చిన ఖరుడిని తప్పించుకోవటం కోసం ఒక అడుగు వెనక్కి కూడా వేస్తాడు రాముడు. అయోధ్య నుండి స్థైరంగా బయలుదేరిన రాముడు తాము సారథిలేకుండా అడవిలో గడిపిన మొదటి రాత్రి తన బాధ వ్యక్తం చేసి, కౌసల్యా బాగోగులు చూడటం కోసం లక్ష్మణుడిని వెనక్కి వెళ్ళిపోమని అంటాడు. అలాగే భరతుడిని కలవటం ముఖ్యం. అందువల్ల నీ ఆతిథ్యం స్వీకరించలేను అని విభీషణుడికి చెప్పి పుష్పక విమానం మీద బయలుదేరిన రాముడు, భరద్వాజ ఆశ్రమం చేరగానే భరతుడు రాజ్యం తనకే శాశ్వతంగా కావాలని అనుకుంటున్నాడేమో కనుక్కో అని చెప్పి హనుమంతుడిని అయోధ్యకి పంపుతాడు. విరాధ కబంధుల చేతిలో చిక్కినప్పుడు

అధైర్యపడి ఒక సాధారణ వ్యక్తి లాగా విధి అని దుఃఖిస్తాడు. యుద్ధంలో గాయపడిన లక్ష్మణుడిని చూసి బేలగా ఏడుస్తాడు[29]. సీతాపహరణం తరువాత నాకు సీతని వెనక్కి ఇవ్వకపోతే సకల సృష్టిని నాశనం చేస్తాను అని బెదిరిస్తాడు. బలం ఉన్న ఏ సాధారణ మానవుడైనా అలాగే ప్రవర్తిస్తాడు, లక్ష్మణుడు ధర్మం గుర్తు చేయగానే వినటమే రాముడి ధర్మనిష్ఠ అని ఇంతకు ముందు గుర్తించాము. రాముడి విరహం కూడా ఆధునికులకి హాస్యాస్పదంగా కనబడుతుంది. పైన చూపిన లోటుపాట్లు చాలా తేలికగా కనపడుతాయి. ఇంకొన్ని సంఘటనలని గురించి దీర్ఘంగా ఆలోచించిన తరువాతే అవి సహజమైన మానవ జీవన వర్ణన, ప్రవర్తన అని గుర్తించగలం. రావణుడిని చంపే వరకూ సీతావియోగంతో బాధపడిన రాముడు తీరా సీత లభించగానే లోకులు ఏమనుకుంటారో[30] అనుకుని సీతను వదిలేయటం ఒక ఉదాహరణ. పర పురుషుడిని నా అంతట నేను తాకను అని

---

[29] ఆధునిక నాస్తికులు సాధారణ మానవుని కన్నా ఎక్కువగా అధైర్యం, అబలత్వం ప్రదర్శించిన రాముడు, ఆ తర్వాత దేవదేవుడే అయిపోయాడు అంటారు. వాళ్ళు అనుకున్నట్టు మొదట్లో రామ కథ ఒక రాజు చరిత్రో, వీరగాథో కాదనటానికి, ఆ ఒక్క మాటే చాలు. నాయకుడికి ఇటువంటి లోట్లు ఉన్నట్టు అలాంటి రచనలలో ఎప్పుడూ చెప్పరు. ఒకవేళ నిజజీవితంలో లోట్లు ఉన్నా, రచనలో కప్పి పెడతారు కానీ వాటిని ప్రస్ఫుటంగా ఎప్పుడూ వెల్లడి చెయ్యరు.

[30] దీని గురించి గుండెలు బాదుకునే ఆధునికులు నేటి సమాజంలో ప్రముఖుల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండకూడదని వాదిస్తారు.

హనుమంతుడికి చెప్పిన సీత, ఇంద్రజిత్తు మరణం తరువాత తనని చంపటానికి కత్తి తీసుకుని వస్తున్న రావణుడిని చూసి ఆవాళ హనుమంతుడి వీపు ఎక్కి వెళ్ళి ఉంటే నేను ఇలాంటి చావునుంచి తప్పించుకునే దానిని కదా అని బాధ పడిందని ఇంతకు ముందు గుర్తించాము. హనుమంతుడితో మాట్లాడి, అతనితో రాముడికి సందేశమూ, చూడామణీ పంపిన సీత అతను ఎవరో నాకు తెలియదు అని రాక్షస స్త్రీలకి అబద్ధం కూడా చెబుతుంది.

సుగ్రీవుడు సుఖాలకు అలవాటుపడి సీత కోసం వెతికించటం మొదలు పెట్టడు. ఇది చూపటం కోసమే సుగ్రీవుడికి నాలుగు నెలల వ్యవధి ఇచ్చారు. సుగ్రీవుడు రావణుడు లంకలో ఉంటాడు అని తనకు తెలిసిన విషయమే రాముడివద్ద దాచాడు అన్నది సీతను వెతకటానికి కపులను పంపినప్పుడు స్పష్టంగా తెలిసి పోతుంది. అయినా రాముడు ఎందుకు దాచావు అని అడగడు. సుగ్రీవుడు, తన నలుగురు మంత్రుల సహాయంతో రావణుడిని చంపలేమని అనుకున్నాడు, రావణుడు సీతను ఇంకెక్కడో దాచి ఉండవచ్చు కదా అని రాముడు గ్రహించి ఊరుకున్నాడు, అని సమర్థించుకోవాలి. లంకలో హనుమంతుడి ఆలోచనలు కాసేపు లంక మీద ఎవరూ విజయం సాధించలేరని కాసేపు రాముడు

జయించగలడని ఊగిసలాడుతాయి. రావణుడి అంతఃపురాన్ని వెతుకుతున్న హనుమంతుడికి లెక్కలేనంతమంది అందమైన స్త్రీలు, ఊహించనంత ఐశ్వర్యం కనపడతాయి. సీత కూడా వీరిలో కలిసిపోయి వుంటే రావణుడు చేసిన సీతాపహరణం సఫలం అయినట్టే అంటూ నిరాశ పడతాడు. మళ్ళీ తెప్పరిల్లి వీరందరికంటే సీత గొప్పది. ఆమెను అపహరించి గొప్ప వాడైన రావణుడు ఒక హీనుడు చేసే పని చేసాడు అంటాడు. అంతకు ముందే ఈ అంతఃపురంలో ఉన్న స్త్రీలు అందరూ సంతోషంగా రావణుడి భార్యలు అయ్యారు. వివాహం కాని ఈ ఉత్తమ జాతి కన్యలలో కొందర్ని రావణుడు యుద్ధాలు గెలిచి తెచ్చుకున్నాడు. మిగిలిన వాళ్ళు రావణుడిని వరించి తమకి తామే వచ్చారు. సీతను తప్ప ఇంకెవ్వరినీ రావణుడు బలవంతంగా తేలేదు అని అంటారు మహర్షి. కానీ గతంలో జరిగిన ఈ విషయాలు ఏవీ హనుమంతుడికి తెలిసే ఆస్కారం లేదని పాఠకులు గుర్తించాలి. ఇంతకు ముందు నిద్రపోతున్న రావణుడిని దగ్గర నుంచి చూసి హనుమంతుడు భయపడి దూరంగా వెళ్ళిపోతాడు. స్థిమితపడి మళ్ళీ దగ్గరికి వచ్చి పరీక్షగా చూస్తాడు. ఆ తరువాత మండోదరిని చూసి సీత అనుకుని తను వచ్చిన పని అయింది అనుకుని కోతి గంతులు వేస్తాడు.

ధర్మాచరణ వరంగా అడిగిన విభీషణుడు కూడా ఇంతవరకు రావణుడు ఎవ్వరితోనూ యుద్ధంలో ఓడలేదు. సీత విషయంలో తప్ప ధర్మాత్ముడు అంటాడు[31]. కానీ హనుమంతుడిని చంపమని రావణుడు ఆజ్ఞాపిస్తే విభీషణుడు దూతని చంపటం ధర్మం కాదు అన్నప్పుడు, రావణుడికి ఆ మాట నచ్చలేదు. నీ వంటి వీరుడు యుద్ధం చేసే అవకాశం ఎప్పుడూ పోగొట్టుకోకూడదు. హనుమంతుడు వెనక్కి వెళ్ళకపోతే అతనిని పంపించిన వాళ్ళు యుద్ధం చేయటానికి రాలేరు అన్న మాట నచ్చి కేవలం తోక కాల్చమని ఆజ్ఞ ఇస్తాడు. రావణుడు దేవతలని ఋషులని, స్త్రీలని బాధిస్తున్నాడు కనుక నువ్వు కాపాడాలి అని పుత్రకామేష్టి సమయంలో విష్ణువుని అడుగుతారు దేవతలు. మారీచుడి గురించి, విద్యుజ్జిహ్వుడి గురించి చర్చించినప్పుడు రావణుడు ఎంత కుటిలుడో మనం ఇంతకు ముందు చూసాము. రావణుడు బలాత్కారం చేసినది రంభని అయినా, పుంజికస్థలని అయినా ఒకటే కదా. రావణుడు స్త్రీని బలాత్కారం చేసాడు. అపహరించిన వివాహిత స్త్రీలు రావణుడిని శపించారని ఉత్తరకాండలో వర్ణన ఉంది. ఇటువంటి అన్నకి నేను అంతిమ సంస్కారం చేయాలా అని తనే రాముడిని అడుగుతాడు. కాబట్టి విభీషణుడి పొగడ్త

---

31 ఈ పొగడ్తని చూపి ఉత్తరకాండలో వాలితో ఓటమి, కార్తవీర్యార్జునుడు బంధించటం ప్రక్షిప్తాలు అంటారు కొందరు ఆధునికులు.

కేవలం దుఃఖంలో అన్న అతిశయోక్తి. సత్యం కాదు. ఇంకా పెద్ద విషయం రావణుడిని కలవటానికి వెళుతున్న కుంభకర్ణుడిని కోట బయటినుంచి చూసి పారిపోతున్న వానరులకి అది కేవలం బొమ్మ అని అబద్ధం చెప్పమని సలహా ఇవ్వటం.

ఈ వర్ణనలు ఆవశ్యకం కావు. రాముడు పూర్తిగా నరావతారమని చూపటం వాల్మీకి ఉద్దేశం. అలాగే ఈ ఉదాత్త పాత్రలు కూడా సామాన్యులు సుమా అని చూపటం కోసం చేసిన వర్ణనలు ఇవి. అందుకే పొగిడినప్పుడు పొగిడినా, వారి లోటుపాట్లు కనపడేలా కూడా వర్ణనలు చేశారు. సీత, రాముడి విజయ వార్త చెప్పిన హనుమంతుడితో ఏ తప్పూ చేయని వాడు ఉండడు అంటుంది. ఇది ఈ ఉదాత్తమైన పాత్రలకి కూడా వర్తిస్తుంది.

వాల్మీకి తరువాత రామ కథలు రాసిన భక్తులకి సీతారాములలో, హనుమంతుడిలో ఇటువంటి చిన్న దోషాలు కూడా పనికిరావు. కనుక ఈ వర్ణనలని తమ రచనలలో నుంచి తొలిగిస్తారు. కానీ ఇటువంటి అలజడులు అనవసరం. మానవులలో తాపసులలో దోషాలు ఉండవచ్చు. మన ధార్మిక గ్రంధాలలో జితేంద్రియులైన మహర్షులు కోపించి శాపాలు ఇవ్వటం చాలా సామాన్యం. వాల్మీకి నిషాధుడికి ఇచ్చిన శాపాన్ని ఇంతకుముందు చర్చించాను.

విశ్వామిత్రుడి చరిత్రలో స్పష్టంగా వర్ణించినట్టు ఈ విధంగా కాలు జారిన తరువాత, లోపాలని సరిదిద్దుకోవడానికి మళ్ళీ సాధన చేస్తారు అని గ్రహించాలి. తపోమార్గం బదులు ధర్మమార్గాన్ని అవలంబించిన వారు రాజు విధించిన శిక్ష అనుభవించటం ద్వారా, లేదా ధర్మ గ్రంధాలు నిర్దేశించిన ప్రకారం ప్రాయశ్చిత్తాలని చేసుకోవడం ద్వారా, తప్పులు సరిదిద్దుకోవచ్చు.

రాముడు యుద్ధంలో వెనుకంజ వెయ్యని వాడు అయితే ఈ బాణం ఇంద్రజిత్తుని చంపుగాక అంటాడు లక్ష్మణుడు. మరి ఖరుడితో యుద్ధంలో వెనకడుగు వేసాడు అని మహర్షి ఎందుకు చెప్పారు? ఇంద్రజిత్తుని ఆ బాణం ఎందుకు చంపగలిగింది? ఇది కూడా పరస్పర విరుద్ధ కథనాలలో ఒకటా? నా ఉద్దేశ్యంలో కాదు. పైన చెప్పినట్టు ఈ చిన్న చిన్న విషయాల ద్వారా రాముడు సాధారణ మానవుడని చూపి, ధర్మాచరణ వల్ల లభించిన శక్తి సహాయంతో బ్రహ్మ వరాన్ని గౌరవిస్తూ రావణుడిని చంపాడు అనటం ముఖ్య విషయం. ధర్మాచరణలో చిన్న లోపాలు ఉన్నా రావణుడు తపస్సు చేసి సంపాదించుకున్న శక్తి కంటే ఎక్కువ శక్తి రాముడికి లభించిందన్నది రెండో విషయం. తల్లితండ్రులని, అన్నని దూషించిన లక్ష్మణుడికి మాత్రం ఇంత శక్తి లేదు అన్నది మూడో ముఖ్య విషయం. ధర్మ నియమాలు పూర్తిగా ఎలాగూ

పాటించలేం అనే సాకుతో మానవులు నియమాలని పూర్తిగా వదిలి వేస్తారు. పైన చెప్పిన మూడు విషయాలని సమిష్టిగా చూసిన సాధారణ మానవులకి అసలు ధర్మనిష్ఠ అంటే ఏమిటో తెలుస్తుంది.

ధర్మనిష్ఠకి వాల్మీకి ఇచ్చిన ప్రాధాన్యత చిన్న చిన్న సంఘటనలలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. వాలితో మొదటిసారి యుద్ధానికి బయలుదేరిన సుగ్రీవుడు, రాముడు దారిలోని ముని ఆశ్రమానికి నమస్కారం చేయరు. రెండవసారి వాలితో యుద్ధానికి వెళుతూ సప్తమునులకి అభివాదం చేస్తారు. సుగ్రీవుడి కోరిక అప్పుడు సఫలమై వాలిని రాముడు వధిస్తాడు. హనుమంతుడు సీతకోసం రావణుడి అంతఃపురం పూర్తిగా వెతికి, సీత కనపడక దుఃఖించి, దేవతలని వేడుకుంటాడు. ఆ తరువాత సీత కనపడుతుంది. బ్రహ్మచారి అయిన హనుమంతుడు నిద్రపోతున్న పరస్త్రీలను చూడటం చేయకూడదు. ఆ తప్పు గుర్తించిన హనుమంతుడు తన మనస్సు చెదరలేదని, సీతను వెతకాలి కనుక అలా చేయక తప్పదని సమర్థించుకుంటాడు. మనస్సులో అలజడి తగ్గలేదు. అందుకే దైవ ప్రార్థన చేసేదాకా సీత కనపడలేదు.

వానరులు సీత కోసం వెతకటంలో కూడా సహజత్వం కంటే ధర్మ దృష్టి ఎక్కువ. మిగతా మూడు దిక్కులకి వెళ్ళిన వానరులు ఒక నెలలో సుగ్రీవుడు ఏకరువు పెట్టిన ప్రదేశాలు అన్నీ వెతికి తిరిగి వచ్చి సీత ఆచూకీ తెలియలేదు అని చెప్పారు. దక్షిణ దిశగా వెళ్ళిన వానరులు వింధ్య పర్వతాల దగ్గరే ఉండి పోయారు. మొదటి వర్ణన సహజం అనుకుంటే రెండవది కాదు. ఆ సంగతి అటుంచి, సుగ్రీవుడు ఇచ్చిన నెల గడువు దాటి పోయింది కనుక కిష్కింధకు వెళ్ళే ధైర్యం లేక ఇక్కడే సముద్రతీరంలో తిండి తినకుండా ప్రాయోపవేశం చేసి మరణించాలని నిర్ణయించారు వానరులు. ఆ తరువాత వారికి జటాయువు అన్న సంపాతి సీత లంకలో ఉందని చెబుతాడు. జటాయువుని సూర్యుడి వేడి నుంచి కాపాడే ప్రయత్నంలో సంపాతి రెక్కలు కాలిపోయి వింధ్య పర్వతం మీద పడి పోతాడు. ఇక్కడ సంపాతి సీతాపహరణాన్ని స్వయంగా చూసినట్టు, కొడుకు చెప్పగా విన్నట్టు పరస్పర విరుద్ధ వర్ణనలు ఉన్నాయి. రాముడికి సహాయం చేసిన తరువాత నాకు రెక్కలు మళ్ళీ వస్తాయని, రాముడు రావణుడి మీద జయం సాధిస్తాడని నిశాకరమహర్షి నాకు చెప్పాడు అంటాడు సంపాతి. వానరులు చూస్తుండగా రెక్కలు వస్తాయి. రాముడికి సహాయం చేసే ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్న జటాయువుకి ముక్తి లభించినట్టే సహాయం చేసిన సంపాతికి రెక్కలు వచ్చాయని

ధర్మపరంగా అర్థం చేసుకోవచ్చు. కథా పరంగా సంపాతికి రెక్కలు రావటం వల్ల, రాముడు రావణుడి మీద విజయం సాధిస్తాడని ఋషి చెప్పాడన్న ధైర్యంతో, ఒక పక్షి మాటలు నమ్మి, సముద్రం ఎలా దాటటం అని భయపడకుండా, వానరులు లంక చేరాలని ప్రయత్నిస్తారు. రావణ వధ తరువాత ఇంద్రుడు వరం ఇవ్వటం వల్ల వానరులు తిరిగి బ్రతకటం గురించి ఇంతకు ముందు చర్చించాను. అదీ రాముడికి, తద్వారా దేవతలకి సహాయం చేసిన వారికి ధర్మ పరంగా మంచి జరగాలనే భావనే.

సున్నితమైన భావాలు రేకెత్తించే కొన్ని వర్ణనలు కనపడుతాయి. ఇవి ధర్మాచరణతో ముడిపడి ఉండటం కూడా కనపడుతుంది. అయోధ్యకాండ చివరి అధ్యాయాలలో, మునులు చిత్రకూటం వదిలి వెళిపోతుంటే మిమ్మల్ని నేను రక్షిస్తాను అని అంటాడు రాముడు. వాళ్ళు మాట వినిపించుకోరు. అరణ్యకాండ మొదటి అధ్యాయంలో మునులు రాముడి సౌందర్యానికి ఆశ్చర్యపడుతూ సంతోషంగా ఆతిథ్యం ఇస్తారు కానీ అభయం ఇమ్మని అడగరు. ఆ తరువాత విరాధుడు సీతని అపహరిస్తే రాముడు బేలగా ప్రవర్తించాడు అని వర్ణించారు మహర్షి. విరాధుడిని చంపిన తరువాత శరభంగమహర్షి నేను తపస్సు చేసి సంపాదించుకున్న పుణ్యలోకాలు స్వీకరించమంటాడు రాముడితో. ఆ తరువాతనే

మునులు రాక్షసులనుంచి తమని రక్షించమని అడగుతారు. రాముడు సుతీక్ష్ణుడిని కలిసిన తరువాత మునులకి శరణాగతి ఇవ్వడం రాక్షసులతో అకారణ వైరమా అని సీతతో సంవాదం వర్ణించారు. రాముడు విష్ణువు అని తెలిపీ తెలపకుండా చేసిన అతి విచిత్రమైన శిల్పం ఇది.

సుగ్రీవుడు రామలక్ష్మణులకి సీత పడేసిన నగలు చూపిస్తాడు. రోజూ పాదాలకి నమస్కారం చేసినప్పుడు చూసి ఉండటం వల్ల మంజీరాలని మాత్రంమే గుర్తించగలను అంటాడు లక్ష్మణుడు. అతి సున్నితంగా లక్ష్మణుడి వ్యక్తిత్వం, ధర్మనిష్ఠ తెలుపుతారు. భరతుడు వినయంగా రాముడితో నీ తేజస్సు సహాయంతో నీ రాజ్యాన్ని పరిపాలించాను అంటే సుగ్రీవుడికి విభీషణుడికి కంట్లో నీళ్లు తిరిగాయిట. రాముడికి భరతుడికి మధ్య ఉన్న ఆప్యాయత అన్నలతో తమకి లేవు. విభీషణుడు సుగ్రీవుడు మొదలైన వాళ్ళు మేము కూడా అయోధ్య వస్తాము అంటే పుష్పకం ఎక్కమన్నాడు రాముడు. అందరు మొగవాళ్ళతో కలసి తాను ఒక్కత్తే అయోధ్య వెళితే బాగుండదు కనుక సీత వానరుల భార్యలని తోడుగా పిలిపించుకుంది. విశ్వామిత్రుడితో కలిసి మిథిలానగరం రాగానే రాముడు మన నివాసం ఎక్కడ అని అడుగుతాడు. సున్నితంగా మనమే రాజు దగ్గరికి వెళ్ళాలా అని అడగటం. సమృద్ధిగా నీరు

ఉన్న చోట ఉందాం మనం అంటారు మహర్షి. రాజకుమారుడివి నువ్వు. జనకుడు పిలవకుండా నువ్వు వెళ్ళనక్కరలేదు అని అతి సున్నితంగా చెప్పటం ఇది. బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ఒక్కడూ ఉంటే ఈ పట్టింపులేమీ లేవు. తిన్నగా రాజభవనానికి వచ్చి ప్రతీహారితో నేను వచ్చానని దశరథుడికి చెప్పు అన్నాడు. సీతకి రాముడు నార బట్టలు ఎలా కట్టుకోవాలో అయోధ్య కాండలో చూపుతాడు ఉత్తర కాండలో అవసరం అవుతుందని కాబోలు.

రాముడు విజయం ధర్మంతో సాధించాడు అనటానికి ఒక ముఖ్య సాక్ష్యం అగస్త్యుడు వచ్చి ఆదిత్యహృదయం ఉపదేశించటం. ఈ సంఘటనని ఎంతో చాకచక్యంగా వర్ణించారు వాల్మీకి మహర్షి. ముందుగా రాముడు గాయపడతాడు. ఆ తరువాత రావణుడిని అతని రథాశ్వాలని తీవ్రంగా గాయపరుస్తాడు. సారథిని మాత్రం తాకడు. సారథి రావణుడి రథాన్ని ఒక పక్కకి తీసుకుపోతాడు. రావణుడు తెప్పరిల్లి సారథిని తిడతాడు. రావణుడికి సారథి నచ్చచెప్పి వెనక్కి రాముడి దగ్గరికి తెస్తాడు. ఈ లోపల ఆదిత్య హృదయం అగస్త్యుడు ఉపదేశించటం, రాముడు జపించటం పూర్తవుతుంది.

ఉత్తర కాండలో లవణాసురుడిని చంపటానికి ఎవరు వెళతారు అని రాముడు అడిగితే వెంటనే భరతుడు సిద్ధం అవుతాడు. నేను ఇప్పటివరకూ ఏ కార్యమూ చేయలేదు కనుక నన్ను పంపు అంటాడు శత్రుఘ్నుడు. రాముడు ఒప్పుకుని, ఇప్పటికిప్పుడు శత్రుఘ్నుడిని రాజుగా అభిషేకించమని భరత లక్ష్మణులకి చెప్పి, నువ్వు ఎదురు చెప్పవద్దని శత్రుఘ్నుడిని ఆజ్ఞాపిస్తాడు. పెద్దవారి మాటకు అడ్డు చెప్పటంవలన భరతుని కంటే ముందు నేను రాజు అయ్యాను అని బాధ పడతాడు శత్రుఘ్నుడు. ఇది ఇంకో సున్నితమైన ధర్మ ప్రసంగం.

జ్యేష్ట పుత్రుడే రాజు అవటం ఇక్ష్వాకు వంశంలో ఆచారం అని భరతుడు, వశిష్టుడు రాముడికి చాలా దృఢంగా చెబుతారు. శత్రుఘ్నుడిని రాజుగా అభిషేకించటం బట్టి చూస్తే జ్యేష్ఠ పుత్ర నియమం కేవలం అయోధ్యకి పరిమితమని అనిపిస్తుంది. చిన్న కొడుకులు ఇతర నగరాలకి రాజులు అవ్వచ్చు. ఉత్తర కాండ చివర రామ లక్ష్మణ భరత శతృఘ్నులకు ఇద్దరు ఇద్దరు కొడుకులు ఉన్నారని చెబుతారు. అవతార సమాప్తి ముందు ఆ ఎనిమిది మందికీ ఎనిమిది రాజ్యాలు ఏర్పడుతాయి. మనుధర్మ శాస్త్ర నిబంధన మూలంగా ఒకే కొడుకు ఉండటం కొడుకులు లేకపోవడంతో సమానం. అందుకే ఒక్కొక్కరికి ఇద్దరు కొడుకులు

ఉన్నారు అనుకోవాలి. రాముడు సమస్త అయోధ్య వాసులకు ముక్తి ఇస్తాడు కనుక పుత్రులకి విడిగా రాజ్యాలు ఏర్పడ్డాయి. సీత అగ్ని ప్రవేశం తరువాత దేవతలతో కలిసి వచ్చిన శివుడు ఇక్ష్వాకు వంశాన్ని స్థిరపరిచి దేవలోకానికి రమ్మని రాముడికి చెబుతాడు. నారదుడు సంక్షిప్త రామాయణంలో కూడా రాముడు నూరు రాజ వంశాలని స్థాపిస్తాడు అని చెబుతాడు.

వాల్మీకి రామాయణంలో భక్తులు లేరు అన్నది అతి ముఖ్యమైన విషయం. భాగవతంలో లాగా ప్రహ్లాదుడు, ధ్రువుడు ఆఖరికి గజరాజు కనపడరు. కుచేలుడిలాగా గుప్పెడు అటుకులు ఇచ్చి, గొప్ప ఐశ్వర్యం సంపాదించుకున్న పాత్ర ఏదీ లేదు. మహర్షి నువ్వు లేనప్పుడు సీతను నేను రక్షిస్తాను జటాయువు చేత ముందే అనిపిస్తారు. జటాయువు తన మాట నిలబెట్టుకోవడం కోసం ప్రాణాలు వదిలి తన ధర్మనిష్ఠ నిరూపిస్తాడు. ఆ ధర్మనిష్ఠకి ప్రతిఫలమే ముక్తి.

శబరి కూడా ధర్మనిష్టాపరురాలు. రాముడి భక్తురాలు కాదు. శబరిని కలుసుకోగానే నీ ధర్మాచరణ చక్కగా సాగుతోందా అనే అడుగుతాడు రాముడు. నేను ఈ ఆశ్రమంలోని మహర్షులకి సేవ చేసే దానిని. వారు ఉత్తమ లోకాలకి వెళుతూ నీకు ఆతిథ్యం

ఇచ్చి, తరువాత తమని కలుసుకోమని చెప్పారు అంటుంది శబరి రాముడితో. ఆశ్రమ విశేషాలన్నీ రాముడికి చూపించిన తరువాత అగ్నిలో ప్రవేశించిన శబరి దివ్య దేహంతో స్వర్గానికి వెళ్ళిపోతుంది.

హనుమంతుడు సైతం భృత్యుడే. ఉత్తర కాండలో, రాముడి దగ్గర సెలవు తీసుకుంటూ, ఎల్లప్పుడూ నీయందు భక్తి కలిగి ఉందును గాక, అన్నారు కాని వాల్మీకి రచనలో సేవకుడిగా చేసిన కార్యాల వర్ణనే కనపడుతుంది. హనుమంతుడితో పాటు శబరి, గుహుడు విభీషణుడు తమ తమ ధర్మాచరణ వల్ల రాముడికి ప్రీతిపాత్రులైనవారని గుర్తించాలి. ఇహలోక సుఖాలు ముఖ్యమని రామాయణంలో భావించినది కేవలం రాక్షసులు.

అంతర్వాహినిగా లీలావేణి

రాముడు విష్ణువు అవతారం అని చాలా చోట్ల స్పష్టంగా చెప్పారు వాల్మీకి. ఇంకొన్ని చోట్ల కొంచెం ఆలోచించిన తరువాత విషయం తెలుస్తుంది[32]. మరి రామావతారంలో లీల అంతర్వాహిని ఎలా

---

[32] ఇవన్నీ ప్రక్షిప్తాలు అనేవారు వీటిని అన్నిటినీ తీసేస్తే గ్రంథంలో ఏం మిగులుతుంది అని ఆలోచించరు.

అయింది? వాల్మీకి రామాయణంలో రాముడు విష్ణువు అవతారం అని చూపించిన సంఘటనలని ఇక్కడ వరుసగా చూపిస్తాను. పుత్రకామేష్టికి వచ్చిన దేవతలు విష్ణువుని దశరథుడికి నలుగురు కొడుకులుగా జన్మించి రావణుడిని చంపమని వేడుకుంటారు. రాముడి సంగతి నాకు తెలుసు. వశిష్టుడికి, ఇక్కడి ఋషులకి కూడా తెలుసు అని విశ్వామిత్రుడు దశరథుడికి ఒక సూచనగా చెబుతాడు. అందుకే రాముడు తనని అడిగితే సమాధానాలు చెప్పేటప్పుడు, అస్త్రాలు ఇచ్చినప్పుడు, నవ్వుతూ చేసారు అని వర్ణించారు మహర్షి. ఈ లీల నాకు అర్థం అయింది, నువ్వు విష్ణువువి అని తెలుసు అనటానికి ఆ నవ్వు ఒక సూచన. శతానందుడు రాముడిని చూసి అశ్చర్యపోతూ నా తల్లి రాముడిని చూసి సత్కారం చేసిందా అని విశ్వామిత్రుడిని అడుగుతాడు. ఇదీ రాముడి దైవత్వానికి ఒక సూచనే. శివుడి విల్లు విరవటం రాముడు విష్ణువు అవతారమని చెప్పకుండా చెప్పటం. మహర్షి లీలని అంతర్వాహిని చెయ్యటం కోసం పరశురాముడి రాకని చాలా చక్కగా ఉపయోగించుకున్నారు. ముందు తన కొడుకుని రక్షించమని అడిగి, పరశురాముడు పట్టించుకోకపోవడం చూసి దశరథుడు దుఃఖంలో మునిగి ఏం జరుగుతోందో పట్టించుకోలేని స్థితికి వస్తాడు. అప్పటి దాకా రాముడు మాట్లాడడు. ఆ పైన ఒక రాజకుమారుడికి తగినట్టుగా పితృఋణం తీర్చుకున్నందుకు

“మేము” నిన్ను అభినందిస్తున్నాము అని ముందుగా చెప్పి ఆ తరువాత ఇక నా పరాక్రమం చూడు అంటూ పరశురాముడి చేతినించి విల్లుని బాణాన్నీ లాక్కుంటాడు. రాముడు విష్ణువు విల్లు ఎక్కు పెట్టిన తరువాత నువ్వు విష్ణువువి అని స్పష్టంగా రాముడికే చెబుతాడు పరశురాముడు. వాల్మీకి చిన్న మాటతో కూడా రాముడు అవతార పురుషుడు అని సూచిస్తారు. ఐదు వేల సైనికులు కష్టపడి లాక్కు వచ్చిన శివధనుస్సుని రాముడు లీలగా చేతిలోకి తీసుకున్నాడు అంటారు మహర్షి. సామాన్యంగా అవతారాలలో విష్ణువు చేసినదంతా లీల అని అంటారు.

కొన్ని వర్ణనలు ఆలోచనలు రేకెత్తిస్తాయి. రాముడి వనవాసం సమస్త అయోధ్యావాసులకి అంత తీవ్రంగా దుఃఖం ఎందుకు కలిగించింది? తాము బ్రాహ్మణులమని, వయసులో కూడా చాలా పెద్దవారమని గుర్తించక క్షత్రియ రాజకుమారుడికి ఆశీర్వాదం బదులు సాష్టాంగ నమస్కారం ఎందుకు చేసారు? దశరథుడు యాభైవేల సంవత్సరాలు ధర్మం అనుసరించి రాజ్యం చేసాడు, ఇక్ష్వాకు వంశంలో అందరూ ధర్మం తప్పని రాజులని, భరతుడు కూడా మంచి నడవడిక కలవాడని ఎందుకు ఆలోచించ లేదు? రాముడు ఈశ్వరుడని గుర్తించని వారు, తమకి తెలియకుండానే ఈశ్వరుడు తమకి దూరం అవుతోంటే దుఃఖిస్తున్నారు. ఇలాగే

విశాలనగర రాజు సుమతి ఈ రాజకుమారులు ఎవరు అని విశ్వామిత్రుడిని రామలక్ష్మణులని స్తోత్రంచేస్తూ ప్రశ్నిస్తాడు. రాజర్షి అయిన జనకుడు అదే చేస్తాడు, అవే శ్లోకాలతో. రాక్షస స్వభావం లేని వారందరూ, జ్ఞానులైనా కాకున్నా, రాముడు విష్ణువు అని గుర్తించగలిగినా గుర్తించ లేక పోయినా రాముడిని చూడగానే ఒకేలాగా స్పందిస్తారని వాల్మీకి సూచన. సీతారామలక్ష్మణుల లావణ్యం చూసి దండకారణ్యంలో తపస్సు చేసుకుంటున్న మునులు ఆశ్చర్యపోయారని అందుకే వర్ణిస్తారు మహర్షి. ఈ వర్ణన దండకారణ్యంలోని మునులే తరువాతి జన్మలో గోపికలు అనే భావనలకి దారి చూపింది. శరభంగుడు, సుతీక్ష్ణుడు మేము తపస్సు చేసి సంపాదించుకున్న పుణ్యలోకాలని స్వీకరించమని రాముడితో అన్నారు అని ఇంతకు ముందు గుర్తించాము. ఇది నువ్వు విష్ణువువి అని మేము తెలుసుకున్నాము అని చెప్పటమే. ఇలా అడగటం ఇంక ఏ ధర్మకథలోనూ కనపడదు. రాముడు అన్ని లోకాలనీ సర్వనాశనం చేసి మళ్ళీ సృష్టించగలడు అని రావణుడిని హనుమంతుడు హెచ్చరిస్తాడు. నాశనం ఎవరైనా చేయగలరు కానీ సృష్టించగలడు అనటం మాత్రం రాముడు ఈశ్వరుడని చెప్పటమే. రామలక్ష్మణులని ఒక సన్యాసి రూపంలో కలుసుకున్న హనుమంతుడు, గృహస్థుకి నమస్కారం చేస్తాడు.

సన్యాసి చేయకూడని పని చేయించటం, రాముడి నిజస్వరూపం గుర్తించాడు అని చెప్పటం కోసం.

విచిత్రంగా, దండకారణ్యంలో రాక్షసులని రాముడు చంపేసాడు అని రావణుడికి చెప్పిన అకంపనుడు కూడా, రాముడు అన్ని లోకాలనీ నాశనం చేసి మళ్ళీ సృష్టించగలడు అని అంటాడు. అకంపనుడు విష్ణువుని గుర్తించాడని నమ్మలేము. యుద్ధం ముందు మాల్యవంతుడు, తమ బంధువులు మరణించిన తరువాత విలపిస్తున్న రాక్షస స్త్రీలు రాముడు విష్ణువు అని అనుమానిస్తారు. వారిలాగే అకంపనుడు కూడా ఒంటరిగా పద్నాలుగు వేల రాక్షసులని రాముడు చంపేయటం స్వయంగా చూసి భయం వల్ల ఇలా భావించాడు అని అనుకోవాలి. ఇవి అయోధ్యావాసుల ప్రవర్తనకి ఒకరకంగా వ్యతిరేక ప్రతిబింబాలు. వారి వారి స్వభావాన్ని బట్టి ఒకరు కారణం తెలియకుండానే ఆకర్షణకు లోనయ్యారు, ఇంకొకరు కారణం గ్రహించకుండానే భయానికి లోనయ్యారు. రావణ వధ తరువాత మండోదరి, సీత అగ్నిప్రవేశం తరువాత ఇతర దేవతలతో పాటు బ్రహ్మ రాముడికి నువ్వు విష్ణువువి అని చెబుతారు. ఉత్తర కాండ ప్రారంభంలో రాముడిని కలుసుకున్న ఋషులు కూడా స్పష్టంగా చెబుతారు.

ఎక్కడా, ఎవరికీ రాముడు బదులు చెప్పడు. అయోధ్యావాసులని కానీ సన్యాసి రూపంలో ఉన్న హనుమంతుడిని కాని ఇదేమిటి అని కూడా అడగడు. బ్రహ్మాది దేవతలతో నన్ను నేను నరుడిగా దశరథుడి కొడుకైన రాముడిగా గుర్తిస్తున్నాను. నేను ఎవరో, ఎవరికి సంబంధించిన వాడినో, ఎక్కడ నుంచి వచ్చానో దైవ స్వరూపులైన మీరు చెప్పండి అంటాడు రాముడు. రాముడి మాట లీల అంతర్వాహిని అని తెలుపుతుంది. నేను ఎవరిని, ఎక్కడ నుంచి వచ్చాను అనే ప్రశ్నలు ప్రతి మానవుడు అడిగేవే. అన్ని ధర్మ గ్రంధాలు వీటికి సమాధానాలు చెప్పటం కోసమే ఏర్పడ్డాయి. ఇది రాముడు మానవుడిగా అడిగాడు అనవచ్చు. ఈ ప్రశ్నలకి సమాధానాలు మానవుడు మాటలతో కాక స్వానుభూతితో తెలుసుకుంటాడు. బ్రహ్మ నువ్వే విష్ణువువి, నువ్వే పరబ్రహ్మ స్వరూపానివి అని స్తోత్రం చేసిన తరువాత అగ్నిదేవుడు సీతను తీసుకుని వచ్చి నా మాట విని స్వీకరించు అంటే రాముడు అన్ని లోకాలలో ప్రసిద్ధి చెందిన మీరు నా హితవు కోరి చెప్పినది ఆచరిస్తాను అంటాడు, సామాన్య మానవుడి లాగా. కానీ బ్రహ్మ స్తోత్రానికి సమాధానం చెప్పడు. నేనే విష్ణువుని అని అనడు. అదే కృష్ణావతారంలో నేనే ఈశ్వరుడిని అని అనేకసార్లు అనేక మందికి చూపిస్తాడు.

గాయపడిన లక్ష్మణుడు నేను విష్ణువుని అనుకుని తెప్పరిల్లాడని ఇంతకుముందు గుర్తించాము. ఇది సీత, రాముడు, లక్ష్మణుడు తమ దైవత్వాలని తొక్కిపెట్టి సామాన్య మానవుల లాగా ప్రవర్తించ గలిగారని మనకి సూచన. ఎలా సాధ్యం అయిందో మనకి తెలియబోదు. ఈశ్వరుడు ఉన్నాడో లేదో కూడా తెలుసుకోలేని మనకి ఈశ్వరుడి అంతరంగం ఎలాగ తెలుస్తుంది? మహర్షులు ఇంద్రియాలని అదుపులో పెట్టి తపస్సు చేసినట్టు ఇది వారి తపస్సు అనుకుని ఊరుకోవాలి.

రామభక్తులు జటాయువుకి ముక్తిని, విభీషణుడికి శరణాగతిని ఇవ్వటం, అహల్యా శాపవిమోచనం, రాముడి దైవత్వానికి ముఖ్య ఉదాహరణాలుగా భావిస్తారు. విభీషణ శరణాగతి ధర్మాచరణా లేక నేను పరాత్పరుడిని అనటమా పాఠకులకి తెలియకుండా వాల్మీకి రచించారు అని ఇంతకు ముందు చూసాము. రాముడు మోక్షార్హత లేని పక్షి, జటాయువుకు అగ్ని సంస్కారం చేసి, నేను నీకు అగ్ని సంస్కారం చేసాను కనుక పరమపదానికి వెళ్ళమనే అంటాడు. ఈ పక్షికి మోక్షం ఇవ్వమని లేదా స్వర్గంలో స్థానం ఇవ్వమని దేవతలని ప్రార్థించడు. భక్తులు పరబ్రహ్మగా ముక్తి ఇచ్చాడని పూర్తిగా నమ్ముతారు. వాల్మీకి రామాయణంలో శ్రవణ కుమారుడు, స్వర్గానికి వెళుతున్న వర్ణన ఉంది. సగరుడి అరవై

వేల పుత్రులూ స్వర్గానికి చేరుకున్నారు అని స్వయంగా బ్రహ్మ భగీరథుడికి చెబుతాడు. కానీ జటాయువు వెళ్లినట్టు వర్ణన లేదు. కేవలం ఋషి వంటివాడు శాస్త్రోక్తంగా అగ్ని సంస్కారం చేసాడు కాబట్టి తనకి మంగళప్రదమైన స్థానానికి చేరుకున్నాడు అంటారు వాల్మీకి మహర్షి. ఇదీ లీల అంతర్వాహిని అన్న మాటకి అర్థం. వాల్మీకి రామాయణంలో అహల్య రామపాదం సోకితే అసలు రూపాన్ని పొందిన రాయి కాదు. చేసిన తప్పుకి ప్రాయశ్చిత్తంగా రాముడు వచ్చే వరకు అదృశ్యంగా ఉండి తపస్సు చెయ్యమని చెబుతాడు గౌతముడు. రాముడి ఆశ్రమంలో ప్రవేశించటంతో కాలనియమం పూర్తి అయింది. అహల్య అసలు రూపంలో కనపడుతుంది. బ్రహ్మచారులయిన రామలక్ష్మణులు అహల్యకి పాదాభివందనం చేస్తారు.

దండకారణ్యంలో మునులకి మిమ్మల్ని హింసిస్తున్న రాక్షసులను చంపుతాను అని రాముడు మాట ఇచ్చిన తరువాత నువ్వు వనవాసంలో కూడా ఆయుధాలు ఉంచుకున్నావు. ఇది మునికి తగదు. అందువల్ల నీతో శత్రుత్వం లేని రాక్షసులని చంపుతాను అన్నావు అంటుంది సీత. మునులు అడగకపోయినా వారిని రక్షించే బాధ్యత నాకు ఉంది అంటాడు రాముడు. ఇది లీల అంతర్వాహిని అనటానికి గొప్ప ఉదాహరణ. ఆ మాట రాముడు

రాజప్రతినిధిగా అనవచ్చు. విష్ణువు అవతారంగానూ అనవచ్చు. రాముడి ఈశ్వరత్వాన్ని వాల్మీకి ఈ విధంగా రెండు అర్థాలూ కనిపించేటట్టు వర్ణిస్తారు.

రాముడు ఉత్తర సముద్రంలో బాణం ప్రయోగించిన సందర్భంలో మరుకాంతమనే ప్రదేశానికి రాముడు వరమిచ్చాడు అని వర్ణన మాత్రం రాముడు మనుజావతారం అనటానికి బాధాకరం. కానీ పాపాత్ములు నశించటం వలన అది పుణ్య క్షేత్రం అయింది. బాణం వేయడమే వరం అని సమర్థించుకోవచ్చు. లేకపోతే పతివ్రతల లాగే ధర్మాచరణ వల్ల, వరం ఇచ్చే శక్తి కలిగింది అని కూడా చెప్పవచ్చు.

శంబూకుడు

ఒక శూద్రుడు తపస్సు చేయటం నేరంగా పరిగణించి, దానికి మరణమే శిక్ష అని నిర్ణయించి, రాముడు శంబూకుడి తలని తెగగొడతాడు. ఎవ్వరూ వర్ణాశ్రమ ధర్మాలని ఉల్లంఘించకుండా చూడటం రాజు కర్తవ్యం అని అంగీకరిస్తే శంబూకుడి గురించి చర్చ అనవసరం. తల్లిదండ్రులు, అన్న, గురువు మొదలైన పెద్దల ఆదేశాలని పిల్లలు ప్రశ్నించరాదు. అన్నకి తమ్ముడు ఒక

సేవకుడు వంటి నియమాలని ఇంతకు ముందు మనం ధర్మ కథా వేణులలో భాగంగా చర్చించాము. ఆనాటి శిక్షలు మరీ క్రూరంగా ఉన్నాయా అనే చర్చ కూడా నా దృష్టిలో అనవసరం[33]

శంబూకుడు తపస్సు చేయటం వల్ల అతనితో ఏ విధంగానూ సంబంధం లేని బ్రాహ్మణ బాలుడు మరణించటం మన కర్మ సిద్ధాంతానికి విరుద్ధం కాదా అనే ప్రశ్న తలెత్తుతోంది. శకునాలు సహితం మానవుడి చర్య యొక్క సఫలతకి, ప్రకృతికి సంబంధం ఉందన్న సూచన మాత్రమే. శకునాలు మానవుల జీవితాలలో ఏ మార్పూ కలిగించవు. రోమపాదుడు అధర్మం చేయటం వల్ల క్షామం వచ్చింది అన్నా, అది ప్రకృతితో సంబంధమే కానీ ఇతర మానవుల ప్రారబ్ధ కర్మని మార్చదు. శంబూకుడు చేసిన తప్పుకి శిక్ష విధించటం రాజధర్మమే అవవచ్చు. అయినా ఆ బ్రాహ్మణ బాలుడు ఎలా మరణించాడు? రాముడు ప్రతి ఒక్కరూ వర్ణాశ్రమ ధర్మాలని పాటించేలా రాజ్య పాలన చేసాడని చెప్పటానికి ఒక ఉదాహరణగా శంబూకుడిని చూపి, వివరాల విషయంలో శ్రద్ధ తీసుకోలేదని నా అభిప్రాయం.

---

[33] వర్ణాశ్రమ ధర్మాలని, ఇతర సామాజిక నియమాలని తప్పించినా ఆధునిక జీవనశైలికి రామాయణం యొక్క ప్రయోజనం ఉందా అనే ప్రశ్నకి సమాధానం నా ఇతర రచనలలో ఏది ధర్మం, ఏది న్యాయం, ఏది నీతి అనే ప్రశ్నల ఆధారంగా చర్చించాను.

సింహావలోకనం

వాల్మీకీయం వ్యాసంలోని కథా సంగ్రహాన్ని, త్రివేణి వ్యాఖ్యానాన్ని కలిపి సింహావలోకనం చేస్తే వాల్మీకి రామాయణం యొక్క అసలు రూపం తెలుస్తుంది. రామావతారంలో విష్ణువు ఒక సాధారణ మానవుడిగా ప్రవర్తిస్తూ, ధర్మాలంబనతో తన అవతార బాధ్యత పూర్తి చేసుకున్నాడని నిరూపించటానికి వాల్మీకి తన కావ్యం మౌలిక స్వరూపం దగ్గరనుంచి అత్యంత సూక్ష్మ అంశాలదాకా అన్నిటినీ జాగ్రత్తగా మలిచారని కనపడుతుంది. రావణుడికి బ్రహ్మ ఇచ్చిన వరాన్ని పూర్తిగా గౌరవించటానికి, సీతారాములతో సహా ఉదాత్తమైన పాత్రలన్నీ సాధారణ మానవులని చూపటమే కాక భగవంతుడి లీలని కనిపించీ కనిపించని అంతర్వాహినిగా చూపారు మహర్షి. ఎప్పటికప్పుడు కొత్త మెరుపులు కనపడే ఈ త్రివేణిలో కేవలం ధర్మనిష్ఠతో అవతార బాధ్యత తీర్చుకోటానికి రామచంద్రుడిగా అవతరించిన ఆ శ్రీమన్నారాయణుడికి ఎన్ని సంఘటనల కలయిక అవసరం అయిందో పరిశీలిస్తే ఆశ్చర్య పరమావధి చేరుకుంటాము.

దశరథుడు కైకేయికి వరాలు ఇచ్చి ఉండకపోయినా!

పాయసం కైకేయికి మాత్రమే ఇచ్చివున్నా!

నలుగురు కొడుకులు లేకపోయినా!

భరతుడు అయోధ్యలోనే ఉన్నా!

రాముడు ఏకపత్నీవ్రతుడు కాకపోయినా!

లక్ష్మణుడు కోపధారి కాకపోయినా!

అగస్త్యుడు సూర్పణఖ నివాసమైన పంచవటిలో ఉండమని

రాముడికి చెప్పకపోయినా!

సూర్పణఖ ఖరుడిని రెచ్చగొట్టి యుద్ధానికి పంపకపోయినా!

సూర్పణఖ సీత అందాన్ని వర్ణించి రావణుడిని సీతాపహరణం

చేయటానికి ప్రేరేపించకపోయినా!

వాలి సుగ్రీవుడి భార్యని అపహరించకపోయినా!

హనుమంతుడు సీత లంకలో ఉందని తెలుసుకోలేకపోయినా!

నలుడు సేతువు నిర్మాణం చేయకపోయినా!

గరుత్మంతుడు సర్పబంధాలనుంచి విడిపించకపోయినా!

హనుమంతుడు రెండు సార్లు సంజీవని పర్వతం

తేలేకపోయినా!

అగస్త్యుడు ఆదిత్యహృదయం ఉపదేశించకపోయినా!

రామాయణం జరిగేది కాదు.

బ్రహ్మ వరాన్ని యథాతథంగా గౌరవిస్తూ రావణ వధ జరగటానికి ఇంకొక విధానం మన ఊహకి అందదు. ధర్మావతారుడికి సైతం రావణుడిని జయించటానికి సకల దేవతల, ఋషుల సహాయ సహకారాలు అవసరం అయ్యాయి. అది పౌలస్త్యుడి వరబలం. ధర్మాధర్మాల మధ్య ఇంత క్లిష్టమైన పరస్పర ప్రభావాల వల్లనే మన ధర్మంలోని ముఖ్య విశేషాలకి వాల్మీకి రామాయణం అద్దం పడుతుంది. అదీ వాల్మీకి రామాయణం గొప్పతనం.

వాల్మీకీయం : వ్యాఖ్యాధారాలు

వాల్మీకీయం లోని వర్ణనకి, త్రివేణి వ్యాఖ్యలోని నా అభిప్రాయాలకి వాల్మీకి రామాయణం ఆధారం. ప్రతి ఒక్క విషయానికి శ్లోకాలని ఆధారంగా చూపించటం మొదలుపెడితే ఈ భాగం మరీ పొడుగు అవుతుంది. అందువల్ల త్రివేణి వ్యాఖ్యలో నా “సొంత అభిప్రాయలకి”, నా దృష్టిలో గతంలో ఇతరులు ప్రాముఖ్యత ఇవ్వని విషయాలకి మాత్రమే ఆధారాలు చూపాలని నిర్ణయం తీసుకున్నాను. త్రివేణి వ్యాఖ్యలోని ఉప శీర్షికల వారిగా, ముఖ్యమైన పదాలని ఎత్తి చూపుతూ ఆధార శ్లోకాల కాండం సంఖ్య, అధ్యాయం సంఖ్య, శ్లోకం సంఖ్య (పు.శ్రీ. */*/*) వారీగా ఇక్కడ పొందుపరిచాను. ఒకసారి ఇచ్చిన ఆధార శ్లోకాలని తరువాత ఉప శీర్షికలో చర్చించినా ఆధారాలని ఇంకొకసారి చూపలేదు. ఒక చిన్న గమనిక. త్రివేణి వ్యాఖ్య వ్యాసంలోని విశేషాలు అన్నీ వాల్మకీయం వ్యాసంలో కనపడవు. ఇది పాఠకులకి అసౌకర్యం తగ్గించటానికి తీసుకున్న నిర్ణయం. ఇదే కారణంగా త్రివేణి వ్యాఖ్య వ్యాసంలో కూడా ఆధారాలు చూడండి అని ఎక్కడా సూచించలేదు.

నేను ఉపయోగించింది సాంప్రదాయిక దాక్షిణాత్య రామాయణ ప్రతి. కానీ సాంప్రదాయిక దాక్షిణాత్య ప్రతి ఆధారమైన ప్రచురణలు అన్నిటిలో కాండ, అధ్యాయ, శ్లోకాల సంఖ్యలు ఒకేలాగా ఉండవు. సాంప్రదాయిక దాక్షిణాత్య రామాయణ ప్రతుల ఆధారంగా ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు తమ బాలానందినీ వ్యాఖ్యని జోడించి టీకా తాత్పర్య సహితంగా ప్రచురించిన ప్రతి ఉత్తర కాండలో సహా "ఆన్ లైన్" చూడవచ్చు. (https://readramayana.org/pullela/ అందువల్ల దీనిని ఆధారంగా తీసుకున్నాను. అనేక ఇతర వాల్మీకి రామాయణం ప్రతులు, ఆన్ లైన్ కనపడతాయి. కొన్నింటిలో పదాలకి అర్థాలు, శ్లోకాలకి తాత్పర్యాలు ఉంటాయి. ఉదాహరణకి

https://stotranidhi.com/

https://www.valmiki.iitk.ac.in/

ఇవి చదవటానికి సౌకర్యంగా కూడా ఉంటాయి. తెలుగు కాక ఆంగ్ల, దేవనాగరి, కన్నడ, తమిళ లిపులలో కూడా దొరుకుతాయి. కానీ ఉత్తర కాండ ఉండదు. పుల్లెల వారి ప్రతి కాక ఉత్తరకాండ ఆన్ లైన్ దొరకటం, అందులో సాంప్రదాయిక దాక్షిణాత్య ప్రతి దొరకపటం ఇంకా కష్టం. కావలసినవారు గీతా ప్రెస్ గోరఖపూర్ లేదా ఇన్టర్ నెట్ ఆర్కైవ్ లో వెతికి చూసుకోవాలి.

త్రివేణి

రావణుడికి బ్రహ్మ ఇచ్చిన వరాలు (పు.శ్రీ. 7/10/19-24)

వాల్మీకి తన గ్రంథానికి పెట్టిన పేర్లు (పు.శ్రీ 1/4/7)

వాల్మీకి

వాల్మీకి నారదుడిని అడిగిన ప్రశ్న (పు.శ్రీ. 1/1/2-4)

మానిషాద.. (పు.శ్రీ. 1/2/15)

వాల్మీకి ఎందుకు రచించాను అని తనని తాను ప్రశ్నించుకోవటం (పు.శ్రీ. 1/2/16)

జంతువులని వేటాడటం గురించి వాలికి రాముడి సమాధానం (పు.శ్రీ. 4/18/38-40)

వాల్మీకి కథా శిల్పం

సుగ్రీవుడు వానరులని పంపించి ప్రపంచమంతా వెతికించటం (పు.శ్రీ. 4/40/15 నుంచి 4/52/32 వరకు)

వాల్మీకి ప్రకృతిని వాస్తవిక దృష్టితో పరిశీలించ లేదనడానికి రెండు ఉదాహరణాలు (పు.శ్రీ. 3/35/14, 3/35/18)

వాల్మీకి భవనాల ఎత్తైన గోపురాలని విమానం అని వర్ణించారు (పు. శ్రీ. 1/5/16)

పుష్పక విమాన వర్ణన (పు.శ్రీ. 5/7/6-13, 5/8/1-2)
పుష్పకం గురించి సీతతో త్రిజట అన్న మాట (పు.శ్రీ. 6/48/25)
పర్వతాలకి రెక్కలు ఉండేవి అని మైనాకుడు అనటం (పు. శ్రీ. 5/1/123)
గాలిలో నడిచే రావణుడి రథం (పు.శ్రీ. 3/35/10)
గాలిలో నడిచే అక్షుడిరథాన్ని హనుమంతుడు నాశనం చేయటం (పు.శ్రీ. 5/47/31-32)
ఇంద్రజిత్తు తన రథంతో ఆకాశమార్గాన యుద్ధానికి వెళ్ళటం (పు.శ్రీ. 6/73/29)
హనుమంతుడు లంకకి బయలుదేరితే పూలు, చెట్లు కదలటం (పు.శ్రీ. 5/1/47,52)
విశ్వామిత్రుడి యజ్ఞం దండకారణ్యంలో జరిగిందని మారీచుడు చెప్పటం (పు.శ్రీ. 3/38/13)
పట్టాభిషేకం నిర్ణయం తీసుకుని ప్రజల అంగీకారం కోసం సభ చేసి, జనకుడిని అశ్వపతిని ఆహ్వానంచవద్దని దశరథుడు సుమంత్రుడికి ఆజ్ఞ ఇవ్వటం (పు.శ్రీ. 2/1/46)
భరతుడు తిరిగి రాకముందే నీ పట్టాభిషేకం జరగాలి అని దశరథుడు అనటం (పు.శ్రీ. 2/4/25)
వివాహం తరువాత పన్నెండు సంవత్సరాలు అయోధ్యలో గడిపాను అని సీత అనటం (పు.శ్రీ. 3/47/4)

రాముడు భరతుడితో చాలా కాలం తరువాత చూసాను, గుర్తు పట్టలేక పోయాను అనటం. (పు.శ్రీ. 2/100/2,5)

విరాధుడి గురించి పరస్పర విరుద్ధ కథనాలు. వరసగా వాడు జయుడి కొడుకైన రాక్షసుడని, తుంబురుడనే గంధర్వుడని, బ్రహ్మ వరం వల్ల వాడిని శస్త్రాలు ఛేదించలేవని, రామలక్ష్మణులు వాడి భుజాలు నరికారని (పు.శ్రీ.3/3/ 5, 3/4/16, 3/3/6, 3/4 /5)

కబంధుడికి ఆ రూపం ముని శాపంవల్ల కలిగిందని, ఇంద్రుడు వజ్రాయుధంతో తలని మొండెం లోకి తోసాడని పరస్పర విరుద్ధ కథనాలు (పు.శ్రీ. 3/71/3,10)

వాలి మాయావిని తరుముతూ గుహలో ప్రవేశించాడని, దుందుభిని తరుముతూ ప్రవేశించాడని సుగ్రీవుడు చెబుతాడు (పు.శ్రీ. 4/9/11,4/46/4)

రావణుడు తాను పుంజకస్థలని బలాత్కారం చేసితే బ్రహ్మ శపించాడు అంటాడు. (పు.శ్రీ. 6/13/14)రంభని బలాత్కారం చేసితే నలకూబరుడు శపించాడు అని అగస్త్యుడు రాముడికి చెబుతాడు. (పు. శ్రీ. 7/26/55)

తన వద్దకు వచ్చిన వాడు గౌతముడి రూపంలో ఉన్న ఇంద్రుడని అహల్యకి తెలుసని బాలకాండలో విశ్వామిత్రుడు రాముడికి చెబుతాడు. (పు.శ్రీ.1/48/19) తెలియదని అగస్త్యుడు రాముడికి చెబుతాడు. (పు.శ్రీ.7/30/42)

తాటక

స్త్రీని ఎప్పుడూ హత్య చేయకూడదని భరతుడు చెప్పటం (పు.శ్రీ. 2/78/21-23)

సీతను చంపుతాను అని బయలుదేరిన రావణుడిని మంత్రి సుపార్శ్వుడు ఆపటం (పు.శ్రీ. 6/92/63-64)

సూర్పణఖ ముక్కు చెవులు కోయటం (పు.శ్రీ. 3/18/20-21)

అయోముఖి ముక్కు చెవులు కోయటం (పు.శ్రీ. 3/69/17)

హనుమంతుడు లంఖిణిని బలంగా కొట్టకపోవటం (పు.శ్రీ. 5/3/40-41)

ఇంద్రజిత్తు మాయా సీతని హింసిస్తే హనుమంతుడు తిట్టటం (పు.శ్రీ. 6/81/18-20)

నన్ను కూడా చంపు. అయినా నీకు స్త్రీ హత్యా పాతకం రాదు అని తార రాముడికి చెప్పటం (పు.శ్రీ. 4/24/37)

మహనీయుల చేసిన స్త్రీ హత్యలకి విశ్వామిత్రుడు చెప్పిన ఉదాహరణలు (పు.శ్రీ. 1/25/16-21)

బల అతిబల ఉపదేశం (పు.శ్రీ. 1/22/11-19)

తండ్రి మాట ప్రకారం తాటకని చంపుతాను అని రాముడు అనటం (పు.శ్రీ. 1/26/2)

రాముడికి అస్త్రాలు ఉపదేశించమని ఇంద్రుడు చెప్పటం (పు.శ్రీ. 1/26/28-29)
ఉపసంహారం ఉపదేశించమని రాముడు అడగటం (పు.శ్రీ. 1/28/2)
రాముడికి అస్త్రాలు తెలియవని దశరథుడు చెప్పటం (పు.శ్రీ. 1/20/7)
జనకుడి దూతలు అయోధ్యకి రావటం (పు.శ్రీ. 1/68/1)
విశ్వామిత్రుడి పూర్వీకులు (పు.శ్రీ. 1/34/2-6)
రాముడి పూర్వీకులు (పు.శ్రీ. 1/70/20-43)
సుమతి పూర్వీకులు (పు.శ్రీ. 1/47/11-17)
జనకుడి పూర్వీకులు (పు.శ్రీ. 1/71/3-13)
రావణుడి పూర్వీకులు (పు.శ్రీ. 7/2/32, 7/9/14-28)
నిమి ఇక్ష్వాకు కొడుకు అన్నా వర్ణన (పు.శ్రీ. 7/55/4, 7/57/19-20)

లక్ష్మణుడు

లక్ష్మణుడు తండ్రిని, (పు.శ్రీ. 2/21/12) అన్న భరతుడిని, తల్లి. కైకేయిని, చంపుతాను అనటం (పు.శ్రీ. 2/96/23-27)
నువ్వు సీతను వదిలి రావటం తప్పు అంటాడు రాముడు (పు.శ్రీ. 3/59/21-24)

లక్ష్మణుడు నేను విష్ణువుని అనుకోవటం (పు.శ్రీ. 6/59/112,122)
లక్ష్మణుడి కోసం హనుమంతుడు సంజీవని తేవటం (పు.శ్రీ. 6/101/34-46)
యముడిని రావణుడి పైన కాలదండం ప్రయోగించవద్దని బ్రహ్మ చెప్పటం (పు.శ్రీ. 7/22/38-46)
రావణుడి వరబలం వల్ల ఇప్పుడు చంపటం సాధ్యం కాదు. భవిష్యత్తులో నేను రావణుడిని వధిస్తాను అని విష్ణువు ఇంద్రుడికి చెప్పటం (పు.శ్రీ. 7/27/15-20)
రావణుడిని జయించటం కంటే ఇంద్రజిత్తుని చంపటం గొప్ప విషయం అని మహర్షులు చెప్పటం (పు.శ్రీ. 7/1/29-30)
ఇంద్రజిత్తుని చంపటానికి లక్ష్మణుడు రాముడి ధర్మాచరణ మీద శపథం చేయటం (పు.శ్రీ. 6/90/71)
విభీషణుడు రాముడి బలం ధర్మమని చెప్పటం (పు.శ్రీ. 6/14/12)
పంచవటిలో లక్ష్మణుడు కైకేయిని నిందించటం (పు.శ్రీ. 3/16/35-37)
రాముడు సకల లోకాలని నాశనం చేస్తాను అనటం (పు.శ్రీ. 3/64/55-75) లక్ష్మణుడు శాంతింప చేయటం (పు.శ్రీ. 3/65/4,9)

హనుమంతుడి వీపు మీద వెళ్ళి ఉంటే రావణుడి చేతిలో మరణించే దాన్ని కాదు అని సీత అనటం (పు.శ్రీ, 6/92/55-56)

శునశ్శేపుడిని తండ్రి యజ్ఞ పశువుగా అమ్మటం (పు.శ్రీ, 1/61/21)

విష్ణువు యొక్క నాలుగవ భాగం తిరిగి దేవలోకం చేరింది (పు.శ్రీ, 7/106/17)

మాయాసీత వధ గురించి తెలిసిన లక్ష్మణుడు చేసిన ధర్మనింద (పు.శ్రీ, 6/83/14-41)

జాబాలి రామ సంవాదం (పు.శ్రీ, 2/108/1-18, 2/109/1-32)

జాబాలికి ఆశ్రయం ఇచ్చినందుకు రాముడు దశరథుడిని నిందించటం (పు.శ్రీ, 2/109/33)

మారీచుడు, రావణ ప్రథమ దర్శనం

మానవాస్త్ర ప్రయోగం (పు.శ్రీ, 1/30/16-19)

విద్యుజ్జిహ్వుడి మాయ (పు.శ్రీ, 6/31/7-9,43-44)

ఇంద్రజిత్తు మాయా సీతతో హనుమంతుడిని మోసగించడం (పు.శ్రీ, 6/81/5,6)

మారీచుడికి ప్రతి చోటా రాముడు కనపడటం, ర తో మొదలైన పదాలు విన్నా భయం కలగటం (పు.శ్రీ, 3/39/14-17)

నేను ఏం చేస్తే సీత లక్ష్మణడిని పంపుతుంది, శూన్యంగా ఉన్న ఆశ్రమం నుంచి రావణుడు సీతాపహరణం చేయగలడు అని మారీచుడు ఆలోచించటం (పు.శ్రీ. 3/44/18-19)

అకంపనుడి సీతాపహరణ సలహా (పు.శ్రీ. 3/31/31)

రావణుడు మారీచుడిని మొదటిసారి కలవటం (పు.శ్రీ. 3/31/40-50)

నీ ముక్కు చెవులు కోసి నాతో వైరానికి కాలు దువ్వుతున్నది ఎవరు అని ఖరుడు సూర్పణఖని అడగటం (పు.శ్రీ. 3/19/1-12)

సూర్పణఖ రావణుడిని తిడుతూ, మధ్యలో రాముడు ఖరవదూషణులని, సైన్యాన్ని చంపాడని చెప్పటం.(పు.శ్రీ. 3/33/1-10,11-13,14-23)

రావణుడు సూర్పణఖ ఎందుకు తిడుతోంది అని ఆలోచించటం (పు.శ్రీ. 3/33/24) రాముడి గురించి వివరాలు అడగటం (పు.శ్రీ. 3/34/2,3)

సూర్పణఖ సీతని వర్ణించి, ఆమెకోసం రామలక్ష్మణులని చంపటానికి రావణుడిని పురిగొల్పటం (పు.శ్రీ. 3/34/14-24)

మారీచుడు రాముడంటే తనకి ఎంత భయమో చెప్పి రావణుడిని వారించే విఫల ప్రయత్నం చేయటం (పు.శ్రీ. 3/37/1 నుండి 3/41/20 వరకు)

సర్ప బంధంలో ఉన్న రామలక్ష్మణులని సీతకు చూపమని రావణుడు ఆజ్ఞాపించటం (పు.శ్రీ. 6/47/7-10)

రావణుడు వానర సైన్యం గురించి నిజం చెప్పిన చారులని తిట్టటం (పు.శ్రీ. 6/29/6-14)

మూడు లోకాలూ కలిసి దండెత్తినా సీతను ఇవ్వనని రావణుడు చెప్పటం (పు.శ్రీ. 6/24/37,6/26/2,6/30/15)

సీత రావణుడిని శూరుడినని చెప్పుకుంటూ దొంగతనం చేసినందుకు రావణుడిని నిందించటం. ఒక పతివ్రతతో ఈ విధంగా ప్రవర్తించినా నీ కళ్ళు ఎందుకు రాలలేదో నాకు తెలియటంలేదు అనటం (పు.శ్రీ.5/22/18-22)

దొంగతనంచేసి శూరుడునని చెప్పుకుంటున్నావు అని రాముడు రావణుడిని తిట్టటం (పు.శ్రీ. 6/103/11-17)

ఇంద్రియాలని అణిచిపెట్టి వరాలు సంపాదించుకున్న నిన్ను ఇంద్రియాలే చంపాయి అని మండోదరి అనటం (పు.శ్రీ. 6/111/18)

నిద్రిస్తున్న రావణుడిని దగ్గరనుంచి చూసిన హనుమంతుడు భయపడి వెనక్కి అడుగు వెయ్యటం (పు.శ్రీ. 5/10/12)

హనుమంతుడు రావణుడిని కొట్టి చంపలేక పోవటం (పు.శ్రీ. 6/59/56-69)

రావణుడు చాలా గొప్ప తపస్సు చేసాడు కనుకనే అగ్నిలాంటి సీతను స్పృశించి కూడా బ్రతికే ఉన్నాడు అంటాడు హనుమంతుడు (పు.శ్రీ. 5/59/3-4)

ఇంద్రజిత్తు మరణం తరువాత మిగిలిన సైన్యాన్ని రాముడిని ఒక్కడినే చుట్టుముట్టమని రావణుడు వేడుకోవటం (పు.శ్రీ 6/93/3-5)

రాముడు విభీషణుడిని ఓదారుస్తూ రావణుడు వీరుడిలా యుద్ధంలో మరణించాడని మాత్రమే అంటాడు. (పు.శ్రీ. 6/109/14-19)

శివుడు ఎవరు అని ధిక్కరించే రావణుడు కైలాసాన్ని కదపాలని ప్రయత్నం చేశాడు. (పు.శ్రీ. 7/16/12,23,24)

రావణుడు నర్మదానది దగ్గర శివుని పూజించటం (పు.శ్రీ. 7/31/33,43)

విశ్వామిత్రుడు

రావణుడు వరాలు సంపాదించుకున్న గర్వంతో అన్న కుబేరుడిని లంకా వదిలి వెళ్ళమని తాను రాజు అవటం (పు.శ్రీ 7/11/35-50)

వశిష్టుడు విశ్వామిత్రుడి సైన్యానికి విందు చేస్తానని బలవంతం

చేయడం (పు.శ్రీ. 1/52/13-18)

రాముడు గంగానది చేరక ముందే అయోధ్యకి వందనం

చేయటం (పు.శ్రీ. 2/50/1-3)

సీతని గంగ దాటించి వదిలి రమ్మని రాముడు లక్ష్మణుడిని

ఆజ్ఞాపించటం (పు.శ్రీ. 7/45/17-18)

రాజు ధర్మాన్ని రక్షించినందుకు ప్రతిఫలంగా ఆరవవంతు

తీసుకోవచ్చు (పు.శ్రీ. 2/75/25, 3/6/11)

భరతుడు రాజసూయ యాగం చేయవవద్దు అని చెప్పటం

(పు.శ్రీ. 7/83/10-15) (1

లక్ష్మణుడు అశ్వమేధం చెయ్యమని చెప్పటం (పు.శ్రీ. 7/84/2)

ఇంద్రుడు. సగర అంబరీషుల అశ్వమేధ అశ్వాలని

దొంగిలించటం (పు.శ్రీ. 1/39/7,1/61/6)

విశ్వామిత్రుడు తపస్సు చేసి అస్త్రాల సంపాదించటం (పు.శ్రీ.

1/55/16-17)

విశ్వామిత్రుడు బ్రహ్మ బలం గొప్పదని గ్రహించటం (పు.శ్రీ.

1/56/23-24)

దేవతలు త్రిశంకుడికి దేవతలతో సమాన స్థానం ఇవ్వటం (పు.శ్రీ.

1/60/28-31)

సముద్రుడు రాముడు సేతువు కట్టటానికి సహాయం చేయటం (పు.శ్రీ, 6/22/28-29,44-45)

వాలి, వానరోత్పత్తి

నరావతారానికి సహాయంగా వానరులని పుట్టించమని బ్రహ్మ చెప్పటం (పు.శ్రీ, 1/17/2-5)

వాలి తనని పట్టుకుని నాలుగు సముద్రాలకీ తిప్పినందుకు రావణుడు మెచ్చుకోవటం (పు.శ్రీ, 7/34/37)

సుగ్రీవుడి భవన రక్షకుల చేతిలో ఆయుధాలు ఉండటం (పు.శ్రీ, 4/33/17)

భేరీ మృదంగ శంఖములు మ్రోగించటం (పు.శ్రీ, 6/50/62, 6/34/27, 6/36/1)

రాముడు ఇంద్రుడు వరం కోరుకోమంటే రాముడు తన కోసం యుద్ధం చేసి మరణించిన వానరులు తిరిగి బ్రతకాలని వారికి ఎల్లప్పుడూ పూలూ పళ్ళూ దుంపలూ నదులలో నీళ్ళు దొరకాలని కోరుతాడు (పు.శ్రీ, 6/120/5-10)

దుందుభి అప్రమత్తుడిని చంపటం భ్రూణ హత్య అనటం (పు.శ్రీ, 4/11/36)

రాముడు లక్ష్మణుడితో ఏమరుపాటుగా ఉన్న వాడిని చంప కూడదు అనటం (పు.శ్రీ, 6/80/39)

రాముడు నీ భార్యని అపహరించిన వాలిని చంపుతాను అని మాత్రమే అంటాడు (పు.శ్రీ. 4/8/21,4/10/32-33)
సుగ్రీవుడి బదులు నన్ను అడిగితే సీతతో పాటు రావణుడిని బంధించి తెచ్చి ఇచ్చేవాడిని అని వాలి చెప్పటం (పు.శ్రీ. 4/17/48-50)
వాలికి రాముడు చెప్పిన సమాధానం (పు.శ్రీ. 4/18/18,22,38-41)
వానరులతో సమంగా రాముడు దుఃఖించటం (పు.శ్రీ. 4/25/1)
అంజన మానుష రూపంలో విహరించటం (పు.శ్రీ. 4/66/10)
వానర వీరులు దేవతలకి సహాయం చేసారు (పు.శ్రీ. 6/27/15-16,20-21)

తార, సుమిత్ర, మండోదరి

సుమిత్ర లక్ష్మణుడికి ఇచ్చిన ఆశీర్వాదం (పు.శ్రీ. 2/40/9)
ధర్మం పాటిస్తున్న రాముడిని గురించి దుఃఖించి వద్దని సుమిత్ర కౌసల్యని ఓదార్చటం (పు.శ్రీ. 2/44/4)
తార వాలిని వారించటం (పు.శ్రీ. 4/15/10-12,21)
తార విశ్వామిత్రుడిని ఉదాహరణగా చూపటం (పు.శ్రీ. 4/35/6-7)
లక్ష్మణుడి దగ్గరికి వచ్చిన తార వర్ణన (పు.శ్రీ. 4/33/38)
సీతను మెచ్చుకుంటూ స్త్రీలని చిన్న చూపు చూసిన అగస్త్యుడు (పు.శ్రీ. 3/13/3-7)

విపులంగా చేసిన తార దుఃఖ వర్ణన (పు.శ్రీ. 4/20/1-27, 4/23/1-30, 4/24/31-41)

మంథర, కైకేయి, సూర్పణఖ

కైకేయిని దూషించకు. రాముడి వనవాసం చెయ్యటం వల్ల లోకాలకి మేలు కలుగుతుంది అని భరద్వాజుడు చెప్పటం (పు.శ్రీ. 2/92/29-30)

కైక భరతుడికి దశరథుడి మరణవార్త చెప్పటం (పు.శ్రీ. 2/72/5-6,15)

సుమంత్రుడు కైకను తిట్టటం (పు.శ్రీ. 2/35/1-7)

శత్రుఘ్నుడికి కనపడిన మంథర వర్ణన (పు.శ్రీ. 2/78/6-7)

రాముడు పది సంవత్సరాలు ముని ఆశ్రమాలలో ఉండటం (పు.శ్రీ. 3/11/23-27)

రాముడు ఉంటానికి స్థలం చూపమనటం శరభంగుడు, (పు.శ్రీ. 3/5/33) సుతీక్ష్ణుడు, (పు.శ్రీ. 3/7/13) అగస్త్యుడు (పు.శ్రీ. 3/13/11)

తన తపోఫలం తీసుకోమని శరభంగుడు రాముడిని అడగటం (పు.శ్రీ. 3/5/31)

తన తపోఫలం తీసుకోమని సుతీక్ష్ణుడు రాముడిని అడగటం (పు.శ్రీ. 3/7/11-12)

అగస్త్యుడు పంచవటి చూపటం (పు.శ్రీ. 3/13/12-14)

శూర్పణఖ సీతను మింగబోతే అడ్డుపడి రాముడు ఆమెను శిక్షించమని లక్ష్మణుడికి చెప్పటం (పు.శ్రీ. 3/18/11-21)
అయోముఖి (పు.శ్రీ. 3/69/11-18)

దశరథుడు

దశరథుడు మంత్రులతో అశ్వమేధ యాగం గురించి సంప్రదించటం (పు.శ్రీ. 1/8/8-9)
మంత్రులతో ఎక్కువ సంప్రదింపులు లేకుండా పట్టాభిషేక నిర్ణయం (పు.శ్రీ. 2/1/41)
సుమంత్రుడితో జనకుడిని అశ్వపతిని పట్టాభిషేక నిర్ణయం చేసిన సభకి పిలవ వద్దని దశరథుడు చెప్పటం (పు.శ్రీ. 2/1/45-46)
సుమంత్రుడితో జనకుడు అశ్వపతి ముఖ్య ఆతిథులు. నువ్వే వెళ్ళి అశ్వమేధ యాగానికి తీసుకుని రా అని వశిష్ఠుడు చెప్పటం (పు.శ్రీ. 1/13/20-24)
దశరథుడు భరతుడు రాకుండా నీ పట్టాభిషేకం చేస్తున్నాను అనటం (పు.శ్రీ. 2/4/25)
దశరథుడు భరతుడి గురించి అనుమానం వ్యక్తం చేయటం (పు.శ్రీ. 2/4/26-27)

కైకేయి కొడుకుని రాజుని చేస్తానని దశరథుడు మాట ఇచ్చాడని రాముడు భరతుడికి చెప్పటం (పు.శ్రీ. 2/107/3)
భరతుడిని రాజ్యాభిషేకం చేసుకోమని చెప్పిన సభకి వశిష్టుడు యుధాజిత్తుని పిలవటం (పు.శ్రీ. 2/81/13)
మంత్రి రాజుకి సంతోషం కలిగించే వార్తను మాత్రమే చెప్పాలి అని రావణుడు అనటం (పు.శ్రీ. 3/40/9-10)
లంకా దహనం తరువాత రావణుడు మంత్రులని సంప్రదించటం మేలు అని నీతులు చెప్పటం (పు.శ్రీ. 6/6/5-15)
సీత తనని ఒక సంవత్సరం గడువు అడిగిందని రావణుడు అబద్ధం చెప్పటం (పు.శ్రీ. 6/12/18)
సీతను వెనక్కి ఇవ్వమని నేను మొదటే చెప్పాను అని ప్రహస్తుడు అబద్ధం చెప్పటం (పు.శ్రీ. 6/57/14)
శ్రవణుడు ఋషినైన నేను ఎవరికి ఏ అపరాధం చేసాను అనటం (పు.శ్రీ2/63/30)
శ్రవణుడు తన తండ్రి వైశ్యుడు తల్లి శూద్రు స్త్రీ కనుక బ్రహ్మ హత్యా పాతకం ఉండదు అనటం (పు. శ్రీ. 2/63/52-53)
తెలియక చేసిన తప్పు కనుక నీ తల బ్రద్దలవలేదు, లేకుంటే నీ కులమే నాశనం అయ్యేది (పు.శ్రీ. 2/64/23-26) ఆ కారణం చేతనే నీకు బ్రహ్మ హత్యా పాతకం ఉండదని శ్రవణుడి తండ్రి అనటం (పు.శ్రీ. 2/64/56)

సీతాపహరణం, సీతాపరిత్యాగం

విరాధుడు వొడిలో సీతని చూసి రాముడు దుఃఖించటం (పు.శ్రీ, 3/2/16-17)

రాముడు సీతతో నేను నిన్ను స్వీకరించలేను. నీకు ఎక్కడ సుఖంగా ఉంటుంది అనుకుంటే అక్కడ ఉండు అనటం (పు.శ్రీ, 6/115/18-24)

సీత లక్ష్మణుడితో దారుణంగా మాట్లాడటం (పు.శ్రీ, 3/45/5-8, 21-26, 37-39)

సీతకి స్నానం అలంకారం చేయించి తీసుకుని రమ్మని విభీషణుడికి రాముడు చెప్పటం (పు. శ్రీ, 6/114/7)

సీతని నువ్వు వదిలి రావటం తప్పు అని రాముడు అనటం (పు.శ్రీ, 3/59/21-24)

సీత హనుమంతుడితో తప్పులు చేసిన వారిని క్షమించాలి అనటం (పు.శ్రీ 6/113/46-47)

సీత పది మంది ఎందుటా నన్ను నా భర్త అనరాని మాటలు అన్నాడు కనుక అగ్ని ప్రవేశం చేస్తాను అనటం (పు.శ్రీ, 6/116/18-19)

లక్ష్మణుడు సీతకి చితి ఏర్పాటు చేయటం (పు.శ్రీ, 6/116/20-21)

నా మనస్సు కేవలం రాముడి యందే లగ్నమైయుంటే అగ్ని నన్ను రక్షించుగాక అని సీత ప్రతిజ్ఞ చేయటం (పు.శ్రీ, 6/116/25-28)

నా మనస్సు కేవలం రాముడి యందే లగ్నమైయుంటే భూమి నాకు మార్గమిచ్చుగాక అని సీత ప్రతిజ్ఞ చేయటం (పు.శ్రీ, 7/97/14-16)

దశరథుడు సీతను సముదాయించటం (పు.శ్రీ, 6/119/35-37)

అయోధ్యలో భద్రుడు, స్నేహితులు రాముడికి లోకాపవాదం చెప్పటం (పు.శ్రీ, 7/43/13-22)

రాముడు నృగ మహారాజు కథ చెప్పటం (పు.శ్రీ, 7/53/6-26)

లవకుశులని ప్రవేశపెట్టినప్పుడు రాజపుత్రులు అన్నారు మహర్షి (పు.శ్రీ, 1/4/5) (బ.వి. 1/4/4)

ఇంద్రజిత్తు

ఇతర రాక్షసులకి, కుంభకర్ణుడికి ఉన్న తేడా విభీషణుడు వివరించటం (పు.శ్రీ6/61/12)

దేవతలకి కానుకలు ఇవ్వటం రాక్షసులకి తగదు అని రావణుడు అనటం (పు.శ్రీ7/25/14)

హనుమంతుడు లంకలో ప్రవేశించటానికి రాత్రి వరకు ఆగటం (పు.శ్రీ5/2/35)

రావణుడు ఉదయం నిద్రలేవటం (పు.శ్రీ5/18/2-4)
అంగదుడు ఇంద్రజిత్తు రథం నాశనం చేయటం (పు.శ్రీ 6/44/28-30)
యుద్ధభూమిలో యజ్ఞం (పు.శ్రీ6/73/20-29,6/80/5-16)
అగ్ని దేవుడు స్వయంగా ఆహుతి స్వీకరించటం (పు.శ్రీ 6/73/26,6/80/10)
లక్ష్మణుడు బ్రహ్మాస్త్రం ప్రయోగించి ప్రపంచంలోని రాక్షసులని అందరినీ చంపుతాను అంటే రాముడు అది అధర్మం. ధర్మ బద్ధమైన మార్గాలు ఆలోచిద్దాము అనటం (పు.శ్రీ6/80/37-43)
ఇంద్రజిత్తు మాయా సీత వధ చేయాలనే నిర్ణయం తీసుకోవటం (పు.శ్రీ6/81/4-6)
ఇంద్రజిత్తు యజ్ఞం చేయటానికి నికుంభిల వెళ్ళటం (పు.శ్రీ 6/82/24)
లంకా దహనం ముందు రాక్షసులు హనుమంతుడిని తాళ్ళతో కట్టటం (పు.శ్రీ5/48/37,48-49)
ఇంద్రజిత్తు అదృశ్యమయ్యాడు (పు.శ్రీ6/73/29) వానరులు చెట్లూ రాళ్ళూ విసిరితే కోపించాడు (పు.శ్రీ6/73/35-36) అని పరస్పర విరుద్ధ కథనాలు
రామలక్ష్మణులని చూసి దుఃఖిస్తున్న సుగ్రీవ, అంగద, నీల జాంబవంతులని విభీషణుడు ఓదార్చటం (పు.శ్రీ6/74/1-4)

మరణించిన సుగ్రీవ అంగద నీలుని హనుమంతుడు, విభీషణుడు చూడటం (పు.శ్రీ6/74/10-11)

విభీషణుడు

శ్రీరామ చరమ శ్లోకం (పు.శ్రీ. 6/18/32)

అహంకారి అయిన శత్రువునైనా శరణు వేడితే కాపాడాలి (పు.శ్రీ. 6/18/27-28)

రావణుడు కుబేరుడితో యుద్ధంచేసిన విషయం సీతకి చెప్పటం (పు.శ్రీ. 3/48/4-6)

కుబేరుడికి తపస్సు వల్ల దిక్పాలత్వం, పుష్పక విమానం లభించటం (పు.శ్రీ. 7/3/15-18)

విభీషణుడికి లభించిన వరాలు (పు.శ్రీ. 7/10/31-35)

సత్యాధర్మాల మీద శ్రద్ధ ఉన్న వారికి మృత్యుభయం లేదు అని విభీషణుడు చెప్పటం (పు.శ్రీ. 6/46/33)

విభీషణుడు సముద్రం దాటటానికి ఉపాయం చెప్పటం (పు.శ్రీ. 6/19/30-31)

ధర్మ నిష్ఠ

రాముడు సుమంత్రుడిని అబద్ధం చెప్పమనటం (పు.శ్రీ. 2/40/46-47)

రాముడు సీతతో నీకోసం యుద్ధం చెయ్యలేదు అనటం (పు.శ్రీ. 6/115/15)
నన్ను ఇప్పుడే సీత దగ్గరికి తీసుకుని వెళ్ళమని హనుమంతుడిని అడగటం (పు.శ్రీ. 5/66/11)
ఖరుడు రాముడి చేతిలో ఉన్న విల్లు విరగ్గొట్టటం (పు.శ్రీ. 3/28/15)
ఖరుడు మీద మీదకి వస్తే అడుగులు వెనక్కి వెయ్యటం (పు.శ్రీ. 3/30/23)
గంగ దాటిన తరువాత మొదటి రాత్రి లక్ష్మణుడిని తల్లులకోసం అయోధ్య వెళ్ళమని చెప్పటం (పు.శ్రీ. 2/53/15-17)
భరద్వాజ ఆశ్రమం దాకా వచ్చిన రాముడు భరతుడి మనసు తెలుసుకోమని హనుమంతుడిని పంపటం (పు.శ్రీ. 6/125/15-18)
విరాధుడు సీతాపహరణం చేస్తే బెంబేలు పడటం (పు.శ్రీ. 3/2/18-21)
కబంధుడు పట్టుకుంటే ధైర్యం చూపకపోవడం (పు.శ్రీ. 3/69/47-50)
గాయపడిన లక్ష్మణుడిని చూసి రెండు సార్లు విలపించటం (పు.శ్రీ. 6/49/5-21, 6/101/1-23)
హనుమంతుడు ఎవరో తనకి తెలియదని సీత చెప్పటం (పు.శ్రీ. 5/42/8-10)

సుగ్రీవుడు రావణుడు లంకలో ఉంటాడు అని చెప్పటం (పు.శ్రీ. 4/41/25)

హనుమంతుడు ముందు లంకని జయించటం అసంభవం అని అనుకోవటం (పు.శ్రీ. 5/2/27-28) తరువాత రామలక్ష్మణుల శక్తి గుర్తువచ్చి ధైర్యం తెచ్చుకోవటం (పు.శ్రీ. 5/3/17)

హనుమంతుడు రావణుడి అంతఃపుర స్త్రీలని చూసి నిరాశ పడటం (పు.శ్రీ. 5/9/72-73)

రావణుడి అంతఃపుర స్త్రీల వివరాలు (పు.శ్రీ. 5/9/68-71)

మండోదరిని చూసి సీత అనుకుని హనుమంతుడు కోతి గంతులు వేయటం (పు.శ్రీ. 5/10/50-54)

విభీషణుడు రావణుడిని పొగడటం (పు.శ్రీ. 6/109/6-8)

హనుమంతుడిని వధిస్తే రావణుడికి గొప్ప యుద్ధం చేసే అవకాశం చేజారిపోతుందని విభీషణుడు చెప్పటం (5/52/21-26)

కుంభకర్ణుడు బొమ్మ అని వానరులకి చెప్పమనటం (పు.శ్రీ. 6/61/33)

ఏ తప్పూ చేయని వాడు ఉండడు అని సీత అనటం (పు.శ్రీ 6/113/46)

సప్తమునులకి రామలక్ష్మణులు సుగ్రీవుడు అభివాదం చేయటం (పు.శ్రీ. 4/13/25-28)

హనుమంతుడు లంకలో దేవతలకి నమస్కరించటం (5/13/56-60)

నిద్రపోతున్న పర స్త్రీలని చూడటాన్ని హనుమంతుడు సమర్థించుకోవటం (పు.శ్రీ. 5/11/37-43)

పంపాతికి రెక్కలు రావటం (పు.శ్రీ. 4/63/8)

లక్ష్మణుడు పాదమంజీరాలు మాత్రమే గుర్తించటం (పు.శ్రీ. 4/6/22)

విభీషణ కపి వీరులు కన్నీరు కార్చటం (పు.శ్రీ. 6/127/56)

సీత వానర స్త్రీలని తోడు తీసుకుని వెళ్ళటం (పు.శ్రీ. 6/123/24-25)

మిథిలలో మన బస ఎక్కడ అని రాముడు అడగటం (1/50/3-5)

రాముడు సీతకి నార బట్టలు కట్టటం (2/37/14)

శత్రుఘ్నుడు పెద్దలని ఎదిరించడం వల్ల శిక్షగా రాజుని అయ్యానని దుఃఖించాడు (పు.శ్రీ. 7/62/16-20, 7/63/2-8)

అనేక ఇక్ష్వాకు వంశజుల రాజ్యాలని రాముడు స్థాపిస్తాడని నారదుడు (పు.శ్రీ. 1/1/96) శివుడు చెప్పటం (పు.శ్రీ. 6/119/5)

సీతను నేను రక్షిస్తాను అని జటాయువు చెప్పటం (పు.శ్రీ. 3/14/33-34)

నీ ధర్మాచరణ చక్కగా జరుగుతుందా అని రాముడు శబరిని అడగటం (పు.శ్రీ. 3/74/8-9)

హనుమంతుడి ప్రార్ధన (పు.శ్రీ. 7/40/16)

అంతర్వాహినిగా లీలావేణి

విష్ణువుని దశరథుడికి నలుగురు కొడుకులుగా పుట్టి రావణుడిని చంపమని దేవతలు ప్రార్థించటం (పు.శ్రీ. 1/15/17-21)

విశ్వామిత్రుడు, నాకు వశిష్టుడికి ఇతర ఋషులకి రాముడు ఎవరో తెలుసు అనటం (పు.శ్రీ1/19/14)

రాముడు ప్రశ్నలు వేస్తుంటే విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వటం (పు.శ్రీ1/23/9, 1/27/1, 1/39/3)

ధనుర్భంగ సమయంలో లీల అనే మాట వాడటం (పు.శ్రీ 1/67/15-16)

వనవాసానికి వెళుతున్న రాముడికి వృద్ధ బ్రాహ్మణులు నమస్కారం చేయటం (పు.శ్రీ2/45/27)

విశాల నగరం రాజు సుమతి (పు.శ్రీ1/48/2-6) జనకుడు (పు.శ్రీ 1/50/17-21) స్తోత్ర రూపంలో విశ్వామిత్రుడిని ఈ రాజకుమారులు ఎవరు అని అడగటం

సీతారామలక్ష్మణులు లావణ్యం చూసి మునులు ఆశ్చర్యపోవటం (పు.శ్రీ3/1//13-14)

హనుమంతుడు రావణుడిని హెచ్చరించటం (పు.శ్రీ5/51/39)
హనుమంతుడు సన్యాసిగా వచ్చి రామలక్ష్మణులకి నమస్కారం చేయటం (పు.శ్రీ4/3/3)
రాముడు విష్ణువు అవతారమని అకంపనుడు (పు.శ్రీ3/31/26) మాల్యవంతుడు, (పు.శ్రీ6/35/36-37) రాక్షస స్త్రీలు, (పు.శ్రీ 6/94/24) మండోదరి (పు.శ్రీ6/111/14-17) ఊహించటం
నేను దశరథుడి కొడుకైన రాముడిని అని దేవతలకి చెప్పటం (పు.శ్రీ6/117/11)
రాముడు దైవ ఆజ్ఞగా సీతని స్వీకరించటం (పు.శ్రీ6/118/21)
అహల్య శాపం కాల అవధి (పు.శ్రీ1/48/29-31)
రామలక్ష్మణులు అహల్యకి పాదాభివందనం చేయటం (పు.శ్రీ 1/49/16)
జటాయువుకి అగ్నిసంస్కారం చేసి రాముడు అన్నమాట (పు.శ్రీ 3/68/29-30)
నేను ధర్మాన్ని అనుసరిచే ఋషి వంటి వాడిని అని రాముడు చెప్పటం (పు.శ్రీ2/19/20)
ఋషి వంటి వాడు అగ్నిసంస్కారం చేయటం వల్ల జటాయువు తనకు తగిన మంగళప్రదమైన స్థానానికి చేరుకున్నాడు అని వాల్మీకి అనటం (పు.శ్రీ3/68/37)

రాముడు సీతతో అడగక పోయినా రక్షించే బాధ్యత నాకు ఉంది (పు.శ్రీ3/10/20)

మరుకాంతానికి రాముడు వరం ఇవ్వటం (పు.శ్రీ6/22/39-42)

శంబూకుడు

రోమపాదుడు ధర్మం తప్పటం వల్ల క్షామం రావటం (పు. శ్రీ. 1/9/7-8)

సింహావలోకనం

సకల భువన సుసంరక్షణార్థమ్

ధర్మైకాయుధధారిణం శ్రీరాఘవమ్ |

శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేతమ్

అనన్యశరణః శరణం ప్రపద్యే ||